
'నిరుపేదలకు పట్టెడన్నం దొరికేటట్లు చేయడం ప్రభుత్వ ధర్మం, అందుకు ఎన్ని కోట్లు ఖర్చయినా వెనుకాడకూడదు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4+20 వెల: ₹5.00

సంపుటి: 10 సంచిక: 319

శుక్రవారం 9-2-2018



ఏడు రోజుల నష్టాలకు బ్రేక్

నిఫ్టీ 100, సెన్సెక్స్ 330 పాయింట్లు అప్.

ఫార్మా, ఐటీ స్టాక్స్‌లో కొనుగోళ్లు -11లో



జోరు కొనసాగిస్తా

35 ఏళ్ల వరకు ఇలాగే ఆడాలనుకుంటున్నానన్న కోహ్లి- స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

బస్ 'స్టాప్'



గురువారం రాష్ట్ర బంద్ సందర్భంగా బస్సు సర్వీసులన్నీ నిలిచిపోవడంతో నిర్మానుష్యంగా మారిన విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్

హోదా సంజీవనే



బంద్‌కు సంఘీభావంగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గం జువ్వలగుంటపల్లి వద్ద ఇంజనీరింగ్ విద్యార్థులతో కలిసి నిరసనలో పాల్గొన్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

బంద్ సంపూర్ణం

రాష్ట్రానికి న్యాయం చేయాలని నినదించిన విపక్షాలు • హామీలు నెరవేర్చాల్సిందేనని డిమాండ్

ఎక్కడి బస్సులు అక్కడే.. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలకు తాళం.. స్కూళ్లకు సెలవు

- వినూత్న నిరసనలు, బైకాయింపులు, ర్యాలీలు
- నెల్లూరు జిల్లాలో విద్యార్థులతో కలిసి బంద్‌లో పాల్గొన్న ప్రతిపక్ష నేత జగన్
- విజయవాడలో మధు, కర్నూలులో రామకృష్ణ ఆందోళన
- సర్కారు ఆంక్షలు విధించినా ఖాతరు చేయని జనం
- ప్రజల ధర్మాగ్రహంతో రూటు మార్చిన ప్రభుత్వ పెద్దలు
- తమ ఎంపీల పోరాటానికి సంఘీభావం తెలపాలని ఆదేశం



సాక్షి, అమరావతి/ సాక్షి నెట్‌వర్క్

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ వామపక్షాల పిలుపు మేరకు గురువారం చేపట్టిన రాష్ట్ర బంద్ సంపూర్ణంగా, ప్రశాంతంగా జరిగింది. టీడీపీ ప్రభుత్వం ఎన్ని ఆంక్షలు విధించినా, అవాంతరాలు సృష్టించినా జనం ఖాతరు చేయకుండా రాష్ట్రానికి న్యాయం చేయాలని నినదించారు. బంద్‌కు మద్దతు పలికిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్, లోక్‌సత్తా, కార్మిక, విద్యార్థి, యువజన, మహిళా సంఘాలు నిరసన గళాలు వినిపించాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును దుయ్యబట్టాయి. రాష్ట్రానికి న్యాయం జరిగే వరకు పోరాటం విశ్రమించబోమని ప్రకటించాయి. అత్యవసర సేవలు మినహా బంద్‌తో రవాణా స్తంభించింది. సుమారు 13 వేల బస్సులు డిపోలకే పరిమితం అయ్యాయి. విద్యా, వాణిజ్య, వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా మూతపడ్డాయి. ఇంటర్ ప్రాక్టికల్స్‌ను, యూనివర్సిటీలు పరీక్షలను వాయిదా వేశాయి. సినిమా థియేటర్లలో ఉదయం, మధ్యాహ్నం ఆటలు రద్దయ్యాయి. పెట్రోల్ బంకులు మూతపడ్డాయి. రహదారులు జనం లేక బోసిపోయాయి. కిటకిటలాడే హోటళ్లలో నిశ్శబ్దం తాండవించింది. బంద్‌కు ససేమిరా సహకరించేది లేదన్న అధికార తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ప్రజాభీష్టానికి తలొగ్గారు. ర్యాలీలు నిర్వహించండని దుబాయి నుంచి తమ పార్టీ కార్యకర్తలకు పిలుపిచ్చారు. ప్రజల సెంటిమెంట్‌ను గౌరవిస్తున్నట్టు ప్రకటించి ధర్మాగ్రహానికి


మిగతా 6వ పేజీలో ▶

హోదా పోరులో అందరినీ కలుపుకుపోతాం: జగన్

బంద్‌కు మద్దతుగా తన ప్రజా సంకల్ప యాత్రకు విరామం ప్రకటించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రధాన ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్.. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా జువ్వలగుంటపల్లి సమీపంలోని తన శిబిరం వద్ద విద్యార్థులతో కలిసి ప్లకార్డులు పట్టుకుని ప్రత్యేక హోదా కావాలంటూ నినదించారు. హోదా పోరులో అందరినీ కలుపుకుపోతామని స్పష్టం చేశారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన నిధులు రాబట్టడంలో సీఎం విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, సీపీఎం నాయకుడు పి.మధు విజయవాడలో, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కర్నూలులో ప్రదర్శన నిర్వహించారు.

జైట్లీ పాత పాటకు సుజనా చప్పట్లు

విభజన చట్టంలోని హామీలపై లోక్‌సభలో ఆర్థిక మంత్రి ప్రకటన





- సంస్థలకు, రాజధానికి నిధులిచ్చాం.. ఆంధ్రప్రదేశ్‌కు అండగా నిలిచాం..
- పోలవరానికి 4,500 కోట్లు ఇచ్చామని జైట్లీ వెల్లడి
- హామీలు, నిధులపై ఎలాంటి స్పష్టత ఇవ్వని వైనం
- బల్లలు చరిచి హర్షం వ్యక్తం చేసిన కేంద్ర మంత్రి సుజనా చౌదరి
- 15 రోజుల్లో పరిష్కారం కాకపోతే వచ్చే సెషన్‌లో వర్షించాలని వెల్లడి
- సభలో మౌనంగా ఉండిపోయిన టీడీపీ ఎంపీలు
- అరుణ్ జైట్లీ ప్రకటనపై వైఎస్సార్‌సీపీ ఎంపీల తీవ్ర నిరసన
- వెల్‌లో నుంచి కదలకుండా నినాదాలు

2లో

టీడీపీ రసవత్తర నాటకం

- అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు పన్నాగం
- పార్లమెంటులో నోరు మెదపకుండా రోజుకో డ్రామా
- ప్రజల దృష్టిని మళ్లించేందుకు లీకుల మంత్రం
- అరుణ్ జైట్లీ ప్రకటనపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారట!
- నాటకాన్ని రక్తికట్టిస్తున్న టీడీపీ అధిష్ఠానం

6లో

మద్యం వ్యాపారులకు 15 % కమీషన్!

సిద్ధమైన ప్రభుత్వ ప్రతిపాదనలు

- లిక్కర్ అమ్మకాలను ప్రోత్సహించేందుకు ఎత్తుగడ
- రూ.17 వేల కోట్లకుపైగా ఆర్జించాలని నిర్ణయం
- ప్రభుత్వ పెద్దలకు రూ.8 కోట్లు ముట్టజెప్పిన సిండికేట్లు



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం మద్యాన్ని ప్రధాన ఆదాయ వనరుగా చూడబోమని చెబుతూనే అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోంది. రాష్ట్రంలో లిక్కర్ అమ్మకాలను అమాంతం పెంచేసి, ఖజానా నింపుకునే ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉంది. ఈ దిశగా ఇప్పటికే అదనపు మద్యం డిపోలను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా మద్యం వ్యాపారులకు కమీషన్ పెంపు ప్రతిపాదనలను సిద్ధం చేసింది. ఇప్పటిదాకా మద్యం వ్యాపారులకు అమ్మకాలపై 7 శాతం కమీషన్ ముట్టజెబుతోంది. అంటే రూ.100 విలువైన మద్యం అమ్మితే వ్యాపారికి కమీషన్ కింద రూ.7 అందజేస్తోంది. ఈ కమీషన్‌ను ఏకంగా 15 శాతానికి పెంచేందుకు ప్రభుత్వం

మిగతా 2వ పేజీలో ▶

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఖలీదాకు ఐదేళ్ల జైలు

అవినీతి కేసులో ఢాకా కోర్టు తీర్పు



- వివరాలు 8లో

జైట్లీ పాత పాటకు సుజనా చప్పట్లు

సాక్షి, న్యూఢిల్లీ: విభజన చట్టంలో ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీల అమలుపై కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పార్లమెంట్‌లో మరోసారి ప్రకటన చేశారు. ఎప్పటిలాగే పాత పాటే పాడారు. హామీల అమలుపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేకపోయారు. అదనంగా పైసా కూడా ఇవ్వనున్నట్టు చెప్పలేదు. అయినప్పటికీ టీడీపీ నేత, కేంద్ర సహాయ మంత్రి వైఎస్ చౌదరి (సుజనా చౌదరి) హర్షం వ్యక్తం చేస్తూ పలుమార్లు బల్లలు చరిచడం గమనార్హం. టీడీపీ ఎంపీలు సైతం ఎలాంటి వ్యతిరేకత వ్యక్తం చేయకుండా మౌనంగా ఉండిపోయారు. హామీలపై స్పష్టత ఇవ్వకుండా చర్విత చర్వణంగా సాగిన అరుణ్ జైట్లీ ప్రకటనపై వైఎస్సార్ సీపీ ఎంపీలు నిరసన వ్యక్తం చేశారు. ఈ ప్రకటనలో కొత్తదనమేమీ లేదంటూ వెల్‌లో బైఠాయించి ప్లకార్డులతో నినాదాలు చేశారు.

సుజనా చౌదరికి ముందే తెలుసా?
బడ్జెట్‌పై జరిగిన చర్చకు అరుణ్ జైట్లీ గురువారం లోక్‌సభలో సమాధానం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ ఎంపీల నిరసనపై తనకు సానుభూతి ఉందని, ప్రసంగం చివరలో తాను ఏపీ హామీలపై ప్రకటన చేస్తానని పేర్కొన్నారు. ప్రసంగం చివరలో అత్యంత ఉత్కంఠ మధ్య ప్రకటన చేశారు. కానీ, మొన్న చేసిన ప్రకటనకే కొన్ని అదనపు వాక్యాలు జోడించి చదివారు. జైట్లీ ప్రసంగానికి ముందే సుజనా చౌదరి అనూహ్యంగా మధ్యాహ్నం లోక్‌సభలో ఒక ప్రకటన చేశారు. తాను కేంద్ర మంత్రితో మాట్లాడుతున్నానని చెప్పారు. బడ్జెట్‌పై చర్చకు ఆర్థిక మంత్రి ఇచ్చే సమాధానంలో ఏపీ హామీలపై స్పందించాలని అన్నారు. ఒకవేళ 15 రోజుల్లోగా ఈ అంశాలపై పరిష్కారం కాకపోతే వచ్చే సెషన్‌లో 2 గంటల పాటు చర్చకు అనుమతించాలని స్పీకర్‌ను కోరారు. అంటే అరుణ్ జైట్లీ ప్రకటనలో కొత్తగా ఏమీ ఉండబోదని సుజనాకు ముందే తెలుసు. జైట్లీ ప్రకటన ఎలా ఉండబోతోందో ఆయనకు ముందే తెలుసన్న సంగతి దీని ద్వారా స్పష్టమైంది. సుజనా చౌదరి ప్రకటన కంటే ముందే పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంతకుమార్ మాట్లాడారు. బడ్జెట్‌పై చర్చకు ఇచ్చే సమాధానంలో అరుణ్ జైట్లీ ఏపీ వ్యవహారాలపై ప్రకటన చేస్తారని చెప్పారు.

ఇదీ ఆర్థిక మంత్రి ప్రకటన..: ''ఆంధ్రప్రదేశ్ ఎంపీలు కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్నారు. రాష్ట్ర విభజన జరిగి తెలంగాణ ఏర్పడినప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రజల హక్కుల కోసం మేం నిలబడ్డాం. ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనుందని వారికి అండగా నిలిచాం. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టంలో కొన్ని నిబంధనలు పొందుపరిచాం. అందులో అనేకం అమలయ్యాయి. ఇంకా కొన్ని పురోగతిలో ఉన్నాయి. హామీ మేరకు ఏపీలో చాలా సంస్థలకు నిధులిచ్చాం. ఇకపైనా అన్ని సంస్థలకూ నిధులిస్తాం. సంస్థల నిర్మాణం జరుగుతున్న కొద్దీ నిధులు ఇస్తూనే ఉంటాం. ఏపీలో నూతన రాజధాని నిర్మాణానికి కూడా నిధులు అందజేశాం. వెనుకబడిన ప్రాంతాలకు సైతం నిధులు ఇచ్చాం. పోలవరం ప్రాజెక్టుకు నాబార్డు ద్వారా రూ.4,500 కోట్లు ఇచ్చాం. ప్రాజెక్టుకు అయ్యే ఖర్చులో గణనీయమైన భాగం మేం చెల్లిస్తామని చెప్పాం. ఇక మరో రెండు అంశాలను కార్యాచరణలో పెట్టాల్సి ఉంది. అందులో మొదటిది ప్రత్యేక ప్యాకేజీకి సంబంధించిన నిధులు. ఎక్స్‌టర్నల్లీ ఎయిడెడ్ ప్రాజెక్టుల రూపంలో నిధులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. జనవరి 8న ఏపీ ముఖ్యమంత్రి నాకు లేఖ రాశారు. ఈ నిధులను నాబార్డు ద్వారా ఇవ్వాలని కోరారు. ఇందుకోసం బుధవారం ఒక కార్యాచరణ రూపొందించాం. ఈ ప్రక్రియ సాధ్యమైనంత త్వరగా పూర్తయ్యేలా చూస్తాం. ఇక రెండో అంశం రెవెన్యూ లోటు భర్తీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి మరో ప్రతిపాదన వచ్చింది. ఏపీ సర్కారు ఇంకొంత మొత్తాన్ని ఆశిస్తోంది. మేం ఈ అంతరాన్ని తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నాం. అంతరాన్ని పూడ్చుతాం. ఈ రెండు అంశాలు మరికొద్ది రోజుల్లో కొలిక్కి వస్తాయి. ప్రత్యేక రైల్వే జోన్, పెట్రో కెమికల్ కాంప్లెక్స్ తదితర అంశాలపై ఆయా శాఖలతో చర్చిస్తున్నాం. ఆంధ్రప్రదేశ్ స్నేహితులతోనూ చర్చిస్తున్నాం. సాధ్యమయ్యే అత్యుత్తమ పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నాం. ఇవన్నీ త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. ఆంధ్రప్రదేశ్ ప్రజలపై మాకు సానుభూతి ఉంది. అందువల్ల ప్రతీ అంశాన్ని సానుభూతితో చూస్తున్నాం'' అని అరుణ్ జైట్లీ ప్రకటించారు. అనంతరం సభను వాయిదా వేస్తున్నట్టు లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ పేర్కొన్నారు.


పార్లమెంట్ ఆవరణలో నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ ఎంపీలు


లోక్‌సభలో మౌనంగా కూర్చుండిపోయిన టీడీపీ ఎంపీలు

ఉదయం నుంచి ఏం జరిగింది?
ఉదయం 10.30 గంటలకు పార్లమెంట్ ఆవరణలో వైఎస్సార్‌సీపీ ఎంపీలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, వి.విజయసాయిరెడ్డి, వి.వరప్రసాదరావు, వైఎస్ అవినాశ్‌రెడ్డి, మిథున్‌రెడ్డి ధర్నా చేపట్టారు. అధికార టీడీపీ పార్లమెంట్‌లో డ్రామాలాడుతోందని దుయ్యబట్టారు. టీడీపీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే రాజీనామా చేసి, నిరసన తెలపాలని సవాల్ విసిరారు. లోక్‌సభ ప్రారంభం కాగానే వైఎస్సార్‌సీపీ ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఉదయం నుంచి రాత్రి అరుణ్ జైట్లీ ప్రకటన పూర్తయి, సభ వాయిదా పడేవరకూ వెల్‌లోనే ఉన్నారు.

సోనియాగాంధీతో టీడీపీ నేతల మంతనాలు

టీడీపీ ఎంపీలు లోక్‌సభ వెల్‌లో ప్లకార్డులు పట్టుకుని ఆందోళన చేస్తుండగా ఉదయం 11.30 గంటల సమయంలో చిత్తూరు ఎంపీ శివప్రసాద్ లోక్‌సభ సెక్రెటరీ జనరల్ టేబుల్ వద్ద ఉన్న పుస్తకాలను ఎత్తుకుని తన స్థానం వైపు వెళ్లారు. దీంతో స్పీకర్ సభను 15 నిమిషాలపాటు వాయిదా వేశారు. ఈ సమయంలో అక్కడే ఉన్న కాంగ్రెస్ నేత సోనియాగాంధీ వద్దకు టీడీపీ నేతలు వెళ్లి మంతనాలు జరిపారు. ఆ పార్టీ లోక్‌సభాపక్ష నేత తోట నర్సింహం, కేశినేని నాని, రామ్మోహన్ నాయుడు, రవీంద్రబాబు తదితరులు సోనియాతో మాట్లాడారు. సభ తిరిగి 11.45కు ప్రారంభమైన తరువాత సుజనా చౌదరి సూచనల మేరకు టీడీపీ సభ్యులు మౌనం దాల్చారు. కొద్దిసేపు పోడియం వద్దే పడుకున్నారు. మధ్యాహ్నానికి కొద్దిమందే మిగిలారు. సభలో అరుణ్ జైట్లీ ప్రకటన తర్వాత మౌనంగా ఉండిపోయిన టీడీపీ ఎంపీల తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో సభ వాయిదా పడిన అనంతరం తామంతా జైట్లీని కలిసి, గట్టిగా నిలదీసినట్లు లీకులు ఇవ్వడం గమనార్హం.

టీడీపీ మంత్రులు రాజీనామా చేయాలి

అరుణ్ జైట్లీ ప్రకటన తరువాత వైఎస్సార్‌సీపీ లోక్‌సభాపక్ష నేత మేకపాటి రాజమోహన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ''ఆర్థిక మంత్రి ప్రకటన కొత్తసీసాలో పాత సారాలా ఉంది. ఎలాంటి కొత్త విషయం లేదు. గతంలో చెప్పిన విషయాలే మళ్లీ చెప్పారు. మన రాష్ట్రం నష్టపోవడానికి కారణం ముఖ్యమంత్రి చంద్రబాబే. ఆయనను కేంద్రం విశ్వసించడం లేదు. ఆయన చరిత్రను చూసి అవకాశవాదిగా గుర్తించారు. చంద్రబాబు తన రాజకీయ ప్రయోజనాలే చూసుకుంటున్నారు తప్ప రాష్ట్రం మేలు గురించి పట్టించుకోవడం లేదు. ఆయనకు ధైర్యం ఉంటే కేంద్రంలోని టీడీపీ మంత్రులతో రాజీనామా చేయించాలి. ఎంపీలను వెల్‌లోకి వెళ్లమంటారు. తన మంత్రులను కుర్చీల్లో కూర్చోమంటారు. చంద్రబాబుకు ఏమాత్రం నైతిక విలువలు ఉన్నా తన మంత్రులతో రాజీనామా చేయించాలి'' అని మేకపాటి పేర్కొన్నారు.



చంద్రబాబులాగా కక్కుర్తి పడం
''రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఎప్పుడో ఇచ్చి ఉండాల్సింది. నాలుగేళ్లయింది. ఇంకా చేస్తాం, చూస్తామంటే ఎలా? కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి నష్టం చేస్తోంది. చంద్రబాబుపై బీజేపీకి ఉన్న కోపం కారణంగా రాష్ట్రం నష్టపోతోంది. మేం గొంతెమ్మ కోరికలు కోరడం లేదు. రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టంలో చెప్పినవి, రాజ్యసభలో నాటి ప్రధానమంత్రి ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని మాత్రమే కోరుతున్నాం. ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు, విశాఖ రైల్వే జోన్, పెట్రో కెమికల్ కాంప్లెక్స్, దుగరాజపట్నం పోర్టు, కడప స్టీల్ ప్లాంట్, పారిశ్రామిక కారిడార్ వంటి కీలక అంశాల విషయంలో కేంద్రం ఇప్పటిదాకా చేసిందేమీ లేదు. రాష్ట్రం నష్టపోయినా ఫరవాలేదు, తనకు రాజకీయ లబ్ధి చేకూరితే చాలని చంద్రబాబు భావిస్తున్నారు. ఆయన స్వార్థం వల్ల రాష్ట్ర ప్రజలంతా నష్టపోవాల్సి వస్తోంది'' అని మేకపాటి రాజమోహన్‌రెడ్డి వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ ఏం సాధించిందన్న మీడియా ప్రశ్నకు సమాధానమిస్తూ... ''మేం ప్రతిపక్షంలో ఉన్నాం. మాకు 9 మంది ఎంపీలు ఉంటే, ఏపీలో చంద్రబాబు ముగ్గురిని తీసుకున్నాడు. తెలంగాణలో ఉన్న ఒక ఎంపీని తీసుకున్నాడు. ఇప్పుడు ఐదుగురం ఉన్నాం. పోరాటం సాగిస్తున్నాం. అన్యాయాలకు వ్యతిరేకంగా గొంతెత్తుతున్నాం. కేంద్ర ప్రభుత్వంపై నిరసన తెలుపుతున్నాం. ప్రభుత్వంలో అధికారం పంచుకుంటున్న టీడీపీ వాళ్లు సాధించిందేమిటో చెప్పాలి'' అని అన్నారు. టీడీపీ వెళ్లిపోతే కేంద్ర సర్కారులో వైఎస్సార్‌సీపీ చేరుతుందని అంటున్నారన్న మీడియా ప్రశ్నకు బదులిస్తూ... ''ఎవరండీ చేరేది? ఆఖరులో మేం చేరేది ఏముంది? బాబులాగా కక్కుర్తి పడేవాళ్లం కాదు. రాష్ట్ర ప్రజలు జగన్ నాయకత్వాన్ని ఆశీర్వదించి 20 స్థానాలు వచ్చినప్పుడు.. రేపు ఢిల్లీలో రాజకీయ సమీకరణాలు మారబోతున్నాయి. ఏపీ ఎంపీలతో ఢిల్లీ పెద్దలకు కచ్చితంగా పని పడుతుంది. మన ప్రాపకం కోరే పరిస్థితి వస్తుంది. అప్పుడు మన రాష్ట్రానికి రావాల్సినవన్నీ సాధించుకోవచ్చు'' మేకపాటి స్పష్టం చేశారు.

@ysjagan
ప్రజల ఆవేదనను ప్రతిబింబించింది
రాష్ట్రబంద్‌పై ప్రతిపక్షనేత జగన్ ట్వీట్



సాక్షి, విజయవాడ: గురువారం జరిగిన రాష్ట్రబంద్ ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆవేదనను ప్రతిబింబించిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ట్విటర్‌లో పేర్కొన్నారు. బంద్‌కు సహకరించిన అన్నివర్గాల ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రత్యేక హోదా అనేది ఆంధ్రప్రదేశ్ ప్రజల హక్కు అని, పార్లమెంట్ ద్వారా లభించిన ఈ హక్కును సాధించుకునేంతవరకు పోరాటం కొనసాగిద్దామని పిలుపునిచ్చారు.



మద్యం వ్యాపారులకు 15 % కమీషన్!

▶ మొదటి పేజీ తరువాయి



ప్రతిపాదనలు రూపొందించినట్లు సమాచారం. దీనివల్ల వ్యాపారులకు మరింత ప్రోత్సాహం లభించి, మద్యం అమ్మకాలు ఊపందుకుంటాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో మద్యం అమ్మకాలు రూ.13,640 కోట్లు దాటాయి. ఇందులో రూ.954.8 కోట్లు కమీషన్ రూపంలో మద్యం వ్యాపారుల జేబుల్లోకి వెళ్లాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మద్యం విక్రయాల ద్వారా రూ.17 వేల కోట్లకుపైగా ఆర్జించాలని సర్కారు నిర్ణయించింది. అందులో భాగంగానే కమీషన్ పెంపు ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. ఒక మద్యం వ్యాపారి తన లీజు కాలంలో సగటున రూ.4 కోట్ల విలువైన మద్యం విక్రయిస్తే, ఇకపై కమీషన్ రూపంలో రూ.60 లక్షలు దక్కనున్నాయి.

ప్రభుత్వ పెద్దలకు డబ్బేడబ్బు
మద్యం వ్యాపారులకు కమీషన్ పెంచుతున్నందుకు ప్రతిఫలంగా సిండికేట్లు ప్రభుత్వ పెద్దలకు భారీగానే ముట్టజెప్పినట్లు సమాచారం. రాష్ట్రంలో ప్రతి మద్యం దుకాణం, బార్ల నుంచి రూ.20 వేల వరకూ వసూలు చేసినట్లు చర్చ జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 4,380 మద్యం దుకాణాలు, 779 బార్లు ఉన్నాయి. మద్యం సిండికేట్లు వీటి నుంచి రూ.8 కోట్ల వరకు వసూలు చేసి, ప్రభుత్వ పెద్దలకు అందజేసినట్లు సాక్షాత్తూ ఎక్సైజ్ శాఖ వర్గాలే చెబుతుండడం గమనార్హం.

రాజ్యసభ ఎన్నికల్లో నెగ్గేందుకు టీడీపీ ప్రలోభాలు

- రాష్ట్రపతి కోవింద్‌కు వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ఫిర్యాదు
- మా ఎమ్మెల్యేలకు టీడీపీ రూ. 25 కోట్లు చొప్పున ఆఫర్ చేస్తోంది
- ఇప్పటికే 23 మందిని పార్టీ ఫిరాయింపులకు ప్రోత్సహించారు
- టీడీపీ ఎంపీ టీజీ వెంకటేష్ బేరసారాలకు దిగుతున్నారు

సాక్షి, న్యూఢిల్లీ: అధికార టీడీపీ డబ్బులు వెదజల్లి రాజ్యసభ ఎన్నికల్లో గెలుపొందేందుకు ప్రయత్నిస్తోందని వైఎస్సార్ సీపీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి గురువారం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు ఫిర్యాదు చేశారు. వైఎస్సార్ సీపీకి చెందిన ఎమ్మెల్యేలకు రూ. 25 కోట్లు చొప్పున ఆఫర్ చేస్తూ అవినీతి చర్యలకు పాల్పడుతోందని రాష్ట్రపతి దృష్టికి తెచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కోట్ల రూపాయలు ఇస్తామంటూ ప్రతిపక్ష పార్టీకి చెందిన ఎమ్మెల్యేలను మభ్యపెట్టి లాక్కుంటున్న తీరును రాష్ట్రపతికి వివరించారు.

ఫిరాయింపులపై స్పీకర్‌కు ఫిర్యాదు చేసినా స్పందించలేదు
వైఎస్సార్ సీపీకి చెందిన 23 మంది ఎమ్మెల్యేలను అధికార టీడీపీ ప్రలోభాలకు గురిచేసి ఫిరాయింపులకు ప్రోత్సహించిందని, ఇప్పుడు మళ్లీ రాజ్యసభ ఎన్నికల్లో నెగ్గేందుకు మరో నలుగురిని లాక్కొనేందుకు ఒక్కో ఎమ్మెల్యేకు రూ. 25 కోట్లు ఆఫర్ చేస్తోందని రాష్ట్రపతికి ఫిర్యాదు చేశారు. అధికార పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ కొద్ది రోజుల క్రితం తమ పార్టీ ఎమ్మెల్యేలను కలసి టీడీపీలో చేరాలంటూ రూ. 25 కోట్లు ఆఫర్ చేసి ప్రలోభపెడుతున్నారని చెప్పారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని శాసనసభ స్పీకర్ కోడెల శివప్రసాదరావుకు ఫిర్యాదు చేసినా ఆయన చర్యలు తీసుకోకుండా టీడీపీ తొత్తుగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు.



వైఎస్సార్ సీపీ రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డితో సమావేశం అనంతరం రాష్ట్రపతి కోవింద్ చేసిన ట్వీట్

మీరే ఆమోదించి.. మీరే నిరసనలా?
కేంద్ర క్యాబినెట్‌లో కొనసాగుతున్న టీడీపీ ఎంపీలు అశోక్‌గజపతిరాజు, సుజనాచౌదరి కేంద్ర బడ్జెట్‌ను, రాష్ట్రపతి ప్రసంగాన్ని ఆమోదించి.. తిరిగి వారే పార్లమెంటులో వ్యతిరేకిస్తూ నిరసన తెలపటంపై విజయసాయిరెడ్డి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దీన్ని రాష్ట్రపతి దృష్టికి తెచ్చారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీలను కేంద్రం అమలు చేయలేదని రాష్ట్రపతికి విజయసాయిరెడ్డి వివరించారు. గత ప్రధాని ఇచ్చిన ప్రత్యేక హోదా హామీ, విశాఖకు రైల్వే జోన్, దుగరాజపట్నం పోర్టు, విశాఖ–చెన్నై కారిడార్, పోలవరం మొత్తం ఖర్చును భరించడం లాంటి అంశాలను కేంద్ర బడ్జెట్‌లో పొందుపరచలేదన్నారు. ఏపీకి జరుగుతున్న అన్యాయాన్ని రాష్ట్ర ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని వైఎస్సార్ సీపీ తరఫున రాష్ట్రపతికి నివేదించినట్లు అనంతరం ఎంపీ విజయసాయిరెడ్డి మీడియాకు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అవినీతి చర్యల గురించి కూడా రాష్ట్రపతికి వివరించామన్నారు.

జగన్ పాదయాత్రపై రాష్ట్రపతి వాకబు
వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పం పాదయాత్ర గురించి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ వాకబు చేశారు. జగన్ యోగక్షేమాల గురించి, పాదయాత్రపై రాష్ట్రపతితో భేటీ సందర్భంగా అడిగినట్లు విజయసాయిరెడ్డి మీడియాకు తెలిపారు. ప్రతిపక్ష నేత పాదయాత్ర జరుగుతున్న తీరు గురించి రాష్ట్రపతికి వివరించినట్టు తెలిపారు.

చంద్రబాబుపై ఈసీకి ఫిర్యాదు చేస్తాం..
వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రలోభపెట్టి కొనుగోలు చేస్తున్న తీరుపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు విజయసాయిరెడ్డి తెలిపారు. చంద్రబాబు తనపై చేసిన విమర్శలను ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి తిప్పికొట్టారు. రాజ్యసభ సభ్యుడిగా రాష్ట్ర ప్రయోజనాల కోసం తాను ఎవరినైనా కలుస్తానని చెప్పారు. చంద్రబాబులా తాను అవినీతికి పాల్పడడం లేదని, లంచాలు తీసుకోవడం లేదని, చిత్తశుద్ధితో రాష్ట్ర ప్రయోజనాల కోసం పనిచేస్తున్నానని చెప్పారు. ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురిచేస్తున్న టీడీపీ నేతల వివరాలను త్వరలో బయట పెడతామని ప్రకటించారు.

అమరావతికి మెట్రో లేదు
పార్లమెంట్‌లో ప్రకటించిన కేంద్రం

సాక్షి, అమరావతి: మెట్రో రైలు లేదా లైట్ మెట్రో రైలు వ్యవస్థలను అమరావతిలో ఏర్పాటు చేసే ప్రతిపాదన ఏదీ లేదని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రకటించింది. వైఎస్సార్ సీపీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పూరి గురువారం రాజ్యసభలో ఈమేరకు సమాధానం ఇచ్చారు. ఏపీ రాజధాని అమరావతిలో ఏ మెట్రో రైల్ ప్రాజెక్ట్‌నూ చేపట్టే ప్రతిపాదన ప్రభుత్వం వద్ద లేదన్నారు. ప్రధాని మాతృ వందనం పథకం అమలులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం జార్ఖండ్, చత్తీస్‌ఘడ్ కంటే కూడా వెనుకబడినట్లు మహిళా శిశు సంక్షేమ శాఖ సహాయ మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్ తెలిపారు. ఎంపీ వి.విజయసాయిరెడ్డి అడిగిన మరో ప్రశ్నకు ఆయన సమాధాం ఇస్తూ పథకం అమలు చేస్తున్న రాష్ట్రాల జాబితాలో ఏపీ 19వ స్థానంలో ఉన్నట్లు చెప్పారు. పథకం కింద ఈ ఏడాది ఫిబ్రవరి 5వతేదీ నాటికి ఆంధ్రప్రదేశ్‌లో కేవలం 2,352 మంది మాత్రమే లబ్ధి పొందినట్లు తెలిపారు.

చీరాల పట్టు చీరలకు జియో ట్యాగింగ్ ప్రతిపాదన రాలేదు
చీరాల పట్టు చీరలకు జియా ట్యాగింగ్‌కు సంబంధించి ఎలాంటి ప్రతిపాదన రాలేదని కేంద్రం స్పష్టం చేసింది. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి అడిగిన ప్రశ్నకు గురువారం లోక్‌సభలో కేంద్ర మంత్రి అజయ్ తమ్టా లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు.

జేఈఈ మెయిన్‌కు తగ్గుతున్న దరఖాస్తులు

- గడిచిన మూడేళ్లలో గణనీయంగా పడిపోయిన సంఖ్య
- 12.93 లక్షల నుంచి 11.35 లక్షలకు తగ్గిన దరఖాస్తులు
- ఏడు దశల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నా మిగులే
- హైదరాబాద్, కాన్పూర్ ఐఐటీల్లో మాత్రమే అన్ని సీట్లు భర్తీ

సాక్షి, హైదరాబాద్: జేఈఈ మెయిన్ కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది. గడిచిన మూడేళ్లలో 1.5 లక్షల మందికి పైగా దరఖాస్తు చేసుకునే విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది. ఓ వైపు జాతీయ స్థాయి సాంకేతిక విద్యా సంస్థలు, మరోవైపు రాష్ట్రాలు తమ పరిధిలోని ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్లను జేఈఈ మెయిన్ ద్వారానే భర్తీ చేసుకునేందుకు చర్యలు చేపడుతున్నా.. దరఖాస్తు చేసుకునే విద్యార్థుల సంఖ్య పడిపోతోంది. 2015–16 విద్యా సంవత్సరంలో 12.93 లక్షల మంది విద్యార్థులు జేఈఈ మెయిన్ రాసేందుకు దరఖాస్తు చేసుకోగా, 2018–19లో 11.35 లక్షల మంది మాత్రమే దరఖాస్తు చేసుకోవడమే ఇందుకు ఉదాహరణ. ఏదో పరీక్ష రాద్దామనే ఉద్దేశంతో కాకుండా సీరియస్‌గా ప్రిపేర్ అయ్యే విద్యార్థులే దరఖాస్తు చేసుకుంటున్నారని, దరఖాస్తులు తగ్గడానికి అదే కారణమని విద్యావేత్తలు పేర్కొంటున్నారు. ఇక ప్రవేశాల విషయానికి వస్తే.. నాలుగేళ్ల కిందటి పరిస్థితితో పోల్చితే కొంత మెరుగైనా ఇంకా సీట్లు ఖాళీగానే ఉంటున్నాయి. ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్‌ఐటీ, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో కొనసాగే జాతీయ స్థాయి విద్యా సంస్థల్లో (జీఎఫ్‌టీఐ) ప్రవేశాలు తగ్గిపోతున్నాయి. గతంలో కంటే సీట్ల మిగులు అధికంగా ఉంటోంది. జేఈఈ మెయిన్ ర్యాంకుల ఖరారులో ఇంటర్మీడియెట్ మార్కులకు వెయిటేజీ తొలగించడం, జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష రాసేందుకు ఇంటర్ మార్కులు 75 శాతం (ఎస్సీ, ఎస్టీలకు 65 శాతం) ఉంటే చాలన్న సడలింపు ఇచ్చినా సీట్ల మిగులు తగ్గడం లేదు. సీట్ల మిగులు ఉండకుండా చూసేందుకు మూడేళ్ల నుంచి కేంద్ర ప్రభుత్వం వెయిటేజీ తొలగింపు, సడలింపులు వంటి చర్యలు చేపట్టడంతోపాటు ఏడు విడతలుగా ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహిస్తోంది. అయినప్పటికీ మార్పు రావడం లేదు. 2014–15 విద్యా సంవత్సరంలో ఐఐటీల్లో కేవలం 3 సీట్లు మిగిలిపోగా, 2017–18లో 121 సీట్లు మిగిలిపోయాయి.

అడ్వాన్స్‌డ్‌కు అర్హుల సంఖ్య పెంచినా..
జేఈఈ మెయిన్‌లో అర్హత సాధించిన వారి నుంచి జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు పరిగణనలోకి తీసుకునే విద్యార్థుల సంఖ్యను క్రమంగా పెంచుతున్నా పరిస్థితి అలానే ఉంది. జేఈఈ మెయిన్‌లో అర్హత సాధించిన వారిలో టాప్ 1.5 లక్షల మంది విద్యార్థులను గతంలో జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హులుగా తీసుకునేవారు. క్రమంగా దాన్ని టాప్ 2 లక్షలకు, టాప్ 2.2 లక్షలకు, ప్రస్తుతం టాప్ 2.24 లక్షలకు పెంచింది. అయినా సీట్ల మిగులు పెరుగుతోంది.

ఆర్ఎస్‌పీడీ నిధుల బాధ్యత వ్యవసాయ శాఖదే

సాక్షి, అమరావతి: తక్కువ వర్షపాతం నమోదయ్యే పర్వత ప్రాంతాల అభివృద్ధి విభాగాన్ని (ఆర్ఎస్‌పీడీ) వ్యవసాయ, సహకార శాఖలో విలీనం చేసినట్టు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి స్పష్టం చేసింది. ఆర్ఎస్‌పీడీ సిబ్బంది మొదలు, నిధుల వినియోగం వరకు వ్యవసాయ శాఖదే బాధ్యతని, ఆర్ఎస్‌పీడీకి ఎలాంటి అధికారాలు లేవని పేర్కొంటూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

రాష్ట్రంలో రోడ్ సేఫ్టీ లీడ్ ఏజెన్సీలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో రోడ్ సేఫ్టీ లీడ్ ఏజెన్సీలను ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. రహదారి భద్రతపై సుప్రీం కోర్టు కమిటీ ఆదేశాల మేరకు వీటిని ఏర్పాటు చేయనున్నట్టు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ గురువారం పరిపాలన అనుమతులు జారీ చేశారు.



... వదులుకుంటే ఆయన మంత్రి పదవే పోతుంది.. మావి పోతాయ్!!

తిరుమలలో గదుల నిర్మాణానికి స్వస్తి!

- ధార్మిక క్షేత్రం పవిత్రత, పర్యావరణ పరిరక్షణకే..
- గదుల నిర్మాణం ఇక తిరుపతిలోనే!
- భక్తుల వసతి కొరతపై దృష్టిసారించిన టీటీడీ ఈవో

సాక్షి, తిరుమల: ప్రముఖ ధార్మిక క్షేత్రం పవిత్రత, శేషాచల పర్యావరణ పరిరక్షణకు తిరుమలలో ఇకపై గదుల నిర్మించకూడదని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) సంకల్పించింది. మరోవైపు.. స్వామి దర్శనానికి పెరుగుతున్న భక్తులకు అనుగుణంగా తిరుపతిలోనే వసతి కల్పనకు శ్రీకారం చుట్టాలని నిర్ణయించింది. తిరుపతిలో 2,600 గదుల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. తిరుమలలో ప్రస్తుతం ఏడువేల వరకు గదులు ఉన్నాయి. ఇందులో కాటేజీలతోపాటు బహుళ అంతస్తుల వసతి సముదాయాలున్నాయి. వాటితోపాటు భక్తులకు మరుగుదొడ్లు, స్నానపు గదులు, లగేజీ భద్రపరిచే లాకర్లతో కూడిన నాలుగు యాత్రి సదన్‌లు ఉన్నాయి. 2017 లెక్కల ప్రకారం సరాసరిగా రోజూ 75వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకుంటున్నారు. ఇలా వచ్చిన వారిలో కొందరు గదుల కొరతతో తీవ్ర ఇబ్బందులు చవిచూడాల్సి వస్తోంది.



టీటీడీ పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, శ్రీనివాసరాజు, సిద్ధాంతి తదితరులు

తిరుపతిలో భారీ వసతి సముదాయాలు

ఈ నేపథ్యంలో, తిరుపతిలో టీటీడీకి చెందిన శ్రీనివాసం, మాధవం, విష్ణునివాసాల మాదిరిగానే మరో 10వేల మంది భక్తులకు వసతి కల్పించేలా భారీ వసతి సముదాయాలు నిర్మించాలని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ నిర్ణయించారు. తొలి విడతగా 2,600 గదులతో కూడిన సముదాయాన్ని నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధంచేశారు. ఇందుకు అలిపిరితోపాటు టీటీడీకి చెందిన పలు భూముల్లో ప్రాథమిక సర్వే చేశారు. ఇదిలా ఉంటే.. తిరుమలలో గతంలోనే ప్రారంభించిన నిర్మాణాల పూర్తిపై టీటీడీ దృష్టిసారించింది. ఇవి పూర్తిచేశాక, తిరుమలలో ఇతర నిర్మాణాలు చేపట్టకూడదని నిర్ణయించారు.

టీటీడీ పంచాంగం ఆవిష్కరణ

2018–2019 శ్రీ విళంబి నామ సంవత్సర తెలుగు పంచాంగాన్ని గురువారం రాత్రి టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్, జేఈవో శ్రీనివాసరాజు ఆవిష్కరించారు. తర్వాత ఈవో మాట్లాడుతూ, రాశిఫలాలతోపాటు అన్ని పరిస్థితులు వివరిస్తూ 80వేలు కాపీలు ముద్రించామన్నారు. ప్రస్తుతం ఇవి తిరుమల, తిరుపతిలో అందుబాటులో ఉన్నాయని, వచ్చేవారం నుండి అన్ని టీటీడీ సమాచార కేంద్రాల్లో విక్రయిస్తామన్నారు. టీటీడీ ఆస్థాన సిద్ధాంతి తంగిరాల వెంకటకృష్ణ పూర్ణప్రసాద్ మాట్లాడుతూ, ఈసారి అధిక మాసం దృష్ట్యా తిరుమలేశునికి రెండు బ్రహ్మోత్సవాలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు.

గంటన్నర.. గజగజ

శ్రీశైలం బ్యాక్ వాటర్‌లో బోటు నిలిచిపోవడంతో వణికిపోయిన పర్యాటకులు

కొత్తపల్లి: శ్రీశైలం డ్యాం బ్యాక్‌వాటర్ మధ్యలో ఓ బోటు నిలిచిపోయింది. దాదాపు గంటన్నర పాటు 25 మంది పర్యాటకులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడిపారు. లైఫ్ జాకెట్లు కూడా లేకపోవడంతో భయాందోళనకు గురయ్యారు. వివరాలు.. గురువారం మధ్యాహ్నం తెలంగాణలోని వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం చెర్లోపల్లికి చెందిన 25 మంది శివ స్వాములతో ఇంజిన్ బోట్ సోమశిలఘాట్ నుంచి సంగమేశ్వరం ఘాట్‌కు బయలుదేరింది. కృష్ణా జలాల నడి మధ్యకు చేరుకోగానే ఇంజన్‌కు వల తగిలి బోటు నిలిచిపోయింది. ఎంతకీ స్టార్ట్ కాకపోవడంతో గంటన్నర పాటు శివస్వాములు బోటులోనే బిక్కుబిక్కుమంటూ గడిపారు. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రమాదం జరగలేదు. విషయం తెలుసుకున్న కర్నూలు ఆర్డీవో హుసేన్ సాహెబ్ వెంటనే ఆత్మకూరు సీఐ కృష్ణయ్య, కొత్తపల్లి తహసీల్దారు రామకృష్ణను సంగమేశ్వరం పంపించారు. వారు మరో బోటును పంపించి శివస్వాములను ఒడ్డుకు చేర్చారు.



శ్రీశైలం బ్యాక్ వాటర్‌లో బోటు నిలిచిపోవడంతో బిక్కుబిక్కుమంటున్న పర్యాటకులు

ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో చట్ట వ్యతిరేక పనులు

హైకోర్టులో దాఖలైన పిటిషన్



సాక్షి, హైదరాబాద్: పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం సావిత్రిపేటలో ఉన్న ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో చట్ట వ్యతిరేక పనులు జరుగుతున్నాయని, 22 మంది మహిళలను అక్కడ నిర్బంధించారని హైకోర్టులో పిటిషన్ దాఖలయ్యింది. వీరేంద్రదేవ్ దీక్షిత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ విద్యాలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాల పేరుతో మహిళలను వేధిస్తున్నారని జి.శ్రీను, మరో ఐదుగురు హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వివరించారు. ఈ పిటిషన్‌ను గురువారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేషసాయి విచారించారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని జిల్లా ఎస్పీని ఆదేశిస్తూ.. విచారణను రెండు వారాలకు వాయిదా వేశారు.


సాక్షి
శుక్రవారం, ఫిబ్రవరి, 9

పారికర్‌పై మైనింగ్ మరక

దేశ భూభాగంలో గోవా వాటా ఒక శాతంకన్నా తక్కువే. కానీ అక్కడున్న దట్టమైన అడవులు, నీలాకాశాన్ని తాకుతున్నట్టనిపించే శిఖరాలు, గగుర్పొడిపించే లోయలు, మనోహర సాగర తీరాలు దేశ విదేశాలనుంచి ఏటా దాదాపు 40 లక్షలమంది పర్యాటకుల్ని ఆకర్షిస్తాయి. అలాంటి రాష్ట్రంలో అక్కడి ప్రభుత్వం ఆదరా బాదరాగా వివిధ సంస్థల మైనింగ్ లీజులను పొడిగిస్తూ 2014 నవంబర్–2015 జనవరి మధ్య తీసుకున్న నిర్ణయాలు చెల్లవని సర్వోన్నత న్యాయస్థానం బుధవారం వెలువరించిన తీర్పు పర్యావరణవాదులకు ఊరటనిస్తుంది. అదే సమయంలో గోవాలోని మనోహర్ పారికర్ నాయకత్వాన గల బీజేపీ ప్రభుత్వాన్ని ఇరకాటంలోకి నెడుతుంది. నిజానికి 2007–12 మధ్య ఆయన ప్రతిపక్ష నాయకుడిగా, ప్రజా పద్దుల సంఘం (పీఏసీ) చైర్మన్‌గా ఉండి మైనింగ్ లీజుల్లో సాగుతున్న అవకతవకలను వెలుగులోకి తెచ్చారు. అప్పటి కాంగ్రెస్ పాలనలో సాగుతున్న ఈ అక్రమాల వల్ల ఖజానాకు రూ. 25,000 కోట్ల నష్టం వాటిల్లిందని ఆరోపించారు. అనంతరం ఆయన నేతృత్వంలో ఏర్పడిన ప్రభుత్వం ప్రకటించిన కొత్త లీజు విధానం సైతం ఆచరణలో పాత సంస్థలకే మేలు చేకూర్చేవిధంగా ఉన్నదన్న అభిప్రాయం అందరిలో కలిగింది. పైగా సుప్రీంకోర్టులో మైనింగ్ అవకతవకలపై ప్రజా ప్రయోజన వ్యాజ్యం విచారణలో ఉండగానే కొత్త విధానాన్ని ప్రకటించడం, ఆరోపణలు ఎదుర్కొంటున్న సంస్థలకే మళ్లీ లీజు పొడిగింపునకు అవకాశమీయడం విమర్శలకు తావిచ్చింది. నిజానికి నూతన విధానం అమలు మొదలయ్యాక పారికర్ కొద్దికాలం మాత్రమే ముఖ్యమంత్రిగా కొనసాగారు. పారికర్ సర్కారు 2014 అక్టోబర్ 1న గనులకు సంబంధించిన నూతన లీజు విధానాన్ని అంగీకరించగా అది నవంబర్ 4న అమల్లోకొచ్చింది. ఆ మర్నాటినుంచి డిసెంబర్ 10 వరకూ 16 సంస్థల మైనింగ్ లీజులు పొడిగించారు. వాస్తవానికి ఆయన నవంబర్ 8న కేంద్రంలో రక్షణ శాఖ మంత్రిగా వెళ్లిపోయారు. పారికర్ తర్వాత వచ్చిన లక్ష్మీకాంత్ పర్సేకర్ ప్రభుత్వం సైతం ఆ విధానం కిందే పాత లీజుదారుల గడువు పొడిగించుకుంటూ పోయింది. దీని స్థానంలో వేలం విధానాన్ని రూపొందించాలని ఒకపక్క కేంద్రంలోని ఎన్‌డీఏ సర్కారు నిర్ణయిస్తే అందుకు విరుద్ధంగా గోవా లీజు విధానం ఎందుకు ఉందన్నదే ప్రశ్న. కేంద్రం ముసాయిదా విధానాన్ని ప్రకటించాక సైతం లీజులు పొడిగించడం ఆపకపోవడం, ఆఖరికి గనుల లీజుకు వేలం విధానం అమల్లోకి తెస్తూ కేంద్రం ఆర్డినెన్స్ జారీ చేసిన రోజు కూడా ఈ వ్యవహారాన్ని కొనసాగించడం అనేక అనుమానాలకు తావిచ్చింది. సుప్రీంకోర్టు తాజా తీర్పు ద్వారా రద్దు చేసిన 88 లీజు పొడిగింపుల్లో 56 పొడిగింపులు వేలం విధానం ముసాయిదా ప్రకటనకూ, ఆర్డినెన్స్ జారీకి మధ్య చోటు చేసుకున్నాయి. మరో 31 పొడిగింపులు ఆర్డినెన్స్ జారీ అయిన రోజు ఆమోదం పొందాయి. మైనింగ్ లీజులను అంత హఠాత్తుగా, అంత హడావుడిగా ఎందుకు పొడిగించవలసి వచ్చిందో అర్థం కావడం లేదన్న సుప్రీంకోర్టు వ్యాఖ్యలు గమనించదగ్గవి. కేంద్రం గనులకు సంబంధించి ముసాయిదా విధానం వెలువరించిందని, అది త్వరలోనే అమల్లోకి రాబోతున్నదని అంచనా వేసుకునే గోవా ప్రభుత్వం ఇలా వ్యవహరించిందన్న అనుమానాలు వ్యక్తం చేసింది.

వాస్తవానికి పర్యావరణవాదుల ఆందోళనకు ప్రాతిపదిక పారికర్ వెలుగులోకి తెచ్చిన అంశాలే. ఈ విషయంలో అన్ని వర్గాల నుంచీ ఒత్తిళ్లు పెరగడంతో కేంద్రంలోని అప్పటి యూపీఏ ప్రభుత్వం దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఇనుము, మాంగనీసు వగైరా ఖనిజాల తవ్వకానికి ఎలాంటి మార్గాలు అనుసరిస్తున్నారో, ప్రత్యేకించి గోవాలో చోటుచేసుకుంటున్న అవకతవకలేమిటో వెలికితీయడానికి రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ ఎంబీ షా నేతృత్వంలో 2010లో ఒక కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఆ కమిషన్ వెలువరించిన మధ్యంతర నివేదికల ఆధారంగా సుప్రసిద్ధ పాత్రికేయుడు, పర్యావరణవేత్త క్లాడ్ ఆల్వారెస్ నేతృత్వంలోని గోవా ఫౌండేషన్ 2012లో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసింది. ఆ వ్యాజ్యంలోనే సుప్రీంకోర్టు ప్రస్తుత తీర్పు వెలువరించింది. కొండలు, గుట్టలు, నదీనదాలు వేల సంవత్సరాలనుంచి మనిషికి వారసత్వంగా సంక్రమిస్తున్న ప్రకృతి సంపద. ఆ సంపదను పొదుపుగా, జాగ్రత్తగా వినియోగించుకోవడం... సురక్షితంగా భవిష్యత్తరాలకు అందించడం ప్రజలందరి సమష్టి బాధ్యత. ప్రజలందరికీ ప్రాతినిధ్యం వహించి ఆ బాధ్యతను వారి తరఫున నెరవేర్చవలసిన ప్రభుత్వాలు దురదృష్టవశాత్తూ తామే ఆ సంపద ధ్వంసానికి కారణమవుతున్నాయి. అసలు ప్రపంచ దేశాలతో పోలిస్తే పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను గుర్తించడంలోనే మనం ఎంతో వెనకబడ్డాం. అందుకొక ప్రత్యేక శాఖ అవసరమని 1985 వరకూ పాలకులు అనుకోలేదు. ఆ తర్వాత సైతం అది నామమాత్రావశిష్టంగానే మిగిలింది. దేశంలో సంస్కరణలకు తలుపులు బార్లా తెరిచాక అభివృద్ధికీ, పర్యావరణ పరిరక్షణకూ మధ్య వైరుధ్యం మొదలైంది. ఒకటి కావాలంటే మరొకటి వదులుకోక తప్పదన్న వాదనలు బయల్దేరుతున్నాయి.

పర్యావరణ పరిరక్షణ కోసం పాటుబడేవారు పాలకులకు అభివృద్ధి నిరోధకులుగా, తిరోగమనవాదులుగా, కొన్ని సందర్భాల్లో మావోయిస్టులుగా కనబడుతున్నారు. ఒడిశాలో నియంగిరి కొండలను అల్యూమినియం ఖనిజం కోసం పిండి చేయడాన్ని అడ్డుకుంటున్న సామాజికవేత్త ప్రఫుల్ల సమంతర, ఛత్తీస్‌గఢ్‌లో బొగ్గు మాఫియాకు వ్యతిరేకంగా పోరాడిన రమేష్ అగర్వాల్‌వంటివారు పోలీసుల నుంచి, ప్రైవేటు ముఠాల నుంచి ఎదుర్కొన్న ఇబ్బందులే ఇందుకు ఉదాహరణ. గోవా ప్రభుత్వం లీజుల పొడిగింపు వ్యవహారం కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి మాత్రమే కాదు... సహజ సంపద వినియోగంలో అనుసరించాల్సిన విధానాలేమిటో నిర్దేశించిన 2014 ఏప్రిల్‌నాటి సుప్రీంకోర్టు తీర్పు స్ఫూర్తికి కూడా విరుద్ధం. సహజ వనరుల వినియోగంలో, కేటాయింపులో పెడ ధోరణులు తలెత్తకుండా తాజా తీర్పు దోహదపడుతుందని ఆశించాలి.




భూమి అందిస్తున్న వనరులు మనిషి అవసరాలకే కానీ, దురాశకు కాదు. స్వార్థం పైచేయి సాధించినప్పుడు వినాశం తథ్యం.

– మహాత్మా గాంధీ

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, తిథి బ.నవమి ప.2.36 వరకు, తదుపరి దశమి, నక్షత్రం అనూరాధ రా.7.14 వరకు, తదుపరి జ్యేష్ఠ, వర్జ్యం రా.1.21 నుంచి 3.06 వరకు, దుర్ముహూర్తం ఉ.8.47 నుంచి 9.33 వరకు, తదుపరి ప.12.35 నుంచి 1.20 వరకు, అమృతఘడియలు ఉ.8.01 నుంచి 9.41 వరకు.

సూర్యోదయం	: 6.35	12.00 వరకు
సూర్యాస్తమయం	: 5.54	యమగండం :
రాహుకాలం :		ప.3.00 నుంచి
ఉ.10.30 నుంచి		4.30 వరకు



నమాజ్ వేళలు

ఫజర్	: 5.32	మగ్రీబ్	: 6.15
జొహర్	: 12.30	ఇషా	: 7.29
అసర్	: 4.39		

విలువల పతనానికి 'ఈ' తోడైతే!



దిలీప్ రెడ్డి

ఇలా జరిగే ఘోరాలు, నేర ఘటనల్ని దర్యాప్తు సంస్థలు కదిలించినపుడు ఫేస్‌బుక్, వాట్సాప్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి మాధ్యమాల లింకులు బయటపడుతున్నాయి. దారితప్పేలా చేసిన ప్రేరణ వెల్లడవుతోంది. వివాహేతర సంబంధాల వల్ల జరిగే హత్యలు, ఆత్మహత్యలు, నేరపూరిత దాడుల ఘటనల్లోనూ కొత్త పరిచయాల నుంచి అనుచిత, లైంగిక సంబంధాలు, వైషమ్యాల వరకు సెల్‌ఫోన్లు, సామాజిక మాధ్యమాలు పోషిస్తున్న పాత్ర విడదీసి చూడరానిదిగా ఉంటోంది.

సమకాలీనం

ఒక టెలివిజన్ జర్నలిస్టు నుంచి ఉదయం వాట్సాప్‌లో నాకో గుడ్‌మార్నింగ్ మెసేజ్ వచ్చింది. అందులో 'ఈ ప్రపంచంలో ఏదీ 'మంచి' లేదా 'చెడు' అని నిర్దిష్టంగా ఉండదు. మన ఆలోచనల్ని బట్టే ఏదైనా! ప్రాణాల్ని కాపాడేందుకు ఓ వైద్యుడు శస్త్రచికిత్సకు వాడుతున్నపుడు కత్తి మంచిది. ప్రాణాల్ని తీసేందుకు ఓ ఉగ్రవాది వినియోగిస్తున్నపుడు కత్తి చెడ్డది' ఇదీ సంక్షిప్త సందేశం. అంటే, కత్తి కాకుండా దాని వినియోగాన్ని బట్టే ఫలితం మంచైనా, చెడైనా! సామాజిక మాధ్యమాలపైన ఈ మధ్య తరచూ చర్చ జరుగుతోంది. అవి మంచా–చెడా? శాపమా–వరమా? నిజానికీ చర్చకు ముగింపు లేదు. ఎందుకంటే, చాలా విషయాల్లోలాగానే ఇందులోనూ మంచి, చెడు రెండూ ఉంటాయి! మంచి–చెడు పాళ్లలో వ్యత్యాసం, హెచ్చు తగ్గులే ఈ చర్చను సజీవంగా ఉంచుతాయి. చెడును పరిహరించి, మంచిని స్వీకరించడమే మనం చేయాల్సింది. శాస్త్ర–సాంకేతిక పరిజ్ఞానం ఫలాలను సమాజం గరిష్టంగా ఉపయోగించుకొని ప్రయోజనం పొందగలుగుతుంది. ఆ తెలివిడి మనకు, అంటే ప్రజా సమూహాలకు, పౌర సంఘాలకు, పాలకులకు ఉండాలి. చెడును తగ్గించి, మంచి నిష్పత్తిని పెంచినపుడు సామాజిక మాధ్యమాలైనా, అంతర్జాల వ్యవస్థయినా సత్ఫలితాలిస్తుంది. భారతదేశానికి అపారంగా మానవవనరులున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఇదొక పెద్ద చేయూత. యువశక్తి వనరుల్ని భవిష్యత్ సంపదగా మలిచే క్రమంలో ఈ శాస్త్ర–సాంకేతికత సద్వినియోగం అవసరం. మార్కెట్ శక్తులు, సమాచారం శాసించే నేటి విశ్వసమాజంలో మనకు మనంగా స్థానాన్ని సుస్థిరపరచుకోవడానికి ఇదొక గొప్ప అవకాశం. జ్ఞాన–సమాచార వ్యాప్తి, వ్యాపార–వాణిజ్య విస్తరణ, వ్యక్తులు–సంస్థల మధ్య పరస్పర భావ వినిమయం వంటి ఎన్నో ప్రయోజనాలు ఈ సామాజిక మాధ్యమాలు, సైబర్ సాంకేతికత వల్ల ప్రభావవంతంగా నెరవేరతాయి. అలా కాకుండా, దుర్వినియోగమైనపుడు సమాజ వికాసం కుంటుపడుతుంది. తిరోగమనంలో సాగుతాం, ఓ నిర్వీర్య–నిస్తేజపు తరం ఆవిర్భవిస్తుంది. అంతర్జాలం, ఆ సాంకేతికత ఆధారంగా పనిచేసే గూగుల్, ఫేస్‌బుక్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, ట్విటర్, లింక్‌డిన్... తదితర మాధ్యమ వేదికలు సమాచార వ్యవస్థలో ఇప్పుడు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఉపయోగాన్ని బట్టి మంచి ఉపకరణాలు కాగలిగిన బలం, నేపథ్యం వాటికుంది. కానీ, పట్టుతప్పి చెడు మార్గం పడితే, ఒడుపుగా కాక నిర్లక్ష్యంగా ఉపయోగంలో పెడితే... అందుకు తగ్గ సమాజ పతనాన్ని రచించే శక్తి కూడా ఈ ఉపకరణాలకు ఉంది. పెడపోకడలను పెరుగుతున్న సంకేతాలు కనిపిస్తూనే ఉన్నాయి.

ఇరువైపులా పదునున్న కత్తినెలా వాడాలి?

అదివరకటి వందేళ్ల ప్రపంచ ప్రగతిని మించిన అభివృద్ధి గత ఇరవయ్యేళ్లలో లభించింది. మానవేతిహాసంలో నిప్పును గుర్తించి, వాడటం ఒక విప్లవాత్మక మార్పుగా చెబుతారు. తర్వాత.. 'చక్రం' కనుగొనడం ఓ మేలు మలుపై పారిశ్రామిక విప్లవానికి దారులు పరిచింది. ఆధునిక కాలంలో 'అంతర్జాలం' అనేక సంచలనాలకు మూలమైంది. సమాచార వ్యవస్థ వేగంగా వృద్ధి–విస్తరణ చెందింది. అది దన్నుగా నూతన ఆర్థిక, రాజకీయ విధానాల నీడలో ఎన్నెన్నో పరిణామాలు చోటు చేసుకున్నాయి. మౌలిక సదుపాయాల స్వరూప స్వభావాలే మారిపోయాయి. సమాజ గతి పెను మార్పులకు లోనవుతోంది. ఖండాలకతీతంగా మనుషుల జీవన శైలిలో వేగంగా మార్పులొస్తున్నాయి. వ్యక్తిగత సౌఖ్యాలు, సదుపాయాలు, ఆస్తులు పెరుగుతున్న క్రమంలోనే విలువలు నశిస్తున్నాయి. కట్టడిలేని కాలుష్యం! సహజవనరుల అసాధారణ వినియోగంతో భవిష్యత్తును భయానకం చేస్తున్నారు. శాస్త్ర–సాంకేతికత వృద్ధితో సమాచార, రవాణా సదుపాయాలు పెరిగాయి. ఫలితంగా భౌతిక దూరాభారాలు తగ్గి ప్రపంచమే ఓ కుగ్రామమౌతున్న తరుణంలో మనుషుల మధ్య అంతరాలు పెరుగుతున్నాయి. సాటి మనుషులపైన, జన సమూహాలపైన, వారి జీవన స్థితిగతులపైన అవగాహన లేమి కన్నా మనుషుల్లో 'పట్టింపులేనితనం' పెరిగిపోతోంది! ఆర్థిక అసమానతలు ప్రమాదకర స్థాయికి చేరాయి. 73 శాతం సంపద రెండు శాతం జనాభా వద్ద కేంద్రీకృతమైంది. ఎందుకిలా జరుగుతోంది? ఇది కోటి రూకల ప్రశ్న. మనిషి స్వార్థం హెచ్చడం, నిజాయితీ, విలువలు, సహజ జీవన పద్ధతులు నశించి కృత్రిమత్వం పెరగటం వల్లే ఇదంతా అనే వాదనా ఉంది. సంప్రదాయ ప్రసారమాధ్యమాలతో పాటు సామాజిక మాధ్యమాలు, అంతర్జాల వ్యవస్థ విస్తరించిన నేటి పరిస్థితుల్లో వనరుల హేతుబద్ధ వినియోగం, సంపద సృష్టి, సమగ్ర పంపిణీ, సమసమాజ స్థాపన, పర్యావరణ పరిరక్షణకు చక్కటి సావకాశమున్న సమయమిది. కృత్రిమ మేధ, రోబోటిక్స్ యుగంలోకి దూసుకువెళ్లినా మానవ విలువల పరిస్థితులు మాత్రం భిన్నంగా ఉన్నాయి. వినిమయవాద సంస్కృతి పెరిగి డబ్బు–సంపదకు ఇచ్చిన విలువ సాటి మనుషులకు ఇవ్వటం లేదు. మనుషులతో సంబంధాలు, నెట్‌వర్క్, విద్యావ్యాప్తి, సహాయ–సహకారాలు, సమాచారం–ఆధునీకరణ, వాణిజ్యవృద్ధి, అవగాహన పెంచడం, నేరాల నియంత్రణ, విభిన్న సమాజాల నిర్మాణం.... ఇలా పలు విషయాల్లో ఈ–సైట్లు బాగా ఉపయోగపడుతాయి. కానీ, వాటిని మంచి కోసం ఎక్కువగా వాడుకోవడం లేదు. అమెరికా, రష్యా, యూరప్, జపాన్, చైనా వంటి అభివృద్ధి చెందిన సమాజాలతో పోల్చినపుడు, వెనుకబడిన, ముఖ్యంగా భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న సమాజాల్లో ఇదింకా వేగం పుంజుకోవాల్సి ఉంది. సామాజిక మాధ్యమాల దుర్వినియోగం తగ్గి సద్వినియోగం పెరగాలి.

మానవ సంబంధాల విధ్వంసం

సున్నితమైన, విలువల ఆధారితమైన మానవ సంబంధాలే సమాజాల స్థితి గతిని నిర్వచిస్తాయి. విలువలతో కూడిన జీవన విధానమే ప్రపంచానికి భారత్ ఇచ్చిన కానుక అని, అమెరికా అధ్యక్షుడి హోదాలో బారాక్ ఒబామా మన పార్లమెంటు ఉభయసభలనుద్దేశించి మాట్లాడుతూ కీర్తించారు. ఆయన పొగిడింది చాన్నాళ్ల కిందటి మన గతం. ఇదివరకే క్షీణిస్తూ ఉన్న విలువలు నేడు మరింత సన్నగిల్లుతున్నాయి. సమిష్టి కుటుంబ వ్యవస్థ క్రమంగా కనుమరుగవుతూ చిన్న కుటుంబాలు రావడం, సగటుమనిషి ఆలోచనలు డబ్బుమయమవడం, అన్ని రంగాల్లోనూ విలువలు–ప్రమాణాలు పడిపోవడం, అవసరాలకు–అవకాశాలకు మధ్య సంఘర్షణ వంటివి మనుషుల్లో నైతికతను తగ్గిస్తున్నాయి. మారిన విద్యా విధానంతో పాటు ఇందుకెన్నెన్నో కారణాలున్నా, అంతర్జాల వ్యవస్థ, సామాజిక మాధ్యమాల పాత్ర కూడా ఉంది. ముఖ్యంగా సోషల్ నెట్‌వర్కింగ్ సైట్స్ (ఎస్సెన్నెస్) యువతపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. మంచి కన్నా చెడు వైపు వేగంగా ఆకర్షితులవుతున్నారు. ఫలితంగా వ్యక్తిగత సంబంధాలు, వ్యక్తుల సామాజిక అనుబంధాలు బలహీనపడుతున్నాయి. పిల్లలు, యువతరం ఎదుగుదలలో బహుముఖ వికాసం కనిపించడం లేదు. పనికిమాలిన సమయం వృథా వ్యవహారాల్లో మునిగి తేలుతూ మేధోమరుగుజ్జులవుతున్నారు. సైట్ల ప్రభావం వారిపై అలా ఉంది. 'మనం ఏం చూస్తున్నాం, ఏం వింటున్నాం, ఏం మాట్లాడుతున్నాం అన్నదే ప్రధానంగా మన ఆలోచనల్ని ప్రభావితం చేస్తుంది' అంటారు శంకరాచార్యుడు. దేశంలో 42 కోట్లమందికి పైగా అంతర్జాలం వినియోగిస్తున్నారు. అందులో సగం మంది సామాజిక మాధ్యమాల్లో క్రియాశీలంగా ఉన్నారు. 18–24 మధ్య వయస్కులే అత్యధికులు. దేశంలో నేడు సెల్‌ఫోన్ వాడని యువతీయువకులు లేరేమో? పొద్దస్తమానం అదే పనిగా సామాజిక మాధ్యమాలతో గడిపేవారే అత్యధికులు. వారికి లభించే సరుకు అలా ఉంది. ఎదిగే పిల్లల చదువులు, కౌమారంలోని వారి ఆలోచనలు, యవ్వనంలోని యువతీయువకుల సంబంధాలు తీవ్రంగా ప్రభావితమౌతున్నాయి. అశ్లీలసైట్ల విచ్చలవిడి తనానికి హద్దే లేదు. 16, 17 ఏళ్ల వయసులోనే ప్రేమలని, వైఫల్యాలని, మానసిక కుంగుబాట్లని, కక్ష్యలు–కార్పణ్యాలని, కడకు ఆత్మహత్యలు, హత్యల వైపు సాగుతున్న ఘటనలెన్నో! ఇలా జరిగే ఘోరాలు, నేర ఘటనల్ని దర్యాప్తు సంస్థలు కదిలించినపుడు ఫేస్‌బుక్, వాట్సాప్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి మాధ్యమాల లింకులు బయటపడుతున్నాయి. దారితప్పేలా చేసిన ప్రేరణ వెల్లడవుతోంది. వివాహేతర సంబంధాల వల్ల జరిగే హత్యలు, ఆత్మహత్యలు, నేరపూరిత దాడుల ఘటనల్లోనూ కొత్త పరిచయాల నుంచి అనుచిత, లైంగిక సంబంధాలు, వైషమ్యాల వరకు సెల్‌ఫోన్లు, సామాజిక మాధ్యమాలు పోషిస్తున్న పాత్ర విడదీసి చూడరానిదిగా ఉంటోంది. 'నిర్మిత ప్రపంచంలోని యాదృచ్ఛిక సంబంధాలకు, వాస్తవిక ప్రపంచంలోని అర్థవంతమైన సంబంధాలకు మధ్య తేడాలు తెలుసుకునే విచక్షణా జ్ఞానాన్ని సామాజిక మాధ్యమాలు హరించివేస్తాయి' అని కార్నెల్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ స్టీవెన్ స్ట్రాంగజ్ అంటారు. వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని, సామాజిక మాధ్యమాల పట్ల అజాగ్రత్తగా ఉంటే జరిగే నష్టాలను ప్రపంచ మేధావులు ఏకరువు పెడుతున్నారు. జాగ్రత్త పడకుంటే, బనాయింపుల్తో .... బలహీన మనస్కుల్ని వేధించి, ఆత్మహత్యలకు పురికొల్పే సైబర్ రౌడీయిజం, డాటాను కొల్లగొట్టే హ్యాకింగ్స్, నిలువునా ముంచే నేరాలు–స్కామ్‌లు, వ్యక్తిగత భద్రతకు ముప్పు కలిగించడాలు పెచ్చుమీరతాయి. వాడేవారికిదొక వ్యసనంగా మారడం, శారీరక–మానసిక రుగ్మతలకు దారితీయడం వంటి అరిష్టాలెన్నో!


మూలాల్ని గుర్తించి మందేయాలి

విలువల పరిస్థితి మెరుగు పరచకుండా, సామాజిక మాధ్యమాల్లో వచ్చే 'సరుకు' ప్రమాణాల్ని నియంత్రించకుండా పైపై చర్యలు ఎన్ని చేసినా పెద్దగా ప్రయోజనం ఉండదనే భావన వ్యక్తమౌతోంది. 'షీ–టీమ్'లు, సీసీ కెమెరాలు, ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాటు వంటివి తదనంతర నియంత్రణ చర్యలే తప్ప సమస్య మూలాల్లోకి వెళ్లి పరిష్కార మార్గాలు వెతకటం కాదనే పెదవి విరుపు ఉంది. పట్టణాలు, మండల–గ్రామ స్థాయిల్లో ఇప్పటికే ఇదొక నియంత్రణ లేని వ్యవస్థగా, చేయి దాటిన వ్యసనంగా మారింది. కౌమారంలోని పిల్లలు చదువులు పక్కన పడేసో, చదువుతూనో, అదరాబాదరగా చదువు ముగించో... పొద్దస్తమానం ఈ సైట్లతో గడిపేస్తున్నారు. వాటి ద్వారానే తప్ప, ప్రత్యక్ష సంభాషణలు, కలయికల్ని మానేస్తున్నారని 'చైల్డ్ మైండ్ డాట్ ఆర్గ్' వంటి సంస్థల అధ్యయనాలు తేల్చాయి. ఫలితంగా పిల్లలు–యువతలో సంయమనం, సమ్యక్‌దృష్టి, నిర్ణయసామర్థ్యం, విచక్షణ లోపిస్తున్నాయని తేలింది. సాధారణ స్థాయి బుద్ధి కుశలత, పనినైపుణ్యాల్ని కూడా చూపలేకపోతున్నారు. ఆదాయాలు, జీవన ప్రమాణాలకు ఆధునిక సెల్‌ఫోన్, ఈ–సైట్స్ వంటి సదుపాయాలకు మధ్య సమతూకం లేనపుడు కూడా కొన్ని సమస్యలు తలెత్తుతున్నాయి. నిరంతరం అవే చూస్తుండటం, తమ పరిస్థితిని ఇతరులతో పోల్చి చూసుకోవడం వల్ల కూడా అసంతృప్తి స్థాయి, ఆత్మన్యూనతా భావనలు పెరిగి అనర్థాలకు దారి తీస్తోందని డాక్టర్ స్టీవెన్ అడెయిర్ విశ్లేషిస్తారు. ఈ–సైట్ల వ్యసనపరుల్లో తెగించి అత్యాచారాలకు పాల్పడటమే కాకుండా ఈర్ష్య, దుగ్ధ, కక్ష్య–కార్పణ్యం వంటివి పెరిగి హింసకు పురికొల్పుతున్న ఘటనలూ ఉన్నాయి. 'నీ మిత్రులెవరో చెప్పు... నీవేంటో చెబుతా!' అన్నాడట బెర్నార్డ్‌షా. 'పదినిమిషాలు నీ సెల్‌ఫోన్ ఇవ్వు... నీవేంటో చెబుతా అంటోంది శాస్త్ర సాంకేతికత! తస్మాత్ జాగ్రత్త!!

ఈ–మెయిల్ : dileepreddy@sakshi.com

చర్చలు రగిలించిన మానవతామూర్తి

సాగర్‌లో రెసిడెన్షియల్ వ్యవస్థ అంత గొప్పగా ఉండటానికి కారణం వై.వి. రెడ్డి లాంటి ప్రిన్సిపాళ్లు ఉండటమే. ఒక విద్యాసంస్థను తీర్చిదిద్దడంలో సఫలీకృతులయ్యారు. ఉపదేశాలకు బదులు విద్యార్థుల్లో ఆలోచనలు రేపే చర్చలు రగిలించేవారు.



చుక్కా రామయ్య


ప్రతి ప్రిన్సిపాల్ తనకన్నా ముందున్న ప్రిన్సిపాళ్లను పిల్లలు విమర్శిస్తే సంతోషపడతారు. దాని వలన తన గౌరవం పెరుగుతుంది అనుకుంటారు. కానీ వై.వి రెడ్డి (వై. వెంకటరెడ్డి) తనకన్నా ముందున్న ప్రిన్సిపాళ్లను పొగిడితే సంతోషపడతాడు. ఈనాడు తన కుర్చీని పటిష్టంగా చేసింది వారే కదా అంటాడు. తన కన్న ముందున్న ప్రిన్సిపాళ్లను ఎంతో గౌరవంగా చూసేవాడు. ఆయనను నేను ప్రిన్సిపాల్‌గా, పొలిటికల్ సైన్స్ లెక్చరర్‌గా చూశాను. తనతో ఏకీభవించనివాళ్లను వాళ్లముందే విమర్శిస్తాడు. కానీ వారు లేనప్పుడు వారి మంచితనాన్ని పొగుడుతాడు. ఇది చాలామందిలో ఉండదు. మానవత్వానికి ప్రతీక ఆయన. ఆయనే నాగార్జున సాగర్ ఎ.పి.రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీకి నా తర్వాత వచ్చిన ప్రిన్సిపాల్. అలాంటి మనిషి విద్యార్థులకే కాదు, నాలాంటి వారికి కూడా ఆదర్శనీయం. చనిపోయిన తర్వాత వచ్చే కీర్తి అది శాశ్వత కీర్తి. బతికున్నప్పుడు వచ్చే కీర్తి నీళ్ల మీద రాతలే.

కొందరు వ్యక్తులు ఎక్కడికి వెళ్లినా ఏ ప్రాంతానికి వెళ్లినా, తమ పనిద్వారా, నడవడిక ద్వారా ప్రత్యేక ముద్ర వేస్తారు. తరగతి గది అంటే అది సిలబస్‌కు, పరీక్షలు నిర్వహించటానికి మాత్రమే కేంద్రం కాదు. తరగతి గదిని పరీక్షలతో పాటుగా భవిష్యత్ సమాజంలో విద్యార్థులు జీవితంలో ఎదుర్కొబోయే సమస్యలకు కూడా సన్నద్ధం చేస్తారు. వై.వి. రెడ్డి నల్గొండ ఎన్.జి. కాలేజీలో పనిచేస్తున్నప్పుడు నాకు సహ అధ్యాపకుడు. ఆయన ప్రతిరోజు దేశంలో, ప్రపంచంలో పత్రికల్లో వచ్చే వార్తలను విశ్లేషించి చెప్పేవాడు. వార్తల రూపం వెనుక ఏం జరిగి ఉంటుందని విశ్లేషించి చెప్పేవాడు. ఫలానా దేశంలో పరిస్థితులు ఏమిటి? అక్కడ ప్రజల చైతన్యస్థాయి ఏమిటి? ప్రజలు ఇలాంటి సమస్యలపై ఏ రకంగా ప్రతిస్పందిస్తారు అన్న అంశాలను నల్గొండ స్టాఫ్ రూమ్‌లో కూర్చున్నప్పుడు ఆయన చెప్పిన మాటలు మా మదిలో ఎప్పటికీ గుర్తుకు వస్తుంటాయి.

వై.వి. రెడ్డి ప్రతిరోజు విద్యార్థుల అసెంబ్లీలో మాట్లాడే మాటల విశ్లేషణలు విన్నాను. విద్యార్థులకు ఆయన హితోపదేశాలు చేసేవాడు కాదు. విద్యార్థులు ఆలోచించుకోవటానికి అనుగుణమైన చర్చను మాత్రం వారిలో రగిలించేవాడు. సమస్యలకు పరిష్కారం చెప్పేవాడుకాదు. కానీ పిల్లలను పాత్రధారులను చేసేవారు. దాని వల్ల ఆ స్కూల్లో చదువుకున్న పిల్లలు ఈనాడు సైంటిస్టులుగా, పాలనా రంగంలో, వివిధ వృత్తుల్లో ఉన్నతమైన దశలో ఉన్నారు. ఏ సమస్యకైనా, ఏ సవాళ్లకైనా పరిష్కారాలు చెప్పే పాలనాదక్షులయ్యారు. అలా ఒక విద్యాసంస్థను తీర్చిదిద్దడంలో వై.వి. రెడ్డి సఫలీకృతులయ్యారు. ప్రిన్సిపాలే పరిష్కారం చెబితే అతని గొప్పతనం మాత్రమే బయటపడుతుంది. కానీ అందులో పిల్లలను నిమగ్నం చేస్తే వాళ్ల భవిష్యత్‌ను నిర్ణయిస్తారు. దాంతో భవిష్యత్ నిర్మాణం జరుగుతుంది.

వై.వి. రెడ్డి దీర్ఘదృష్టి కలవాడు. కోదాడ డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న సమయంలో అక్కడి విద్యార్థులకు.. సమాజానికి కాలేజీకి మధ్య సంబంధం ఎలా ఉంటుందో ఆయన ఆచరణ ద్వారా చెప్పగలిగాడు. నాగార్జునసాగర్‌లో ప్రిన్సిపాల్‌గా ఉండి దేశానికి అవసరమైన పాలనాదక్షులను తయారుచేయటానికి దోహదపడ్డాడు. ఖమ్మంలో ఆయనపైన నక్సలైట్‌లకు ఆశ్రయం ఇచ్చిన వ్యక్తిగా ముద్ర పడింది. ఎమర్జెన్సీ కాలంలో అనేక సమస్యలను ఎదుర్కొన్నాడు. సాగర్‌లో డిగ్రీ చదువులో రెసిడెన్షియల్ వ్యవస్థ అంత గొప్పగా ఉండటానికి కారణం వై.వి. రెడ్డి లాంటి ప్రిన్సిపాళ్లు ఉండటమే. ఒక ప్రిన్సిపాల్‌ను అంచనా వేయాలంటే ఆయన పనిచేసిన కాలేజీలో లక్ష్యం ఏమేరకు చేరుకోగలిగారో అదే గీటురాయిగా చెప్పవచ్చు.

పరిశోధన అంటే సబ్జెక్టుపై సంపూర్ణ అవగాహన ఉండాలి. అంటే ప్రస్తుతం ఉన్న విజ్ఞానం నుంచి పరిశోధనాత్మకమైన దృక్కోణం రావాలి. దానికి కావాల్సింది సబ్జెక్టుపైన అవగాహనే. పరిశోధనాత్మక దృక్కోణం ఉన్న టీచర్లను తీసుకోవాలి. అదే కోణంలో ఏపీ రెసిడెన్షియల్ డిగ్రీకాలేజీల్లో అధ్యాపకుల నియామకం జరిగింది. అంతకు ముందే డిగ్రీ కాలేజీల్లో పనిచేసిన అనుభవం ఉన్నవారిని తీసుకొన్నారు. ఇలాంటి మనుషులను తీసుకొన్నట్లయితే పరిశోధనకు అవసరమైన విద్యార్థులు తయారవుతారని దూరదృష్టితో ఈ రెసిడెన్షియల్ వ్యవస్థను నిర్మించారు. దీన్ని నిర్వహించే ప్రిన్సిపాళ్లకు కూడా ఈ లక్ష్యంవైపుకు తీసుకుపోయే శక్తిసామర్థ్యాలు ఉండాలి. ఆనాటి రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ వ్యవస్థ విద్యార్థులను ఆర్ఈసీలకు, పిల్లలను ఐఐటీలకు పంపి సాంకేతిక మానవ సంపదను తయారుచేసేది. అదే విధంగా డిగ్రీల్లో మానవీయశాస్త్రాలు, సైన్స్ సబ్జెక్టులలో రీసెర్చ్ చేసే మనుషులను తయారుచేసింది.



నివాళి

ఆ దారిలో సంస్థను ముందుకు నడిపించే దీక్షాదక్షత, శక్తి వై.వి.రెడ్డికి ఉన్నాయి. ఆయనకు సామాజిక చింతన ఉంది. లక్ష్యంకోసం పట్టు వదలకుండా పనిచేసే ధైర్యం ఉంది. పిల్లలను తీర్చిదిద్దగల నైపుణ్యం ఉంది. కొత్తకోణాలను ఆవిష్కరించగల శక్తి వై.వి. రెడ్డికి ఉంది. అలాంటి ప్రిన్సిపాళ్లకోసం సమాజం ఎప్పుడూ ఎదురుచూస్తుంది. వై.వి. రెడ్డి వృత్తికి అంకితమైన మహామనిషి. ఆయనకు అధ్యాపకులందరి తరపున స్మృత్యంజలి ఘటిస్తున్నాను.

(నేటి సాయంత్రం 4 గంటలకు సూర్యాపేట జిల్లా కోదాడలో, రేపు ఉదయం 10 గంటలకు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా యర్రంవారిపాలెంలో వై.వి. రెడ్డి సంతాపసభ, ఆయనపై 'నిలువెత్తు పుస్తకం' పుస్తకావిష్కరణ ఉంటాయి)

వ్యాసకర్త ప్రముఖ విద్యావేత్త, శాసనమండలి మాజీ సభ్యులు

డోపింగ్ చట్టబద్ధమా నేరమా?

దేశంలో యాంటీ డోపింగ్ పరీక్షలు నిర్వహించే ప్రయోగశాలలు ప్రాంతీయ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో లేనందున క్రీడాకారులు కింది స్థాయిలో ప్రేరకాలు వాడితే పట్టుకోవడానికి విధానమే లేకుండా పోయింది.

విశ్లేషణ




మాడభూషి శ్రీధర్

తాత్కాలికంగా శక్తిని పెంచే ఉత్ప్రేరక మత్తు మందులను వాడి ఆటల్లో గెలిచే అవినీతి విస్తరిస్తున్నది. క్రీడాస్ఫూర్తితో జీవితాన్ని ఉత్తమంగా తీర్చిదిద్దుకోవాలనే నీతి సూత్రాలు చిన్నప్పటి పెద్ద మాట. ఇప్పుడు ఏదో రకంగా గెలవడమే కర్తవ్యంగా క్రీడాకారులు భావించడం విచారకరం. దీన్ని డోపింగ్ అంటున్నారు. తప్పుడు ప్రేరకాల నేరాన్ని (డోపింగ్) అరికట్టడానికి మనం ఏ విధానాన్ని అనుసరిస్తున్నాం? మన విధానం న్యాయంగా లేదని విమర్శిస్తూ దీపక్ సాంధూ అనే క్రీడాభిమాని ఒక ఆర్టీఐ దరఖాస్తులో విమర్శించారు. దేశంలోనూ రాష్ట్రాలలోనూ ప్రేరకాల వాడకాన్ని కనిపెట్టి నిరోధించడానికి కఠిన విధానాలను అనుసరించడంలేదని ఆయన అంటున్నారు.

ప్రపంచ ప్రేరక వ్యతిరేక సంస్థ (వరల్డ్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ) 2015లో ఒక నియమావళిని రూపొందించింది. పరీక్షలు నిర్వహించి తొండి చేసి గెలవాలని చూసే మోసపూరిత ఆటగాళ్లను పట్టుకొని నిషేధించేందుకు ప్రమాణాలను నిర్దేశించింది. పరిశోధన, రసాయన మందుల పరిమాణం ఎంత ఉండాలని కూడా వివరించింది. క్రీడాకారుని శరీరంలో ప్రవేశించిన మందు పరిమాణాన్ని, అతనికి ప్రేరకం అందిన వనరులను కనిపెట్టే ప్రక్రియను కూడా నిర్దేశించింది.

మనదేశంలో ఈ ప్రేరకాల నిరోధక పద్ధతులు, ప్రయోగశాలలో కనిపెట్టి అరికట్టే ప్రయోగశాలలు ప్రాంతీయ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఎందుకు లేవన్నది ప్రధానమైన ప్రశ్న. అందువల్ల జాతీయస్థాయి పోటీలకు చేరుకునే వారు అందుకు కింది స్థాయిలో ప్రేరకాలు వాడితే పట్టుకోవడానికి విధానమే లేకుండా పోయింది. అంటే పరోక్షంగా జిల్లా, రాష్ట్ర ప్రాంతీయ స్థాయిలలో ప్రేరకాలు వాడి గెలిచేందుకు మనదేశంలో వీలుంది. దాన్ని చట్ట వ్యతిరేకతగా భావించడానికి వీల్లేదు. అంటే ప్రేరకాల వాడకం జాతీయస్థాయి కింది అన్ని స్థాయిల్లో చట్టబద్ధం, ఆ తరువాత నేరం. మనకు జాతీయ ప్రేరక నిరోధక సంస్థ, జాతీయ ప్రేరక పరీక్షా ప్రయోగశాల ఉన్నాయి. కాని ప్రాంతీయస్థాయిలో ఈ ప్రయోగశాలలు లేక, అక్కడి క్రీడాకారులను పరీక్షించే విధానం లేక, ప్రేరకాలు వాడే వారు జాతీయ స్థాయి దాకా చేరుకుంటున్నారు.

ఈ నేపథ్యంలో నాడా సంస్థ పరిశీలన ప్రకారం 2015, 2016 సంవత్సరాలలో పోటీనుంచి ఎంత మందిని తప్పించారు? ఎంతమందిని అనుమతించారు? ఎన్ని ప్రయోగాలు జరిపారు, ఎందరు ప్రేరకాలు తీసుకున్నారని తేలింది? వారిపై తీసుకున్న చర్యలు, నిషేధంవంటి వివరాలు కోరారు దీపక్ సాంధూ. సీపీఐఓ గానీ మొదటి అప్పీలు అధికారి గానీ ఏ జవాబూ ఇవ్వలేదు.



ప్రజాసమాచార అధికారి కొన్ని సంబంధిత పత్రాల ప్రతులు ఇచ్చినట్టు చెప్పారు. అయితే ఇచ్చిన 122 పేజీల పత్రాలలో ఒక్కటి కూడా ధృవీకరణ లేదని దీపక్ సాంధూ విమర్శించారు. ముంబై ఐబీబీఎఫ్ వారి ప్రజాసమాచార అధికారి సంతకం చేయలేదు, స్టాంపుకూడా కొట్టలేదు. క్రీడా సంస్థల జాబితా ఇచ్చారుగాని వారు 2015–16 సంవత్సరంలో నాడా సంస్థకు రాసిన ఉత్తరాల ప్రతులు ఇవ్వలేదని, 10.8.2017న తాను రాసిన లేఖకు జవాబు కూడా ఇవ్వలేదని విమర్శించారు. సెక్షన్ 4(1) సి ప్రకారం కీలకమైన విధాన నిర్ణయాలు తీసుకునేప్పుడు లేదా ప్రకటించేటప్పుడు ప్రజలను ప్రభావితం చేసే ఆ విధానాలకు సంబంధించిన అన్ని వాస్తవాలను ప్రజలముందు తమంత తామే ఉంచవలసి ఉంటుంది.

ప్రాంతీయ రాష్ట్రస్థాయిల్లో అసలు ప్రేరకాల వాడకాన్ని నిరోధించే విధానమే ప్రభుత్వం రూపొందించలేదు. దీనివల్ల జాతీయస్థాయికి వచ్చేదాకా అసలు ఈ పరీక్షే లేకుండా పోయింది. దీనివల్ల ప్రతిభావంతులైన, సహజంగా ఆడగల స్తోమతగల అర్హులైన ఆటగాళ్లు పోటీలో మిగిలే అవకాశమే లేదు. జిల్లాస్థాయిలో ఆ తరువాత రాష్ట్ర స్థాయిలో చివరకు ప్రాంతీయ స్థాయిలో కూడా ఆటగాళ్లు ఈ ప్రేరకాల ప్రభావంతో ఆడి, సహజంగా ఆడే పోటీదారులపై గెలిచిపోతూ ఉంటారు. ఒకవేళ జాతీయ స్థాయిలో పట్టుబడినా అప్పటికే ఆ క్రీడాకారుడు సహజ క్రీడాకారులను వెనక్కితోసి జాతీయ స్థాయికి చేరి ఉంటాడు. కానీ నష్టం అప్పటికే జరిగిపోయి ఉంటుంది. ఈ అనారోగ్యకరమైన విధానాన్ని మార్చి అన్ని స్థాయిలలో ప్రేరకాల వాడకాన్ని నిరోధించడానికి ప్రయత్నించాలని కమిషన్ సిఫార్సుచేసింది. సమాచారం అభ్యర్థించిన దీపక్ సాంధూ అడిగిన విషయాలకు సంబంధించిన ఫైళ్లను పరిశీలనకు సమర్పించాలని, అందులో ఆయన కోరిన పత్రాలను ఇవ్వాలని కమిషన్ ఆదేశించింది. దీపక్ సాంధూ దాఖలుచేసిన అన్ని సమాచార దరఖాస్తులకు సంబంధించిన దస్తావేజులను చూపాలని ఆదేశించింది. (దీపక్ సాంధూ వర్సెస్ ఇండియన్ బాడీ బిల్డర్స్ ఫెడరేషన్ CIC/SAOIN/A/ 2017/140574 కేసులో 21.11.2017 న ఇచ్చిన తీర్పు ఆధారంగా).

వ్యాసకర్త కేంద్ర సమాచార కమిషనర్
professorsridhar@gmail.com

జీఎస్టీపై వర్మకు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: గాడ్ సెక్స్ అండ్ ట్రూత్ (జీఎస్టీ) వెబ్ సిరీస్ వివాదంపై నమోదైన కేసులో దర్శకుడు రామ్‌గోపాల్ వర్మకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. వీటి ప్రకారం గురువారం దర్యాప్తు అధికారి ముందు హాజరు కావాల్సిన వర్మ షూటింగ్స్ కారణంగా రాలేకపోతున్నానంటూ వర్తమానం పంపారు. మరోసారి నోటీసులు జారీ చేస్తే వస్తానని చెప్పారు.

రూ.11,600 కోట్లు కావాలి

కేంద్రానికి డీపీఆర్ సమర్పించాం : నారాయణ

సాక్షి, అమరావతి: రాజధాని నిర్మాణానికి రూ.11,600 కోట్ల నిధులు అవసరమవుతాయని కేంద్రానికి సవివర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సమర్పించినట్లు మంత్రి పి.నారాయణ తెలిపారు. కేంద్రం ఇచ్చిన రూ.1,500 కోట్లకు కూడా యుటిలైజేషన్ సర్టిఫికెట్లు ఇచ్చినట్లు స్పష్టంచేశారు.

'పంచాయతీరాజ్'లో పదోన్నతులు

సాక్షి, అమరావతి: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో విస్తరణాధికారులుగా ఉన్న 116 మందికి ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. జోన్–1లో 16, జోన్–2లో 30, జోన్–3లో 29, జోన్–4లో 41 ఖాళీలు భర్తీచేశారు.

ఈ ఏడాదైనా నిధులు కేటాయిస్తారా?

- తుంగభద్ర ఎల్లెల్సీ ఆధునికీకరణకు ఇప్పటికీ నిధులు కేటాయించని ప్రభుత్వం
- ఆధునికీకరణతో జలచౌర్యాలకు చెక్!
- అనంతపురం, కర్నూలు, వైఎస్సార్ జిల్లాల రైతులకు లాభదాయకం



సాక్షి, అమరావతి: రాయలసీమకు జీవనాడులైన ఎగువ కాలువ(హెచ్చెల్సీ), దిగువ కాలువ(ఎల్లెల్సీ)లను ఆధునికకీరించే పనులను తుంగభద్ర బోర్డు వేగవంతం చేసింది. కర్ణాటక పరిధిలో ఇప్పటికే హెచ్చెల్సీని 71 కిమీల పొడవున సిమెంట్ లైనింగ్ చేసి ఆధునికీకరించిన బోర్డు.. ఈ రాష్ట్ర సరిహద్దు వరకూ అంటే 105.40 కిమీల వరకూ ఆధునికీకరించే పనులకు ఇటీవల టెండర్లు పిలిచింది. ఈ పనులు ఈ ఏడాది ఆఖరు నాటికి పూర్తయ్యే అవకాశం ఉంది. ఎల్లెల్సీ ఆధునికీరణను 2014–15లో ప్రారంభించాలని బోర్డు ప్రతిపాదించింది. 2018–19 నాటికి పూర్తి చేయాలని నిర్ణయించింది. కానీ ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఎల్లెల్సీ ఆధునికీకరణకు ఇప్పటివరకు నిధులు కేటాయించలేదు. ఈ ఏడాదైనా రూ. 880 కోట్లు మంజూరు చేయాలని తుంగభద్ర బోర్డు చైర్మన్ డి.రంగారెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి ఈనెల 4న లేఖ రాశారు. ఆధునికీకరణ పనులు పూర్తయితే కర్ణాటక జలచౌర్యాలకు పూర్తిగా అడ్డుకట్ట పడుతుందని రైతులు చెబుతున్నారు.

జలచౌర్యంతో ఆయకట్టు దయనీయం..

తుంగభద్ర జలాశయంలో హెచ్చెల్సీ కింద కర్ణాటకకు 17.50, ఆంధ్రప్రదేశ్‌కు 32.50 టీఎంసీలు.. ఎల్లెల్సీ కింద కర్ణాటకకు 19, ఆంధ్రప్రదేశ్‌కు 24 టీఎంసీలు కేటాయించారు. తుంగభద్ర నదిలో నీటి లభ్యత తగ్గడంతో.. దామాషా పద్ధతిలో నీటిని కేటాయిస్తున్నారు. అరకొరగా కేటాయించిన జలాలను కూడా కర్ణాటక పరిధిలోని రైతులు పైపింగ్‌ల ద్వారా పొలాలకు మళ్లిస్తూ జలచౌర్యాలకు పాల్పడుతున్నారు. దాంతో అనంతపురం, వైఎస్సార్ కడప, కర్నూల్ జిల్లాల్లో హెచ్చెల్సీ కింద 2.34 లక్షల ఎకరాలు, ఎల్లెల్సీ కింద కర్నూల్ జిల్లాలో 1.73 లక్షల ఎకరాల ఆయకట్టు పరిస్థితి దయనీయంగా మారింది. అనంతపురం, వైఎస్సార్ జిల్లాల్లో అధిక శాతం ప్రజల దాహార్తి తీర్చేది హెచ్చెల్సీ జలాలే. కర్ణాటక రైతులు పొలాలకు మళ్లించగా అనంతపురం జిల్లాకు వచ్చే జలాలను కేవలం తాగునీటికి కేటాయిస్తుండటంతో ఆయకట్టు బంజరుగా మారుతోంది. ఈ నేపథ్యంలోనే 2005లో దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి హెచ్చెల్సీ, ఎల్లెల్సీ ఆధునికీకరణకు ప్రతిపాదించారు. రాష్ట్ర పరిధిలో హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు ప్రారంభించి.. కర్ణాటక, తుంగభద్ర బోర్డుపై ఒత్తిడి తెచ్చారు. ఫలితంగా దశాబ్దాలుగా ఆధునికకీరణకు అంగీకరించని కర్ణాటక ఎట్టకేలకు ఒప్పుకుంది. 2013–14లో కర్ణాటక పరిధిలో హెచ్చెల్సీ ఆధునికకీరణ పనులు ప్రారంభయ్యాయి. ప్రస్తుతం పూర్తయ్యే దశకు చేరుకున్నాయి. జలచౌర్యాలు దాదాపుగా తగ్గుముఖం పట్టాయి. ఎల్లెల్సీ ఆధునికీరణను 2014–15లో ప్రారంభించాలని బోర్డు ప్రతిపాదించింది. 2018–19 నాటికి పూర్తి చేయాలని నిర్ణయించింది. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఎల్లెల్సీ ఆధునికీకరణకు నిధులు కేటాయించలేదు. ఎల్లెల్సీ ఆధునికీకరణ కూడా పూర్తయితే రాయలసీమలో లక్షల ఎకరాల ఆయకట్టుకు మేలు జరుగుతుందని రైతులు పేర్కొంటున్నారు.

ప్రాణాలు పోతున్నా.. పంపించడం లేదు

- వైద్యం కూడా అందించకుండా చాకిరీ చేయిస్తున్నారు
- సౌదీలో బంధీ అయిన 'అనంత' మహిళ ఆవేదన
- వాట్సాప్ ద్వారా కుటుంబసభ్యులకు సమాచారం
- బాధితురాలిని స్వదేశానికి తీసుకురావాలని కుటుంబ సభ్యుల వేడుకోలు



రమణమ్మ (ఫైల్)

నల్లమాడ: అనారోగ్యానికి గురైనా కనీస వైద్యం అందించకుండా బలవంతంగా పనులు చేయిస్తున్నారని సౌదీకి వెళ్లిన ఓ మహిళ వాపోయింది. ప్రాణాలు పోకముందే ఇండియాకు పంపించాలంటూ వేడుకుంటున్నా.. యజమాని ససేమిరా అంటూ నిర్బంధించాడని విలపించింది. ఈ మేరకు సెల్ఫీ వీడియో తీసి వాట్సాప్ ద్వారా కుటుంబసభ్యులకు సమాచారం చేరవేసింది. అనంతపురం జిల్లా నల్లమాడకు చెందిన కాలువపల్లి సూర్యనారాయణ భార్య రమణమ్మ బతుకుదెరువు కోసం ఏడాది క్రితం దళారీల ద్వారా సౌదీకి వెళ్లారు. అక్కడ ఓ షేక్ ఇంటిలో పనిమనిషిగా ఉంటున్న ఆమె పది రోజుల క్రితం తీవ్ర జ్వరం, వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురైంది. యజమాని ఆమెకు కనీస వైద్యం చేయించకపోగా ఓ గదిలో బంధించినట్లు మూగబోయిన గొంతుతో బాధితురాలు సెల్ఫీ వీడియో తీసి వాట్సాప్ ద్వారా కుటుంబ సభ్యులకు చేరవేసింది. తిండి కూడా లేక అలమటిస్తున్న తనతో బలవంతంగా ఇంటి పనిచేయిస్తున్నారని కంట తడి పెట్టింది. తనను విడిచి పెట్టాలని వేడుకుంటే.. దళారీకి ఇచ్చిన రూ.1.80 లక్షలు వెనక్కు ఇవ్వాలని షేక్ మొండికేసినట్లు వాపోయింది. ఎలాగైనా తనను ఇండియాకు చేర్చాలని మొరపెట్టుకుంది. దీనిపై కుటుంబసభ్యులు నల్లమాడ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కదిరికి చెందిన ఏజెంట్లు సలీంబాషా, జాఫర్ వలీని ఎస్‌ఐ సత్యనారాయణ గురువారం పోలీస్ స్టేషన్‌కు రప్పించుకుని విచారించారు. తమ బిడ్డను స్వదేశానికి రప్పించేందుకు అధికారులు, నాయకులు సహకరించాలని బాధితురాలి తల్లిదండ్రులు వెంకటనారాయణ, తిరుపాలమ్మ, భర్త సూర్యనారాయణ కోరుతున్నారు.

'దేవ'.. దేవా!

- తీరు మారకుండా శాఖ పేరు మార్చితే అన్నీ చక్కబడతాయా?
- ఆలయాలను ఆదాయ వనరులుగానే చూస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- వ్యాపార ధోరణితో సేవల ధరల నిర్ణయం



సాక్షి, అమరావతి: దేవాదాయశాఖ పేరును ప్రభుత్వం 'దేవదాయ శాఖ'గా మార్చడంపై అధికారులే నవ్వుకుంటున్నారు. ఆలయాలను ప్రభుత్వం ఆదాయ వనరులుగానే చూస్తోందని పలువురు మఠాధిపతులు బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదాయం అనే అర్థం రాకుండా ఉండేందుకు దేవదాయ శాఖగా పేరు మార్పు చేస్తున్నట్టు మంత్రి మాణిక్యాలరావు ఇటీవల ప్రకటించటం తెలిసిందే. తెలుగు భాషలో 'దేవదాయ' అన్న పదమే ఉండదని, రెండు పదాలను సంధి చేయడం ద్వారా ఏర్పడిన 'దేవాదాయ' పదాన్ని మార్చడంలో అర్థం లేదంటూ కొందరు తెలుగు భాషా పండితులు ప్రభుత్వానికి పెద్ద సంఖ్యలో లేఖలు రాశారు. శాఖలో అమలవుతున్న విధానాలు మార్చకుండా కేవలం పేరు మార్చితే పరిస్థితులు చక్కబడతాయా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఆదాయంపైనే మమకారం

దేవదాయ శాఖ పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా 23,000 ఆలయాలు ఉండగా ప్రభుత్వం ఆదాయం వచ్చే 3 – 4 వేల ఆలయాల్లో మాత్రమే రోజువారీ కార్యక్రమాలను పర్యవేక్షిస్తోంది. ఆదాయం లభించే ఆలయాలకు మాత్రమే సిబ్బందిని నియమించింది. ఆదాయం లేని మూడొంతుల ఆలయాల పర్యవేక్షణను విస్మరించింది. భక్తులు ఎక్కువగా సందర్శించే ఆలయాల్లో రకరకాల పూజలు, ప్రత్యేక దర్శనం పేరుతో నాలుగైదు రకాల టిక్కెట్ ధరలను నిర్ణయించింది. ఒక్కో టికెట్‌కు ఒక్కో రకమైన దర్శనం ఏర్పాట్లు చేయటాన్ని మఠాధిపతులు, ఆలయాల పరిరక్షణ సమితి సంస్థలు పలుసార్లు తప్పుబట్టటం తెలిసిందే.

శ్రీమంతులకే సేవలు

ఏడాదిన్నర క్రితం శ్రీశైలంలో అంతరాలయ అభిషేకం టిక్కెట్ ధరను ఏకంగా రూ. 5 వేలకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నలుగురు సభ్యులు కలిగిన కుటుంబం శ్రీశైలం అంతరాలయ అభిషేక పూజల్లో పాల్గొంటే రూ. 20 వేలు చెల్లించాల్సిన పరిస్థితి రావటంతో డబ్బున్న వారికే పరిమితం చేశారని భక్తులు విమర్శిస్తున్నారు. మరోపక్క ఆలయాలకు దాతలు ఇచ్చిన భూములపై పర్యవేక్షణ కొరవడటంతోపాటు భక్తులు సమర్పించే కానుకలు కైంకర్యం అవుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో శాఖ పేరు మార్చటానికి బదులుగా అవినీతికి అస్కారమున్న అంశాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దేవదాయ, ధర్మదాయ అర్థం లేని పదాలు..

'పంచదార డబ్బా మీద కారం అని రాస్తే చీమలు పట్టకుండా ఉండవు. మార్చాల్సింది పేరు కాదు. తెలుగు సంధుల ప్రకారం ఏర్పడిన పదాలు ఇప్పుడు అర్థం లేనివి అయ్యాయి. పదాలు మార్చడం ద్వారా కాకుండా శాఖ స్వభావం మార్చడం ద్వారానే భక్తులకు మేలు జరుగుతుంది.

–ఆకెళ్ల రాఘవేంద్ర (తెలుగు రచయిత)

ఈ అన్యాయమేంటి 'చంద్రన్న'

- '104' పథకం ఉద్యోగుల మెడపై కత్తి
- ప్రైవేట్ సంస్థ ఇష్టారాజ్యం
- రెండు నెలల్లో 40 మందిపై వేటు



సాక్షి, అమరావతి: చంద్రన్న సంచార చికిత్స(104) పథకం పరిధిలో పని చేస్తున్న ఉద్యోగులు భయంభయంగా బతుకుతున్నారు. ఉద్యోగం ఎప్పుడు ఊడుతుందో తెలియక ఆందోళన చెందుతున్నారు. 'చంద్రన్న సంచార చికిత్స' పథకం నిర్వహణ బాధ్యతను ప్రభుత్వం పిరమిల్ స్వాస్థ్య అనే ప్రైవేట్ సంస్థకు అప్పగించింది. ఆ సంస్థ యాజమాన్యం ఉద్యోగులను ఎడాపెడా తొలగిస్తోంది. ముందస్తుగా నోటీసులు ఇవ్వకుండానే తొలగింపు ఉత్తర్వులు జారీ చేస్తోంది. గత రెండు నెలల్లో దాదాపు 40 మందిని అకారణంగా తొలగించింది. కొందరిని సుదూర ప్రాంతాలకు బదిలీ చేసింది. అక్కడికి వెళ్లలేక చాలామంది ఉద్యోగం మానేశారు. అరకొరగా ఇచ్చే రూ.10 వేలతో మరోచోట ఎలా బతకాలని ప్రశ్నిస్తున్నారు. బాబు వచ్చాక జాబు పోతోందని కన్నీటి పర్యంతమవుతున్నారు.

గ్రామాల్లో జనం తిడుతున్నారు

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 'చంద్రన్న సంచార చికిత్స' వాహనాలు 277 ఉన్నాయి. వీటిలో కనీసం 60 రకాల మందులు ఉండాలి. కానీ, 10 రకాల మందులు కూడా ఉండడం లేదు. ఇదేమిటని అడిగిన ఉద్యోగులపై బదిలీ వేటు వేశారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు సైతం పిరమిల్ స్వాస్థ్య సంస్థకే వత్తాసు పలుకుతున్నారని, తమకు న్యాయం చేయడం లేదని ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. సంచార చికిత్స వాహనాల్లో సరైన మందులు లేకపోవడంతో గ్రామాల్లో జనం తమను తిడుతున్నారని, అందుకే పొలిమేరల వరకు వెళ్లి, వెనక్కి వచ్చేస్తున్నట్లు శ్రీకాకుళం జిల్లాకు చెందిన కొందరు ఆపరేటర్లు చెప్పారు.

ఇక ఆత్మహత్యలే గతి

రాష్ట్రవ్యాప్తంగా వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ ప్రభుత్వం 50 శాతం చొప్పున వేతనాలు పెంచింది. ఏడాది క్రితం విధుల్లో చేరిన వారికి సైతం వేతనాలు పెరిగాయి. కానీ, 11 సంవత్సరాలుగా పనిచేస్తున్న తమకు పైసా కూడా పెంచకపోవడం దారుణమని '104' ఉద్యోగులు బావురుమంటున్నారు.

గదిలో బంధించి కొట్టారు



'తొమ్మిదేళ్లుగా '104' సంస్థలో పనిచేస్తున్నా. నన్ను తీసేయాలనుకున్నారు. రీజనల్ మేనేజర్ ఒకరోజు పిలిచి ఉద్యోగంలోంచి తీసేస్తున్నాం అన్నారు. నన్నెందుకు తొలగిస్తారు, నేనేం తప్పు చేశా? అని ప్రశ్నించా. దాంతో నన్ను గదిలో బంధించి కొట్టారు. బలవంతంగా సంతకాలు చేయించుకుని తొలగించారు'

– సుధాకర్, గుడివాడ, కృష్ణా జిల్లా

ఏసీబీ వలలో కడప రిమ్స్ ఏవో

రూ. 60 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ వైనం



ఏవో భరత్‌మోహన్‌సింగ్

కడప అర్బన్: వైఎస్సార్ జిల్లా కడపలోని రిమ్స్‌లో పరిపాలన అధికారి (ఏవో)గా పనిచేస్తున్న భరత్‌మోహన్‌సింగ్ గురువారం తన చాంబర్‌లో సురేష్‌కుమార్‌రెడ్డి అనే ఉద్యోగి నుంచి రూ. 60 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. ఏసీబీ డీఎస్పీ నాగరాజు తెలిపిన వివరాల మేరకు.. కడప రిమ్స్‌లో భరత్‌మోహన్‌సింగ్ పరిపాలనాధికారిగా పనిచేస్తున్నాడు. అనంతపురం నర్సింగ్ కళాశాల కార్యాలయ సూపరింటెండెంట్‌గా పనిచేసే సురేష్‌కుమార్‌రెడ్డి బదిలీపై కడప రిమ్స్‌కు వచ్చారు. అయితే లంచం కోసం సురేష్‌కు వేతనం ఇవ్వకుండా వేధిస్తున్నారు. ఈ నేపథ్యంలో 4 నెలల వేతనం, సీటు కేటాయింపు విషయంలో సురేష్ నుంచి భరత్‌మోహన్‌సింగ్ రూ. లక్ష లంచం డిమాండ్ చేశారు. వీరి మధ్య రూ. 60 వేలకు ఒప్పందం కుదరడంతో ఈ నెల 6న సురేష్‌కుమార్‌రెడ్డి ఏసీబీని ఆశ్రయించాడు. అనంతరం గురువారం భరత్‌మోహన్‌సింగ్‌కు సురేష్‌కుమార్‌రెడ్డి రూ. 60 వేలు లంచం ఇస్తుండగా ఏసీబీ డీఎస్పీ నాగరాజు తమ సిబ్బందితో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ దాడుల్లో సీఐలు సుధాకర్‌రెడ్డి, రామచంద్ర, సిబ్బంది పాల్గొన్నారు. నిందితుడిని అరెస్టు చేసి కర్నూలు ఏసీబీ కోర్టులో హాజరు పరచనున్నట్లు డీఎస్పీ వెల్లడించారు.



నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్ నుంచి వీఆర్సీ సెంటర్‌కు ప్రదర్శనగా వెళ్తున్న నెల్లూరు సిటీ ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్, డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్, వైఎస్సార్ సీపీ శ్రేణులు



విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న వైఎస్సార్ సీపీ, సీపీఎం, సీపీఐ నాయకులు, కార్యకర్తలు



శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గం జువ్వలగుంటపల్లి వద్ద నిరసనలో పాల్గొన్న ప్రతిపక్ష నేత

బంద్ సంపూర్ణం

▶ మొదటి పేజీ తరువాయి

తలొంచారు. శాంతియుత బంద్‌కు సహకరించాలంటూ పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

తెల్లవారుజాము నుంచే బైఠాయింపులు

వామపక్షాల కార్యకర్తలు, వైఎస్సార్‌సీపీ నేతలు తెల్లవారు జాము నుంచే బస్ డిపోల ఎదుట ఆందోళన ప్రారంభించారు. బస్సులు డిపోల నుంచి బయటకు రాకుండా గేట్ల ముందు బైఠాయించారు. విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్‌స్టాండ్ ఎదుట సీపీఐ, సీపీఎం కార్యకర్తలు గేట్లకు అడ్డంగా నిలబడి బస్సులను కదలనీయలేదు. 144వ సెక్షన్ అమల్లో ఉన్నా ఉద్యమ కారులు భాతరు చేయలేదు. కార్మిక సంఘాలు మద్దతు పలకడంతో ఆటోలు, రిక్షాలు సైతం రోడ్డెక్కలేదు. ద్విచక్ర వాహనాల రాకపోకలు సైతం గణనీయంగా తగ్గాయి. వామపక్షాల ముందస్తు హెచ్చరికతో ప్రయాణికులు సైతం ప్రయాణాలకు దూరంగా ఉన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే బస్సులను గమ్యస్థానాలు చేరేందుకు అనుమతించారు. కొన్ని జాతీయ రహదారులపై లారీలు బారులు తీరి నిలిచాయి.

హోరెత్తిన నిరసనలు..

బంద్ సందర్భంగా ఆందోళనకారులు రాష్ట్రంలో వినూత్న ప్రదర్శనలు, నిరసనలు చేపట్టారు. రోడ్లపై కబడ్డీ ఆడిన వారు కొందరైతే.. కర్రా బిళ్ల, క్రికెట్ ఆడిన వారు మరి కొందరు. ఇంకొందరు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చేయాల్సిందంతా చేస్తుందన్న హామీని ఎగతాళి చేస్తూ చెవుల్లో గులాబీ పూలు, చేతుల్లో క్యాబేజీ, కాలిఫ్లవర్‌తో వినూత్న నిరసనలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు హోరెత్తాయి. విజయవాడలో కొందరు యువతీ యువకులు మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపగా కర్నూలులో బంగి అనంతయ్య తదితరులు భిక్షాటన చేశారు. ఏలూరు, తిరుపతిలో అర్ధనగ్న ప్రదర్శనలు చేశారు. విశాఖలో న్యాయవాదులు మూతికి నల్లగుడ్డలు కట్టుకుని నిరసన తెలిపారు. విశాఖకు రైల్వే జోన్ ఎక్కడని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేసిన నరేంద్ర మోదీ డౌన్ డౌన్, ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు, బాబు, మోదీ జోడితో అన్యాయం అంటూ నినాదాలు చేశారు. కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలంటూ వైఎస్సార్‌సీపీ, వామపక్షాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ జరిగింది. విజయవాడలో వైఎస్సార్ సీపీ నాయకుడు పార్థసారథి, వెల్లంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు తదితర వైఎస్సార్‌సీపీ నేతల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ జరిగింది. ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి బంద్‌లో పాల్గొని నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్‌లో రాస్తారోకోలో సిటీ ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి బైక్ ర్యాలీని నిర్వహించారు. విజయనగరం జిల్లా సాలూరులో ఎమ్మెల్యే పీడిక రాజన్నదొర, కురుపాంలో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై విరుచుకుపడ్డారు. ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి అనంతపురం జిల్లా హిందూపూర్‌లో ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు వైఎస్ వివేకానంద రెడ్డి పులివెందులలో ఉండి బంద్‌ను పర్యవేక్షించారు. విపక్షాల నాయకులందరూ తమ తమ ప్రాంతాల్లో బంద్ జయప్రదానికి కృషి చేశారు.



విజయవాడ వన్‌టౌన్ సామారంగచౌక్ సెంటర్‌లో రోడ్డుపై నిరసన తెలియజేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు వెలంపల్లి శ్రీనివాస్, షేక్ ఆసిఫ్ తదితరులు

కదంతొక్కిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

కడపలో వామపక్ష, అఖిలపక్ష నేతలతోపాటు వైఎస్సార్‌సీపీ శ్రేణులు కదంతొక్కాయి. పులివెందులలో వైఎస్సార్‌సీపీ జిల్లా సమన్వయకర్త వైఎస్ వివేకానందరెడ్డి, పార్టీ నేత వైఎస్ భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి పూల అంగళ్ల వద్ద నిరసన చేపట్టారు. కడప పార్లమెంటరీ వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.సురేష్‌బాబు, రాజంపేట పార్లమెంటరీ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించారు. ప్రొద్దుటూరులో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, రైల్వేకోడూరులో కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో, బద్వేలు నియోజకవర్గంలోని పోరుమామిళ్లలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి సారథ్యంలో ఆందోళనలు కొనసాగాయి. కర్నూలు జిల్లా పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ఆధ్వర్యంలో కల్లూరు పరిధిలోని నంద్యాల చెక్ పోస్టు నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కర్నూలు జిల్లా ఆదోనిలో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఆలూరులో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, నందికొట్కూరులో ఎమ్మెల్యే ఐజయ్య, పత్తికొండలో సమన్వయకర్త కంగాటి శ్రీదేవి, ఎమ్మిగనూరులో సమన్వయకర్త ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొని బంద్‌కు మద్దతు ప్రకటించారు. గుంటూరు జిల్లాలో గుంటూరు పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు రావి వెంకటరమణ, నగర అధ్యక్షుడు లేళ్ల అప్పిరెడ్డి, పార్లమెంటు ఇన్‌చార్జి శ్రీకృష్ణదేవరాయలు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిలారి రోశయ్య, ఆతుకూరి ఆంజనేయులు బస్టాండ్ ఎదుట బైఠాయించి బస్సులను అడ్డుకున్నారు. గుంటూరులో ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా, లేళ్ల అప్పిరెడ్డి, నరసరావుపేటలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి బంద్ నిర్వహించారు. విశాఖలో మాడుగుల ఎమ్మెల్యే బూడి ముత్యాల నాయుడు, చోడవరం మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీలు బైఠాయించి రాస్తారోకో చేశారు. తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురంలో ఎమ్మెల్సీ పిల్లి సుభాష్ చంద్రబోస్, కొత్తపేటలో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి బంద్‌లో పాల్గొన్నారు. తిరుపతిలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూమన కరుణాకర రెడ్డి, నగరి ఎమ్మెల్యే రోజా పాల్గొన్నారు.

మూతపడిన సంక్షేమ శాఖలు..

రాష్ట్ర బంద్ సందర్భంగా రాజధాని అమరావతి పరిసర ప్రాంతాల్లోని సంక్షేమ శాఖలు మూతపడ్డాయి. బంద్ నిర్వాహకులు సంక్షేమ శాఖల కార్యాలయాల వద్దకు వెళ్లి ఉద్యోగులను బయటకు వెళ్లాల్సిందిగా కోరారు. సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ రామారావుతో సహా ఉద్యోగులందరూ బయటకు వెళ్లారు. మైనార్టీ సంక్షేమ శాఖ, క్రిష్టియన్ కార్పొరేషన్, ఎస్సీ కార్పొరేషన్, గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ కార్యాలయం, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థలు మూతపడ్డాయి. కార్యాలయాలు ఉదయం ప్రారంభమైనా ఆందోళన కారులు అక్కడికి వెళ్లగానే తాళాలు వేసి బయటకు వచ్చారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని, బడ్జెట్‌లో నిధులు కేటాయించాలనే డిమాండ్‌లకు ఉద్యోగులు మద్దతు పలికారు. కొన్ని ఉద్యోగ సంఘాలు బహిరంగంగానే మద్దతు నిచ్చాయి. చాలా ప్రాంతాల్లో జర్నలిస్టులు బంద్‌కు మద్దతు పలుకుతూ ర్యాలీలు నిర్వహించారు. రాష్ట్రంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి నేతృత్వంలో కేవీపీఎస్, తుడుందెబ్బ కార్యకర్తలు బంద్‌లో పాల్గొన్నారు.



అనంతపురం జిల్లా హిందూపురంలో బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి

ధర్మాగ్రహానికి తలొంచిన ప్రభుత్వం

ఆంక్షలు, నిర్బంధాలతో బంద్‌ను ఆపాలనుకున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ధర్మాగ్రహానికి తలొగ్గాల్సి వచ్చింది. రాష్ట్రానికి జరిగిన తీవ్ర అన్యాయాన్ని నిరసిస్తూ బంద్ జరుగుతుంటే జనం మధ్య ఉండాల్సిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దుబాయ్ పర్యటనకు వెళ్లడం పట్ల తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. అదే సందర్భంలో బంద్ జయప్రదం కావడం, అన్ని వర్గాల ప్రజలు రోడ్ల మీదకు రావడంతో ముఖ్యమంత్రి ఫ్లైట్ ఫోన్‌లో బంద్‌కు సంఘీభావం ప్రకటించారు. ఆత్మగౌరవ పోరాటానికి ఆటంకాలు కల్పించవద్దంటూ పోలీసులకు హుకుం జారీ చేశారు. జనం సెంటిమెంట్‌ను గౌరవిస్తున్నామన్నారు. ఎంపీలు పార్లమెంట్‌లో చేస్తున్న పోరాటానికి సంఘీభావంగా ర్యాలీలు జరపాలని తమ శ్రేణులకు పిలుపునిచ్చారు. అయితే చంద్రబాబు ద్వంద్వ ప్రమాణాలను విపక్షాలు దుమ్మెత్తి పోశాయి. అంబేద్కర్ విగ్రహాల ఎదుట ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటూ ప్రదర్శనలు చేశాయి. కాగా, రాష్ట్రంలోని 13 జిల్లాల్లో బంద్ జయప్రదమైంది. ప్రజా శక్తిలో కేంద్రానికి చేరింది, ఇందుకు సహకరించిన రాజకీయ పార్టీలకు, ప్రజా సంఘాలకు, ప్రజలకు లెఫ్ట్ పార్టీలు కృతజ్ఞతలు తెలిపాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపాయి. రాష్ట్రానికి సంబంధించిన ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు, రాజధానికి నిధులు వంటి అంశాల సాధనకు ముందుముందు కూడా కలిసి కట్టుగా పోరాటాలు చేద్దామని, రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా పని చేద్దామని పిలుపిచ్చాయి.

గృహ నిర్బంధాలు, చిత్రీకరణలు..

బంద్ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధ కాండను ప్రయోగించింది. పలు చోట్ల వైఎస్సార్‌సీపీ, వామపక్షాల నాయకుల్ని ముందస్తు అరెస్టులు చేసింది. పలువుర్ని గృహ నిర్బంధంలో ఉంచింది. రాజధాని ప్రాంతమైన అమరావతిలో సెక్షన్ 144ను, విశాఖ, తిరుపతి, అనంతపురం, గుంటూరు, రాజమండ్రి, కాకినాడ తదితర ప్రాంతాలలో సెక్షన్ 30ను విధించింది. ర్యాలీలు జరక్కుండా నిరోధించే ప్రయత్నం చేసింది. బలవంతంగా బస్సులు నడపాలని చూసిన అనంతపురం జిల్లాలో వామపక్షాల కార్యకర్తలు తిరగబడి బస్సు అద్దాలను పగులగొట్టారు. ఏలూరులో వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మధ్యాహ్నపు ఈశ్వరిని, పలువురు వైఎస్సార్‌సీపీ, సీపీఐ నేతలను గృహ నిర్బంధంలో ఉంచారు. శ్రీకాకుళం జిల్లాలో అరెస్టయిన వారిలో రాజాం వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్యే కంబాల జోగులు, పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడు ధర్మాన కృష్ణదాస్, ఎచ్చెర్ల, టెక్కలి నియోజకవర్గాల సమన్వయకర్తలు గొర్లె కిరణ్‌కుమార్, పేరాడ తిలక్ ఉన్నారు. పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ ధర్మాన ప్రసాదరావు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెడ్డి శాంతిలను శ్రీకాకుళంలోని పార్టీ జిల్లా కార్యాలయం నుంచి బయటకు రానీయకుండా పోలీసులు అడ్డుకున్నారు. మరోపక్క పోలీసులు తమ బాడీ కెమెరాలతో ర్యాలీలను చిత్రీకరించారు.

అందరం ఒక్కటై పోరాడుదాం

బంద్‌కు వైఎస్ జగన్ సంఘీభావం

- ప్లకార్డు ప్రదర్శిస్తూ విద్యార్థులతో కలిసి ఆందోళన
- ప్రత్యేక హోదా రాష్ట్రానికి సంజీవనే..

ప్రజా సంకల్ప యాత్ర శిబిరం నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి : కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయానికి నిరసనగా వామపక్షాలు పిలుపునిచ్చిన రాష్ట్ర బంద్‌కు ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రజలంతా ఒక్కటై పోరాడాలన్న ఉద్దేశంతో గురువారం ఆయన ప్రజా సంకల్ప యాత్రకు విరామం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గంలోని జువ్వలగుంటపల్లి వద్ద తాను విడిది చేసిన శిబిరం నుంచి గురువారం ఉదయం బయటకు వచ్చిన జగన్.. కావలి ఆర్ఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులతో కలిసి నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. 'ప్రత్యేక హోదా – ఆంధ్రప్రదేశ్ హక్కు' అనే ప్లకార్డును ప్రదర్శిస్తూ విద్యార్థులతో మమేకం అయ్యారు. అడ్డగోలు విభజనతో అన్ని విధాలా అన్యాయమైపోయిన ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఒక సంజీవని లాంటిదని జగన్ అన్నారు. యువత ముందుండి పోరాడితే ప్రత్యేక హోదా సాధించడం కష్టం కాదని, హోదా వస్తేనే రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పడతాయని చెప్పారు. దీంతో కష్టపడి చదువుకున్న విద్యార్థుల శ్రమ సార్థకమయ్యేలా ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. హోదా సాధన కోసం తాము గట్టిగా పోరాడుతామని ఈ సందర్భంగా విద్యార్థులు జగన్‌కు చెప్పారు. హోదా కోసం తాము చేస్తున్న పోరాటంలో ప్రతి ఒక్కరినీ కలుపుకుని పోతామని, విద్యార్థులు ఇలా ముందుకు వచ్చినందుకు అభినందిస్తున్నానని జగన్ అన్నారు. నెల్లూరు పార్లమెంట్ జిల్లా పార్టీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఆత్మకూరు, కావలి, నెల్లూరు(రూరల్) ఎమ్మెల్యేలు మేకపాటి గౌతమ్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డిలు కూడా ప్లకార్డులు చేతబూని బంద్‌కు మద్దతుగా నిరసనలో పాల్గొన్నారు. 'మీ కేసుల మాఫీ కోసం మా ప్రయోజనాలను తాకట్టు పెడతారా?', 'ప్రత్యేక హోదా బిక్ష కాదు.. అది ఆంధ్రుల హక్కు', 'ప్రత్యేక హోదా ఆంధ్రులకు సంజీవనే!' అని రాసిన ప్లకార్డులను పట్టుకుని విద్యార్థులు నిరసన తెలిపారు.

ఆర్టీసీకి రూ.12.32 కోట్ల నష్టం

బంద్ కారణంగా రాష్ట్రంలో ఆర్టీసీ బస్సులన్నీ డిపోలకే పరిమితమయ్యాయి. ముందు జాగ్రత్తగా ఆర్టీసీ అధికారులు బస్సులు నిలిపివేశారు. సుమారు రూ.12.32 కోట్ల నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు. సరిహద్దు రాష్ట్రాల ప్రధాన నగరాలైన చెన్నై, బెంగుళూరుకు వెళ్లే బస్సులను ఆర్టీసీ నిలిపేసింది. భద్రతను దృష్టిలో ఉంచుకుని పక్క రాష్ట్రాల నుంచి వస్తున్న బస్సులను పోలీసులు ఆపివేశారు. బంద్‌కు ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్ మద్దతు ప్రకటించింది. దీంతో అన్ని జిల్లాల్లో లారీల ద్వారా సరుకు ఎగుమతులు, దిగుమతులు నిలిచిపోయాయి. అత్యవసర సరుకుల రవాణా మాత్రం కొనసాగింది.

693 మంది అరెస్ట్

బంద్ కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా 693 మందిని అరెస్ట్ చేసి కేసులు నమోదు చేసినట్టు డీజీపీ ఎం.మాలకొండయ్య గురువారం రాత్రి మీడియాకు వెల్లడించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. అక్కడక్కడ చిన్నపాటి ఇబ్బందులు తప్ప పెద్ద ఘటనలు నమోదు కాలేదన్నారు. అమరావతి ప్రాంతం అంతా పోలీసులు పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకున్నారు. వెలగపూడి చెక్‌పోస్ట్ వద్ద నుంచి సచివాలయం రెండో ప్రవేశ ద్వారం వరకు ప్రత్యేక బలగాలు మోహరించాయి.



గుంటూరులో బంద్ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు ఎమ్మెల్యే ముస్తఫా, రావి వెంకటరమణ, లేళ్ల అప్పిరెడ్డి తదితరులు



గుంటూరు పట్టాభిపురం నుంచి బైక్ ర్యాలీగా వస్తున్న వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నేతలు



ఒంగోలు కలెక్టరేట్ వద్ద ధర్నాలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు బాలినేని శ్రీనివాసరెడ్డి



విజయవాడలో బంద్‌లో పాల్గొన్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు, ఇతర నేతలు



కర్నూలులో బంద్ నిర్వహిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

క్యాబినెట్‌లో మీరే ఆమోదించి..

మీరే నిరసనలా?

- సుజనా టీడీపీ నుంచి కేంద్ర మంత్రివర్గంలో కొనసాగుతూ సమష్టి బాధ్యతను విస్మరించారు
- పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తిన ఎంపీ విజయసాయిరెడ్డి.. సమర్థించిన సమాజ్‌వాదీ ఎంపీ



న్యూఢిల్లీ: కేంద్ర మంత్రివర్గంలో కొనసాగుతున్న టీడీపీ ఎంపీలు సమష్టి బాధ్యత నుంచి తప్పుకొని రాష్ట్రపతి ప్రసంగంపై నిరసనలకు దిగటంపై వైఎస్సార్ సీపీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి గురువారం రాజ్యసభలో పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తారు. బడ్జెట్, రాష్ట్రపతి ప్రసంగాన్ని మీరే ఆమోదించి మీరే నిరసనలకు దిగటం ఏమిటంటూ విస్మయం వ్యక్తం చేశారు. ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ బడ్జెట్‌పై సమాధానం ఇస్తుండగా... ఏపీకి ప్రత్యేక ప్యాకేజీ అంశాన్ని పరిష్కరించాలని కేంద్ర మంత్రి సుజనా చౌదరి కోరారు. ఈ సమయంలో రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు సూచన మేరకు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి విజయ్ గోయల్ జోక్యం చేసుకుంటూ ఈ అంశాన్ని జైట్లీ దృష్టికి తెస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి నిబంధన 238(1), 238(2), 238–ఏ ప్రకారం పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తారు. రాజ్యాంగంలోని అధికరణ 74, 75 ప్రకారం మంత్రి మండలి ఉమ్మడిగా జవాబుదారీతనంవహిస్తుందన్నారు. అయితే కేంద్ర మంత్రివర్గం ఆమోదించిన రాష్ట్రపతి ప్రసంగం, బడ్జెట్‌లపై నిరసన వ్యక్తం చేయటం ద్వారా మంత్రిగా కొనసాగుతున్న సుజనా చౌదరి సమష్టి బాధ్యతను విస్మరిస్తున్నారని పేర్కొన్నారు. క్యాబినెట్ ఉమ్మడి నిర్ణయాలను వ్యతిరేకిస్తున్నందున మంత్రి పదవికి రాజీనామా చేయటం మినహా సుజనాకు మరో మార్గం లేదని స్పష్టం చేశారు.

పాయింట్ ఆఫ్ ఆర్డర్ వర్తించదన్న వెంకయ్య

ఈ సందర్భంగా రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు జోక్యం చేసుకుంటూ.. సుజనా చౌదరి కేంద్రానికి సూచన మాత్రమే చేసినందున ఇందులో పాయింట్ ఆఫ్ ఆర్డర్ అంశం తలెత్తదన్నారు. సమాజ్‌వాదీ పార్టీ సభ్యుడు నరేష్ అగర్వాల్ సైతం ఓ కేంద్ర మంత్రి డిమాండ్ చేయటం, మరో మంత్రి ఈ అంశాన్ని ఆర్థిక మంత్రికి నివేదిస్తానని చెప్పటాన్ని తప్పుబట్టారు. అయితే ఓ మంత్రి మరో మంత్రికి సూచనలు చేయటం నిబంధనలకు విరుద్ధమేమీ కాదంటూ సభాపతి ఆయన్ను కూర్చోబెట్టారు. ఓ దశలో మీపై చర్యలు తీసుకునే అధికారం తనకు ఉందని, అయితే సభను సజావుగా నడపాలని భావిస్తున్నానని విజయసాయిరెడ్డిని ఉద్దేశించి వెంకయ్యనాయుడు హెచ్చరించారు. అయినా ఆందోళనను విరమించకపోవటంతో సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. సభ తిరిగి సమావేశమైన అనంతరం కూడా ఏపీకి న్యాయం చేయాలంటూ ఆందోళన కొనసాగింది.

టీడీపీ రసవత్తర నాటకం

- అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు పన్నాగం
- రాష్ట్రానికి నాలుగేళ్లుగా అన్యాయం జరుగుతున్నా అదే మౌనం
- ప్రజల దృష్టిని మళ్లించేందుకు లీకుల మంత్రం
- కేంద్రంపై గట్టిగా పోరాడుతున్నామంటూ ప్రచారం
- అరుణ్ జైట్లీ ప్రకటనపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారట!
- నాటకాన్ని రక్తికట్టిస్తున్న టీడీపీ అధిష్టానం

సాక్షి, అమరావతి: రాష్ట్ర విభజన చట్టంలోని హామీలను అమలు చేయకున్నా, నాలుగేళ్లుగా కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం జరుగుతున్నా ఒక్కసారైనా నోరు విప్పని అధికార తెలుగుదేశం పార్టీ తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు రోజుకో నాటకం ఆడుతోంది. ప్రజల దృష్టిని మళ్లించేందుకు కేంద్ర ప్రభుత్వంపై పోరాడుతున్నట్లు కలరింగ్ ఇస్తోంది. అనుకూల మీడియా ద్వారా లీకులిప్పిస్తూ పబ్బం గడుపుకునేందుకు ప్రయత్నిస్తోంది. విభజన చట్టంలోని హామీలపై కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ గురువారం లోక్‌సభలో ప్రకటన చేశారు. ఇందులో పాత విషయాలే చెప్పారు తప్ప కొత్తగా ఒరగబెట్టిందేమీ లేదు. అయినప్పటికీ టీడీపీ నేత, కేంద్ర సహాయ మంత్రి సుజనా చౌదరి సభలో బల్లలు చరిచి హర్షం వ్యక్తం చేశారు. ప్రకటన అద్భుతం అంటూ పరోక్షంగా చెప్పేశారు. టీడీపీ ఎంపీలు కూడా నోరుమెదపకుండా మౌనం దాల్చారు. జైట్లీ ప్రకటనలో కొత్తగా ఏందో ఉంటుందని ఆశలు పెట్టుకోవద్దంటూ సుజనా చౌదరి ముందుగానే తమ సభ్యులకు సూచన జారీ చేయడం గమనార్హం.

హామీల అమలుపై జైట్లీని నిలదీశారట!

అరుణ్ జైట్లీ ప్రకటన పట్ల టీడీపీ ఎంపీల మెతక వైఖరిపై ప్రజల నుంచి ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. ఇది పసిగట్టిన టీడీపీ అధిష్టానం నష్టనివారణ చర్యలు ప్రారంభించింది. తాజా ప్రకటనపై తమ ఎంపీలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారని, జైట్లీని స్వయంగా కలిసి హామీల అమలు కోసం గట్టిగా నిలదీసి అడిగారంటూ లీకులు ఇప్పించింది. అలాగే సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్‌లో టీడీపీ ఎంపీలతో మాట్లాడారని, దేశంలో ఆంధ్రప్రదేశ్ అంతర్భాగం కాదన్న రీతిలో కేంద్రం వ్యవహరిస్తోందంటూ మండిపడ్డారని అనుకూల మీడియా ద్వారా ఊదరగొట్టింది. తమ భవిష్యత్తు కార్యాచరణను రేపు ఖరారు చేయబోతున్నామంటూ ప్రచారం ప్రారంభించింది. సభలో జైట్లీ ప్రకటన తర్వాత టీడీపీ ఎంపీలు ఒక్క మాట కూడా మాట్లాడలేదు. కానీ, జైట్లీ ఏపీని లెక్కచేయడం లేదు, కేంద్రం మనల్ని పట్టించుకోవడం లేదు, ఇకపై గట్టిగా వ్యవహరించాల్సిందేనంటూ వారంతా చంద్రబాబును కోరినట్లు లీకులు వెలువడ్డాయి. ఇదంతా నాటకాన్ని మరింత రక్తికట్టించడంలో భాగమేనని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఉత్తుత్తి వీరంగాలు

టీడీపీ నాలుగేళ్లుగా కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉంటోంది. ప్రతి బడ్జెట్‌లోనూ రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా ఇదేమిటని ప్రశ్నించిన పాపాన పోలేదు. పైకి మాత్రం కేంద్రంపై పోరాడుతున్నాం.. తాడోపేడో తేల్చేస్తాం అంటూ వీరంగం వేస్తోంది. టీడీపీ అధిష్టానం కేంద్రంలోని తన మంత్రులతో రాజీనామా చేయించి, బయటకు వచ్చి ఉంటే, ఎన్డీయే సర్కారులో కచ్చితంగా ఇప్పటికే కదలిక వచ్చేదని, రాష్ట్రానికి నిధులు వచ్చేవని, విభజన చట్టంలోని హామీల అమలుపై కేంద్రం తప్పనిసరిగా దృష్టి సారించేదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అయితే, తన మంత్రులతో రాజీనామా చేయించలేని దుస్థితి టీడీపీది. ప్రజలను మభ్యపెట్టేందుకు పార్లమెంట్‌లో ఎంపీలతో తూతూమంత్రంగా ఆందోళనలు చేయిస్తూ డ్రామాలాడుతోంది తప్ప కేంద్రాన్ని నిలదీసే ధైర్యం చేయలేకపోతోంది. అవినీతికి సంబంధించిన కేసుల భయం టీడీపీ పెద్దలను వెంటాడుతోందని, అందుకే కేంద్ర ప్రభుత్వం ముందు వినయంగా వ్యవహరించక తప్పడం లేదని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు.



అమిత్‌షాతో చర్చిస్తున్న కేంద్ర మంత్రి సుజనా

కాలయాపనే..

రాష్ట్ర సమస్యలపై కేంద్ర ప్రభుత్వం చర్చించి 15 రోజుల్లోగా ఒక ప్రకటన చేయాలని కేంద్ర మంత్రి సుజనా చౌదరి గురువారం సభలో అన్నారు. సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అడగాల్సింది పోయి మరింత కాలహరణం జరిగేలా టీడీపీ మంత్రి వ్యవహరించడం దారుణమని పలువురు విమర్శిస్తున్నారు.

ఏపీ ఎంపీల డిమాండ్లను పరిష్కరించాలి

బడ్జెట్‌పై చర్చలో టీఆర్ఎస్ ఎంపీ కవిత



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చాలని టీఆర్ఎస్ ఎంపీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్‌పై గురువారం లోక్‌సభలో జరిగిన చర్చలో ఆమె మాట్లాడారు. 'విభజన చట్టంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలి. వైఎస్సార్ కాంగ్రెస్, టీడీపీ ఎంపీలు కొద్దిరోజులుగా చేస్తున్న ఆందోళనకు మా మద్దతు పలుకుతున్నాం. ప్రభుత్వం–పాలన ఒక నిరంతర ప్రక్రియ. ప్రభుత్వంలో ఉన్న టీడీపీ సభలో ఆందోళన చేస్తుండడం ప్రభుత్వానికి మంచిది కాదు. ఒక తప్పుడు సందేశాన్ని పంపుతుంది'.. అని ఆమె వివరించారు. చివరగా ' జై ఆంధ్రా..' అంటూ కవిత ప్రసంగం ముగించారు.

ఏప్రిల్‌లో 'ఎల్బీనగర్- అమీర్‌పేట్ ' మెట్రో ట్రయల్‌రన్!

- జూన్ నుంచి అందుబాటులోకి...
- అమీర్‌పేట్- హైటెక్ సిటీరూట్ జూన్‌కి పూర్తి

సాక్షి, హైదరాబాద్: అత్యంత రద్దీగా ఉండే ఎల్బీనగర్–అమీర్‌పేట్ మార్గంలో ఏప్రిల్‌లో మెట్రోరైల్ ట్రయల్ రన్‌కు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. జూన్ తొలివారం నాటికి 17 కిలోమీటర్ల ఈ మార్గాన్ని ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొచ్చే దిశగా పనులను పరుగెత్తిస్తున్నారు. ఈ మార్గంలో మొత్తంగా 652 పిల్లర్ల ఏర్పాటు పనులు పూర్తయ్యాయి. వీటిపై మెట్రో పట్టాలు పరిచేందుకు వీలుగా వయాడక్ట్ సెగ్మెంట్ల ఏర్పాటు పనులు కూడా దాదాపు పూర్తికావచ్చాయి. ఫిబ్రవరి, మార్చిల్లో మెట్రోట్రాక్, విద్యుదీకరణ పూర్తి చేయనున్నారు. అత్యంత క్లిష్టంగా మారిన లక్డీకాపూల్ వద్ద రైలు ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తిచేయడంతోపాటు ఈ మార్గంలోని పదిహేడు స్టేషన్ల నిర్మాణ పనులు శరవేగంగా చేస్తున్నారు. ప్రధానంగా ఎంజీబీఎస్ వద్ద రెండు కారిడార్లు కలిసే భారీ ఇంటర్ ఛేంజ్ మెట్రోస్టేషన్ ఏర్పాటు పనుల్లో వేగం పుంజుకుంది. నగరంలో ఒక చివర నుంచి మరో చివరకు(ఎల్బీనగర్- మియాపూర్)వరకు 29 కిలోమీటర్ల కారిడార్ పరిధిలో ఇప్పటికే 12 కిలోమీటర్ల మార్గంలో(అమీర్‌పేట్–మియాపూర్) మెట్రోరైళ్లు పరుగులు తీస్తున్న విషయం విదితమే. ఈ కారిడార్ పూర్తయితే నిత్యం సుమారు 6–7 లక్షల మంది ప్రయాణికులు మెట్రోరైళ్లలో రాకపోకలు సాగించే అవకాశాలున్నాయని అంచనా వేస్తున్నారు.

జూన్ నాటికి ఒకటి.. ఈ ఏడాది చివరికి మరోటి?

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2 నాటికి అమీర్‌పేట్–హైటెక్ సిటీ మార్గంలోనూ మెట్రో పనులను పూర్తి చేసే దిశగా మెట్రో అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎంజీబీఎస్– జేబీఎస్ మార్గంలో ప్రధానంగా సుల్తాన్‌బజార్ ప్రాంతంలో పిల్లర్లు, వాటిపై వయాడక్ట్ సెగ్మెంట్ల ఏర్పాటు ప్రక్రియ జటిలంగా మారడం, పుత్లీబౌలి ప్రాంతంలో డబుల్ ఎలివేటెడ్(రెండు కారిడార్లు కలిసేచోట) మార్గంలో చేపట్టిన పనులు నత్తనడకన సాగుతుండడంతో ఈ ఏడాది చివరినాటికి ఈ మార్గంలోనూ మెట్రోరైళ్లు ప్రజలకు అందుబాటులోకి రానున్నట్లు అధికారులు చెబుతున్నారు.

‘పోగొండ’లో కొండంత అవినీతి!

- రిజర్వాయర్ పనులపై కీలక మంత్రి కన్ను
- కాంట్రాక్టర్‌తో రహస్య అవగాహన
- అదనంగా రూ.43.97 కోట్లు ఇవ్వాలని ప్రతిపాదనలు
- తోసిపుచ్చిన ఎస్‌ఎల్‌ఎస్సీ, చీఫ్ ఇంజనీర్స్ కమిటీ
- నివేదికను వక్రీకరించి అదనపు బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు


పోగొండ రిజర్వాయర్

సాక్షి, అమరావతి: పశ్చిమ గోదావరి జిల్లా బుట్టాయగూడెం మండలం చింతలగూడెంలో నిర్మిస్తున్న పోగొండ రిజర్వాయర్ అవినీతి అక్రమాలకు వేదికగా మారింది. చింతలగూడెంకు సమీపంలో బైనేరు నదిపై 227.38 ఎంసీఎఫ్‌టీ సామర్థ్యంతో పోగొండ రిజర్వాయర్‌ను 2007లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేపట్టారు. రూ.18.20 కోట్లతో ఈ ప్రాజెక్టు పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించారు. రిజర్వాయర్‌ను పూర్తి చేసి, 4 వేల ఎకరాలకు నీళ్లందించాలని నిర్ణయించారు. ఎస్టీ సబ్‌ప్లాన్ కింద నిధులను ఖర్చు చేయాలని ప్రతిపాదించారు. బైనేరు నది వరద ఉధృతి అధికంగా ఉన్న నేపథ్యంలో రిజర్వాయర్ డిజైన్‌లను మార్చాలంటూ సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్(సీడీవో) చీఫ్ ఇంజనీర్, జీఎస్‌ఐ(జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా) కమిటీ ప్రతిపాదించాయి. దాంతో డిజైన్‌ను మార్చారు. దీనివల్ల అంచనా వ్యయాన్ని రూ.85.51 కోట్లకు పెంచుతూ 2014 జనవరి 1న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రిజర్వాయర్ పనులు 2014 నాటికే పూర్తయ్యాయి. కేవలం డిస్ట్రిబ్యూటరీల(పిల్ల కాలువలు) పనులు పూర్తిచేస్తే ఆయకట్టుకు నీళ్లందించవచ్చు. కానీ, మూడున్నరేళ్లుగా పిల్ల కాలువలు తవ్వించలేని ఓ కీలక మంత్రి ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను కొల్లగొట్టేందుకు ఎత్తు వేశారు.

కాంట్రాక్టర్ ముసుగులో..

అధికారం చేపట్టగానే పోగొండ రిజర్వాయర్‌పై కీలక మంత్రి కన్నేశారు. కాంట్రాక్టర్‌తో రహస్య అవగాహనకు వచ్చారు. అందులో భాగంగా రిజర్వాయర్ పనులను 2011–12 అంచనాల ప్రకారం తమకు అప్పగించారని.. ధరలు పెరగడం, డిజైన్లలో మార్పులు చేయడంతో అదనంగా రూ.43.97 కోట్లు ఖర్చు చేశామని, ఆ మేరకు అదనపు నిధులు ఇప్పించాలని 2016 జనవరి 18న కాంట్రాక్టర్ ప్రతిపాదనలు పంపారు. ఈ ప్రతిపాదనలపై ఆమోదముద్ర వేసి, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను మంజూరు చేయాలంటూ అధికారులపై కీలక మంత్రి ఒత్తిడి తెచ్చారు. డిజైన్‌లు మారడంతోనే 2014లో అంచనా వ్యయం పెంచారని స్టేట్ లెవల్ స్టాండింగ్ కమిటీ(ఎస్‌ఎల్‌ఎస్సీ) గుర్తుచేసింది. కాంట్రాక్టర్ ప్రతిపాదనలను తోసిపుచ్చింది. అదనపు నిధులు ఇవ్వాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పింది. దీనిపై కన్నెర్ర చేసిన కీలక మంత్రి.. ఎస్‌ఎల్‌ఎస్సీకి మరోసారి అవే ప్రతిపాదనలను పంపారు. ఉన్నతస్థాయి ఒత్తిడి మేరకు ఆ ప్రతిపాదనలను చీఫ్ ఇంజనీర్స్ కమిటీకి పంపించారు.

నివేదికను వక్రీకరించి..

కాంట్రాక్టర్ ప్రతిపాదనలను పరిశీలించిన చీఫ్ ఇంజనీర్స్ కమిటీ ఎస్‌ఎల్‌ఎస్సీ వ్యక్తం చేసిన అభిప్రాయాన్నే పునరుద్ఘాటించింది. ఒప్పందం గడువు ముగిసిన నేపథ్యంలో జీవో 22 వర్తిస్తుందో లేదో పరిశీలించి.. ధరల సర్దుబాటు కింద అదనపు నిధులు ఇచ్చే అంశాన్ని పరిగణనలోకి తీసుకోవచ్చని సూచించింది. కీలక మంత్రి ఒత్తిడితో ఈ నివేదికను ఉన్నతాధికారులు వక్రీకరించారు. అదనపు పనులకు రూ.30.87 కోట్లు, జీవో 22 కింద రూ.13.10 కోట్లు.. వెరసి అదనంగా రూ.43.97 కోట్లు కాంట్రాక్టర్‌కు ఇచ్చేయాలంటూ ఆగస్టు 1న చిన్న నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ పంపిన ప్రతిపాదనలపై నవంబర్ 30న ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. ఈ అదనపు నిధులు నేరుగా కీలక మంత్రి జేబులోకి చేరనున్నట్లు సమాచారం.

ఎమ్మెల్సీ గాలి ముద్దుకృష్ణమనాయుడు పార్థివదేహాన్ని మోస్తున్న భూమన, ఎమ్మెల్యేలు చెవిరెడ్డి, నారాయణస్వామి



ముద్దుకృష్ణమనాయుడుకు కన్నీటి వీడ్కోలు

- అధికార లాంఛనాలతో అంత్యక్రియలు
- పార్థివదేహాన్ని మోసిన వైఎస్సార్‌సీపీ నేతలు

తిరుపతి రూరల్: టీడీపీ ఎమ్మెల్సీ గాలి ముద్దుకృష్ణమనాయుడి అంత్యక్రియలు గురువారం అధికార లాంఛనాలతో నిర్వహించారు. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు, వివిధ పార్టీల నేతలు పెద్ద సంఖ్యలో ఆయనకు కన్నీటి వీడ్కోలు పలికారు. ఆయనను కడసారి చూసేందుకు చిత్తూరు జిల్లా రామచంద్రాపురం మండలం వెంకట్రామాపురానికి అభిమానులు వేలాదిగా తరలివచ్చారు. మధ్యాహ్నం మూడు గంటలకు అంతిమ యాత్ర ప్రారంభమైంది. తిరుపతి రూరల్ మండలం వేమూరు పంచాయతీలోని ముద్దుకృష్ణమనాయుడి సొంత మామిడితోటలో సాయంత్రం 5 గంటలకు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, ఎమ్మెల్సీ పార్థివ దేహాన్ని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు భూమన కరుణాకర్‌రెడ్డి, నారాయణస్వామి, చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి భుజాన ఎత్తుకుని అంత్యక్రియలు నిర్వహించే ప్రదేశం వరకు మోశారు. రాష్ట్ర మంత్రులు అమరనాథ్‌రెడ్డి, అచ్చెన్నాయుడు, దేవినేని ఉమామహేశ్వరరావు, పత్తిపాటి పుల్లారావు, జవహర్, సృజయ్‌కృష్ణరంగారావు, నగరి ఎమ్మెల్యే ఆర్కే రోజా, ఎమ్మెల్యేలు సుగుణమ్మ, శంకర్‌యాదవ్, మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్, మాజీ స్పీకర్ అగరాల ఈశ్వర్‌రెడ్డి, కలెక్టర్ ప్రద్యుమ్న, ఎస్పీ మెహంతి, పద్మావతీ మహిళా వర్సిటీ వీసీ ఆచార్య దుర్గాభవాని, మాజీ వీసీ ఆచార్య వరలక్ష్మి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

జనన మరణాల నమోదు సక్రమంగా ఉండాలి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయితీలు, మున్సిపాలిటీల్లో జనన, మరణ రిజిష్టర్లను సక్రమంగా నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం వెలగపూడి తాత్కాలిక సచివాలయంలోని ఆయన కార్యాలయంలో మెటర్నిటీ బెనిఫిట్ స్కీమ్, జనన, మరణ సర్టిఫికెట్లు జారీ, రిజిష్టర్లు నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాతాశిశు మరణాలకు సంబంధించిన సంఘటనలు జరిగితే వెంటనే సంబంధిత అథారిటీకి ఆ వివరాలను తెలియజేయాలని, అలాగే గ్రామ పంచాయితీలు, మున్సిపాలిటీల్లో జనన, మరణ సర్టిఫికెట్లను సకాలంలో జారీ చేయడంతో పాటు అందుకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. మెటర్నిటీ స్కీమ్‌ను మహిళలకు పూర్తిగా వర్తింప చేసేందుకు వీలుగా 2016లో జరిగిన ఆసుపత్రి ప్రసవాలకు సంబంధించిన వివరాలన్నిటినీ ఈనెల 15లోగా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తేవాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి పూనం మాలకొండయ్య, స్త్రీశిశు సంక్షేమశాఖ కార్యదర్శి కె.సునీత, స్త్రీశిశు సంక్షేమశాఖ ప్రత్యేక కమిషనర్ హెచ్.అరుణ్ కుమార్, మున్సిపల్ శాఖ సంచాలకులు కె.కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

జూడాల స్టైఫండ్ పెంపుపై ఉన్నతస్థాయి కమిటీ

సాక్షి, అమరావతి: తమకు రావాల్సిన బకాయిలతో పాటు స్టైఫండ్ పెంపుపై ఈనెల 13లోగా నిర్ణయం తీసుకోకపోతే 14వ తేదీ నుంచి సమ్మెలోకి వెళతామంటూ జూనియర్ వైద్యులు నోటీసు ఇచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం స్టైఫండ్ పెంపుపై ఉన్నత స్థాయి కమిటీ వేసింది. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య గురువారం ఉత్తర్వులు జారీచేశారు. కమిటీ చైర్మన్‌గా వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఉంటారు. మెంబర్ కన్వీనర్‌గా వైద్యవిద్యా సంచాలకులు, సభ్యులుగా అకడమిక్ వైద్యవిద్యా సంచాలకులు, ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ రిజిస్ట్రార్, వైద్యవిధాన పరిషత్ కమిషనర్, ఏపీ జూడాల సంఘం అధ్యక్షుడు ఉంటారు. మూడు నెలల్లోగా ఈ కమిటీ జూడాలకు ఇస్తున్న స్టైఫండ్‌పై పరిశీలన చేసి నివేదిక ఇస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బీజేపీతో కటీఫ్‌కు సిద్ధం

- ఆ పార్టీని ఎదిరించడానికి టీడీపీ రెడీ
- మంత్రి గంటా వ్యాఖ్యలు
- పొత్తుపై సీఎం నిర్ణయం తీసుకుంటారు : చినరాజప్ప


విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి గంటా

గాజువాక/అమరావతి/నెల్లూరు టౌన్ : రాష్ట్ర ప్రయోజనాల కోసం అవసరమైతే బీజేపీతో పొత్తును వదులుకోవడానికి కూడా టీడీపీ సిద్ధంగా ఉందని రాష్ట్ర విద్యాశాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు చెప్పారు. విశాఖ జిల్లా గాజువాకలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నికల సమయంలో, రాష్ట్ర విభజన చట్టంలో చెప్పిన విషయాలను, గత ప్రధాని మన్మోహన్‌సింగ్ పార్లమెంట్ సాక్షిగా చెప్పిన విషయాలుగానీ ప్రస్తుత బడ్జెట్‌లో లేకపోవడం దురదృష్టకరమన్నారు. టీడీపీ ఎంపీలు రాజ్యసభలో, లోక్‌సభలో గొడవ చేయడం.. బీజేపీని ఎదిరించడానికి టీడీపీ సిద్ధంగా ఉందన్న విషయానికి సంకేతమని గంటా అన్నారు. కేంద్ర నిధులకు రాష్ట్ర ప్రభుత్వం లెక్కలు చెప్పడంలేదన్న బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు చేసిన వ్యాఖ్యలపై గంటా స్పందిస్తూ.. లెక్కలు చెప్పాల్సిన అవసరం లేదని, అన్నీ ఆన్‌లైన్‌లో ఉన్నాయన్నారు.

పొత్తుపై పునరాలోచించే సమయమిది : హోంమంత్రి

రాష్ట్రానికి కేంద్రం చేస్తున్న అన్యాయాన్ని చూస్తుంటే పొత్తులపై పునరాలోచించాల్సిన సమయం ఆసన్నమైందని, దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం తీసుకుంటారని హోంమంత్రి ఎన్.చినరాజప్ప వెల్లడించారు. పార్లమెంటులో ప్రధాని ప్రసంగం విన్నాక ఈ బాధ మరింత ఎక్కువైందన్నారు. రాష్ట్రంలో గురువారం జరిగిన బంద్ తీరును సమీక్షించిన తర్వాత మంత్రి తన చాంబర్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రధాని, కేంద్రం దిగొచ్చే వరకు పోరాటం చేయాలని సీఎం దుబాయ్ నుంచి ఫోన్‌లో ఆదేశించారని చెప్పారు. కాగా, రాష్ట్రంలో బంద్ ప్రశాంతంగా జరిగిందన్నారు.

ప్రజాభీష్టం మేరకే నడుచుకుంటాం : మంత్రి జవహర్

ఏపీకి ప్రత్యేక నిధులు కేటాయింపు విషయంలో ప్రజల మనోభావాల మేరకు టీడీపీ నడుచుకుంటుందని ఎక్సైజ్ శాఖ మంత్రి జవహర్ తెలిపారు. నెల్లూరులో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీతో మిత్రధర్మం పాటించినందువల్లే మాట్లాడకుండా ఉన్నామని, కానీ నాలుగేళ్లుగా ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా మాటలతో కాలం గడుపుతున్నారని ఆరోపించారు. ఆంధ్రప్రజలు ఆత్మగౌరవానికి భంగం కలిగితే ఊరుకోబోమని ఆయన హెచ్చరించారు.

అటవీ అనుమతులకు ‘పరివేష్’

- అన్ని రకాల క్లియరెన్సులకు ఒకే పోర్టల్
- ప్రధాని చేతుల మీదుగా త్వరలో ప్రారంభం
- ప్రజావసరాలకు త్వరితగతిన అనుమతులు
- ‘సాక్షి’తో కేంద్ర అటవీ పర్యావరణ శాఖ ఆగ్నేయ రీజియన్ అదనపు ప్రధాన అటవీ సంరక్షణాధికారి రాంగోపాల్‌రెడ్డి



సాక్షి, అమరావతి: అటవీ, పర్యావరణ అనుమతుల జారీలో జాప్యం వల్ల రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో పలు మౌలిక సదుపాయాల కల్పన పనులు పెండింగులో ఉండిపోతున్నాయి. అటవీ, పర్యావరణ అనుమతుల కోసం 2014కు ముందు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ, రహదారులు – భవనాలు, గిరిజన సంక్షేమశాఖలు పంపిన ప్రతిపాదనలు ఇప్పటికీ అలాగే మిగిలిపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో అన్ని రకాల అటవీ అనుమతులకు సంబంధించిన ప్రతిపాదనలను ‘పరివేష్’ అనే పోర్టల్ ద్వారా తీసుకుని దాని ద్వారానే క్లియరెన్సులు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. ఆన్‌లైన్ ద్వారా ప్రతిపాదనల సమర్పణపై ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల వారికి శిక్షణ ఇవ్వడం కోసం విజయవాడ వచ్చిన కేంద్ర అటవీ పర్యావరణ మంత్రిత్వ శాఖ ఆగ్నేయ రీజియన్ అదనపు ప్రధాన అటవీ సంరక్షణాధికారి జి.రాంగోపాల్‌రెడ్డి ‘సాక్షి’కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

సాక్షి: అటవీ, పర్యావరణ అనుమతులు పెండింగులో ఉన్నందువల్ల పనులు ఆగిపోయాయని రాష్ట్ర ప్రభుత్వం అంటోంది. 2014కు ముందు పంపిన ఫైళ్లకు కూడా క్లియరెన్సు రాలేదని గిరిజన సంక్షేమ శాఖ వారు అంటున్నారు. దీనికి కారణాలేమిటి?

జవాబు: వాస్తవంగా చెప్పాలంటే మా దగ్గర ఒక్కదరఖాస్తు కూడా పెండింగులో లేదు. రాష్ట్రం నుంచి వచ్చిన ప్రతిపాదనలపై ఎప్పటికప్పుడు ఫిజికల్ ఫైళ్ల ద్వారా వివరణలు పంపించాం.(2014 జులై 15 తేదీ వరకూ అన్నీ ఫిజికల్ ఫైళ్లే నడిచాయి). వాటిలో చాలా వాటికి సమాధానాలు రాలేదు. బహుశా అధికారులు బదిలీ అవ్వడం, తర్వాత వచ్చిన వారు వాటిని పరిశీలించకపోవడం, పాత ఫైళ్లు మూలన పడిపోవడం తదితర కారణాలు కావచ్చు.

కారణాలేమైనా, తప్పెవరిదైనా ఇలా అత్యవసర ప్రజావసరాలకు సంబంధించిన ప్రతిపాదనలు దీర్ఘకాలం పెండింగులో ఉండటం సమంజసమా?

ఏమాత్రం సమంజసం కాదు. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన పనులకు త్వరితగతిన అనుమతులు ఇవ్వాల్సిందే. ఇలా ఏళ్ల తరబడి ఫైళ్లు పెండింగులో ఎక్కడ ఉన్నా తప్పే.

త్వరితగతిన అనుమతులకు తీసుకుంటున్న చర్యలేమిటి?

అటవీ అనుమతులు(ఎఫ్‌సీ), మొదటి దశ, రెండో(చివరిదశ) పర్యావరణ అనుమతులు(ఈసీ), వన్యప్రాణి విభాగం క్లియరెన్సు(డబ్ల్యూసీ)లన్నీ ఒకే వెబ్‌పోర్టల్ ద్వారా ఇవ్వాలని కేంద్ర అటవీ పర్యావరణ శాఖ తాజాగా నిర్ణయించింది. ఇందులో భాగంగానే పరివేష్ అనే వెబ్‌పోర్టల్‌ను దేశవ్యాప్తంగా రెండు నెలల్లో అందుబాటులోకి తేనున్నాం. ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్వయంగా దీనిని ప్రారంభిస్తారు. అటవీభూమి బదలాయింపు కోసం పరివేష్ వెబ్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులపై ఆన్‌లైన్‌లోనే వివరణలు కోరతాం. రాష్ట్ర అధికారులు ఆన్‌లైన్‌లోనే వాటికి సమాధానాలు ఇవ్వాలి. తీవ్రవాద ప్రభావిత జిల్లాల్లో పాఠశాలలు, ఆస్పత్రి భవనాల నిర్మాణం, రహదారుల ఏర్పాటు లాంటి ప్రజోపయోగ కార్యక్రమాల కోసం ఐదు హెక్టార్ల వరకూ అటవీ భూమి బదలాయింపు కోసం రాష్ట్ర ప్రభుత్వమే అనుమతి ఇవ్వవచ్చు. అంతకు మించి అటవీ భూమి బదలాయింపు, క్లియరెన్సులు ఇచ్చే అధికారం కేంద్ర అటవీ పర్యావరణ శాఖకే ఉంటుంది.

స్పీడ్ లేని యాక్సెస్ రోడ్డు

- రాజధానిలో ముందుకు సాగని కీలక రహదారి పనులు
- 2016 జూన్‌లో సీఎం శంకుస్థాపన
- ఏడాదిలో పనులు పూర్తి చేస్తామని ప్రకటన
- రెండేళ్లవుతున్నా సగం కూడా పూర్తికాని రోడ్డు నిర్మాణం
- ప్రభుత్వం వద్ద కచ్చితమైన ప్రణాళిక లేదంటున్న స్థానికులు


గ్రావెల్ పనులకే పరిమితమైన కృష్ణాయపాలెం నుంచి వారధి మధ్య ఉన్న రోడ్డు

సాక్షి అమరావతి బ్యూరో: రాష్ట్ర రాజధాని అమరావతిలో రహదారుల నిర్మాణం శరవేగంగా సాగుతోందని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నా క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. అత్యంత కీలకమైన సీడ్ యాక్సెస్ రోడ్ నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారిపోయింది. రాజధాని ప్రాంతానికి తూర్పు దిక్కున కనకదుర్గమ్మ వారధి వద్ద చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారి నుంచి మొదలై బోరుపాలెం వరకు 21.5 కిలోమీటర్ల పొడవున 6 వరుసల సీడ్ యాక్సెస్ రహదారిని రూ.579 కోట్లతో నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2016లో టెండర్లను ఆహ్వానించింది. 2016 జూన్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 12 నెలల్లో పనులు పూర్తి చేస్తామని ప్రకటించారు.

నిలిచిన మొదటి దశ పనులు

మొదటి దశలో కనకదుర్గమ్మ వారధి నుంచి పనులు ప్రారంభం కావాల్సి ఉండగా, ఈ రోడ్డు నిర్మాణానికి తమ భూములు ఇచ్చేందుకు రైతులు ముందుకురాలేదు. దీంతో ప్రారంభ దశలోనే పనులకు ఆటంకం ఏర్పడింది. తర్వాత వెంకటపాలెం నుంచి బోరుపాలెం వరకు పనులను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ప్రస్తుతం రోడ్డు రాయపూడి వరకు దాదాపు 11 కిలోమీటర్ల మేర మాత్రమే పూర్తయింది. రాయపూడి నుంచి బోరుపాలెం వరకు 6.5 కిలోమీటర్లు, వారధి నుంచి వెంకటపాలెం వరకు 5 కిలోమీటర్ల మేర పనులు మిగిలిపోయాయి. రాజధాని నిర్మాణంలో భాగంగా మొట్టమొదట ప్రారంభించిన రోడ్డు నిర్మాణం ఇప్పటికీ పూర్తికాకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఎప్పుడు పూర్తయ్యేనో!

సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణ పనులు అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏడీసీ) ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. నిత్యం పనులను పర్యవేక్షిస్తూ గడువులోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో పనులు చేయకుండా కాంట్రాక్టర్ మొండికేస్తున్నారు. మరోవైపు మాస్టర్‌ప్లాన్ ప్రకారం పనులు జరగడం లేదన్న ఆరోపణలూ ఉన్నాయి. రహదారి నిర్మాణానికి పూర్తిస్థాయిలో భూ సేకరణ చేపట్టలేదు. కనకదుర్గమ్మ వారధి నుంచి వెంకటపాలెం వరకు రైతులు తమ భూములను ఇచ్చేందుకు అంగీకరించలేదు. దీంతో చేసేదేమీ లేక వెంకటపాలెం నుంచి రాయపూడి వరకు రూ.215 కోట్లతో రోడ్డు పనులు ప్రారంభించారు. ప్రస్తుతం ఈ మార్గంలో ఓ మోస్తరుగా రోడ్డు నిర్మించారు. దీన్ని కూడా అక్కడక్కడ తరచూ కూల్చివేస్తూ మళ్లీ నిర్మిస్తున్నారు. విద్యుత్ లైన్ కోసం ప్రభుత్వం తవ్వమంది కాబట్టి తవ్వుతున్నామని కాంట్రాక్టర్ చెబుతున్నారు. దీన్నిబట్టి చూస్తే సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణంపై ప్రభుత్వం వద్ద కచ్చితమైన ప్రణాళిక లేదని తెలుస్తోంది. మొత్తం 21.5 కిలోమీటర్ల పొడవునా రహదారి నిర్మించాల్సి ఉండగా, రెండేళ్లలో 11 కిలోమీటర్లు మాత్రమే అరకొరగా పూర్తిచేశారు. మిగిలిన పనులు ఎప్పుడు పూర్తవుతాయో ఎవరూ చెప్పలేని పరిస్థితి.

మాట తప్పటం సరికాదు

విభజన హామీలపై జేపీ వ్యాఖ్య • పవన్ కల్యాణ్‌తో సమావేశం



హైదరాబాద్: దేవుడి పెళ్లికి అందరం పెద్దలమేనని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ్ వ్యాఖ్యానించారు. విభజన హామీల అమలు కోసం ఓ వేదిక ఏర్పాటు చేయాలనే ఆలోచన చేసిన జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌ను అభినందిస్తున్నట్లు చెప్పారు. గురువారం హైదరాబాద్ బేగంపేటలోని లోక్‌సత్తా కార్యాలయంలో జేపీతో సుమారు గంటపాటు పవన్‌కళ్యాణ్ సమావేశం అయ్యారు. అనంతరం జేపీ విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీరు ఏరుదాటాక తెప్ప తగలేసిన మాదిరిగా ఉందని విమర్శించారు. విభజన హామీలను చట్టంలో చేర్చాక, పార్లమెంట్‌లో లోతైన చర్చ జరిగాక కూడా ఇలా వ్యవహరించటం చాలా ప్రమాదకరమైన పరిణామమని చెప్పారు. దీనివల్ల ప్రభుత్వాలు, పార్టీలు, పార్లమెంట్‌పై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లుతుందని హెచ్చరించారు. దేశ ప్రధాని, హోంశాఖ మంత్రి పార్లమెంట్ సాక్షిగా రాతపూర్వకంగా ఇచ్చిన హామీలు చట్టంలో లేవని, తమ ఇష్టం అనడం ధర్మం కాదన్నారు. బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ప్రకారం చూసినా దామాషా ప్రకారం రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు రూ.10 వేల కోట్లు ఇవ్వాలని, మరి నిధులు ఎక్కడ ఇచ్చారని ప్రశ్నించారు.

శాంతియుతంగా పోరాటం: పవన్

విభజన హామీల అమలుకు సంబంధించి ఏం చేస్తే కేంద్రంలో కదలిక వస్తుందనే అంశాలపై జేపీతో చర్చించినట్లు పవన్‌కళ్యాణ్ చెప్పారు. గురువారం ఏపీ బంద్ ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన అన్ని పార్టీల నేతలు, కార్యకర్తలు, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

ఏపీకి ఇచ్చిన నిధులపై లెక్కలు చెబుతాం: బీజేపీ


ఢిల్లీలో జరిగిన కొల్లేరు సమావేశంలో చర్చిస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్ర పర్యావరణ మంత్రి హర్షవర్ధన్, రాష్ట్ర మంత్రి కామినేని

సాక్షి, న్యూఢిల్లీ/కైకలూరు: ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్రం ఇప్పటి వరకు ఇచ్చిన నిధులపై లెక్కలు చెబుతామని బీజేపీ ఎంపీ గోకరాజు గంగరాజు తెలిపారు. గురువారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ విభజన చట్టంలో ఇచ్చిన హామీల్లో ఇంతవరకు అమలు చేసిన, అమలు చేయాల్సిన అంశాలపై శ్వేతపత్రం విడుదల చేస్తామన్నారు. శనివారం ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబుతో కలసి మీడియాకు వివరాలు వెల్లడిస్తామన్నారు.

కొల్లేరు సమస్యపై ఉపరాష్ట్రపతి సమీక్ష

కొల్లేరు కాంటూరు సమస్యలపై ఉపరాష్ట్రపతి వెంకయ్య గురువారం ఢిల్లీలో సమీక్షించారు. మంత్రి కామినేని శ్రీనివాస్, ఎంపీ గోకరాజు గంగరాజు వెంకయ్యను కలసి సమస్య పరిష్కారంపై చర్చించారు. సమావేశంలో కేంద్ర మంత్రి హర్షవర్దన్, అటవీ శాఖ డిజి సిద్ధాంత దాస్, పర్యావరణ శాఖ ప్రధాన కార్యదర్శి సీకే మిశ్రా పాల్గొన్నారు. కొల్లేరు సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం పంపిన నివేదిక కేంద్రం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదికకు దగ్గరగా ఉందని మంత్రి కామినేని వివరించారు. మార్చి మొదటివారంలో నేషనల్ వైల్డ్ లైఫ్ బోర్డు సమావేశం జరుగుతుందని, అప్పుడు కేంద్ర ఎక్స్‌పర్ట్ కమిటీ రిపోర్టు, ఏపీ నుంచి వచ్చిన రిపోర్టును పూర్తిస్థాయిలో పరిశీలించి అధికారులు కొల్లేరుపై నిర్ణయం తీసుకుంటారని కేంద్ర మంత్రి హర్షవర్ధన్ చెప్పారు. పర్యావరణం దెబ్బతినకుండా కొల్లేరు సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కేంద్ర మంత్రిని, ఉన్నతాధికారులను వెంకయ్య ఆదేశించారు.

డ్వాక్రా మహిళల బతుకు దయనీయం!

- భారీగా తగ్గిపోయిన మహిళల కుటుంబాల ఆదాయం
- 73 శాతం డ్వాక్రా మహిళా కుటుంబాలు పేదరికంలోనే..
- ‘సెర్ప్’ అంతర్గత సర్వేలో వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో డ్వాక్రా సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళల కుటుంబ ఆదాయం భారీగా పడిపోయింది. గ్రామీణాభివృద్ధి శాఖలో డ్వాక్రా సంఘాల వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) డ్వాక్రా మహిళల కుటుంబాల ఆదాయంపై తాజాగా అధ్యయనం నిర్వహించింది. ఇందులో పలు చేదు నిజాలు బహిర్గతమయ్యాయి. మూడో వంతు డ్వాక్రా మహిళల కుటుంబాల నెలవారీ ఆదాయం కనీసం రూ.3,000 కూడా దాటడం లేదని వెల్లడైంది. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతంలో 7.18 లక్షల పొదుపు సంఘాల్లో 72.42 లక్షల మంది మహిళలు సభ్యులుగా కొనసాగుతున్నారు. ఇందులో 28 శాతం మహిళల కుటుంబాల ఆదాయం నెలకు రూ.3,000 లోపే ఉన్నట్లు తేలింది. మరో 45 శాతం మహిళల కుటుంబాల ఆదాయం నెలకు రూ.3,000 నుంచి రూ.6,000 వరకు ఉన్నట్లు స్పష్టమైంది. ఒక కుటుంబ ఆదాయం నెలకు రూ.3,000 లోపు ఉంటే అది నిరుపేద కుటుంబంగా ప్రభుత్వం గుర్తిస్తోంది. నెలకు రూ.6,000 లోపు ఆదాయం ఉండే కుటుంబాన్ని పేద కుటుంబం(బీపీఎల్)గా పరిగణిస్తోంది. ఈ లెక్కన గ్రామీణ ప్రాంతాల్లో 28 శాతం డ్వాక్రా మహిళల కుటుంబాలను నిరుపేదలుగా, మరో 45 శాతం కుటుంబాలు పేదరికంలోనే మగ్గుతున్నట్టు అధికారులు గుర్తించారు.

పెరుగుతున్న రుణ భారం

డ్వాక్రా సంఘాల రుణాలన్నీ మాఫీ చేస్తామని 2014 సాధారణ ఎన్నికల ముందు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. ఎన్నికలయ్యాక ఆ హామీని మాఫీ చేశారు. ఎన్నికల సమయంలో 13 జిల్లాల ఆంధ్రప్రదేశ్‌లో బ్యాంకుల్లో రూ.12,404 కోట్ల డ్వాక్రా రుణాలున్నాయి. ఇవి 2014 మార్చి నెలాఖరు నాటికి రూ.13,400 కోట్లకు పెరిగాయి. అప్పట్లో ఆ రుణ మొత్తంపై వడ్డీ ఏడాదికి రూ.1,300 కోట్లు అయ్యేది. అసలు, వడ్డీ కలిపి రూ.14,700 కోట్లు కాగా, రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సంఘం(ఎస్‌ఎల్‌బీసీ) లెక్కల ప్రకారం 2015 మార్చి ఆఖరి నాటి బ్యాంకుల్లో డ్వాక్రా సంఘాల అప్పు రూ.14,977 కోట్లకు చేరింది. ఆ అప్పుపై ఏటా పెరిగే వడ్డీని కూడా కలిపితే 2017 సెప్టెంబరు నాటికి అది రూ.19,106 కోట్లకు పెరిగిపోయింది.



డ్వాక్రా మహిళల కుటుంబ ఆదాయ వివరాలు

రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లోని మొత్తం డ్వాక్రా సంఘాలు	:	7,18,127
డ్వాక్రా సంఘాల్లోని మహిళా సభ్యులు	:	72,42,232
రూ.3,000 కంటే తక్కువ కుటుంబ ఆదాయం కలిగిన మహిళలు	:	20,27,824
రూ.3,000-రూ.6,000 మధ్య నెలసరి ఆదాయం ఉన్న మహిళలు	:	32,59,004
రూ.6,000-రూ.8,000 మధ్య ఆదాయం ఉన్న మహిళలు	:	10,13,912
రూ.8,000-రూ.10,000 మధ్య ఆదాయం ఉన్న మహిళలు	:	5,06,956
రూ.10,000కు పైగా ఆదాయం కలిగిన మహిళలు	:	4,34,536



102.34 కేరట్ల బరువైన అత్యంత స్వచ్ఛమైన వజ్రమిది. దీన్ని లండన్‌లోని సోత్‌బే సంస్థ వేలానికి ఉంచింది. పారదర్శకత, కటింగ్ విషయాల్లో దీనికున్న అత్యున్నత ప్రమాణాలు మరే వజ్రానికీ లేవని సంస్థ తెలిపింది. వేలంలో రూ.213 కోట్ల ధర పలుకుతుందని అంచనా.

తల్లి అంత్యక్రియల కోసం భిక్షాటన

సాక్షి, చెన్నై: అనారోగ్యంతో మరణించిన తల్లి అంత్యక్రియలకు చిల్లిగవ్వకూడా లేకపోవడంతో ఏం చేయాలో తోచని ఇద్దరు పిల్లలు భిక్షాటన చేసిన దారుణఘటన తమిళనాడులో జరిగింది. దిండుగల్ జిల్లాలోని మేటుపట్టికి చెందిన కాళియప్పన్, విజయ దంపతులకు మోహన్(14), వేల్ మురుగన్(13) కుమారులు, కుమార్తె కాళీశ్వరి ఉన్నారు. గతంలోనే కాళియప్పన్ చనిపోయాడు. దీంతో విజయ ఒక్కతే రెక్కల కష్టంతో పిల్లల్ని చూసుకుంటోంది. ఇటీవల ఆమెకు రొమ్ము కేన్సర్ సోకింది. దీంతో కుమారులు బడి మానేసి కూలిపనికి వెళ్తున్నారు. విజయ పరిస్థితిని చూసిన ఓ ఆశ్రమం కుమార్తె కాళీశ్వరి బాధ్యతలు స్వీకరించింది. ఆరోగ్యం క్షీణించిన విజయను దిండుగల్ ఆస్పత్రిలో చేర్పించగా గురువారం




కన్నుమూసింది. తల్లి మృతిపై బంధువులకు సమాచారం అందించినా ఎవ్వరూ స్పందించకపోవడం, చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో అంత్యక్రియల కోసం ఇద్దరు పిల్లలు ఆస్పత్రిలో భిక్షాటనకు దిగారు. విషయం తెల్సుకున్న ఆస్పత్రి సంక్షేమాధికారి మాలతి అంత్యక్రియల ఏర్పాట్లు చూశారు. చివరికి ప్రభుత్వ దహన వాటికకు తరలించి అంత్యక్రియలు పూర్తిచేశారు.



మానవ సహిత అంగారక మిషన్‌లో వినియోగించే సాంకేతికతను ఒమన్ ఎడారిలో పరీక్షిస్తున్న శాస్త్రవేత్తలు. అంగారక గ్రహ వాతావరణాన్ని పోలి ఉండే ఈ ఎడారిలో 200 మంది శాస్త్రవేత్తలు..సుమారు నెల రోజులు పాటు క్షేత్రస్థాయిలో ఇలా ప్రయోగాలు చేయనున్నారు.

రజనీతో పొత్తును కాలమే నిర్ణయిస్తుంది



సాక్షి ప్రతినిధి, చెన్నై: సూపర్‌స్టార్ రజనీకాంత్ పెట్టబోయే పార్టీతో పొత్తు అంశాన్ని కాలమే నిర్ణయిస్తుందని నటుడు కమల్ హాసన్ తెలిపారు. ఒకవేళ ఎన్నికల్లో కలసి పోటీచేయాలంటే తాను, రజనీ బాగా ఆలోచించాల్సి ఉంటుందన్నారు. తమిళ వారపత్రిక 'ఆనంద వికటన్'కు రాసిన వ్యాసంలో కమల్ తన అభిప్రాయాన్ని తెలిపారు. రజనీతో పొత్తు సినిమాకు నటీనటుల్ని ఎంపిక చేసుకున్నంత సులభం కాదనీ, ఇవి రెండూ పూర్తి భిన్నమైన అంశాలన్నారు. పొత్తు కోసం ఇరు పార్టీల సిద్ధాంతాల్లో కూడా సారూప్యత కూడా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. మరోవైపు కమల్‌తో పొత్తుపై రజనీ స్పందిస్తూ.. 'నేను మీకు ఇప్పటికే చెప్పా. కాలమే ఈ ప్రశ్నలన్నింటికి సమాధానం చెప్పగలదు' అని వ్యాఖ్యానించారు.

కర్ణాటకలో బీఎస్పీతో జేడీఎస్ జట్టు



సాక్షి, బెంగళూరు / న్యూఢిల్లీ: ఈ ఏడాది జరగనున్న కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కలసి పోటీచేస్తామని జనతాదళ్(సెక్యులర్), బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ)లు ప్రకటించాయి. ఈ పొత్తు 2019 లోక్‌సభ ఎన్నికల్లోనూ కొనసాగుతుందని జేడీఎస్ నేత డ్యానిష్ అలీ, బీఎస్పీ నేత సతీశ్‌చంద్ర మిశ్రా తెలిపారు. కర్ణాటకలోని 20 అసెంబ్లీ నియోజకవర్గాల్లో(8 రిజర్వ్‌డ్) బీఎస్పీ పోటీచేస్తుందనీ, మిగిలిన 204 సీట్లలో జేడీఎస్ అభ్యర్థులు పోటీచేస్తారన్నారు. జేడీఎస్, బీఎస్పీ జాతీయ అధ్యక్షులు దేవెగౌడ, మాయావతిలు ఫిబ్రవరి 17న బెంగళూరులో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తారన్నారు.దాదాపు 22 శాతం ఎస్టీ జనాభా ఉన్న కర్ణాటకలో తమ పార్టీకి మంచి పట్టు ఉందని మిశ్రా అన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రైవేటు సేవలు వద్దు

న్యూఢిల్లీ: అధికారిక కార్యక్రమాలు నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వ విభాగాలు, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటు సంస్థల సేవలు తీసుకోవడం మానుకోవాలని ఉత్తర్వులు జారీఅయ్యాయి. 'ప్రోటోకాల్ నిబంధనలు ఉల్లంఘించి లోక్‌సభ సభ్యులతో ప్రభుత్వాధికారుల ధిక్కార ప్రవర్తన' పేరిట పార్లమెంటరీ సంఘం జనవరి 4న లోక్‌సభలో సమర్పించిన నివేదికలో సిఫార్సుల మేరకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోకి వచ్చే వివిధ కార్యక్రమాల నిర్వహణకు ప్రైవేటు సంస్థలు లేదా ఏజెన్సీల సేవలు పొందడాన్ని మానుకోవాలని పార్లమెంటరీ సంఘం సిఫార్సు చేసింది. ఎంపీలు, ఎమ్మెల్యేలతో అధికారిక సంప్రదింపులు జరిపేటప్పుడు ప్రభుత్వ ఉద్యోగులందరూ మార్గదర్శకాలు, నిబంధనల్ని కచ్చితంగా పాటించాలని ఈ ఉత్తర్వుల్లో కేంద్రం స్పష్టం చేసింది.

జంక్ ఫుడ్ ప్రకటనల నిషేధ యోచన లేదు



న్యూఢిల్లీ: టీవీల్లో జంక్ ఫుడ్‌కు సంబంధించి వ్యాపార ప్రకటనలు నిషేధించే ఆలోచన ప్రస్తుతానికి లేదని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. పిల్లలకు సంబంధించిన ప్రకటనలను కట్టడి చేయాలని ఫుడ్ అండ్ బేవరేజెస్ అలయన్స్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌బీఐఏ) స్వతంత్రంగా నిర్ణయం తీసుకుందని గురువారం లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి రాజ్‌వర్ధన్ సింగ్ తెలిపారు. పిల్లల ఆరోగ్యంపై జంక్ ఫుడ్ ప్రభావం చూపుతోందని అనుబంధ ప్రశ్నల్లో ఎంపీలు ప్రశ్నించగా ఆ శాఖ మంత్రి స్మృతీ ఇరానీ సమాధానమిస్తూ.. 'సమస్య పరిష్కారానికి నిపుణుల బృందాన్ని ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) నియమించింది. కొవ్వులు, చక్కెర, ఉప్పు గల ఆహార పదార్థాలను పిల్లల ఛానళ్లల్లో ప్రసారం చేయకుండా నిషేధించాలని ఆ బృందం నివేదికలో సూచించింది.


నిబంధనలు పాటించని పార్టీలపై చర్యలేవి?

న్యూఢిల్లీ: నిధుల సేకరణలో నిబంధనలను పాటించని రాజకీయ పార్టీలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని ఢిల్లీ హైకోర్టు ఎన్నికల సంఘాన్ని(ఈసీ) ప్రశ్నించింది. నిబంధనల ప్రకారం పార్టీలు ఆదాయానికి సంబంధించి వివరాలను అందజేయాల్సి ఉన్నా అమలు కావటం లేదని ప్రజాస్వామ్య సంస్కరణల సంఘం(ఏడీఆర్) దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు బెంచ్ విచారించింది. ఏడీఆర్ తరఫు సీనియర్ న్యాయవాది అరవింద్ నిగమ్ వాదనలు వినిపిస్తూ..కేవలం చిన్న, ప్రాంతీయ రాజకీయ పార్టీలు మాత్రమే ఈసీకి ఐటీ రిటర్నులు అందజేస్తున్నాయని తెలిపారు. రాజకీయ పార్టీల ఎన్నికల ఖర్చుపై నిఘా ఉంచాలనే నిబంధనలు అమలు కావటం లేదన్నారు. దీనిపై న్యాయమూర్తులు స్పందిస్తూ...'నిబంధనలను పాటించని పార్టీలపై ఏం చర్యలు తీసుకున్నారు? ఎందుకు తాత్సారం చేస్తున్నారు? ఈ పిటిషన్ 2014 నుంచి పెండింగ్‌లో ఉంది..' అని నిలదీశారు.

3కోట్ల ఉచిత ఎల్పీజీకి రూ.4,800 కోట్లు

న్యూఢిల్లీ: బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం పేద మహిళలకోసం ప్రకటించిన 3కోట్ల అదనపు ఉచిత ఎల్పీజీ కనెక్షన్లకు రూ.4,800 కోట్లు అదనంగా ఖర్చుకానుంది. ఈ విషయాన్ని కేంద్ర పెట్రోలియం మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ గురువారం ఢిల్లీలో వెల్లడించారు. బుధవారం సాయంత్రం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశ వివరాలను మంత్రి వెల్లడిస్తూ.. 'గతంలో నిర్ణయించినట్లుగా 5కోట్ల ఎల్పీజీ కనెక్షన్లను వచ్చే ఆర్థిక సంవత్సరం పూర్తయ్యేలోపు అందజేస్తాం. ఇప్పటికే 3.36కోట్ల కనెక్షన్లను పేద మహిళలను అందజేశాం. ఇందుకోసం రూ.8వేల కోట్ల కేటాయింపులు జరిగాయి. ఇప్పుడు ఈ పథకాన్ని మరో 3కోట్లు పెంచాలన్న ప్రకటన నేపథ్యంలో అదనంగా రూ.4,800 కోట్లకు కేటాయించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది' అని పేర్కొన్నారు.

కలప.. ఉక్కు కంటే గట్టిగా..!



వాషింగ్టన్: ఉక్కు కంటే దృఢంగా, ఎక్కువ మన్నిక కలిగిన కలపను తయారుచేసే కొత్త విధానాన్ని అమెరికా శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఈ విధానంలో తయారుచేసిన కలప, సాధారణ కలప కంటే 12 రెట్లు దృఢంగా, పది రెట్లు ఎక్కువ మన్నికతో ఉంటుందని యూనివర్సిటీ ఆఫ్ మేరీల్యాండ్ శాస్త్రవేత్తలు తెలిపారు. ఉక్కు, టైటానియం మిశ్రమ లోహాలు, కార్బన్ ఫైబర్‌కు ప్రత్యామ్నాయంగా దీన్ని వాడవచ్చని వెల్లడించారు. కార్లు, విమానాలు, ఇళ్ల నిర్మాణంలోనూ వాడుకోవచ్చు. పరిశోధనలో భాగంగా తొలుత కలపను సోడియం హైడ్రాక్సైడ్, సోడియం సల్ఫైట్ కలిపిన ద్రావణంలో 7 గంటల పాటు ఉడికించారు. ఈ ప్రక్రియతో వృక్ష కణజాలంలోని సెల్యులోజ్‌పై ఎలాంటి ప్రభావం పడకపోగా, లిగ్నిన్ వంటి పాలిమర్లు వేరుపడ్డాయి. దీంతో కణజాలంలో ఖాళీస్థలం ఏర్పడిందన్నారు. అనంతరం ఈ కలపను 100 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో ఒకరోజు పాటు బలమైన ఒత్తిడితో నొక్కిపెట్టామన్నారు. దీంతో కలపలోని సెల్యులోజ్ కణజాలాలు ఒకదానితో ఒకటి కలిసిపోయి దృఢమైన కలప తయారయిందన్నారు.

ప్రణబ్ దగ్గర నేర్చుకోండి!

కాంగ్రెస్ చీఫ్ రాహుల్‌కు జైట్లీ సూచన

దేశ భద్రతకు సంబంధించిన విషయాలు వెల్లడించం • బడ్జెట్‌పై ఉభయ సభల్లో చర్చ



లోక్‌సభలో బడ్జెట్‌పై చర్చలో మాట్లాడుతున్న అరుణ్ జైట్లీ

న్యూఢిల్లీ: రాఫెల్ యుద్ధ విమానాల ఒప్పందం వివరాలను బహిర్గతం చేయాలంటూ కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తిప్పికొట్టారు. రాఫెల్ యుద్ధ విమానం, దీంతోపాటు కొనుగోలు చేసిన యుద్ధ సామగ్రి వివరాలన్నీ దేశ భద్రతకు సంబంధించిన అంశాలని దీనిపై వివరాలు కోరటం హాస్యాస్పదమన్నారు. 'మాజీ రక్షణ మంత్రి ప్రణబ్ ముఖర్జీ దగ్గర జాతీయ భద్రతపై పాఠాలు నేర్చుకోండ'ని కాంగ్రెస్ చీఫ్ రాహుల్‌కి సూచించారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా విపక్షాలు రాఫెల్ వివరాలు వెల్లడించాలని పట్టుబట్టడంపై జైట్లీ ఈ విధంగా స్పందించారు. 'మీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అవినీతికి పాల్పడింది. దేశ భద్రతకు సంబంధించిన అంశాలపై మీరు రాజీపడ్డారు. ఇప్పుడు ఎన్డీయే ప్రభుత్వంపైనా అవినీతి బురద చల్లాలని విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. నాలుగేళ్లుగా మోదీ స్వచ్ఛమైన ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. అందుకే ఓ సంక్షోభాన్ని, ఓ వివాదాన్ని సృష్టించాలని ప్రయత్నిస్తున్నారు. అందుకే రాఫెల్ వివరాలు వెల్లడి చేయాలని వివాదం చేస్తున్నారు' అని జైట్లీ రాజ్యసభలో పేర్కొన్నారు. 36 రాఫెల్ యుద్ధ విమానాలను ఫ్రాన్స్ ప్రభుత్వం నుంచి భారత్ కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే.

రామాయణ వ్యాఖ్యలపై దుమారం

కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరిపై ప్రధాని మోదీ చేసిన 'రామాయణ' వ్యాఖ్యలపై గురువారం రాజ్యసభలో దుమారం రేగింది. అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన మోదీ క్షమాపణలు చెప్పాలంటూ కాంగ్రెస్ మహిళా ఎంపీలు డిమాండ్ చేశారు. దీనికి తోడు మోదీ తనపై వ్యంగ్యంగా మాట్లాడుతున్న వీడియో క్లిప్‌ను హోం శాఖ సహాయ మంత్రి కిరణ్ రిజిజు ట్వీట్ చేయటంపై రేణుక మండిపడ్డారు. ప్రధాని హోదాకు తగ్గట్లుగా మోదీ వ్యవహరించలేదని.. ఆయన క్షమాపణ చెప్పాలని మహిళా కాంగ్రెస్ నేత సుష్మితాదేవ్ డిమాండ్ చేశారు. రేణుక వ్యాఖ్యలపై దుమారం కారణంగా రాజ్యసభ శుక్రవారానికి వాయిదా పడింది.

మోసపూరిత ఆర్థిక విధానంతో..

అంతకుముందు, రాజ్యసభలో చర్చ సందర్భంగా కాంగ్రెస్ నేత చిదంబరం కేంద్రం తీరుపై నిప్పులు చెరిగారు. ప్రభుత్వం వ్యవసాయ సంక్షోభాన్ని పట్టించుకోవటం లేదని, ఉపాధికల్పనను పూర్తిగా విస్మరించిందని.. ఆరోపించారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానం పూర్తిగా మోసపూరితమని.. దేశంలో ఆర్థిక క్రమశిక్షణ లేకుండా పోతోందని తీవ్రంగా దుయ్యబట్టారు. తాజా బడ్జెట్ ద్వారా వేతన జీవులు, వయోవృద్ధులకు రూ.12వేల కోట్ల లబ్ధి చేకూరిందని ఆర్థిక మంత్రి జైట్లీ లోక్‌సభలో వెల్లడించారు. దీర్ఘకాల మూలధన రాబడి పన్ను పెంచటాన్ని సమర్థించుకున్న జైట్లీ.. దీని కారణంగా తలెత్తే సమస్యలను ఎలా ఎదుర్కొవాలో ప్రభుత్వానికి తెలుసన్నారు.

ప్రణబ్, ఆంటోనీలూ చెప్పలేదు

రూ.58వేల కోట్ల ఒప్పందాన్ని బహిర్గతం చేసేందుకు విముఖత చూపిన జైట్లీ.. యూపీఏ ప్రభుత్వ హయాంలో అప్పటి రక్షణ మంత్రులు ప్రణబ్ ముఖర్జీ, ఏకే ఆంటోనీలు 15 సందర్భాల్లో ఇలాంటి వివరాలు వెల్లడించలేదని గుర్తుచేశారు. అప్పుడు దేశ భద్రత, జాతి ప్రయోజనాలను వారు కారణంగా చూపించారని సభకు వెల్లడించారు. 'ధరలు, ఇతర వివరాలను బయటపెట్టడం ద్వారా.. సదరు హెలికాప్టర్/ఆయుధానికి సంబంధించిన సాంకేతిక వివరాలన్నీ బయటకొస్తాయి. అది మన రక్షణ వ్యవస్థ సామర్థ్యాన్నీ వెల్లడిస్తుంది. ఇది శత్రువుకు తెలియజేయటానికి రక్షణ వ్యవస్థ, ప్రభుత్వం ఒప్పుకోవు' అని జైట్లీ వెల్లడించారు. అయితే జాతి భద్రతకు సంబంధించిన వివరాలను తాము అడగటం లేదని.. పారదర్శకతను మాత్రమే కోరుతున్నామని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ చెప్పారు.

బంగ్లా మాజీ ప్రధాని జియాకు జైలు

అవినీతి కేసులో ఢాకా కోర్టు తీర్పు



ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, ప్రతిపక్ష నాయకురాలు ఖలీదా జియా(72)కు ఓ అవినీతి కేసులో ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష పడింది. దీంతో డిసెంబర్‌లో జరిగే సాధారణ ఎన్నికల్లో పోటీచేయకుండా ఆమె అనర్హతకు గురయ్యే వీలుంది. తన భర్త, మాజీ అధ్యక్షుడు జియావుర్ రెహ్మాన్ జ్ఞాపకార్థం ఏర్పాటుచేసిన అనాథ శరణాలయానికి సేకరించిన విదేశీ నిధులను దుర్వినియోగం చేసిన కేసులో ఢాకా ప్రత్యేక కోర్టు గురువారం ఈ తీర్పు వెలువరించింది. జియా కొడుకు, బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్‌పీ) సీనియర్ వైస్ ప్రెసిడెంట్ తారిక్‌నూ దోషిగా తేల్చిన కోర్టు..ఆయనతో పాటు మరో నలుగురికి 10 ఏళ్ల చొప్పున జైలు శిక్ష విధించింది. ప్రస్తుతం తారిక్ లండన్‌లో అజ్ఞాతంలో ఉన్నారు. దోషులందరికి ఈ కేసులో సమాన పాత్ర ఉన్నా జియా వయసు, సమాజంలో ఉన్న గౌరవం రీత్యా ఆమెకు కాస్త తక్కువ శిక్ష విధిస్తున్నట్లు జడ్జి మహ్మద్ అక్తారుజ్జమాన్ తన తీర్పు ప్రతిలో పేర్కొన్నారు. తాజా తీర్పును హైకోర్టులో సవాల్ చేస్తామని జియా తరఫు లాయర్ వెల్లడించారు. తీర్పు రాగానే జియా మద్దతుదారులు, అభిమానులు ఆందోళనలకు దిగి ఢాకాలో పలుచోట్ల హింసకు పాల్పడ్డారు. కోర్టు బయట గుమిగూడిన ఆందోళనకారులను చెదరగొట్టడం పోలీసులకు కష్టమైంది. భారీ భద్రత నడుమ జియాను కేంద్ర కారాగారానికి తరలించారు. ప్రతిపక్ష బీఎన్‌పీకి అధినేత్రిగా వ్యవహరిస్తున్న ఆమె.. మూడుసార్లు ప్రధానిగా పనిచేశారు. కాగా, అంతకు ముందు జియా తన మద్దతుదారులు, బంధువులకు ధైర్యవచనాలు చెప్పి కోర్టుకు బయల్దేరారు. 'మీరేం భయపడకండి. ధైర్యంగా ఉండండి. నేను క్షేమంగా తిరిగొస్తా' అని ఆమె అన్నారు. జియా గతంలో చేసిన పాపాలకు ఫలితంగానే ఈ శిక్ష పడిందని ఆమె ప్రధాన ప్రత్యర్థి, బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా అన్నారు.

పాక్, చైనాలకు మాల్దీవుల దూతలు

సంక్షోభ పరిష్కారానికి పంపిన ఆ దేశాధ్యక్షుడు యమీన్



మాలె: మాల్దీవుల అంతర్గత సంక్షోభ పరిష్కారానికి అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్ పాకిస్తాన్, చైనా, సౌదీ అరేబియాలకు ప్రత్యేక దూతలను పంపారు. ప్రధాని మోదీ, విదేశాంగ మంత్రి సుష్మా తీరికలేని షెడ్యూల్ కారణంగా తమ ప్రతినిధి ఇక్కడికి రావడం లేదని ఢిల్లీలో మాల్దీవుల రాయబారి వెల్లడించారు. తమ దేశంలోని పరిస్థితులను వివరించేందుకు మాల్దీవుల ఆర్థికాభివృద్ధి మంత్రి మహ్మద్ సయీద్ చైనాకు, విదేశాంగ మంత్రి మహ్మద్ ఆసిమ్ పాకిస్తాన్‌కు, వ్యవసాయ మంత్రి మహ్మద్ షైనీ సౌదీ అరేబియాకు వెళ్లారు. ఢిల్లీలో మాల్దీవుల రాయబారి అహ్మద్ మహ్మద్ గురువారం స్పందిస్తూ.. తమ ప్రతినిధి పర్యటనకు తొలుత భారత్‌నే ఎంచుకున్నామని కానీ, ఈ వారంలో మోదీ, విదేశాంగ మంత్రి సుష్మాలు విదేశీ పర్యటనల్లో బిజీగా ఉండబోతుండటం వల్లే విరమించుకున్నామని తెలిపారు. మాల్దీవుల్లో ప్రజాస్వామ్యంపై భారత్ వెలిబుచ్చిన ఆందోళనలపై ఆ దేశం ఎలాంటి చర్యలు తీసుకోలేదని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఎవరైనా ప్రతినిధిని పంపే ముందు ప్రత్యేక ప్రొటోకాల్ ఉంటుందని, తమ ప్రతినిధి ఎందుకు రాబోతున్నారో భారత్‌కు మాల్దీవులు తెలియజేయలేదని వెల్లడించాయి.

ఇప్పుడు నా బాస్ రాహుల్

సీపీపీ భేటీలో సోనియా



న్యూఢిల్లీ: ప్రస్తుతం తన బాస్ రాహుల్ గాంధీయే అని పార్టీ శ్రేణులకు సోనియా గాంధీ స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ(సీపీపీ) సమావేశంలో ఆమె ప్రసంగిస్తూ.. దేశంలో మార్పునకు సమయం దగ్గరపడిందని, వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు సిద్ధాంతపరంగా కలిసి వచ్చే పార్టీలతో పని చేస్తామని ఆమె చెప్పారు. సీపీపీ చైర్‌పర్సన్ హోదాలో సోనియా మాట్లాడారు. స్వార్థ రాజకీయాల కోసం సమాజాన్ని చీల్చేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ప్రజలకు బీజేపీపై ఉన్న భ్రమలు తొలగిపోయాయని, ఈ అసంతృప్తిని కాంగ్రెస్ పార్టీ అనుకూలంగా మలుచుకోవాలని హితబోధ చేశారు. 'గతంలో మనం కింద పడ్డా కోలుకుని సత్తా చూపించాం. మరోసారి అందుకు సిద్ధపడాలి. మనం కొత్త అధ్యక్షుడిని ఎన్నుకున్నాం. ఇప్పుడు నా బాస్ కూడా ఆయనే. అంకితభావం, ఉత్సాహంతో కలిసి పనిచేయాలి' అన్నారు.

త్రిపుర ప్రజల్ని బానిసలు చేశారు

ఎన్నికల ప్రచారం సందర్భంగా మాణిక్ సర్కార్ ప్రభుత్వంపై మోదీ నిప్పులు



సోనామురా/కైలాషహర్: త్రిపురలో అధికార కమ్యూనిస్టు పార్టీ ప్రజల జీవితాలను బానిస బతుకులు చేసిందని, ఆ పార్టీని గద్దె దించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. త్వరలో ఎన్నికలు జరగనున్న ఆ రాష్ట్రంలో మోదీ గురువారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. మాణిక్ సర్కార్‌పై దుమ్మెత్తిపోసిన మోదీ..బీజేపీ అధికారంలోకి వస్తే త్రిపురలో 'హీరా'(హెచ్-హైవేలు, ఐ-ఇంటర్నెట్, ఆర్-రోడ్లు, ఏ-ఎయిర్‌వేస్) అభివృద్ధి చెందుతుందని అన్నారు. 25 ఏళ్లుగా నిరంతరాయంగా పాలిస్తున్న కమ్యూనిస్టులు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, రేషన్ కార్డు లాంటి చిన్నాచితకా అవసరాలకూ ఆ పార్టీ తలుపులు తట్టాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఎవరైనా హత్యకు గురైతే ఆ పార్టీ నుంచి అనుమతి రానిదే ఎఫ్ఐఆర్ నమోదుచేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కమ్యూనిస్టులు ప్రతి దానికీ ప్రజలు తమపైనే ఆధారపడేలా చేసారని, బానిసత్వానికి ఇది కొత్త రూపమని అభివర్ణించారు. లెఫ్ట్ పాలనలో త్రిపురలో అభివృద్ధి ఇసుమంతైనా కనిపించడం లేదని ఆరోపించారు. మేమొస్తే ప్రభుత్వ ఉద్యోగులకు ఏడో వేతన సంఘం సిఫార్సులను అమలుచేస్తామన్నారు.

స్థల వివాదంగా చూస్తాం

రామ జన్మభూమి- బాబ్రీ మసీదు కేసుపై సుప్రీం

డాక్యుమెంట్లను ఇంగ్లిష్‌లో సమర్పించాలని ఆదేశం

న్యూఢిల్లీ: రాజకీయంగా సున్నితమైన రామ జన్మభూమి- బాబ్రీ మసీదు వివాదం కేసును పూర్తిగా స్థల వివాదంగానే పరిగణిస్తామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసులో రోజువారీ విచారణ జరపాలన్న విజ్ఞప్తిని అత్యున్నత ధర్మాసనం తిరస్కరిస్తూ సాధారణ పద్ధతిలోనే విచారిస్తామంది. 700 మందికిపైగా పేద కక్షిదారులు(ఇతర కేసుల్లో) న్యాయం కోసం వేచిఉన్నారని, వారి కేసుల్ని కూడా విచారించాల్సి ఉందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. ఈ కేసులో కక్షిదారులు కోర్టు ముందుంచిన డాక్యుమెంట్లు, సాక్ష్యాలు, ప్రాంతీయ భాషల పుస్తకాల్లోని సారాంశాన్ని ఇంగ్లిష్‌కి అనువదించి సమర్పించాలని ఆదేశించింది. విచారణను మార్చి 14కు ధర్మాసనం



సుప్రీంకోర్టు బయట పిటిషనర్లు, లాయర్లు

వాయిదా వేసింది. అలహాబాద్ హైకోర్టులో కేసు విచారణ రికార్డులకు సంబంధించిన వీడియో క్యాసెట్ల కాపీలను కక్షిదారులకు అందచేయాలని రిజిస్ట్రార్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. 'రామ్ లల్లా విరాజ్‌మన్' తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ వాదిస్తూ.. కేసులోని అవతలి వైపు కక్షిదారులు తమ వాదనల సారాంశాన్ని కోర్టుకు తెలపడంతో పాటు, తమతో పరస్పర మార్పిడి చేసుకోవాలని సూచించారు. దీనికి ప్రతివాది తరఫు న్యాయవాది రాజీవ్ ధావన్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. తనకు నచ్చిన విధంగా వాదిస్తానని, తాను దేని ప్రామాణికంగా వాదించాలన్నది వారు ఆదేశించలేరని పేర్కొన్నారు. హిందూ సంస్థల తరఫున సీనియర్ న్యాయవాది కె.పరాశరన్ వాదిస్తూ.. 'ఈ సంఘటన త్రేతాయుగం నాటిది. 30 వేల ఏళ్ల నాటికి చెందిన ఏ సాక్ష్యాల్ని అప్పీలుదారులు తేగలరు? అందువల్ల మమ్మల్ని రికార్డుల్లోని సాక్ష్యాల వరకే పరిమితం చేయాలి' అని విజ్ఞప్తిచేశారు. అయోధ్యలోని వివాదాస్పద భూమిని నిర్మోహి అఖారా, రామ లల్లా, సున్నీ వక్ఫ్ బోర్డులకు సమానంగా పంచుతూ అలహాబాద్ హైకోర్టు గతంలోతీర్పునిచ్చింది.

ముస్లిం నేతలతో రవిశంకర్ చర్చలు

మరోవైపు అయోధ్య వివాద పరిష్కారం కోసం ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు శ్రీ శ్రీ రవిశంకర్ గురువారం ముస్లిం నేతలతో చర్చించారు. సున్నీ వక్ఫ్ బోర్డు, ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ప్రతినిధులతో పాటు ఇతరులు రవి శంకర్‌ను కలిసి అయోధ్య వివాదంలో కోర్టు వెలుపల రాజీకి మద్దతు తెలిపారని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఒక ప్రకటనలో పేర్కొంది. 'వేరే ప్రాంతానికి మసీదును తరలించే ప్రతిపాదనకు వారు మద్దతు ప్రకటించారు' అని వెల్లడించింది.



పొగమంచులోనూ రైళ్లకు మరింత వేగం

న్యూఢిల్లీ: పొగమంచు వంటి అననుకూల వాతావరణ పరిస్థితుల్లోనూ రైళ్లను గంటకు 75 కిలోమీటర్ల వేగంతో నడపాలని రైల్వే బోర్డు నిర్ణయించింది. పొగమంచు వంటి అవాంతరాలు ఎదురైన సందర్భాల్లో ప్రస్తుతం ఉన్న 60 కిలోమీటర్లకు బదులు 75 కి.మీ వరకు వేగంతో రైళ్లను నడిపేలా డ్రైవర్లకు వెసులుబాటు కల్పిస్తున్నట్లు రైల్వే బోర్డు అన్ని జోన్ల అధికారులకు లేఖలు రాసింది. ఇలాంటి పరిస్థితుల్లో ట్రాక్ స్పష్టంగా కనిపించేందుకు అవసరమైన పరికరాలను వాడుకోవాలని సూచించింది. ఆర్థికంగా లాభసాటి కాని స్టేషన్లలో రైళ్లను ఆపవద్దని, మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్ పాయింట్లను, సమయాన్ని తగ్గించటం వంటి చర్యలతో వేగం పెంచుకోవాలని జోన్లకు తెలిపింది.

జీఆర్ఎస్ఈలో జీఎంఈ/టీఎంఈ కోర్స్

కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్ (జీఆర్ఎస్ఈ) లిమిటెడ్.. ఏడాది ప్రి-సీ ట్రైనింగ్ కోర్స్ (టీఎంఈ/జీఎంఈ ట్రైనింగ్) మార్చి-2018 సెషన్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈ కోర్సులో 50 సీట్లు ఉన్నాయి. మెకానికల్/మెకానికల్ అండ్ ఆటోమేషన్/నేవల్ ఆర్కిటెక్చర్‌లో ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు. వయసు: కోర్సు ప్రారంభం నాటికి 28 ఏళ్లు మించకూడదు. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేరడానికి చివరి తేదీ ఫిబ్రవరి 12, 2018. దరఖాస్తు రుసుం రూ.1,000 (ఎస్సీ/ఎస్టీ కేటగిరీలకు ఫీజు లేదు). రిజర్వేషన్లు తదితర పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.grse.nic.in



సోషల్ స్టడీస్ (తె.మీ.)

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబర్-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

కాంపిటీటివ్ కౌన్సెలింగ్

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) అసిస్టెంట్స్ పరీక్షలో రీజనింగ్ నుంచి ఎలాంటి ప్రశ్నలు వస్తాయి? - ఎం.విజయ్, హైదరాబాద్



బ్యాంక్ పరీక్షల్లో రీజనింగ్‌కు అధిక ప్రాముఖ్యం ఉంది. అభ్యర్థి ఆలోచన సామర్థ్యాన్ని పరీక్షించే విధంగా ప్రశ్నలు అడుగుతారు. గ్రూప్ ప్రశ్నలను రీజనింగ్ నుంచి ఎక్కువగా ఇస్తారు. ఇందులో ముఖ్యంగా సీటింగ్ అరేంజ్‌మెంట్, లాజికల్ స్టేట్‌మెంట్స్ అండ్ కన్‌క్లూజన్స్, బ్లడ్ రిలేషన్స్, ఇన్ ఈక్వాలిటీస్, డేటా సఫీషియన్సీ, అనలిటికల్ రీజనింగ్, ఆల్ఫాబెట్స్‌కు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి. స్టేట్‌మెంట్స్ అండ్ కన్‌క్లూజన్స్ నుంచి ఐదు మార్కులకు ప్రశ్నలు రావొచ్చు. వీటికి సమాధానం గుర్తించాలంటే అభ్యర్థి కచ్చితమైన కన్‌క్లూజన్లు, పాజిబిలిటీల మధ్య వ్యత్యాసాలను గమనించాలి. సమాధానంలో ఏ మాత్రం తేడా అనిపించినా అది పాజిబిలిటీగాను, కచ్చితమైన సమాధానం వస్తే అది కన్‌క్లూజన్‌గానూ పరిగణించాలి. బ్లడ్ రిలేషన్స్ నుంచి ఎక్కువ మార్కులు పొందడానికి అవకాశం ఉంటుంది. వీటిపై రెండు నుంచి ఐదు మార్కులకు ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. సీటింగ్ అరేంజ్‌మెంట్ ప్రశ్నల్లో.. వ్యక్తులందరూ ఒకే వైపు ముఖం ఉండేవిధంగా కూర్చొని ఉన్నవి; కొంతమంది వెలుపలి వైపు, మరికొంతమంది లోపలి వైపు కూర్చొని ఉండే ప్రశ్నలు ఇలా రకరకాలుగా అడుగుతున్నారు. వీటిని జాగ్రత్తగా చేయాలి. వీటిని సాధించడంలో చిన్న పొరపాటు చేసినా, దానికి సంబంధించిన ప్రశ్నలన్నింటికీ సమాధానాలు తప్పుగా గుర్తించే ప్రమాదం ఉంటుంది. కాబట్టి ఈ విధమైన ప్రశ్నలను ఎక్కువగా సాధన చేయాలి. ఇన్‌ఈక్వాలిటీస్ నుంచి ఐదు మార్కులకు ప్రశ్నలు రావచ్చు. నంబర్ సిరీస్ నుంచి గతంతో పోలిస్తే మరింత క్లిష్టమైన ప్రశ్నలు అడుగుతున్నారు. ఈ విభాగం నుంచి ఐదు మార్కులకు ప్రశ్నలు ఇస్తారు. నాన్ వెర్బల్‌కు సంబంధించిన ప్రశ్నలను అడగడం లేదు. అయితే వీటిపై కొంతైనా అవగాహన ఉండటం ప్రయోజనకరం.



ఎడ్యుకేషన్ ట్రెండ్స్

ఉపాధ్యాయ విద్యకు సరికొత్త దారి.. ఇంటిగ్రేటెడ్ బీఈడీ..

డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ (డీఐఎస్ఈ) నివేదిక ప్రకారం ప్రస్తుతం దేశవ్యాప్తంగా పాఠశాలల్లో సుమారు 11 లక్షల మంది ఉపాధ్యాయుల కొరత ఉంది. అలాగే గుర్తింపు పొందిన ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో దాదాపు 20 శాతం.. అంటే సుమారు 13 లక్షల మంది ఎలాంటి ఉపాధ్యాయ శిక్షణ అర్హతా లేకుండానే బోధిస్తున్నారు. యునెస్కో.. భారత్‌లో పాఠశాల స్థాయిలో అర్హులైన ఉపాధ్యాయుల సంఖ్య 60 శాతం కూడా లేదని పేర్కొంది. ఇలాంటి పరిస్థితిలో ఇంటిగ్రేటెడ్ బీఈడీ ద్వారా ప్రయోజనం చేకూరుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఆరేళ్ల ముందు నుంచే అడుగులు

వాస్తవానికి నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ దిశగా ఆరేళ్ల కిందటే అడుగులు పడ్డాయి. 2012లో ఏర్పాటైన జస్టిస్ వర్మ కమిటీ పాఠశాలల్లో టీచర్ల కొరత తీర్చడం, ఉపాధ్యాయ విద్య కోర్సుల్లో మార్పుల అవసరాన్ని పేర్కొంటూ కొన్ని సిఫారసులు చేసింది. ఈ మేరకు నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ) 2014లో కొన్ని ప్రతిపాదనలు చేసింది. దీని ప్రకారం ప్రస్తుతం ఎన్‌సీటీఈ పరిధిలోని రీజనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఎడ్యుకేషన్ (ఆర్ఐఈ) క్యాంపస్‌ల్లో నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోర్సు అమలవుతోంది. దీన్ని 2015-16 విద్యా సంవత్సరంలో ప్రారంభించారు. మొత్తం ఎనిమిది సెమిస్టర్లుగా ఉండే ఈ కోర్సులో తొలి సెమిస్టర్ నుంచే ఉపాధ్యాయ విద్య అంశాలతోపాటు విద్యార్థులు తాము ఎంపిక చేసుకున్న బ్యాచిలర్ డిగ్రీ కోర్సు (బీఏ/బీఎస్సీ) అంశాలూ బోధిస్తున్నారు. కేంద్రం తాజాగా ప్రతిపాదించిన నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోర్సు స్వరూపమూ ఇలాగే ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు.



నాలుగేళ్లు.. రెండు సర్టిఫికెట్లు

ప్రస్తుతం ఇంటర్మీడియెట్ అర్హతతో డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్ (డీఈడీ)లో ప్రవేశించే అవకాశం లభిస్తోంది. తర్వాత బీఈడీ చదవాలంటే.. డిగ్రీ తర్వాత మరో రెండేళ్లు వెచ్చించాలి. కానీ, కొత్త విధానంలో వారు నేరుగా బీఈడీ కోర్సులో అడుగుపెట్టొచ్చు. ఈ ఇంటిగ్రేటెడ్ బీఈడీని బీఏ బీఈడీ, బీఎస్సీ బీఈడీగా అందించే అవకాశముంది. మొత్తం నాలుగేళ్ల వ్యవధిలో అభ్యర్థులు తాము ఎంచుకున్న కోర్సు (బీఏ బీఈడీ/బీఎస్సీ బీఈడీ) పూర్తిచేశాక రెగ్యులర్ బ్యాచిలర్ డిగ్రీతోపాటు బీఈడీ సర్టిఫికెట్ కూడా చేతికి అందుతుంది. ఇలా నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోర్సు ద్వారా రెండు సర్టిఫికెట్లు పొందొచ్చు.

2019-20 నుంచి అమల్లోకి!

ప్రతిపాదిత ఇంటిగ్రేటెడ్ బీఈడీని 2019 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించే అవకాశముంది. 2018-19 బడ్జెట్‌లో దీని గురించి ప్రస్తావించినప్పటికీ.. క్షేత్రస్థాయిలో అమలు సాధ్యాసాధ్యాలు, కార్యాచరణ వంటి వాటిని దృష్టిలో పెట్టుకుంటే పూర్తిస్థాయి స్పష్టత రావడానికి కనీసం ఆర్నెల్లు పడుతుంది. కాబట్టి వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ కోర్సు అందుబాటులోకి రావొచ్చు. 2019 నాటికి అన్-ట్రైన్డ్ టీచర్లందరూ ఉపాధ్యాయ విద్య అర్హత పొందాలనే నిబంధనను సడలిస్తూ ఆర్‌టీఈలో మార్పు తెస్తామని ప్రకటించడాన్ని దీనికి నిదర్శనంగా పేర్కొంటున్నారు.

ప్రవేశం ఎలా?

వాస్తవానికి తాజా ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోర్సు లక్షల మందిని లక్ష్యంగా చేసుకొని ప్రతిపాదించింది. ప్రధానంగా అన్-ట్రైన్డ్ టీచర్ల సంఖ్యను ప్రస్తావిస్తూ ప్రవేశపెట్టిన ప్రోగ్రామ్. కాబట్టి జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్ష నిర్వహించి.. నిర్దేశిత ఉత్తీర్ణత శాతం పొందిన వారికే ఈ కోర్సులో ప్రవేశం కల్పిస్తారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు రాష్ట్రాల స్థాయిలోనే ప్రవేశ పరీక్ష నిర్వహించే అవకాశమూ ఉందంటున్నారు. అలాగే ఇప్పటికే పాఠశాలల్లో పనిచేస్తున్న అన్-ట్రైన్డ్ టీచర్లను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రోగ్రామ్‌ను ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్ విధానంలోనూ అందించే వీలుందని పలువురు పేర్కొంటున్నారు. ప్రాథమిక స్థాయిలోని అన్-ట్రైన్డ్ టీచర్ల కోసం నేషనల్ ఓపెన్ స్కూల్ సొసైటీ నేతృత్వంలో గతేడాది ప్రవేశపెట్టిన డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కోర్సును దీనికి నిదర్శనంగా చెబుతున్నారు.

నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ ముఖ్యాంశాలు

- 13 లక్షల మందికి పైగా అన్-ట్రైన్డ్ టీచర్లకు ప్రయోజనం.
- ఇంటర్మీడియెట్‌తోనే బీఈడీలో ప్రవేశించే అవకాశం.
- సంప్రదాయ విధానంతో పోల్చితే ఏడాది సమయం ఆదా.
- కోర్సు పూర్తిచేశాక రెగ్యులర్ బ్యాచిలర్ డిగ్రీ, బీఈడీ రెండు సర్టిఫికెట్లూ అందడం.
- జాతీయ లేదా రాష్ట్ర స్థాయిలో ప్రవేశపరీక్షల నిర్వహణ ద్వారా అర్హుల ఎంపిక.
- 2019-20 నుంచి ప్రోగ్రామ్ ప్రారంభమయ్యే అవకాశం.

25 శాతం క్షేత్రస్థాయి శిక్షణ

ఏ విధానంలో (రెగ్యులర్/ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్) ఈ కోర్సును ప్రవేశపెట్టినా.. మొత్తం గ్రేడ్స్, కోర్సుల పరంగా 25 శాతం క్షేత్రస్థాయి నైపుణ్యాలు పొందేలా అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. దీనికోసం ప్రతి రాష్ట్రంలోనూ ప్రత్యేకంగా నోడల్ సెంటర్లు ఏర్పాటు చేసి, కోర్సు పర్యవేక్షణను వాటికి అప్పగించే అవకాశం ఉంది. ఈ మొత్తం ప్రోగ్రామ్‌ను ఎన్‌సీటీఈ పర్యవేక్షణలోనే కొనసాగించనున్నారు. ఇప్పటికే ఆర్ఐఈలలో ఈ కోర్సు విజయవంతంగా కొనసాగుతుండడం.. ఉపాధ్యాయ విద్య పరంగా జాతీయ స్థాయిలో నియంత్రణ సంస్థగా ఎన్‌సీటీఈ వ్యవహరిస్తుండటం దీనికి కారణం కావొచ్చు. ఒకవేళ ఎన్ఐఓఎస్ ఆధ్వర్యంలో ఓడీఎల్ విధానంలో అందించినా.. ఎన్‌సీటీఈ పర్యవేక్షణే ఉండటం ఖాయమనే అభిప్రాయం బలంగా వినిపిస్తోంది.

విద్యార్థులకు కలిసొచ్చే అంశం

"ఉపాధ్యాయ వృత్తిని కెరీర్‌గా ఎంపిక చేసుకునే యువ ఔత్సాహికులకు ఈ నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ ఎంతో కలిసొచ్చే అంశంగా పేర్కొనొచ్చు. అలాగే అన్-ట్రైన్డ్ ఇన్ సర్వీస్ టీచర్లు కూడా ఉపాధ్యాయ విద్య అర్హత సొంతం చేసుకునే వీలుంది. పర్యవేక్షణ పరంగా పకడ్బందీగా వ్యవహరించేలా చర్యలు తీసుకోవాలి. అప్పుడే లక్ష్యం నెరవేరుతుంది.

- ప్రొఫెసర్ సందీప్ పొన్నాల, మెంబర్, ఎన్‌సీక్యూఎఫ్‌డబ్ల్యూ.

సద్వినియోగం చేసుకుంటే చక్కటి భవిష్యత్తు

"ప్రస్తుతం ప్రతిపాదించిన కోర్సును సద్వినియోగం చేసుకుంటే చక్కటి భవిష్యత్తు సొంతమవుతుంది. బ్యాచిలర్ డిగ్రీ తర్వాత రెండేళ్ల వ్యవధి గల బీఈడీని పరిగణనలోకి తీసుకుంటే.. నాలుగేళ్లలోనే ఈ కోర్సును పూర్తి చేసుకుని పట్టా అందుకుంటే ఉద్యోగాన్వేషణలో ఏడాది సమయం కలిసొచ్చే వీలుంది.

- ప్రొఫెసర్ టి.కుమారస్వామి, ఐఏఎస్ఈ ప్రిన్సిపల్, ఎస్వీయూ.

తొలి అండర్-19 క్రికెట్ ప్రపంచకప్ విజేత?

అండర్-19 ప్రపంచకప్

అండర్-19 క్రికెట్ ప్రపంచకప్‌ను తొలిసారి 1988లో నిర్వహించారు. ఆ తర్వాత పదేళ్లపాటు టోర్నీని నిర్వహించలేదు. రెండో ప్రపంచకప్ 1998లో జరిగింది. అప్పటి నుంచి రెండేళ్లకోసారి ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు.



మొత్తం 16 జట్లు

12వ అండర్-19 క్రికెట్ ప్రపంచకప్ టోర్నీ 2018, జనవరి 13 నుంచి ఫిబ్రవరి 3 వరకు న్యూజిలాండ్‌లో జరిగింది. ఇందులో మొత్తం 16 జట్లు పాల్గొన్నాయి. ఫిబ్రవరి 3న మౌంట్ మౌంగనుయ్‌లో భారత్, ఆస్ట్రేలియా మధ్య ఫైనల్ జరిగింది. ఇందులో భారత్ ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 47.2 ఓవర్లలో 216 పరుగులు చేసింది. భారత్ రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఫైనల్లో భారత ఓపెనర్ మన్‌జోత్ కల్రా అజేయ శతకం (101 నాటౌట్) సాధించడంతో సునాయాసంగా విజయం సాధించింది. దీంతో నాలుగోసారి అండర్-19 ప్రపంచకప్‌ను గెలుచుకుని, భారత్ సరికొత్త రికార్డు సృష్టించింది.

- భారత్ తొలిసారి అండర్-19 క్రికెట్ పపంచకప్‌ను మహ్మద్ కైఫ్ సారథ్యంలో 2000లో సాధించింది. రెండోసారి 2008లో విరాట్ కోహ్లీ కెప్టెన్సీలో, మూడోసారి 2012లో ఉన్ముక్త్ చంద్ నేతృత్వంలో కప్పును అందుకుంది. 2018లో భారత్ పృథ్వీ షా నాయకత్వంలో నాలుగోసారి టైటిల్ సాధించింది.
- ఫైనల్లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు మన్‌జోత్ కల్రాకు దక్కింది. ఈ టోర్నమెంట్లో 372 పరుగులు చేసిన భారత బ్యాట్స్‌మన్ శుభ్‌మన్ గిల్‌కు 'మ్యాన్ ఆఫ్ ది సిరీస్' అవార్డు లభించింది. జగజ్జేతగా నిలిచిన భారత జట్టుకు కోచ్ రాహుల్ ద్రవిడ్.

అండర్-19 ప్రపంచకప్ విజేతలు

సంవత్సరం	ఆతిథ్యదేశం	విజేత
1988	ఆస్ట్రేలియా	ఆస్ట్రేలియా
1998	దక్షిణాఫ్రికా	ఇంగ్లండ్
2000	శ్రీలంక	భారత్
2002	న్యూజిలాండ్	ఆస్ట్రేలియా
2004	బంగ్లాదేశ్	పాకిస్తాన్
2006	శ్రీలంక	పాకిస్తాన్
2008	మలేసియా	భారత్
2010	న్యూజిలాండ్	ఆస్ట్రేలియా
2012	ఆస్ట్రేలియా	భారత్
2014	యూఏఈ	దక్షిణాఫ్రికా
2016	బంగ్లాదేశ్	వెస్టిండీస్
2018	న్యూజిలాండ్	భారత్

భారత్ తొలిసారి అండర్-19 క్రికెట్ పపంచకప్‌ను మహ్మద్ కైఫ్ సారథ్యంలో, రెండోసారి 2008లో విరాట్ కోహ్లీ కెప్టెన్సీలో సాధించింది.



జీకే అండ్ కరెంట్ అఫైర్స్

ఆస్ట్రేలియన్ ఓపెన్

2018లో తొలి టెన్నిస్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఆస్ట్రేలియన్ ఓపెన్ జనవరి 15 నుంచి 28 వరకు మెల్‌బోర్న్‌లో జరిగింది. ఇది 106వ ఆస్ట్రేలియన్ ఓపెన్ టోర్నమెంట్.



పురుషుల సింగిల్స్

స్విట్జర్లాండ్ క్రీడాకారుడు రోజర్ ఫెదరర్ 2018 ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. ఫైనల్లో మారిన్ సిలిచ్ (క్రొయేషియా)ను అయిదు సెట్లలో ఓడించి టైటిల్ సాధించాడు. ఇది ఫెదరర్‌కు ఆరో ఆస్ట్రేలియన్ ఓపెన్, 20వ గ్రాండ్‌స్లామ్ టైటిల్.

ఫెదరర్ గ్రాండ్‌స్లామ్ టైటిల్స్

- ఆస్ట్రేలియన్ ఓపెన్ (6): 2004, 2006, 2007, 2010, 2017, 2018.
- ఫ్రెంచ్ ఓపెన్ (1): 2009.
- వింబుల్డన్ (8): 2003, 2004, 2005, 2006, 2007, 2009, 2012, 2017.
- యూఎస్ ఓపెన్ (5): 2004, 2005, 2006, 2007, 2008.

అత్యధిక గ్రాండ్‌స్లామ్ (పురుషులు) విజేతలు

- రోజర్ ఫెదరర్ (స్విట్జర్లాండ్)-20
- రఫెల్ నాదల్ (స్పెయిన్)- 16
- పీట్ సంప్రాస్ (అమెరికా)- 14
- నొవాక్ జొకోవిచ్ (సెర్బియా)- 12
- రాయ్ ఎమర్సన్ (ఆస్ట్రేలియా)- 12

మహిళల సింగిల్స్

మహిళల సింగిల్స్ ఫైనల్లో డెన్మార్క్ క్రీడాకారిణి కరోలిన్ వోజ్నియాకి.. రొమేనియాకు చెందిన సిమోనా హాలెప్ పై మూడు సెట్లలో నెగ్గి, టైటిల్ సాధించింది. 11 ఏళ్ల పాటు శ్రమించిన కరోలిన్‌కు ఇది తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్. ఆమె ప్రపంచ మహిళల ర్యాంకింగ్స్‌లో మళ్లీ అగ్రస్థానానికి చేరుకుంది. గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించిన తొలి డెన్మార్క్ క్రీడాకారిణిగా కరోలిన్ గుర్తింపు సాధించింది.

పురుషుల డబుల్స్

ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల డబుల్స్ టైటిల్‌ను ఓలివర్ మరాచ్ (ఆస్ట్రియా), మేట్ పావిచ్ (క్రొయేషియా) జోడీ గెలుచుకుంది. ఫైనల్లో వీరు కొలంబియాకు చెందిన సెబాస్టియన్ కబాల్, రాబర్ట్ ఫరా జంటను ఓడించారు.

మహిళల డబుల్స్

టిమియా బబోస్ (హంగేరీ), క్రిస్టినా మ్లదెనోవిచ్ (ఫ్రాన్స్) జంట మహిళల డబుల్స్ టైటిల్‌ను గెలుచుకుంది. వీరు ఫైనల్లో రష్యన్ క్రీడాకారిణులు ఎకతెరినా మకరోవా, ఎలీనా వెస్నినా జంటను ఓడించారు.

మిక్స్‌డ్ డబుల్స్

మేట్ పావిచ్ (క్రొయేషియా), గాబ్రియేల్ దబ్రౌస్కీ (కెనడా) జంట ఆస్ట్రేలియన్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్‌ను గెలుచుకుంది. వీరు ఫైనల్లో రోహన్ బోపన్న (భారత్), టిమియా బబోస్ (హంగేరీ) జంటను ఓడించారు.

మాదిరి ప్రశ్నలు

1. 2020లో అండర్-19 ప్రపంచకప్ క్రికెట్ టోర్నీకి ఏ దేశం ఆతిథ్యమివ్వనుంది?
   1) దక్షిణాఫ్రికా 2) వెస్టిండీస్
   3) బంగ్లాదేశ్ 4) ఆస్ట్రేలియా
2. భారత్ తర్వాత అత్యధికంగా మూడుసార్లు అండర్-19 క్రికెట్ ప్రపంచకప్‌ను ఏ దేశం గెలుచుకుంది?
   1) పాకిస్తాన్ 2) ఆస్ట్రేలియా
   3) ఇంగ్లండ్ 4) దక్షిణాఫ్రికా
3. అతిచిన్న వయసులో (18 ఏళ్ల 86 రోజులు) అండర్-19 క్రికెట్ ప్రపంచకప్ గెలిచిన కెప్టెన్?
   1) విరాట్ కోహ్లీ 2) ఉన్ముక్త్ చంద్
   3) మహ్మద్ కైఫ్ 4) పృథ్వీ షా
4. కింది వారిలో ఎవరు అత్యధికంగా గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిళ్లు సాధించారు?
   1) రోజర్ ఫెదరర్ 2) సెరెనా
   3) మార్గరెట్ కోర్ట్ 4) స్టెఫీగ్రాఫ్
5. ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్ టెన్నిస్ టైటిల్‌ను అత్యధికంగా ఆరుసార్లు ఎవరు గెలుచుకున్నారు?
   1) రాయ్ ఎమర్సన్
   2) నొవాక్ జొకోవిచ్
   3) రోజర్ ఫెదరర్ 4) పై అందరూ
6. 2018, జనవరిలో హాప్‌మన్ కప్ టెన్నిస్ టోర్నమెంట్‌లో ఏ దేశం విజయం సాధించింది?
   1) ఫ్రాన్స్ 2) బెల్జియం
   3) స్విట్జర్లాండ్ 4) జర్మనీ

సమాధానాలు

1) 1; 2) 2; 3) 4; 4) 3; 5) 4; 6) 3



ఎన్.విజయేందర్‌రెడ్డి
విజయేందర్ అకాడమీ
హైదరాబాద్.

బులెటిన్ బోర్డ్

సీఐఎంఎఫ్ఆర్.. 111 'ప్రాజెక్ట్ అసిస్టెంట్' ఖాళీలు

జార్ఖండ్‌లోని ధన్‌బాద్ ఉన్న సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మైనింగ్ అండ్ ఫ్యూయల్ రీసెర్చ్ (సీఐఎంఎఫ్ఆర్) దిగ్వాడి క్యాంపస్‌లో 111 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన వెలువడింది.

- **పోస్టు-ఖాళీలు:** ప్రాజెక్ట్ అసిస్టెంట్ లెవెల్ (1)-78; ప్రాజెక్ట్ అసిస్టెంట్ లెవెల్ (2)-33. **స్టైపెండ్:** ప్రాజెక్ట్ అసిస్టెంట్ లెవెల్ (1)కు రూ.15,000; ప్రాజెక్ట్ అసిస్టెంట్ లెవెల్ (2)కు రూ.25,000.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులు, విభాగాలను బట్టి కనీసం 55 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ (జియాలజీ/అప్లైడ్ జియాలజీ/కెమిస్ట్రీ/ఫిజిక్స్)/ఆనర్స్/బీఎస్సీ (ఆనర్స్)/ఇంజనీరింగ్ డిప్లొమా (మెకానికల్/సివిల్)/మాస్టర్స్ డిగ్రీ (జియాలజీ/అప్లైడ్ జియాలజీ/కెమిస్ట్రీ/ఫిజిక్స్)/బీటెక్ (జియోసైన్స్/కంప్యూటర్ సైన్స్/మెకానికల్/ఎలక్ట్రికల్). **వయసు:** ఇంటర్వ్యూ తేదీ (పోస్టును బట్టి) నాటికి పీఏ లెవెల్ (1)కు 28 ఏళ్లు, పీఏ లెవెల్ (2)కు 30 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి. **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు హార్డ్‌కాపీకి సంబంధిత ధ్రువపత్రాలు జతచేసి వాకిన్ ఇంటర్వ్యూకు హాజరుకావాలి.
- **వాకిన్ ఇంటర్వ్యూ వేదిక:** సీఐఎంఎఫ్ఆర్ దిగ్వాడి క్యాంపస్, ధన్‌బాద్, జార్ఖండ్. **వాకిన్ ఇంటర్వ్యూ తేదీలు:** ఫిబ్రవరి 13, 14, 17, 19, 20 తేదీల్లో (పోస్టు, విభాగాన్ని బట్టి). **వెబ్‌సైట్:** cimfr.nic.in

ఐవోసీఎల్.. 56 జూనియర్ ఆపరేటర్ ఖాళీలు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్) నార్తర్న్ రీజియన్ మార్కెటింగ్ డివిజన్.. 56 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు:** జూనియర్ ఆపరేటర్ (ఏవియేషన్).
- **వేతనశ్రేణి:** రూ.10,500-రూ.24,500.
- **రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల వారీ ఖాళీలు:** చండీగఢ్-4, జమ్మూకశ్మీర్-4, పంజాబ్-16, రాజస్థాన్-11, ఉత్తరాఖండ్-3, ఉత్తరప్రదేశ్-18. **అర్హతలు:** కనీసం 45 శాతం (ఎస్సీ/ఎస్టీ-40 శాతం) మార్కులతో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత. హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. **వయసు:** 18-26 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి. **ఎంపిక:** రాతపరీక్ష, స్కిల్ ప్రొఫిషియెన్సీ ఫిజికల్ టెస్ట్ (ఎస్‌పీపీటీ).
- **దరఖాస్తు రుసుం:** రూ.150; ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకొని, హార్డ్‌కాపీ ప్రింటవుట్‌కు సంబంధిత ధ్రువపత్రాలు జతచేసి ఐవోసీఎల్ నిర్దేశిత చిరునామాకు గడువులోగా పంపాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 20, 2018.
- **హార్డ్‌కాపీ చేరడానికి చివరి తేదీ:** మార్చి 4, 2018.
- **వెబ్‌సైట్:** www.iocl.com

నిట్ పుదుచ్చేరిలో 15 బోధన ఖాళీలు

పుదుచ్చేరిలోని కరైకల్‌లో ఉన్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పుదుచ్చేరి (ఎన్ఐటీపీవై)లో 15 బోధన ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన వెలువడింది. **పోస్టు-ఖాళీలు:** ప్రొఫెసర్-4, అసోసియేట్ ప్రొఫెసర్-11. **వేతనం:** అసోసియేట్ ప్రొఫెసర్-రూ.42,800; ప్రొఫెసర్-రూ.48,000. **విభాగాలు:** సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ, ఎంఈ, సివిల్, మ్యాథమెటిక్స్. **అర్హతలు:** సంబంధిత విభాగాల్లో పీహెచ్‌డీతోపాటు నిబంధనల మేర ఉద్యోగానుభవం.

- **ఎంపిక:** ఇంటర్వ్యూ. **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్.
- **దరఖాస్తు చేరడానికి చివరి తేదీ:** ఫిబ్రవరి 27, 2018.
- **వెబ్‌సైట్:** www.nitpy.ac.in

సాక్షి బిజినెస్
శుక్రవారం 9-2-2018
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
330 ▲	100 ▲
34,413	10,577

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30కి)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	6,922	▽ 130
డోజోన్స్	24,397	▽ 497
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,171	▽ 109
డాక్స్	12,260	▽ 330
షాంఘై	3,262	▽ 47
నికాయ్	21,891	▲ 245

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	65.10	65.23
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	90.81	91.00
€	యూరో	ఎస్‌బీఐ	80.24	80.40
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	59.78	59.90
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.27	51.37
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	49.22	49.32
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.56	18.45
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.93	18.63
¥	చైనా యువాన్	థామస్‌కుక్	7.22	11.72

భెల్ లాభం 64% అప్

40 శాతం డివిడెండు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం భెల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ. 153 కోట్ల నికర లాభం ప్రకటించింది. ఇది అంతక్రితం ఆర్థిక సంవత్సర క్యూ3లో నమోదైన రూ.93 కోట్లతో పోలిస్తే 64 శాతం అధికం. మరోవైపు ఆదాయం రూ. 6,187 కోట్ల నుంచి రూ. 6,494 కోట్లకు పెరిగింది. 2017–18కి గాను 40 శాతం మధ్యంతర డివిడెండు (షేరుకు రూ.0.80) ఇవ్వాలని కంపెనీ బోర్డు నిర్ణయించింది. ఫిబ్రవరి 28న దీన్ని చెల్లిస్తామని కంపెనీ తెలియజేసింది. ప్రాజెక్టులను వేగవంతంగా అమలు చేయడం, వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం, నిల్చిపోయిన ప్రాజెక్టులను పునరుద్ధరించేందుకు నిర్విరామ కృషి మొదలైనవి సానుకూల ఫలితాలిస్తున్నాయని భెల్ చైర్మన్ అతుల్ సోబ్తి ఈ సందర్భంగా చెప్పారు.

ఫోర్బ్స్ క్రిప్టో సంపన్నుల జాబితా

క్రిస్ లార్సెన్‌కు అగ్రస్థానం





న్యూయార్క్: ఫోర్బ్స్ తాజాగా తొలి క్రిప్టో కరెన్సీ సంపన్నుల జాబితాను విడుదల చేసింది. ఇందులో రిపిల్ సహ వ్యవస్థాపకుడు క్రిస్ లార్సెన్ అగ్రస్థానంలో నిలిచారు. ఈయన క్రిప్టో నికర విలువ 7.5- 8 బిలియన్ డాలర్లుగా ఉండొచ్చని అంచనా. ఫోర్బ్స్ జాబితా ప్రకారం.. 2017లో బిట్‌కాయిన్, ఇథీరియమ్, ఎక్స్‌ఆర్‌పీ అనే మూడు ప్రముఖ క్రిప్టోకరెన్సీల సగటు విలువలో మార్పు 14,409 శాతంగా ఉంది. దాదాపు 1,500 క్రిప్టో కరెన్సీలున్నాయి. వీటి సమష్టి విలువ 550 బిలియన్ డాలర్లు. 2017 ప్రారంభం నుంచి చూస్తే ఈ కరెన్సీల విలువ 31 శాతం మేర ఎగసింది. జోసెఫ్ లుబిన్ (క్రిప్టో నికర విలువ: 1–5 బిలియన్ డాలర్లు), చాంగ్‌పెంగ్ ఝావో (1–1.2 బిలియన్ డాలర్లు), కామెరాన్ అండ్ టైలర్ వింక్‌లెవోస్ (900 మిలియన్–1.1 బిలియన్ డాలర్లు), మాథ్యూ మెలాన్ (900 మిలియన్–1.1 బిలియన్ డాలర్లు) తదితరులు ఈ జాబితాలో స్థానం పొందారు. అధిక ఒడిదుడుకుల నేపథ్యంలో నికర విలువ అంచనాలను ఏకమొత్తంగా కాకుండా శ్రేణి రూపంలో వెల్లడించింది. 2018 జనవరి 19 నాటి క్రిప్టో కరెన్సీల విలువ ఆధారంగా ఈ సంపన్నుల జాబితాలను రూపొందించారు. ఇందులో స్థానం దక్కించుకోవాలంటే కనీసం 350 మిలియన్ డాలర్ల విలువైన క్రిప్టో కరెన్సీలను కలిగి ఉండాలి. భారత్‌లో క్రిప్టో కరెన్సీలకు చట్టబద్ధత లేదు.

ఆంధ్రాబ్యాంకు నష్టం రూ.532 కోట్లు


హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రభుత్వ రంగ ఆంధ్రాబ్యాంకు ఈ డిసెంబర్ త్రైమాసికంలో రూ.532 కోట్ల నష్టాన్ని చవిచూసింది. 2016–17 ఏడాది డిసెంబర్ క్వార్టరులో బ్యాంకు రూ.56.7 కోట్ల నికరలాభాన్ని ఆర్జించటం గమనార్హం. టర్నోవరు రూ.5,013 కోట్ల నుంచి రూ.5,093 కోట్లకు పెరిగింది. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్– డిసెంబర్ కాలానికి రూ.15,254 కోట్ల టర్నోవరుపై మొత్తం రూ.876 కోట్ల నికర నష్టాన్ని చవిచూసింది. స్థూల నిరర్థక



ఆస్తులు సెప్టెంబర్ క్వార్టరులో 13.27%గా (రూ.19,839 కోట్లు) ఉండగా, ఇప్పుడు ఇవి 14.26 శాతానికి చేరి రూ.21,599 కోట్లకు ఎగిశాయి. రానిబాకీలకు కేటాయించిన నిధులు ఏకంగా 118% పెరిగి రూ.1,862 కోట్లకు చేరుకున్నాయి. కాగా, డిసెంబర్ త్రైమాసికంలో నికరవడ్డీ ఆదాయం 37% పెరిగి రూ.1,672 కోట్లను తాకటం గమనార్హం. నిర్వహణ లాభం 46% అధికమై రూ.1,330 కోట్లుగా ఉంది. మొత్తం వ్యాపారం 5.74% అధికమై రూ.3,51,735 కోట్లకు చేరింది. మొత్తం డిపాజిట్లు 5.11% పెరిగి రూ.2,00,243 కోట్లకు, అడ్వాన్సులు 6.59% అధికమై రూ.1,51,492 కోట్లకు చేరాయి.

మళ్లీ లాభాల్లోకి సెయిల్


క్యూ3లో రూ.43 కోట్లు



న్యూఢిల్లీ: వరుసగా 10 త్రైమాసికాలపాటు నష్టాలు ప్రకటించిన ప్రభుత్వ రంగ ఉక్కు దిగ్గజం సెయిల్ మళ్లీ లాభాల్లోకి వచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికంలో రూ. 43.16 కోట్ల నికర లాభం (స్టాండెలోన్) ప్రకటించింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో సెయిల్ రూ.795 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. తాజా క్యూ3లో ఆదాయం రూ. 12,688 కోట్ల నుంచి రూ. 15,443 కోట్లకు పెరిగింది. మూడో త్రైమాసికంలో పన్నులకు ముందు లాభాలు రూ.82 కోట్లుగా నమోదైనట్లు సంస్థ చైర్మన్ పి.కె. సింగ్ తెలిపారు. సవాళ్లను సమర్థంగా అధిగమిస్తూ, లాభాల్లోకి మళ్లేందుకు కంపెనీ చేస్తున్న కృషి సత్ఫలితాలనిస్తోందని ఆయన పేర్కొన్నారు. తాజా లాభాలు... సంస్థ టర్న్‌ఎరౌండ్ అవుతోందనడానికి నిదర్శనమన్నారు. అధిక ఉత్పత్తి, సామర్థ్యాలను మెరుగుపర్చుకోవడం, వ్యయ నియంత్రణ చర్యలు, మార్కెటింగ్‌పై మరింతగా దృష్టి సారించడం తదితర అంశాలు సెయిల్ మళ్లీ లాభాల్లోకి మళ్లేందుకు దోహదపడ్డాయని సింగ్ చెప్పారు. ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకునే దిశగా వివిధ ప్రాజెక్టుల ఆధునీకరణ పనులు దాదాపు పూర్తయినట్లు తెలిపారు. వ్యాపార వృద్ధి వ్యూహాల్లో భాగంగా దేశ, విదేశాల్లో కొంగొత్త మార్కెట్లపై దృష్టి పెడుతున్నట్లు సింగ్ చెప్పారు.

కొత్త వాహన పాలసీ 2 నెలల్లో!!

భారీ పరిశ్రమల మంత్రి అనంత్ గీతే వెల్లడి



టీవీఎస్ అపాచీ ఆర్‌ఆర్310తో మోడల్

గ్రేటర్ నోయిడా: కేంద్ర ప్రభుత్వం రాబోయే రెండు నెలల్లో కొత్త వాహన పాలసీ ముసాయిదాను ప్రకటించనుంది. ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వంటి కొత్త సాంకేతిక పరిజ్ఞానం వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేలా పాలసీని రూపొందిస్తామని భారీ పరిశ్రమల మంత్రి అనంత్ గీతే తెలిపారు. 14వ ఆటో ఎక్స్‌పో ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాలసీ రూపకల్పనలో సియామ్, ఏసీఎంఏ సహ పరిశ్రమ ప్రతినిధుల సూచనలు, సలహాలు పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారాయన. 'ఎఫ్‌ఏఎంఈ స్కీమ్ తొలి దశ మార్చిలో ముగియనుంది. దీంతో రెండో దశపై దృష్టి కేంద్రీకరించాం. దీన్ని మరింత విజయవంతం చేయాలని భావిస్తున్నాం' అని తెలిపారు. వివిధ వాహన విభాగాలపై పన్నును సవరించాలనే పరిశ్రమ డిమాండ్‌పై స్పందిస్తూ.. 'పరిశ్రమ నుంచి పలు విజ్ఞప్తులు అందాయి. కొత్త పాలసీ విధానంలో వీటిని పరిష్కరిస్తాం' అని హామీనిచ్చారు. కొత్త పాలసీ విధానం పరిశ్రమకు, వినియోగదారులకు స్నేహపూరితంగా ఉంటుందన్నారు. పరిశ్రమ కొత్త టెక్నాలజీలను ఒడిసి పట్టుకోవాలని, బీఎస్–6 నిబంధనల అమలు విషయంలో సవాళ్లను స్వీకరించడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం పరిశ్రమకు మద్దతుగా ఉంటుందన్నారు. ఇక పన్ను సంబంధ సమస్యలను ప్రభుత్వం తప్పనిసరిగా పరిష్కరించాల్సి ఉందని సియామ్ ప్రెసిడెంట్ అభయ్ ఫిరొడియా కోరారు. వాహన పరిశ్రమలో పలు మంత్రిత్వ శాఖల ప్రమేయం ఉందని, అలాకాకుండా ప్రతిపాదిత నోడల్ వ్యవస్థ 'నేషనల్ ఆటోమోటివ్ బోర్డు'ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 2020 ఏప్రిల్ తర్వాత కూడా బీఎస్–4 వాహన విక్రయాలకు ప్రభుత్వం అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. కాగా వాహన పరిశ్రమ ఎలక్ట్రిక్ వాహనాలపై జీఎస్‌టీ రేటు 5%గా ఉండాలని డిమాండ్ చేస్తోంది. ప్రస్తుతం ఇది 12%. అలాగే ప్యాసింజర్ వాహన విభాగంలో కేవలం రెండు జీఎస్‌టీ శ్లాబ్‌లు మాత్రమే ఉండాలని కోరుతోంది.



ఆటోషోను ప్రారంభిస్తున్న సియామ్ డైరెక్టర్ జనరల్ విష్ణు మాథుర్. చిత్రంలో సీఐఐ ప్రెసిడెంట్ శోభన కామినేని తదితరులు

ఆటో ఎక్స్‌పో 2018



ట్రయంఫ్ బైక్‌తో మోడల్



కవసాకి వల్కన్-ఎస్ బైక్

మారుతీ కొత్త స్విఫ్ట్ వచ్చేసింది..!

దేశీ దిగ్గజ కార్ల తయారీ కంపెనీ 'మారుతీ సుజుకీ ఇండియా' తాజాగా తన పాపులర్ హ్యాచ్‌బ్యాక్ 'స్విఫ్ట్'లో సరికొత్త వెర్షన్‌ను మార్కెట్‌లో ఆవిష్కరించింది. దీని ధర శ్రేణి రూ.4.99 లక్షలు– రూ.8.29 లక్షలు (ఎక్స్‌షోరూమ్ ఢిల్లీ). సుజుకీ 5వ జనరేషన్ హార్టెక్ ప్లాట్‌ఫామ్ ఆధారంగా దీన్ని రూపొందించిన్నట్లు కంపెనీ వెల్లడించింది. కొత్త స్విఫ్ట్.. పెట్రోల్ (1.2 లీటర్), డీజిల్ (1.3 లీటర్) ఇంజిన్ ఆప్షన్లలో కస్టమర్లకు అందుబాటులో ఉంటుందని పేర్కొంది. ఇక కంపెనీ గత నెలలోనే కొత్త స్విఫ్ట్ బుకింగ్స్ ప్రారంభించింది. కాగా 2005లో స్విఫ్ట్ దేశీ మార్కెట్‌లోకి ఎంట్రీ ఇచ్చింది.



కొత్త స్విఫ్ట్‌తో మారుతీ సుజుకీ ఎండీ, సీఈఓ కెనిచి అయుకవ, సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్‌ఎస్ ఖల్సి

- **యూఎం లోహియా:** యూఎం లోహియా టూవీలర్స్ తాజాగా ప్రపంచంలోనే తొలి ఎలక్ట్రిక్ క్రూయిజర్ 'రెనెగేడ్ థార్'ను ఆవిష్కరించింది. దీని ధర రూ.4.9 లక్షలు (ఎక్స్‌షోరూమ్). కంపెనీ అలాగే రెనెగేడ్ డ్యూటీ ఎస్, రెనెగేడ్ డ్యూటీ ఏస్ బైక్స్‌ను ప్రదర్శకు ఉంచింది. వీటి ప్రారంభ ధర రూ.1.9 లక్షలు. ఈ రెండింటిలో 223 సీసీ సింగిల్ సిలిండర్ ఇంజిన్‌ను అమర్చినట్లు కంపెనీ తెలిపింది.
- **సుజుకీ మోటార్‌సైకిల్:** సుజుకీ మోటార్ సైకిల్ తాజాగా 125 సీసీ అడ్వాన్స్‌డ్ లగ్జరీ స్కూటర్ 'బర్గ్‌మ్యాన్ స్ట్రీట్'ను ఆవిష్కరించింది. అలాగే సహా సబ్ 1,000 సీసీ విభాగంలో జీఎస్‌ఎక్స్–ఎస్750 బైక్‌ను ప్రదర్శించింది. కంపెనీ హయబుసా తర్వాత భారత్‌లో తయారు చేస్తోన్న రెండో పవర్ బైక్ ఈ జీఎస్‌ఎక్స్–ఎస్750నే. ఇన్‌ట్రూడర్ బైక్‌లో కొత్త వేరియంట్‌ను ప్రదర్శనకు ఉంచింది.
- **పినాకిల్:** పినాకిల్ స్పెషాలిటీ వెహికల్స్ తాజాగా కస్టమైజ్‌డ్ లగ్జరీ ఎక్స్‌పాండబుల్ మోటార్‌హోమ్ 'ఫినెట్‌జా'ను ఆవిష్కరించింది. దీని ధర రూ.15–50 లక్షల శ్రేణిలో ఉండొచ్చు. కంపెనీ అలాగే మోడిఫైడ్ ఎగ్జిక్యూటివ్ బిజినెస్ వ్యాన్ 'ఒపిసియా', కస్టమైజ్‌డ్ టూరర్ 'మాగ్రిఫిసియా', మోడిఫైడ్ ప్రొడక్ట్ డిస్‌ప్లే వ్యాన్ 'ఎగ్జిబికా'లను ప్రదర్శనకు ఉంచింది.
- **ఎంప్లక్స్ మోటార్స్:** ఎంప్లక్స్ మోటార్స్ తాజాగా ఎలక్ట్రిక్ స్పోర్ట్స్ బైక్ 'ఎంప్లక్స్ వన్' నమూనాను ఆవిష్కరించింది. ఇది 2019 ఏప్రిల్‌లో భారతీయ రోడ్లపై పరిగెత్తనుంది. దీని గరిష్ట వేగం గంటకు 200 కిలోమీటర్లు.
- **యూనిటి:** స్వీడన్‌కు చెందిన ఎలక్ట్రిక్ కార్ల తయారీ కంపెనీ యూనిటి తాజాగా 5 సీటర్ ఎలక్ట్రిక్ కారును ఆవిష్కరించింది. దీని ధర రూ.7.1 లక్షలు. ఇది 2020లో మార్కెట్‌లోకి రానుంది. కంపెనీ అలాగే 2 సీటర్ ఎలక్ట్రిక్ కారు 'యూనిటి వన్'ను ప్రదర్శనకు ఉంచింది. ఈ కార్ల అసెంబ్లింగ్, మార్కెటింగ్ కార్యకలాపాల కోసం బర్డ్ గ్రూప్‌తో భాగస్వామ్యం కూడా కుదుర్చుకుంది.
- **ట్వంటీ టూ మోటార్స్:** ఎలక్ట్రిక్ టూవీలర్ తయారీ కంపెనీ ట్వంటీ టూ మోటార్స్ తాజాగా స్మార్ట్ ఎలక్ట్రిక్ స్కూటర్ 'ఫ్లో'ను ఆవిష్కరించింది. దీని ధర రూ.74,740. దీన్ని 5 గంటలు చార్జ్ చేస్తే 80 కిలో మీటర్లు వెళ్లొచ్చని కంపెనీ తెలిపింది. వీటి బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. ఇవి 2018 రెండో అర్ధ భాగంలో కస్టమర్లకు డెలివరీ అవుతాయి.



బీఎండబ్ల్యూ ఎం4 కూపేతో కంపెనీ ప్రతినిధి విక్రమ్



లోహియా ఎలక్ట్రిక్ ఆటోతో కంపెనీ సీఈఓ ఆయుష్ లోహియా



బీఎండబ్ల్యూ మినీ కూపర్ కన్వర్టబుల్ ఎస్



డీసీ స్పోర్ట్స్ కారుతో బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా

ఏసీసీ లాభం రెట్టింపు



న్యూఢిల్లీ: సిమెంటు తయారీ దిగ్గజం ఏసీసీ నికర లాభం అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికంలో రెట్టింపయి రూ.206 కోట్లుగా నమోదైంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే వ్యవధిలో లాభం రూ.91 కోట్లు. మరోవైపు, ఆదాయం రూ.3,102 కోట్ల నుంచి రూ.3,540 కోట్లకు పెరిగింది. రూ.10 ముఖ విలువ గల ఒక్కో షేరుపై రూ.15 తుది డివిడెండ్‌ను కంపెనీ బోర్డు సిఫార్సు చేసింది. ప్రీమియం ఉత్పత్తులపై ప్రధానంగా దృష్టి పెట్టడం, ఆదాయాలు మెరుగుపడటం తదితర అంశాలు లాభాల వృద్ధికి తోడ్పడ్డాయని సంస్థ సీఈవో నీరజ్ అఖోరి తెలిపారు. బడ్జెట్‌లో ఇన్‌ఫ్రా అభివృద్ధి, స్మార్ట్ సిటీలు, అందుబాటు ధరల్లో ఇళ్ల నిర్మాణానికి పెద్ద పీట వేసిన నేపథ్యంలో సిమెంటు రంగానికి ఈ ఏడాది మరింత మెరుగ్గానే ఉండగలదని నీరజ్ తెలిపారు. బీఎస్‌ఈలో ఏసీసీ షేరు ధర 7% పెరిగి రూ. 1,692 వద్ద క్లోజయ్యింది.


లిస్టింగ్‌లో గెలాక్సీ సర్ఫెక్టెంట్స్ మెరుపులు



న్యూఢిల్లీ: స్పెషాలిటీ కెమికల్స్ తయారీ సంస్థ గెలాక్సీ సర్ఫెక్టెంట్స్ షేర్లు లిస్టింగ్ రోజున మెరిశాయి. ఇష్యూ ధర రూ. 1,480తో పోలిస్తే దాదాపు 15 శాతం పెరిగాయి. గురువారం బీఎస్‌ఈలో 2.7 శాతం లాభంతో రూ. 1,520 వద్ద లిస్టయిన గెలాక్సీ షేరు ఒక దశలో 17 శాతం దాకా కూడా పెరిగింది. రూ.1,732 స్థాయిని తాకింది. చివరికి 14.73 శాతం లాభంతో రూ. 1,698 వద్ద క్లోజయ్యింది. అటు ఎన్‌ఎస్‌ఈలో 14.89 శాతం లాభంతో రూ. 1,700 వద్ద ముగిసింది.

ఐటీకి ఇదేమీ కలిసొచ్చే ఏడాది కాదు: నాస్కామ్

హైదరాబాద్: దేశీ ఐటీ రంగం 2018లో ఆందోళనకరంగానే ఉండొచ్చని నాస్కామ్ అంచనా వేసింది. గ్లోబల్ ఐటీ వ్యయాలు పెరగడం, అమెరికా ఆర్థిక వ్యవస్థ మెరుగుపడటం వంటి సానుకూలతల నడుమ ఇంకా సవాళ్లు పొంచి ఉన్నాయని పేర్కొంది. 2018 ఐటీకి కమ్‌బ్యాక్ ఇయర్ అనే ఊహాగానాలను కొట్టి పారేసింది. 'అదే సమస్య. వారు పునరుద్ధరణ చాలా వేగంగా ఉంటుందని చెబుతున్నారు. ఈ ఏడాది ఊహించిన క్షీణత కానీ ఆకస్మిక మెరుగుదల కానీ ఉండదు' అని నాస్కామ్ ప్రెసిడెంట్ ఆర్.చంద్రశేఖర్ పేర్కొన్నారు. 'గ్లోబల్ ఎకానమీ, అమెరికా ఆర్థిక వ్యవస్థ, ఇతర అంశాలు సానుకూలంగా ఉన్నాయి. ఇందులో ఎలాంటి సందేహం లేదు. అయితే వీటి వల్ల ఇప్పటికిప్పుడు పరిశ్రమకు పెద్దగా అవకాశాలేమీ అందుబాటులోకి రావు' అని హెచ్చరించారు. సవాళ్లు లేవని అనుకోవడం ఇప్పుడు కరెక్ట్ కాదన్నారు. పాత సవాళ్లు కొనసాగుతున్నాయని, అవి సమసిపోలేదన్నారు. అలాగే అమెరికాలోని పాలన చర్యలు వంటి కొత్తవీ ఉన్నాయని చెప్పారు.



మార్చి 1 నుంచి ఏటీఎంలో 200 నోటు!

గ్రామీణ ప్రాంతాల్లో రూ. 50 నోట్లు కూడా..

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మార్చి 1 నుంచి ఏటీఎంలలో రూ.200 నోటు దర్శనమివ్వనుంది. గ్రామీణ ప్రాంతాల్లోని ఏటీఎంలలో అయితే రూ.50 నోట్లు కూడా రానున్నాయి. ప్రస్తుతం ఈ నోట్లు చలామణిలోకి వచ్చినా... అవన్నీ బ్యాంకుల్లో విత్‌డ్రా ద్వారా వచ్చినవే. రూ.200, రూ.50 నోట్ల సైజు నిర్ధారణ, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి ప్రక్రియ వేగవంతంగా జరుగుతోందని, ఇప్పటికే చాలా ఏటీఎంలలో ఈ ప్రక్రియ పూర్తయిందని బ్యాంకింగ్ వర్గాలు చెబుతున్నాయి. పూర్తి స్థాయిలో మార్చి 1 నుంచి అందుబాటులోకి రావచ్చని తెలిపాయి. ప్రస్తుతం ఏటీఎంలలో రూ.2,000, రూ.500, రూ.100 నోట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

గ్రామీణ ప్రాంతాల్లో రూ.50 నోట్లు..

స్థానిక అవసరాలను బట్టి ఏటీఎంలలో నోట్లను అమరుస్తున్నారని, పట్టణాల్లో రూ.2,000, రూ.500, రూ.200, రూ.100 నోట్లకు డిమాండ్ ఉంటే.. గ్రామీణ ప్రాంతాల్లో రూ.500, రూ.200, రూ.100, రూ.50 నోట్లకు డిమాండ్ ఎక్కువగా ఉందని ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ ఒకరు 'సాక్షి బిజినెస్ బ్యూరో'తో చెప్పారు. అందుకే గ్రామాల్లోని అన్ని ఎస్‌బీఐ ఏటీఎంల్లోనూ రూ.200, రూ.50 నోట్లను అందుబాటులోకి తేనున్నట్లు తెలియజేశారు. కాగా ప్రస్తుతం ఏటీఎంలలో అందుబాటులో ఉన్న రూ.2,000, రూ.500, రూ.100 నోట్లకన్నా సైజులో రూ.200 నోటు చిన్నది. దీంతో మళ్లీ అన్ని ఏటీఎంలలోని సాఫ్ట్‌వేర్‌లను మార్చాల్సి వస్తోందని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ రీజినల్ రూరల్ బ్యాంక్ ఆఫీసర్స్ జనరల్ సెక్రటరీ ఎస్ వెంకటేశ్వర్‌రెడ్డి చెప్పారు.



నిర్ధారణ వ్యయం రూ.110 కోట్ల పైనే..

ఏటీఎంలలో నోట్ల నిర్ధారణ, సాఫ్ట్‌వేర్ మార్పు బ్యాంకులకు వ్యయంతో కూడుకున్న పని. ఇందు కోసం సుమారు రూ.110 కోట్లకు పైగానే ఖర్చవుతుందని పరిశ్రమ వర్గాల అంచనా. ఒక్కో ఏటీఎం నిర్ధారణకు రూ.5 వేలు ఖర్చవుతుందని.. ఏటీఎంలోని ఒక్కో క్యాసెట్‌లో 2,500 నోట్లు పడతాయని ఎన్‌సీఆర్ కార్పొరేషన్ ప్రతినిధి ఒకరు తెలిపారు. కాగా ఆర్‌బీఐ గణాంకాల ప్రకారం 2017 డిసెంబర్ నాటికి దేశంలో ఆన్‌సైట్‌లో 1,09,908, ఆఫ్‌సైట్‌లో 97,128 ఏటీఎంలున్నాయి. వీటిల్లో అత్యధిక ఏటీఎంలు ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐవే.

విపణిలోకి సెల్ఫ్‌సర్వ్ ఏటీఎం

విడుదల చేసిన ఎన్‌సీఆర్

ప్రముఖ ఓమ్నీ చానల్ సొల్యూషన్స్ సంస్థ ఎన్‌సీఆర్ కార్పొరేషన్ విపణిలోకి కొత్త తరహా ఏటీఎంను విడుదల చేసింది. సెల్ఫ్‌సర్వ్ రీసైకిల్ ఏటీఎం ఆర్థిక సంస్థలకు ఎంతగానో ఉపయుక్తమని, మారుమూల ప్రాంతాల్లోనూ సులువుగా, వేగవంతంగా ఏటీఎం సేవలందించే వీలుంటుందని ఎన్‌సీఆర్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వైస్ ప్రెసిడెంట్, జీఎం జోస్ రిసెన్‌డిజ్ తెలిపారు. 2018 నాటికి 18.5 బిలియన్ల లావాదేవీలు ఏటీఎం ద్వారా జరుగుతాయని.. 2022 నాటికిది 26 బిలియన్లకు చేరుతుందని ఆయన అంచనా వేశారు.



నిత్యావసరాల ధరలు (హోల్‌సేల్/క్వింటాల్‌కు)

సరుకు	ధర
పత్తి (వరంగల్, వ్యాపారస్తులు)	రూ.4,500 (కనిష్టం) రూ.4,925 (గరిష్టం)
మిర్చి (వరంగల్, తేజ)	రూ.7,000 (కనిష్టం) రూ.9,700 (గరిష్టం)
పసుపు (నిజామాబాద్, కొమ్ము)	రూ.4,028 (కనిష్టం) రూ.7,428 (గరిష్టం)
ఉల్లి (కర్నూలు)	-- --
చక్కెర (చెన్నై)	రూ.3,500
బియ్యం (కరీంనగర్)	3,800 (హెచ్ఎంటీ)
కందిపప్పు (చెన్నై)	రూ.7,200
సుబాబులు (కృష్ణా)	రూ.4,400 (టన్నుకు)
ఆయిల్ పామ్ (పశ్చిమ గోదావరి)	--

ఏడు రోజుల నష్టాలకు బ్రేక్

నిఫ్టీ 100, సెన్సెక్స్ 330 పాయింట్లు అప్

- ఆసియా మార్కెట్లు, కంపెనీల ఆదాయాలపై ఆశలు
- ఫార్మా, ఐటీ స్టాక్స్‌లో కొనుగోళ్లు

ఆసియా మార్కెట్లలో ఆశావహ ధోరణి, కార్పొరేట్ల ఆదాయాలపై సానుకూల అంచనాలు తదితర అంశాలన్నీ కలిసి స్టాక్ మార్కెట్ల ఏడు రోజుల పతనానికి బ్రేక్ వేశాయి. గురువారం దేశీ సూచీలు లాభాల్లో ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 330 పాయింట్లు లాభపడి 34,413 పాయింట్ల వద్ద క్లోజయింది. గడిచిన రెండు వారాల్లో సెన్సెక్స్ ఇంతగా లాభపడటం ఇదే తొలిసారి. దేశ, విదేశీ మార్కెట్లలో నెలకొన్న నెగటివ్ సెంటిమెంట్‌తో గత ఏడు సెషన్స్‌లో సెన్సెక్స్ ఏకంగా 2,200 పాయింట్లు పతనమైంది. మరోవైపు, ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా కోలుకుని 100 పాయింట్ల మేర (0.96 శాతం) లాభంతో 10,577 పాయింట్ల వద్ద ముగిసింది. ఇటీవల భారీగా పతనమైన షేర్లతో పాటు ఫార్మా, ఐటీ స్టాక్స్‌లో కొనుగోళ్లతో మార్కెట్లో కొంత ఆశావహ ధోరణి కనిపించింది. ముడిచమురు ధరలు తగ్గుతుండటం, మెరుగైన ఆర్థిక వృద్ధి అంచనాలు తదితర అంశాలు ఇన్వెస్టర్ల సెంటిమెంటు మెరుగుపడటానికి దోహదపడ్డాయి. ఫ్యూచర్స్ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర ఒక దశలో ఆరు వారాల కనిష్ట స్థాయి అయిన 65.16 డాలర్లకు తగ్గింది. ఇంధనావసరాలకు ప్రధానంగా దిగుమతుల పైనే ఆధారపడిన నేపథ్యంలో ముడిచమురు రేట్ల తగ్గుదల భారత్‌కు సానుకూలాంశం. దేశీ కంపెనీల ఆదాయాలు మెరుగ్గా ఉండటం, ఆసియా మార్కెట్లలో ఆశావహ ధోరణులు నెలకొనడం భారత మార్కెట్ల లాభాలకు దోహదపడ్డాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చీఫ్ మార్కెట్ స్ట్రాటెజిస్ట్ ఆనంద్ జేమ్స్ చెప్పారు. అయితే, అంతర్జాతీయంగా మార్కెట్లు తీవ్ర హెచ్చుతగ్గులకు లోనవుతుండటం, కీలక వడ్డీ రేట్లపై బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ (బీవోఈ) నిర్ణయంపై యూరప్ మార్కెట్లు స్పందించే తీరుతెన్నులు మొదలైనవాటిని ఇన్వెస్టర్లు చాలా జాగ్రత్తగా పరిశీలిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	5,558
ఎన్ఎస్ఈ (ఈక్విటీ)	34,883
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	14,26,958
ఎఫ్ఐఐ	-2,297
డీఐఐ	2,374

కేరళలో బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు ప్రారంభం

తిరువనంతపురం: ప్రభుత్వ రంగ టెలికం దిగ్గజం బీఎస్ఎన్ఎల్ తమ 4జీ మొబైల్ సర్వీసులను కేరళలో ప్రారంభించింది. తొలుత ఇడుక్కి జిల్లాలోని అయిదు ప్రాంతాల్లో ఈ సేవలు అందుబాటులో ఉంటాయని సంస్థ తెలిపింది. ఈ ఏడాది ఆఖరు నాటికి మిగతా జిల్లాలకు కూడా వీటిని విస్తరిస్తామని బీఎస్ఎన్ఎల్ సీజీఎం పి.టి. మాథ్యూ తెలిపారు.

మోక్ష్ అగర్‌బత్తి కొత్త ప్రొడక్ట్.. 'హైలైఫ్'

మోక్ష్ అగరబత్తి తన ప్రొడక్ట్ పోర్ట్‌ఫోలియోను మరింత విస్తరించింది. సంస్థ తాజాగా 'హై లైఫ్' పేరుతో కొత్త ఉత్పత్తిని మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. ఇది ఆన్‌లైన్ సహా దగ్గరిలోని రిటైల్ స్టోర్లలో కస్టమర్లకు అందుబాటులో ఉంటుందని కంపెనీ ప్రకటన తెలిపింది.

ఈ నెలాఖరున భారత్‌కు జూనియర్ ట్రంప్..!

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమారుడు జూనియర్ ట్రంప్ ఈ నెలాఖరున భారత్‌లో పర్యటించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ట్రంప్ ఆర్గనైజేషన్‌కు ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తున్న జూనియర్ ట్రంప్... గుర్‌గావ్, కోల్‌కతాల్లో గ్లోబల్ రియల్టీ బ్రాండ్- ట్రంప్ టవర్స్‌ను అధికారికంగా ప్రారంభిస్తారు. దేశ రాజధానిలో జరిగే గ్లోబల్ బిజినెస్ సదస్సులో ఆయన పాల్గొనే అవకావం ఉంది. ''భారత్ మహోన్నత దేశం. ఈ ప్రాంతంలో పలు సంవత్సరాలుగా మా బ్రాండ్ అద్భుత విజయాలను సొంత చేసుకుంది'' అని తన పర్యటనను పురస్కరించుకుని జూనియర్ ట్రంప్ ట్వీట్ చేశారు.

బోర్డ్ మీటింగ్స్

అవంతి ఫీడ్స్, బాటా ఇండియా, బీఓబీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, ఇండియా సిమెంట్స్, కేసీపీ షుగర్, ఎంఅండ్ఎం, నాల్కో, ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియా, రాంకీ ఇన్‌ఫ్రా, ఎస్‌బీఐ, టాటా స్టీల్

ద్రవ్యలోటు బాట తప్పరాదు

ఇది ఆందోళనకరమే: దువ్వూరి

సింగపూర్: ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ఈ నెల 1వ తేదీ తన బడ్జెట్‌లో ద్రవ్యలోటు లక్ష్యాలను సవరించడం తగిన నిర్ణయం కాదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు అభిప్రాయపడ్డారు. ఈ నిర్ణయం అసంతృప్తికి గురిచేసిందన్నారు. ''ద్రవ్య స్థిరీకరణ విషయంలో అటు యూపీఏ కానీయండి... లేదా ఎన్‌డీఏ కానీయండి. ఆర్థికమంత్రులు ప్రతిసారీ 'విరామ' నిర్ణయాన్ని ప్రకటిస్తున్నారు. ఇప్పటి పరిస్థితుల్లో ఇది తప్పదంటూ తమను తాము సమర్థించుకుంటున్నారు. ద్రవ్య స్థిరీకరణకు కట్టుబడి ఉన్నామంటూనే ఆ బాట తప్పుతున్నారు. ఇది ఆందోళనకరమైన అంశం'' అని నేషనల్ యూనివర్శిటీ ఆఫ్ సింగపూర్‌లో జరిగిన ఒక చర్చా కార్యక్రమంలో వ్యాఖ్యానించారు. ద్రవ్యలోటు లక్ష్యాలకు భారత్ కట్టుబడి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ ఆదాయాలు- వ్యయాలకు మధ్య వ్యత్యాసమైన ద్రవ్యలోటును ఎంత మేరకు కట్టడి చేయాలన్న లక్ష్యాన్ని .. 2018-19 బడ్జెట్ కొనసాగించలేకపోతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2017-18) బడ్జెట్ అంచనాల ప్రకారం- ఈ ఏడాది స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) విలువలో ద్రవ్యలోటును 3.2 శాతానికి కట్టడి చేయాలి. 2018-19 ఆర్థిక సంవత్సరంలో ఈ రేటు 3 శాతానికి తగ్గాలి. అయితే ప్రస్తుతం నడుస్తున్న ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు 3.2 శాతం లక్ష్యానికి బదులు 3.5 శాతంగా ఉంటుందని జైట్లీ పేర్కొన్నారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో ఈ రేటు అనుకున్న 3 శాతానికి భిన్నంగా 3.3 శాతంగా ఉంటుందని చెప్పారు. కాగా జాతీయ ఆరోగ్య బీమా పథకం ప్రతిపాదన పట్ల దువ్వూరి హర్షం వ్యక్తం చేశారు.

గూగుల్‌కు రూ.136 కోట్ల జరిమానా

న్యూఢిల్లీ: ఇంటర్నెట్ దిగ్గజం గూగుల్‌కు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా షాకిచ్చింది. భారత్‌లో ఆన్‌లైన్ సెర్చ్ విషయంలో అనైతిక వ్యాపార విధానాలకు పాల్పడినందుకు గాను రూ.136 కోట్ల పెనాల్టీ చెల్లించాలని ఆదేశించింది. 2012లో గూగుల్‌కు వ్యతిరేకంగా నమోదైన ఫిర్యాదులపై దర్యాప్తు జరిపిన అనంతరం కమిషన్ ఈ ఆదేశాలు జారీ చేసింది. కమిషన్ ఉత్తర్వులను పరిశీలించిన అనంతరం తాము తదుపరి చర్యలు చేపడతామని గూగుల్ అధికార ప్రతినిధి స్పష్టం చేశారు. గూగుల్ ప్రత్యేకమైన సెర్చ్ ఆప్షన్ అన్నది దాని కమర్షియల్ ఫ్లయిట్ యూనిట్‌కు తీసుకెళుతోందని ఇది పోటీ నిబంధనలకు వ్యతిరేకమని కమిషన్ పేర్కొంది.

హెచ్‌టీసీ 'యు11 ప్లస్'@ రూ.56,990

న్యూఢిల్లీ: ప్రముఖ మొబైల్ హ్యాండ్‌సెట్స్ తయారీ సంస్థ 'హెచ్‌టీసీ' తాజాగా 'యు11 ప్లస్' స్మార్ట్ ఫోన్‌ను మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. దీని ధర రూ.56,990. ఇందులో 6 అంగుళాల క్వాడ్ హెచ్‌డీ ప్లస్ డిస్‌ప్లే, 3,930 ఎంఏహెచ్ బ్యాటరీ, 8 ఎంపీ ఫ్రంట్ కెమెరా, 12 ఎంపీ రియర్ కెమెరా, 6 జీబీ ర్యామ్, 128 జీబీ మెమరీ, క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ 835 ప్రాసెసర్, ఆండ్రాయిడ్ ఓరియో, ఐపీ 68 డస్ట్ ప్రూఫ్ వంటి పలు ప్రత్యేకతలున్నాయని కంపెనీ తెలియజేసింది. ఈ స్మార్ట్‌ఫోన్లను ఫ్లిప్‌కార్ట్‌లో కొనుగోలు చేయవచ్చు.

మేధోహక్కుల సూచీలో భారత్‌కు 44వ ర్యాంకు

వాషింగ్టన్: అంతర్జాతీయ మేధోహక్కుల (ఐపీ) సూచీలో భారత్ ర్యాంకింగ్ కొంత మెరుగుపడింది. 50 దేశాల జాబితాలో 44వ స్థానాన్ని దక్కించుకుంది. గతేడాది 45 దేశాల సూచీలో భారత్‌కు 43వ ర్యాంకు దక్కింది. స్కోరు కొంత మెరుగుపడినప్పటికీ .. ఈ సూచీలో భారత్ ఇంకా అట్టడుగు స్థానంలోనే ఉంది. అమెరికా చాంబర్స్ ఆఫ్ కామర్స్‌లో భాగమైన గ్లోబల్ ఇన్నోవేషన్ పాలసీ సెంటర్ (జీఐపీసీ) రూపొందించిన వార్షిక నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. స్థానాన్ని మరింత మెరుగుపర్చుకునేందుకు గాను... విధానాలకు అనుగుణంగా భారత్ మరిన్ని అర్థవంతమైన సంస్కరణలు అమలు చేయాల్సి ఉంటుందని అమెరికా చాంబర్ ఆఫ్ కామర్స్ అభిప్రాయపడింది. భారత్ గతేడాది కంప్యూటర్ ఆధారిత నవకల్పనలకు సంబంధించి జారీ చేసిన మార్గదర్శకాలు.. నూతన సాంకేతిక ఆవిష్కరణలకు తోడ్పాటునిచ్చేలా ఉన్నాయని పేర్కొంది. అలాగే మేధోహక్కులపై అవగాహన పెంచేందుకు వర్క్‌షాపులు నిర్వహించడం, సాంకేతికాంశాల్లో శిక్షణనివ్వడం మొదలైనవి భారత్‌కు సానుకూలాంశాలని తెలిపింది. మేధోహక్కుల సూచీలో అమెరికా అగ్రస్థానంలో ఉండగా .. బ్రిటన్, స్వీడన్ తర్వాత స్థానాల్లో ఉన్నాయి.

స్వల్పంగా తగ్గిన గ్రాన్యూల్స్ లాభం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఫార్మా కంపెనీ గ్రాన్యూల్స్ ఇండియా డిసెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికర లాభం క్రితంతో పోలిస్తే రూ.39 కోట్ల నుంచి రూ.35 కోట్లకు వచ్చి చేరింది. టర్నోవర్ రూ.364 కోట్ల నుంచి రూ.411 కోట్లకు ఎగసింది. 2017-18 ఏప్రిల్-డిసెంబర్ కాలంలో రూ.1,197 కోట్ల టర్నోవరుపై రూ.112 కోట్ల నికరలాభం ఆర్జించింది.

గ్లెన్‌మార్క్ లాభం 78 శాతం డౌన్

ముంబై: అమెరికాలో అమ్మకాలు భారీగా తగ్గిన ప్రభావంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఔషధ రంగ సంస్థ గ్లెన్‌మార్క్ ఫార్మా నికర లాభం ఏకంగా 78% క్షీణించింది. రూ. 105 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం క్యూ3లో లాభం రూ. 477 కోట్లు. ఇక తాజా క్యూ3లో ఆదాయం సైతం 13% క్షీణించి రూ. 2,535 కోట్ల నుంచి రూ. 2,204 కోట్లకు తగ్గింది. అమెరికాలో విక్రయాలు తగ్గినప్పటికీ.. భారత్ సహా, ఇతర మార్కెట్లలో వ్యాపారం మెరుగ్గానే ఉన్నట్లు సంస్థ చైర్మన్ గ్లెన్ సల్దాన్హా తెలిపారు. ఫలితాల నేపథ్యంలో గురువారం ఎన్ఎస్ఈలో గ్లెన్ మార్క్ షేరు 1.85% లాభంతో 579 వద్ద ముగిసింది.

వామా ఇండస్ట్రీస్ లాభం రూ.1.1 కోట్లు

డిసెంబర్ క్వార్టరు కన్సాలిడేటెడ్ ఫలితాల్లో వామా ఇండస్ట్రీస్ నికరలాభం క్రితంతో పోలిస్తే రూ.1.35 కోట్ల నుంచి రూ.1.1 కోట్లకు తగ్గింది. టర్నోవరు రూ.11 కోట్ల నుంచి రూ.30 కోట్లకు ఎగసింది.

రిలయన్స్ క్యాపిటల్ ఆదాయం 20% వృద్ధి

న్యూఢిల్లీ: అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో రిలయన్స్ క్యాపిటల్ నికర లాభం 50 శాతం పెరిగింది. రూ. 209 కోట్ల నుంచి రూ. 315 కోట్లకు చేరింది. అటు ఆదాయం సైతం 20 శాతం వృద్ధితో రూ. 3,964 కోట్ల నుంచి రూ. 4,771 కోట్లకు చేరుకుంది. మూడో త్రైమాసికంలో అన్ని వ్యాపార విభాగాలు మెరుగైన పనితీరు కనపర్చినట్లు, లాభదాయకత మెరుగుపడినట్లు రిలయన్స్ క్యాపిటల్ తెలిపింది. 2017 డిసెంబర్ 31 నాటికి కంపెనీ మొత్తం ఆస్తుల పరిమాణం 18 శాతం పెరిగి రూ. 92,109 కోట్లకు చేరింది. అసెట్ మేనేజ్‌మెంట్, గృహ రుణాలు, సాధారణ .. జీవిత బీమా, బ్రోకింగ్ తదితర వ్యాపార విభాగాల్లో కంపెనీ కార్యకలాపాలు ఉన్నాయి. గురువారం బీఎస్ఈలో రిలయన్స్ క్యాపిటల్ షేరు సుమారు ఏడు శాతం పెరిగి రూ. 470 వద్ద క్లోజయ్యింది.

బులియన్ రూ.లలో

ముంబై			
బంగారం (99.9, 10గ్రా)	30,005	▼	380
బంగారం (99.5, 10గ్రా)	29,855	▼	380
వెండి (కిలో)	37,670	▼	765
చెన్నై			
బంగారం (24 క్యారెట్లు)	– –		
బంగారం (22 క్యారెట్లు)	28,580	▼	310
వెండి (కిలో)	--		
హైదరాబాద్			
బంగారం (24 క్యారెట్లు)	30,010	▼	320
బంగారం (22 క్యారెట్లు)	28,580	▼	310
వెండి (కిలో)	40,700	▼	800
ప్రొద్దుటూరు (బుధవారం ధరలు)			
బంగారం (24 క్యారెట్లు)	30,850		
బంగారం (22 క్యారెట్లు)	28,610		
వెండి (కిలో)	39,700		
విశాఖపట్నం			
బంగారం(24 క్యారెట్లు)	31,200	▲	160
బంగారం (22 క్యారెట్లు)	28,600	▼	270
వెండి (కిలో)	41,000	▲	100
విజయవాడ			
బంగారం (24 క్యారెట్లు)	30,900	▼	600
బంగారం (22 క్యారెట్లు)	28,550	▼	250
వెండి(కిలో)	39,300	▲	100
ఏపీ బులియన్ అసోసియేషన్			
బంగారం (24 క్యారెట్లు)	30,900	▼	340
బంగారం (22 క్యారెట్లు)	28,580	▼	310
వెండి (కిలో)	38,700	▼	800

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	60.84 (రాత్రి 11.00కు)	$61.79 (బుధవారం ముగింపు)
బ్రెంట్	64.63 (రాత్రి 11.00కు)	$65.51 (బుధవారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 09-2-2018

విశాఖ	340-00
చిత్తూరు	373-00
వరంగల్	347-00
ముంబై	390-00
చెన్నై	380-00
విజయవాడ	335-00
గోదావరి	335-00
నమక్కల్	365-00
08-2-2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	345-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.05
బెంగళూరు	365-00
ఢిల్లీ	365-00
కోల్‌కతా	373-00

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PO	405.1	407
AMBUJA C	261.9	248.3
ASIAN PA	1124.05	1121.1
AXIS BAN	568.45	559.35
BAJAJ AU	3157.95	3135.55
BAJAJ FI	1662.15	1641.65
BHARTI A	429.8	430.25

A B C D

3M INDIA	18515.1	18468.85
5PAISA C	284.75	283.3
63 MOONS	103.1	94.85
8K MILES	760.15	726.2
AARTI DR	612.55	608
AARTI IN	1137.35	1125.65
AARVI EN	88.5	88.2
ABAN OFF	188.85	188.25
ABBOTT I	5463.25	5355.15
ACCEL FR	51.4	50.2
BAYER CR	3958.85	3993.8
BEARDSEL	60.35	58.95
BEML LIM	1246	1212.9
BERGER P	250.8	247.35
BETA DRU	161.9	155
BF INVES	295.05	285.25
BF UTILI	438.9	428.95
BGR ENER	123.4	120.75
BHAGERIA	314.3	307.2
BHANSALI	175.9	167.55
BHARAT B	1347.95	1306.8
BHARAT F	761.2	706.3
BHARAT F	1011.85	1004.95
DHUNSERI	443.6	422.5
DIC INDI	538.9	527.2
DILIP BU	913.6	861.25
DISH TV	73.7	75
DISHMAN	348.65	346.85
DIXON TE	3513.1	3852.25
DOLLAR I	422.05	418.4
DOLPHIN	98.3	98.1
DONEAR I	64.45	63.35
DR. LAL	893.2	873.4
DYNAMATI	1783.8	1831.45
DYNEMIC	190.1	187
GUJ NAR	456.85	439.65
GUJ STAT	129.4	125.55
GUJ. APO	221.75	215.4
GUJARAT	143.15	140.95
GUJARAT	146.45	141.4
GUJARAT	207.35	202.75
GUJARAT	241.3	239.85
GUJARAT	730.15	723.25
GUJARAT	780.35	756
GUJARAT	849.9	858.05
GULF OIL	1012.7	928.45
GULSHAN	85.05	81.85
HARITA S	938.85	920.85
JAYANT A	386.5	353.35
JAYSHREE	107.5	102.4
JBF INDU	185.6	171.05
JBM AUTO	487.8	460.7
JET AIRW	776.55	747
JET FREI	103.7	98.8
JHS SVEN	68.55	67.6
JIND POL	69.65	69.25
JINDAL D	169.85	165.5
JINDAL P	68.95	67.45
JINDAL P	342.75	337.8
JINDAL S	104.6	100.35
JINDAL S	134.9	129.6
MANAKSIA	65.65	64.25
MANAPPUR	108.6	104.3
MANG.CHE	64.75	62.3
MANGALAM	174.75	164.8
MANGALAM	373.85	358.3
MANPASAN	406.2	387.65
MANUGRAP	53.55	50.9
MARATHON	518.75	503.25
MAS FINA	599.3	595.8
MASTEK L	480.25	474.25
MATRIMON	890.4	874.6
MAWANA S	60.35	59.85
MAX FINA	519.25	515.35
PIONEER	194.95	183.65
PLASTIBL	202.1	203.7
PNB HOUS	1228.8	1237.7
PNC INFR	169	166.7
PODDAR H	1157.7	1120.05
PODDAR P	299.75	293.8
POKARNA	212.4	201.9
POLY MED	255.45	251.95
POLYPLEX	481.65	479.75
PONNIE S	172.55	168.6
POWER ME	822.05	791.45
PPAP AUT	580.7	545.1
PRABHAT	192.85	184.5
SHARDA C	395.2	391.65
SHARDA M	2337.35	2276
SHEELA F	1599.9	1615.4
SHEMAROO	539.05	512.45
SHILPA M	514.5	511.1
SHIPPING	76.25	74.2
SHIRPUR	152.75	143.5
SHIVA TE	591.35	570.45
SHIVAM A	80.4	77.35
SHOPPERS	530.6	520.3
SHRADHA	60	56
SHRE PUS	249.65	241.2
SHREE TI	60	55
THE NEW	691.5	674.8
THE PHOE	619.9	615.65
THE RAMC	725.15	730.45
THE RUBY	342.2	335.1
THE STAT	156.85	151.1
THE TINP	240.6	228.4
THEMIS M	586.85	575.6
THERMAX	1197.8	1175.9
THIRUMAL	2000.1	1940.65
THOMAS C	238.75	235.05
THYROCAR	667.55	659.6
TI FINAN	671.95	683.65
TIDE WAT	6693.7	6507.7

టీడీపీ మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మారెళ్ల రాజీనామా!

స్పీకర్ తనయుడు దూషించాడని మనస్తాపం

సత్తెనపల్లి: గుంటూరు జిల్లా సత్తెనపల్లి టీడీపీలో మళ్లీ ముసలం మొదలైంది. పట్టణానికి చెందిన 20వ వార్డు సీనియర్ టీడీపీ నాయకుడు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మారెళ్ళ మల్లేశ్వరరావు తన పదవికి గురువారం రాజీనామా చేశారు. రాజీనామా లేఖను మున్సిపల్ చైర్మన్ యెల్లినేడి రామస్వామికి, మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావుకు అందించారు. పట్టణంలో బుధవారం రాత్రి జరిగిన సమావేశంలో అందరి సమక్షంలో స్పీకర్ కోడెల తనయుడు తనను దూషించడాన్ని జీర్ణించుకోలేక మల్లేశ్వరరావు రాజీనామా చేసినట్లు ప్రచారం జరుగుతోంది. కార్యాలయానికి రాకపోవడం ఏమిటని, అంత ఇష్టం లేకపోతే రాజీనామా చేయాలని, అదే వార్డులో మరో నాయకుడిని పెట్టి గెలిపిస్తానంటూ ఆయన ఘాటుగా మాట్లాడినట్లు సమాచారం. అయితే పార్టీ చేపట్టే అన్ని కార్యక్రమాల్లో పాల్గొంటూ, పార్టీ అభివృద్ధి కృషి చేస్తున్న తన గురించి ఈ విధంగా మాట్లాడడంతో మల్లేశ్వరరావు మనస్తాపం చెందినట్లు పలువురు పార్టీ నేతలు తెలిపారు.

ఐటీ శాఖలో రూ.4 కోట్లకు టెండర్?

- రూ.2 కోట్లతో అయ్యే పనులకు రూ.5 కోట్లు
- రూ.కోటితో పూర్తయ్యే పనులకు రూ.2 కోట్లు
- టెండర్ నోటిఫికేషన్ కంటే ముందే పనులు ప్రారంభం
- పనులు మొదలయ్యాక టెండర్ నోటిఫికేషన్
- రూ.4 కోట్లు మంత్రి నారా లోకేశ్ జేబులోకే...!

సాక్షి, అమరావతి బ్యూరో: ప్రభుత్వ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులను టెండర్ల ద్వారా కాంట్రాక్టర్‌కు అప్పగించాలి. కానీ, సీఎం చంద్రబాబు తనయుడు నారా లోకేశ్ మంత్రిత్వ శాఖ అయిన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ కమ్యూనికేషన్ డిపార్ట్‌మెంట్(ఐటీ)లో మాత్రం ఆ నిబంధన అమలు కావడం లేదు. ముఖ్యమంత్రి తనయుడి శాఖ కావడంతో నిబంధనలను పక్కనపెట్టారు. టెండర్ నోటిఫికేషన్ కంటే ముందే తమకు కావాల్సిన సంస్థతో పనులు చేయిస్తున్నారు. ఈ విషయం బయటపడితే ఇబ్బందులు తప్పవన్న ఉద్దేశంతో చివరకు హడావుడిగా టెండర్ నోటిఫికేషన్ ఇచ్చారు. తాము సూచించిన వారికే టెండర్లు దక్కేలా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. మొత్తం రూ.4 కోట్లు కొల్లగొట్టేందుకు స్కెచ్ వేశారు.



టెండర్లు పిలవకుండానే ఐటీ శాఖ కార్యాలయం లోపల పనులు చేస్తున్న దృశ్యం

టెండర్ లేకుండానే పనులా?

విజయవాడ బందర్ రోడ్డులో నూతనంగా నిర్మించిన ఆర్‌అండ్‌బీ శాఖ భవనంలో మూడో ఫ్లోర్‌ను ఐటీ శాఖకు అప్పగించారు. ఆ ఫ్లోర్‌లో ఇంటీరియర్ పనులు చేయించేందుకు ఐటీ శాఖ సూచన మేరకు ఏపీటీఎస్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. టెండర్‌లో పనుల విలువ రూ.5 కోట్లుగా చూపారు. కానీ, కేవలం రూ.2 కోట్లతో పనులు పూర్తి చేయొచ్చని అధికారులు చెబుతున్నారు. నారా లోకేశ్ నుంచి ఆదేశాలు రావడంతో పనుల విలువను రూ.5 కోట్లుగా నిర్ధారించారు. టెండర్లు జారీ చేయకుండానే తమకు అనుకూలమైన పేపర్ క్యాట్ సంస్థతో పనులు జరిపిస్తున్నారు. అంతేకాకుండా అదే సంస్థకు నామినేషన్ విధానంలో మరో రూ.2 కోట్ల విలువైన సివిల్ పనులు అప్పగించారు. ఇందులో మతలబు ఏమిటంటే ఆ పనులను రూ.కోటితో పూర్తి చేయొచ్చు. అంటే అదనంగా రూ.కోటి పెంచేశారు. 15 రోజులుగా ఈ పనులు కొనసాగుతున్నాయి.

పనులు మొదలయ్యాక టెండర్ నోటిఫికేషన్

ఐటీ శాఖ కార్యాలయంలో ఇంటీరియర్ పనులు ప్రారంభమైనా సాంకేతికపరమైన సమస్య తలెత్తకుండా టెండర్ నోటిఫికేషన్ ఇచ్చి ఆన్‌లైన్‌లో ఉంచారు. తొలుత కేవలం రెండు రోజుల గడువే ఇచ్చారు. ఇలాగైతే ఇబ్బందులు తప్పవని గ్రహించి సోమవారం వరకు గడువు పెంచారు. తమకు కావాల్సిన వారు తప్ప ఇతరులు టెండర్‌లో పాల్గొనకుండా ఒత్తిడి తెస్తున్నారు. టెండర్ అర్హత నిబంధనలు పేపర్ క్యాట్, చంద్రహాస్ సంస్థలకు అనుకూలంగా ఉండేలా జాగ్రత్తపడ్డారు. ఇంటీరియర్ పనుల్లో అదనంగా పెంచిన రూ.3 కోట్లు, సివిల్ పనుల్లో అదనంగా పెంచిన రూ.కోటి.. వెరసి మొత్తం రూ.4 కోట్లు కొట్టేసేందుకు పన్నాగం పన్నారు. అంతా అనుకున్నట్లు జరిగితే ఈ సొమ్మంతా చినబాబు కార్యాలయానికి చేరనున్నట్లు తెలుస్తోంది.

భారత ప్రభుత్వం
రోడ్డు రవాణా మరియు హైవేస్ మంత్రిత్వ శాఖ

RFP కోరుతూ ప్రకటన

Bid no. RO/VJA/NHDPIV/2017-18/661/Corr తేది : 08.02.2018

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దిగువ కాంట్రాక్టు ప్యాకేజ్ కోసం అంతర్జాతీయ పోటీ బిడ్డింగ్ ప్రాతిపదికపై అథారిటీ ఇంజినీర్ (AE)ను నియోగించుటకోసం MoRT&H చే పర్యవేక్షణకు జాబితాలోగల అర్హులైన కన్సల్టెంట్ల నుంచి రోడ్ రవాణా & హైవేస్ మంత్రిత్వ శాఖ (MoRT&H) ప్రతిపాదనలు కోరుతోంది.

క్ర. సం.	NH నం.	రాష్ట్రం	ప్రాజెక్ట్ స్ట్రెచ్	ప్రాజెక్ట్ పొడవు (కి.మీ.) / ప్రాజెక్ట్ వ్యయం (రూ. కోట్లలో)	అసైన్‌మెంట్ కాలం (నెలలు)
1	565	ఆంధ్ర ప్రదేశ్	ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో EPC విధానంలో ప్రస్తుతం ఉన్న కి.మీ. 361/330 (దోర్నాల టి జంక్షన్) నుంచి కి.మీ. 420/800 (వెంచల కోన జంక్షన్) వరకు పేవ్డ్ షోల్డర్‌తో రెండు లేన్‌కు NH-565 పునరుద్ధరణ మరియు స్థాయి పెంపుదల	42.31 కి.మీ. / రూ.309.92 కోట్లు	24 నెలలు నిర్మాణ కాలం + 48 నెలలు నిర్వహణ కాలం

పూర్తి బిడ్ డాక్యుమెంట్‌ను 08-02-2018 నుంచి 26-03-2018న 15.00 గం. IST వరకు MoRT&H అధికారిక పోర్టల్ **(www.morth.nic.in)** నుంచి లేదా CPP పోర్టల్ **[https://eprocure.gov.in]**లో చూసి/డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. బిడ్‌ను ఆన్‌లైన్‌లో CPP పోర్టల్ **[https://eprocure.gov.in]**లో 26-03-2018న లేదా ఆలోగా 15.00 గంటల IST వరకు దాఖలు చేయాలి. ఆన్‌లైన్‌లో మరియు హార్డ్‌కాపీగా అందిన బిడ్లు 27-03-2018న 15.00 గం. IST కు తెరువబడతాయి.

ఏ ఇతర విధానం ద్వారానైనా బిడ్ అంగీకరించబడదు. అయితే **కన్సల్టెంట్స్ (RFP సెక్షన్ -II) కు ఇన్విటేషన్ లెటర్‌లోని క్లాజ్ 4.1లోని ఆవశ్యకతల ప్రకారం ఒరిజినల్ బిడ్ డాక్యుమెంట్లను రీజినల్ ఆఫీసర్ కార్యాలయం,** MoRT& H విజయవాడ (ఆంధ్రప్రదేశ్)లో 26-03-2018న లేదా ఆలోగా 15.00 గం. IST వరకు బిడ్డరు భౌతికంగా దాఖలు చేయాలి. రోడ్ రవాణా & హైవేస్ మంత్రిత్వ శాఖ ఏ కారణం చూపకుండా అన్ని బిడ్లను లేదా ఏ బిడ్‌నైనా అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు హక్కు కలిగి ఉందని గమనించవలెను.

రీజినల్ ఆఫీసర్, రోడ్డు రవాణా మరియు హైవేస్ మంత్రిత్వ శాఖ, విజయవాడ
డి.నం. 38-2-3/2, గొర్రెదాలపువ్వు, అమెరికన్ హాస్పిటల్ దగ్గర, పున్నమితోట, విజయవాడ – 520 010.
ఇ-మెయిల్: romorthvijayawada@gmail.com

"ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్"

(దేశీయ వ్యవహారాల మంత్రిత్వ శాఖ)
భారత ప్రభుత్వం

కానిస్టేబుల్ (డ్రైవర్) ఉద్యోగానికి నియామకం
(ఆన్‌లైన్ దరఖాస్తు మాత్రమే)

దళంలో అనుమతించబడే విధంగా దిగువ పే స్కేల్‌లో కానిస్టేబుల్ (డ్రైవర్) యొక్క దిగువ ఖాళీ ఉద్యోగాల భర్తీకి అర్హత గల భారతీయ పురుష అభ్యర్థుల నుంచి ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్ ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతోంది.

ఉద్యోగం పేరు	భర్తీ చేయబడే మొత్తం ఖాళీలు	రిజర్వేషన్ స్థితి			
		UR	SC	ST	OBC (నాన్-క్రీమీ లేయర్)
కానిస్టేబుల్ (డ్రైవర్)	134	47	68	5	14

గమనిక :

ఎ) **బ్యాక్‌లాగ్ ఖాళీలతోపాటు మొత్తం ఖాళీలు ఉన్నాయి మరియు పరిపాలనా కారణాల వలన మారవచ్చును. ఈ ప్రకటన ప్రచురించిన తర్వాత నియామక ప్రక్రియ క్రమంలో మార్పులు చేయు హక్కు ITBPకి కలదు. ఏ కారణం తెలుపకుండా ఏ దశలోనైనా నియామకాన్ని రద్దు చేయు లేదా వాయిదా వేయు హక్కు కూడా ITBPకి కలదు.**

బి) ప్రతీ కేటగిరీలో ఖాళీలలో 10% మాజీ సైనికోద్యోగులకు కేటాయించబడినవి. అర్హత గల లేదా క్వాలిఫైడ్ అభ్యర్థులు అందుబాటులోలేని కారణంగా భర్తీ చేయకుండా ఉన్న మాజీ సైనికులకు కేటాయించబడిన ఖాళీల విషయంలో అవి ఇతర అభ్యర్థులచే భర్తీ చేయబడతాయి.

2. జీత శ్రేణి – పే మ్యాట్రిక్స్‌లోని లెవల్-3 రూ. 21700 – 69100 (7వ CPC ప్రకారం).
3. **www.recruitment.itbpolice.nic.inపై మాత్రమే ఆన్-లైన్ విధానం (ఆఫ్‌లైన్ దరఖాస్తు స్వీకరించబడదు) ద్వారా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించబడును.** జీతం మరియు అలవెన్సులు, అర్హత నిబంధనలు, ఆన్‌లైన్ దరఖాస్తుఫారం పూర్తి చేయు విధానం, నియామక విధానం మరియు పరీక్షలు మొదలైన వాటికి సంబంధించి వివరమైన సమాచారం కోసం దరఖాస్తుదార్లు ITBP వెబ్‌సైట్ అంటే www.itbpolice.nic.in & www.recruitment.itbpolice.nic.inలో మరియు **10 ఫిబ్రవరి, 2018 నాటి ఎంప్లాయ్‌మెంట్ న్యూస్/రోజ్‌గార్ సమాచార్** ప్రకటనను పరిశీలించవలసిందిగా దరఖాస్తుదార్లకు సూచించడమైనది. దరఖాస్తుదార్లు దరఖాస్తు చేయడానికి ముందు జాగ్రత్తగా అర్హతా ప్రమాణాలను చదువుకోవలసిందిగా సూచించడమైనది.

ఆన్‌లైన్ దరఖాస్తు కోసం ప్రారంభ తేదీ 14-02-2018 మరియు ఆన్‌లైన్ దరఖాస్తు స్వీకరణకు ముగింపు తేదీ / ఆఖరు తేదీ 15-03-2018.

సం/- DIG (Estt. & Rectt.)

davp 19143/11/016/1718

ఏపీలో పెట్టుబడులు పెట్టండి

- దుబాయ్ ఎమిరేట్స్‌కు సీఎం చంద్రబాబు విజ్ఞప్తి
- సానుకూలంగా స్పందించిన ఎమిరేట్స్

సాక్షి, అమరావతి: విమానయాన రంగంలో ఏపీ ప్రభుత్వంతో కలసి జాయింట్ వెంచర్ ప్రారంభించాలని దుబాయ్ ఎమిరేట్స్, ఏరో స్పేస్ సంస్థలను సీఎం చంద్రబాబు కోరారు. గురువారం దుబాయ్‌లో దుబాయ్ ఎమిరేట్స్, దుబాయ్ నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ చైర్మన్ షేక్ అహ్మద్ బీన్ సయీద్ అల్ మక్తూమ్‌తో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జరిగిన చర్చల్లో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఎయిర్ క్రాఫ్ట్స్ తయారీ, విమానాల ఇంటీరియర్, డ్యూరబుల్స్ తయారీ కేంద్రాలను ఏపీలో ఏర్పాటు చేసేందుకు ఎమిరేట్స్ గ్రూప్ ముందుకు వచ్చింది. అలాగే ఏవియేషన్ శిక్షణ కోసం ఒక అకాడమీని నెలకొల్పాలని, మెయింటెనెన్స్ రిపేర్ అండ్ ఓవర్ హాల్ సదుపాయాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు సీఎం సమక్షంలో ఏపీ ఆర్థిక అభివృద్ధి మండలి (ఏపీఈడీబీ)తో ఎమిరేట్స్ గ్రూప్ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం ఎమిరేట్స్ గ్రూపు, ఏపీఈడీబీలు కలిసి వర్కింగ్ గ్రూపులు ఏర్పాటు చేస్తాయి. ఏరోస్పేస్ సంబంధిత మౌలిక సదుపాయాలు, తయారీ పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు.. వాటిల్లో ఎమిరేట్స్ పెట్టుబడులు పెట్టేందుకు గల అవకాశాలను ఈ



సీఎం చంద్రబాబు సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న దుబాయ్, ఏపీ అధికారులు

వర్కింగ్ గ్రూపులు పరిశీలిస్తాయి. కాగా, దుబాయ్ ఎయిర్‌పోర్టు ఫ్రీ జోన్ అథారిటీ డైరెక్టర్ జనరల్, దుబాయ్ సిలికాన్ ఒయాసిస్ అథారిటీ వైస్ చైర్మన్, దుబాయ్ ఏరో స్పేస్ డైరెక్టర్ డాక్టర్ మహమ్మద్ అల్ ఝరూనీతో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. ఏపీలో ఏరో సిటీ ఏర్పాటు సన్నాహాల్లో ఉన్నామని, ఇందుకోసం సౌదీ అరేబియా ఫైనాన్షియర్స్‌తో కలిసి పనిచేస్తున్నట్లు ఝరూనీ సీఎంకు వివరించారు. కాగా, లులూ గ్రూప్ ప్రతినిధులు సీఎంను కలిసి విశాఖలో తాము ఏర్పాటు చేయనున్న కన్వెన్షన్ సెంటర్‌కు సంబంధించిన ఆకృతులను చూపించారు. ఆర్థిక మంత్రి యనమల, ప్రభుత్వ సలహాదారుడు పరకాల ప్రభాకర్, సీఎం ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్, మౌలిక వసతుల శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్, ఏపీ ఈడీబీ సీఈవో కృష్ణకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తుత్తి పోరాటాలు కట్టిపెట్టి..
మంత్రులతో రాజీనామా చేయించు

- అన్ని పార్టీలను కలుపుకొని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి
- సీఎం చంద్రబాబుకు వామపక్ష పార్టీల నేతలు డిమాండ్

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రయోజనాల విషయంలో సీఎం చంద్రబాబు స్పష్టమైన వైఖరి ప్రకటించకుండా దోబూచులాట ఆడుతున్నారని వామపక్ష పార్టీల నేతలు మండిపడ్డారు. విజయవాడలోని సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో గురువారం జరిగిన మీడియా సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.మధు మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ఉత్తుత్తి పోరాటాలు మానుకోవాలని హితవు పలికారు. పార్లమెంట్‌లో నిరసనల పేరుతో కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా చిత్తశుద్ధి ఉంటే కేంద్ర మంత్రులుగా ఉన్న టీడీపీ ఎంపీలతో రాజీనామా చేయించి బయటకు వచ్చి మాట్లాడితే విలువ ఉంటుందన్నారు. అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని కేంద్రంపై ఒత్తిడితెచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని, దీనిపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. పవన్‌కళ్యాణ్ జేఏసీ ప్రకటనపై మధు స్పందిస్తూ దానిపై స్పష్టమైన విధి విధానాలేవీ తమ దృష్టికి రాలేదన్నారు. సీపీఐ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ ప్రధాని స్థాయిలో ఉన్న మోదీ పార్లమెంట్‌లో మాట్లాడుతూ అంజయ్యను దళిత నాయకుడిగా ప్రకటించడం సరికాదని తప్పుబట్టారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎవరు పనిచేసినా ఆహ్వానిస్తామన్నారు. వై.వెంకటేశ్వరరావు(సీపీఎం), రావుల వెంకయ్య(సీపీఐ), డి.హరనాథ్(సీపీఐఎంఎల్ లిబరేషన్), రామారావు(సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసి), పోలారి(సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసి), శివయ్య (ఎంసీపీఐ)లు మాట్లాడుతూ రాష్ట్ర విభజన హామీల అమలు కోసం చేపట్టిన బంద్‌ను విజయవంతం చేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం తమ పోరాటం సాగుతుందని, ఈ నెల 13, 14 తేదీల్లో మరోసారి వామపక్ష నేతలు సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

స్టాక్‌మార్కెట్ పతనంతో
యువ వ్యాపారి ఆత్మహత్య

నాదెండ్ల (చిలకలూరిపేట): స్టాక్ మార్కెట్ పతనంతో భారీ నష్టానికి గురైన ఓ యువ వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం వెలుగులోకొచ్చింది. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా నాదెండ్ల మండలం గణపవరం గ్రామానికి చెందిన సవరాల ప్రదీప్ (30) ఎంబీఏ చదివి.. హైదరాబాద్‌లో గత పదేళ్లుగా ఉంటూ షేర్ల కొనుగోళ్లు, అమ్మకాలు చేస్తుంటాడు. నాలుగు రోజుల క్రితం ప్రపంచ, దేశీయ మార్కెట్లు పతనమవడంతో ప్రదీప్‌కు రూ.25 లక్షలు నష్టం వాటిల్లింది. ఒక్కసారిగా పెద్దమొత్తంలో నష్టాలపాలు కావటంతో హైదరాబాద్ నుంచి బుధవారం గణపవరం వచ్చాడు. ఆ సమయంలో తల్లి శివమ్మ కూలి పని నిమిత్తం వెళ్లగా, తాళాలు పగలగొట్టి ఇంట్లోకి వెళ్లి తనతో తెచ్చుకున్న నైలాన్ తాడుతో ఫ్యానుకు ఉరివేసుకున్నాడు. తాను సంపాదించుకున్న సొమ్మును పోగొట్టుకున్న కారణంగా ఆత్మహత్య చేసుకుంటున్నానని ప్రదీప్ ఆత్మహత్య లేఖ రాశాడు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్, ఏలూరు వారి ఉత్తర్వులు
ఆర్.ఓ.సి.నం. ఇ- 763172/2017/R&R, తేది:08-02-2018

(2013 వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టమునకు రూపొందించబడిన సెక్షన్ ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 19, సబ్ రూల్ (1), ననుసరించి ఇయ్యబడిన రూడీ ప్రకటనకు చేర్పులు)

అడెండం రూడీ ప్రకటన

పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ వలన కుక్కునూరు మరియు వేలేరుపాడు మండల గ్రామములలో ముంపుకు గురి అగుచున్న భూములకు చెందిన గిరిజనేతర నిర్వాసితులకు ఇండ్ల స్థలంయులు మంజూరు చేయుటకు పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్, ఏలూరు వారిచే భూసేకరణ చట్టం 2013 నకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు నిర్దేశించిన 19(1) నిబంధనల ప్రకారం పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్, ఏలూరు వారి ఉత్తర్వులు ఇ - 763172/2017/ ఆర్ & ఆర్, తేది:14-12-2017 దాఖలా ప్రచురణ చేయబడి ఆంధ్రప్రదేశ్ గెజిట్ అసాధారణము ఇష్యూ నెం.123, తేది: 19-12-2017 నందు మరియు దినపత్రికలలో ప్రచురితమైన నోటిఫికేషనుకు చేర్పులు చేయుచు ఇయ్యబడిన నోటిఫికేషన్.

షెడ్యూల్

మండలం : జంగారెడ్డిగూడెం — గ్రామము : తాడువాయి

క్రమ సంఖ్య	సర్వే నెం.	మొత్తం విస్తీర్ణం (యు.సెం.)	భూసేకరణ క్రింద విస్తీర్ణం (యు.సెం.)	భూమి తరగతి (స్వభావం)	అనుభవదారుని పేరు	సరిహద్దులు: ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	కట్టడములు/ చెట్లు
1	8/1A2	3.75	3.75	మెట్ట	బండారు వీరస్వామి తండ్రి. కోటేశ్వరరావు	9	10	8\2	13	పామాయిల్, బోరు-1,పైప్ లైను, డ్రిప్
2				మెట్ట	బండారు రామకృష్ణ తండ్రి. కోటేశ్వరరావు					పామాయిల్, బోరు-1,పైప్ లైను, డ్రిప్
3	22/1	2.25	2.25	మెట్ట	కలుము కన్నప్ప తండ్రి. లక్ష్ముడు	20	22\3	24	19	పామాయిల్, బోరు-1, కొబ్బరి-30,పైప్ లైను, వేప-9, టాడి-25
4	22/3	4.59	4.59	మెట్ట	దోయం చెల్లమ్మ తండ్రి. రాజులు	22\1	19	20	18	పామాయిల్, బోరు-2, కొబ్బరి-40, టాడి-100, వేప-10
5	66/1	0.7	0.70	మెట్ట	గూడూరి సత్యవతి భర్త. భూషయ్య	67	69	70	75	
6	66/3	14.05	14.05	మెట్ట	గూడూరి సత్యవతి భర్త. భూషయ్య					
7	70/2	14.23	14.23	మెట్ట	గూడూరి నాగవాణి	68	71	75	79	
8	70/3	10.45	10.45	మెట్ట	గూడూరి నాగవాణి					
9				మెట్ట	పిన్నమనేని వీరవెంకట సత్యనారాయణ వరప్రసాద తండ్రి. ఈశ్వర రాఘవరావు					పామాయిల్, కోకో, టేకు-8, బోరు-4, షెడ్-2, కొబ్బరి-100, టేకు-170, వేప-60, టాడి-90
10	96/1A3	0.6	0.60	మెట్ట	చెంద్రాల అరుణ	97	98	96\3	100	పెదురు,ఆర్.సి.సి.బిల్డింగ్, బోరు-1
మొత్తం విస్తీర్ణం		50.62	50.62							

ఈ భూముల ప్లాను శ్రీ ఆర్ & ఆర్ అధికారి మరియు పథక నిర్వాహణ అధికారి ఐ.టి.డి.ఎ.కె.ఆర్.పురం వారి కార్యాలయములో ఉంచడం అయినది. దానిని ఈ కార్యాలయపు పనివేళలో ఏ సమయములో అయిన తనిఖీ చేసుకోవచ్చును. ఈ భూసేకరణ వలన నిర్వాసితులైన వారు ఎవ్వరును లేరు.

బొగ్గు గనులు, ఇనుపరాయి, పలకరాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూములో కాని లేదా ఒక ప్రత్యేక భాగములో కాని ఉంటే అటువంటి భూములలో ప్రాజెక్ట్ నిర్మాణమునకు అవసరమైన భూభాగమును మాత్రమే త్రవ్వుట గాని తొలగించుట గాని చేయవలెను.

సం/- **భాస్కర్ కాటంనేని**, జిల్లా కలెక్టర్, పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు.

భారత ప్రభుత్వం
రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ
అథారిటీస్ ఇంజనీర్

ఎంపిక కోసం ప్రతిపాదనకు అభ్యర్థన

రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ (MoRT&H) అర్హులైన కన్సల్టెన్సీ సంస్థల నుంచి జాతీయ రహదారి-765D మీద "EPC ప్రాతిపదిక కాంట్రాక్టుపై తెలంగాణ రాష్ట్రంలో పేవ్డ్ షోల్డర్స్‌తో రెండు లేన్ / ఫోర్ లేన్‌కు ప్రస్తుత కి.మీ. 15.970 (డిజైన్ కి.మీ. 0.0) నుండి ప్రస్తుత కి.మీ. 78.700 (డిజైన్ కి.మీ. 62.92) వరకు హైదరాబాద్ ఔటర్ రింగ్‌రోడ్ నుండి మెదక్ సెక్షన్ పునరుద్ధరణ మరియు స్థాయి పెంపుదల" ప్రాజెక్ట్ యొక్క పర్యవేక్షణ కోసం RFP కోరుతోంది. ఆంగ్ల భాషలో బిడ్ డాక్యుమెంట్ యొక్క పూర్తి సెట్‌ను 09-02-2018 నుండి 02-04-2018 (15:00 గం. IST వరకు) MoRT&H పోర్టల్ **http://www.morth.nic.in** నుంచి లేదా భారత ప్రభుత్వ సెంట్రల్ పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్ (CPP) పోర్టల్ **[https://eprocure.gov.in]** లో చూసి / డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. ప్రతిపాదనను 02-04-2018న(15:00 గంటల IST వరకు) లేదా ఆలోగా **[https://eprocure.gov.in]** వద్ద ఆన్‌లైన్‌లో మాత్రమే దాఖలు చేయవలెను. RFP **"INFRACON"** పోర్టల్ **(www.infracon.nic.in)**లో అప్‌లోడ్ చేయబడినది. అందుచేత ప్రతిపాదనలు దాఖలు చేసేముందు కన్సల్టెంట్లు తప్పనిసరిగా తమకు తాము (సంస్థ మరియు ప్రధాన సిబ్బంది అందర్నీ) MoRT&Hలో మరియు INFRACON పోర్టల్‌లో జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకొని వాటి వివరాలు RFPతోపాటు పొందుపరచాలి. తదుపరి వివరాలను **http://www.morth.nic.in** లేదా **https://eprocure.gov.in** లో చూడవచ్చును.

దక్షిణ మధ్య రైల్వే

మమ్మల్ని అనుసరించండి @SCRailwayIndia
ద.మ. రైల్వే టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడవచ్చును

ఇ-టెండరు కోరుతూ ప్రకటన (http://ireps.gov.in ద్వారా) PUB/0171

దిగువ తెలిపిన పనుల కొరకు భారత రాష్ట్రపతి తరఫున డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, కన్‌స్ట్రక్షన్, ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్, దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ వారు సింగిల్ ప్యాకెట్ టెండరింగ్ విధానంలో ఇ-టెండరు కోరుచున్నారు.

1) NIT No. : E29/C/TRD/SC/28/2017-18, తేది 06-2-2018
పని పేరు: టెండరు నం. E29/C/TRD/SC/28/2017-18 తేది: 6-2-2018: దక్షిణ మధ్య రైల్వేలోని గుంటూరు-గుంతకల్ సెక్షన్ పైన పెండేకల్లు (సహా) మరియు డోన్ (సహా) మధ్య డబ్లింగ్ దృష్ట్యా ప్రస్తుత OHE కి మోడిఫికేషన్స్‌తో సహా 65 Sq. mm కేటనరీ వైర్ మరియు 107/150Sq.mm HDG కాపర్ కంటాక్ట్ వైర్ LT సప్లయ్ ట్రాన్స్‌ఫార్మర్ స్టేషన్స్‌తో 25 KV, 50 HZ సింగిల్ ఫేజ్ a.c. ట్రాక్షన్ ఓవర్‌హెడ్ ఎక్విప్‌మెంట్ డిజైన్, సరఫరా, స్థాపన, పరీక్షించుట మరియు పనిచేయించుట.
అంచనా విలువ :రూ. 13,34,47,472.60
బయానా : రూ. 8,17,240/-
డాక్యుమెంట్ ధర : రూ. 10,000/-
పూర్తి చేయవలసిన కాలము: 15 (పదిహేను) నెలలు
ముగింపు తేది :12-03-2018న 15.00 గంటలకు.

2) NIT No. : E29/C/TRD/SC/29/2017-18, తేది 06-2-2018
పని పేరు: టెండరు నం. E29/C/TRD/SC/29/2017-18 తేది: 6-2-2018: దక్షిణ మధ్య రైల్వేలోని గుంటూరు-గుంతకల్ సెక్షన్ పైన నల్లపాడు (సహా), సతులూరు (సహా) మధ్య డబ్లింగ్ దృష్ట్యా ప్రస్తుత OHE కి మోడిఫికేషన్స్‌తో సహా 65 Sq. mm కేటనరీ వైర్ మరియు 107/150 Sq.mm HDG కాపర్ కంటాక్ట్ వైర్ LT సప్లయ్ ట్రాన్స్‌ఫార్మర్ స్టేషన్స్‌తో 25 KV, 50 HZ సింగిల్ ఫేజ్ a.c. ట్రాక్షన్ ఓవర్‌హెడ్ ఎక్విప్‌మెంట్ డిజైన్, సరఫరా, స్థాపన, పరీక్షించుట మరియు పనిచేయించుట.
అంచనా విలువ :రూ. 18,03,81,627.80
బయానా : రూ. 10,51,910.00
డాక్యుమెంట్ ధర: రూ. 10,000/-
పూర్తి చేయవలసిన కాలము: 15 (పదిహేను) నెలలు
ముగింపు తేది :12-03-2018న 15.00 గంటలకు.

3) NIT No. : E29/C/TRD/SC/30/2017-18, తేది 06-2-2018
పని పేరు: టెండరు నం. E29/C/TRD/SC/30/2017-18 తేది: 6-2-2018: దక్షిణ మధ్య రైల్వేలోని బల్లార్ష- విజయవాడ సెక్షన్‌లో రాఘవాపురం మరియు వరంగల్ స్టేషన్ల మధ్య ప్రతిపాదిత 3వ లైన్ దృష్ట్యా ప్రస్తుత SSPs / SPs వద్ద మోడిఫికేషన్స్‌తో పాటు కొత్త SSPs/SPs డిజైన్, సరఫరా, స్థాపన, పరీక్షించుట మరియు పని చేయించుట.
అంచనా విలువ :రూ. 7,62,07,664.00
బయానా : రూ. 5,31,040.00
డాక్యుమెంట్ ధర: రూ. 10,000/-
పూర్తి చేయవలసిన కాలము: 18 (పద్దెనిమిది) నెలలు
ముగింపు తేది :12-03-2018న 15.00 గంటలకు.

1) బిడ్ డాక్యుమెంట్ మరియు ఇతర వివరాల కోసం వెబ్‌సైట్ https://ireps.gov.inకు లాగిన్ కండి
2) కాంట్రాక్టర్లు నెట్ బ్యాంకింగ్, డెబిట్ కార్డు క్రెడిట్ కార్డు మొ॥ వాటి IREPS పోర్టల్‌లో లభించే ఆన్‌లైన్ పేమెంట్ విధానాల ద్వారా మాత్రమే టెండరు డాక్యుమెంట్ ధర మరియు బయానా నిమిత్తం ఈ టెండరుకు సంబంధించి చెల్లింపులు జరిపేందుకు అనుమతించబడతారు. డిమాండ్ డ్రాఫ్ట్, బ్యాంకర్స్ చెక్, డిపాజిట్ రిసీట్స్, FDR లు మొ॥ వాటి ద్వారా మాన్యువల్ చెల్లింపులు అనుమతించబడవు.
3) టెండరుదారు టెండరు దాఖలు కాలంలో వారి ఆఫర్లను ఆన్‌లైన్‌లో దాఖలు చేయాలి. అవి టెండరు ముగింపునకు పదిహేను రోజుల ముందు ఉంటుంది.
4) టెండరుదారు టెండరు దాఖలు కాలము ప్రారంభమయ్యే తేది వరకు ఏవేని సవరణలను (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేసినవి) కోసం చూడవలెను.

డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, కన్‌స్ట్రక్షన్/ TRD, సికింద్రాబాద్

ఓపెన్ ఇ-టెండరు ప్రకటన నం. DRM/EnHM/BZA/21/LD/COA & MTM/ 2018, తేది: 06-02-2018 PUB/0172

దిగువ తెలిపిన పనుల కొరకు భారత రాష్ట్రపతి తరఫున క్రింది సంతకందారు ప్రతిదానికి ఎదురుగా తెలిపిన తేదిన మరియు 15.00 గం. వరకు ఇ-టెండర్లు కోరుతున్నారు.

టెండరు నం. EnHM/BZA/21/LD/COA&MTM/2018
పని పేరు: కోచింగ్ డిపో COA నుండి ప్రారంభమయ్యే ట్రైన్ నం.లు 12737/38 గౌతమి ఎక్స్‌ప్రెస్ (COA-SC-COA) & 12775/76 కోకనాడ ఎక్స్‌ప్రెస్ (CCT-SC-CCT) మరియు కోచింగ్ డిపో MTM నుండి ప్రారంభమయ్యే ట్రైన్ నం. 12749/50 ఎక్స్‌ప్రెస్ (MTM-SC-MTM) కోసం AC కోచ్ అటెండెంట్స్ ఎస్కార్టింగ్‌తో సహా లినెన్ బెడ్ రోల్స్ పంపిణీ.
పూర్తి చేయవలసిన కాలం : ప్రారంభ తేది నుండి 02 సంవత్సరాలు
టెండరు కోరిన విలువ : రూ. 66,83,198/-
బయానా : రూ. 1,33,670/-
టెండరు డాక్యుమెంట్ ధర : రూ. 5,000/-
ముగింపు తేది మరియు సమయం : 13-03-2018న 15.00 గం.కు.

ఏదైనా టెండరు కోసం ఏవైనా మార్పులు /సవరణలను గమనించేందుకు టెండరు ముగింపు తేదికి ముందు వెబ్‌సైట్ **"www.ireps.gov.in"** దర్శించవలసిందిగా కాగోరు టెండరుదార్లు సూచించబడుతున్నారు.

డివిజనల్ రైల్వే మేనేజర్ (EnHM), విజయవాడ

టెండరు ప్రకటన
టెండరు ప్రకటన నం.: Y.M.III. DSL.MLY.13.Bogie 2018-20
తేది : 02.02.2018 PUB/0173

దిగువ తెలిపిన పనుల కోసం ఇదే తరహా పనులను నిర్వహించుటలో గతానుభవం గల బిడ్డర్ల నుండి 12.03.2018న 15.00 గం.వరకు క్రింది సంతకందారు ఆన్‌లైన్ టెండరు కోరుతున్నారు.

టెండరు నం. & తేదీ : Y.M.III.DSL-MLY. 13.Bogie 2018-20 తేది: 02.02.2018 **పని వివరణ :** రెండు సంవత్సరాల (ఇరవై నాలుగు క్యాలెండర్ నెలలు) కాలానికి సంస్థ ప్రిమిసెస్ వద్ద డీజిల్ లోకో షెడ్ మౌలాలిలోని డీజిల్ లోకో మోటివ్స్ (WDM2/WDM3A/WDG3A/WDS6) యొక్క బోగీ ఫ్రేమ్ అసెంబ్లీస్ ఓవర్ హాలింగ్, మొత్తం పరిమాణం: 50 నంబర్లు **హాజరుకావలసిన పరిమాణం:** 50 నంబర్లు **సుమారు విలువ :** రూ. 78,16,762 (డెబ్బై ఎనిమిది లక్షల పదహారు వేల ఏడు వందల అరవై రెండు రూపాయలు మాత్రమే) **GST లేకుండా. డిపాజిట్ చేయవలసిన బయానా :** రూ. 1,56,340/- **కాంట్రాక్ట్ కాలం :** 02 సంవత్సరాలు **టెండరు ఫారం ధర :** రూ, 5,000/-

సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజనీర్/ DSL/మౌలాలి

టెండరు ప్రకటన నం. LGD/L/18/2017-18/OT
తేది : 05.02.2018 PUB/0174

టెండరు నం. LGD/L/18/2017-2018/OT- ఇ-టెండరు-2017-18కి సంబంధించి భారత రాష్ట్రపతి తరఫున వ్యవహరిస్తున్న Dy.CEE/LGDS వారు ఇ-టెండర్లు కోరుతున్నారు. ముగింపు తేది : 20.03.2018న 11.00 గం.లకు. బిడ్డర్లు ముగింపు తేది మరియు సమయం వరకు మాత్రమే తమ ఒరిజినల్/సవరించ బడిన బిడ్లను దాఖలు చేయవలెను. ఈ టెండరుకు సంబంధించి మాన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు మరియు అటువంటి ఏదైనా మాన్యువల్ ఆఫరు స్వీకరించినప్పటికీ తిరస్కరించబడుతుంది.
ఈ టెండరు కోసం టెండరు డాక్యుమెంట్ ధర మరియు బయానా నిమిత్తం చెల్లింపులు చేయడానికి నెట్ బ్యాంకింగ్, డెబిట్ కార్డ్, క్రెడిట్ కార్డ్ మొ॥ వంటి **IREPS** పోర్టల్‌లో లభించే **ఆన్‌లైన్ చెల్లింపు విధానాల ద్వారా మాత్రమే** కాంట్రాక్టర్లు అనుమతించబడతారు. డిమాండ్ డ్రాఫ్ట్, బ్యాంకర్స్ చెక్, డిపాజిట్ రిసీప్టులు, FDR మొ॥వాటి ద్వారా మాన్యువల్ చెల్లింపులు అనుమతించబడవు.

క్ర.సం. 1. **టెండరు నం.** LGD/L/18/2017-18/OT **పని వివరణ:** క్యారేజ్ వర్క్‌షాప్స్ /లాలాగూడ వద్ద 25KW ఆల్టర్నేటర్స్ 30 నం.ల రీవైండింగ్ మరియు రీకండిషనింగ్ **సుమారు వ్యయం :** రూ. 27,19,290 /- (ఇరవై ఏడు లక్షల పంతొమ్మిది వేల రెండు వందల తొంభై రూపాయలు మాత్రమే), **బయానా :** రూ. 54,390/- (యాభై నాలుగు వేల మూడు వందల తొంభై రూపాయలు మాత్రమే), **పూర్తిచేయు కాలం:** అంగీకార లేఖ జారీ తేదీ నుండి 24 నెలలు, **ముగింపు తేది:** 20.03.2018న 11.00 గం.కు.

టెండరు పూర్తి వివరాలను చూసేందుకు నోటీసు బోర్డ్ గల ప్రదేశం: డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ కార్యాలయం, క్యారేజ్ వర్క్ షాప్, లాలాగూడ, సికింద్రాబాద్-500017.

డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, CWS, లాలాగూడ, సికింద్రాబాద్

టెండరు ప్రకటన నం. LGD/L/19/2017-18/OT
తేది : 05.02.2018 PUB/0175

టెండరు నం. LGD/L/19/2017-2018/OT- ఇ-టెండరు-2017-18కి సంబంధించి భారత రాష్ట్రపతి తరఫున వ్యవహరిస్తున్న Dy.CEE/LGDS వారు ఇ-టెండర్లు కోరుతున్నారు. ముగింపు తేది : 20.03.2018న 11.00 గం.లకు. బిడ్డర్లు ముగింపు తేది మరియు సమయం వరకు మాత్రమే తమ ఒరిజినల్/సవరించ బడిన బిడ్లను దాఖలు చేయవలెను. ఈ టెండరుకు సంబంధించి మాన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు మరియు అటువంటి ఏదైనా మాన్యువల్ ఆఫరు స్వీకరించినప్పటికీ తిరస్కరించబడుతుంది.
ఈ టెండరు కోసం టెండరు డాక్యుమెంట్ ధర మరియు బయానా నిమిత్తం చెల్లింపులు చేయడానికి నెట్ బ్యాంకింగ్, డెబిట్ కార్డ్, క్రెడిట్ కార్డ్ మొ॥ వంటి **IREPS** పోర్టల్‌లో లభించే **ఆన్‌లైన్ చెల్లింపు విధానాల ద్వారా మాత్రమే** కాంట్రాక్టర్లు అనుమతించబడతారు. డిమాండ్ డ్రాఫ్ట్, బ్యాంకర్స్ చెక్, డిపాజిట్ రిసీప్టులు, FDR మొ॥వాటి ద్వారా మాన్యువల్ చెల్లింపులు అనుమతించబడవు.

క్ర.సం. 1. **టెండరు నం.** LGD/L/19/2017-18/OT **పని వివరణ:** ట్రావెర్సర్-1కి 120 HP మరియు 35HP మోటార్స్ కోసం VVVF డ్రైవ్స్ సరఫరా, స్థాపన, పరీక్షించుట మరియు పని చేయించుట. **సుమారు వ్యయం :** రూ. 12,15,230 /- (పన్నెండు లక్షల పదిహేను వేల రెండు వందల ముప్పై రూపాయలు మాత్రమే), **బయానా :** రూ. 24,305/- (ఇరవై నాలుగు వేల మూడు వందల ఐదు రూపాయలు మాత్రమే), **పూర్తిచేయు కాలం:** అంగీకార లేఖ జారీ తేదీ నుండి 60 రోజులు **ముగింపు తేది:** 20.03.2018న 11.00 గం.కు.

టెండరు పూర్తి వివరాలను చూసేందుకు నోటీసు బోర్డ్ గల ప్రదేశం: డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ కార్యాలయం, క్యారేజ్ వర్క్ షాప్, లాలాగూడ, సికింద్రాబాద్-500017.

డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, CWS, లాలాగూడ, సికింద్రాబాద్

A0232/18

తదుపరి టెండరు నిబంధనలు /వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం దర్శించండి
వెబ్‌సైట్ : http://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in




డివిలియర్స్ వచ్చేశాడు

విధ్వంసకర బ్యాట్స్‌మన్ ఏబీ డివిలియర్స్ భారత్‌తో నాలుగో వన్డేకు దక్షిణాఫ్రికా జట్టుకు అందుబాటులోకి వచ్చాడు. చేతి వేలి గాయంతో ఏబీ... తొలి మూడు వన్డేలకు దూరమయ్యాడు. ప్రస్తుతం కోలుకోవడంతో చివరి మూడు వన్డేలకు జట్టులోకి ఎంపిక చేశారు. అయితే శుక్రవారం ప్రాక్టీస్ అనంతరమే అతడు నాలుగో వన్డేలో ఆడేది లేనిది తేలనుంది. రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించే కార్యక్రమంలో భాగంగా శనివారం జొహన్నెస్‌బర్గ్‌లోని వాండరర్స్ మైదానంలో జరిగే ఈ మ్యాచ్‌లో సఫారీ జట్టు గులాబీ (పింక్) రంగు దుస్తులతో బరిలోకి దిగనుంది.

ఒకే రోజు 14 వికెట్లు!

శ్రీలంక 222, బంగ్లాదేశ్ 56/4



రజాక్

ఢాకా: శ్రీలంక, బంగ్లాదేశ్ మధ్య జరిగిన తొలి టెస్టులో పరుగుల వరద పారడంతో ఐసీసీ చిట్టగాంగ్ పిచ్‌ను నాసిరకంగా తేల్చింది. ఇప్పుడు దానికి పూర్తి భిన్నంగా రెండో టెస్టులో బౌలర్ల ప్రతాపం మొదలైంది. ఇక్కడి షేర్ ఎ బంగ్లా స్టేడియంలో గురువారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో తొలి రోజే 14 వికెట్లు నేలకూలాయి. తొలుత బ్యాటింగ్ చేసిన లంక 222 పరుగులకే ఆలౌట్ కాగా... అనంతరం ఆట ముగిసే సమయానికి బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 56 పరుగులకే 4 వికెట్లు కోల్పోయింది. ముందుగా బంగ్లా బౌలర్లు రజాక్ (4/63), తైజుల్ ఇస్లామ్ (4/83), ముస్తఫిజుర్ రెహమాన్ (2/17)ల ధాటికి లంక విలవిల్లాడింది. కుషాల్ మెండిస్ (68; 10 ఫోర్లు, 1 సిక్స్), రోషన్ సిల్వా (56; 3 ఫోర్లు, 1 సిక్స్) మినహా మిగతావారు విఫలమయ్యారు. బంగ్లా ఇన్నింగ్స్ కూడా సాఫీగా సాగలేదు. ఓపెనర్లు తమీమ్ ఇక్బాల్ (4), ఇమ్రుల్ కైస్ (19) లతో పాటు తొలి టెస్టు హీరో మోమినుల్ హక్ (0), ముష్ఫికర్ రహీం (1) కూడా తక్కువ స్కోర్లకే పెవిలియన్ చేరారు. లంక బౌలర్లలో లక్మల్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్రస్తుతం లిటన్ దాస్ (24 బ్యాటింగ్), మెహదీ హసన్ (5) క్రీజులో ఉన్నారు.

‘బాటా’తో స్మృతి నడక



న్యూఢిల్లీ: ప్రపంచకప్‌లో అద్భుత ప్రదర్శనతో బ్రాండింగ్ అవకాశం దక్కించుకున్న భారత మహిళా క్రికెటర్ల జాబితాలో తాజాగా స్మృతి మంధాన కూడా చేరింది. ఇటీవలే హర్మన్‌ప్రీత్ కౌర్‌తో సియట్ సంస్థ ఒప్పందం చేసుకోగా...ఇప్పుడు ప్రముఖ పాదరక్షల ఉత్పత్తుల సంస్థ ‘బాటా’ స్మృతితో జత కట్టింది. బాటాకు చెందిన స్పోర్ట్స్ బ్రాండ్ ‘పవర్’కు 21 ఏళ్ల స్మృతి ప్రచారం చేస్తుంది. బుధవారం దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో వన్డేలో మంధాన సూపర్ సెంచరీతో చెలరేగింది. ‘పవర్’కు ప్రచారకర్తగా వ్యవహరించనుండటం పట్ల స్మృతి సంతోషం వ్యక్తం చేయగా...తమతో స్మృతి కలిసి నడవడం ‘బాటా’ విలువను మరింత పెంచుతుందని ఆ సంస్థ ప్రతినిధి సందీప్ కటారియా అన్నారు.

35 ఏళ్ల వరకు ఇలాగే ఆడాలనుకుంటున్నా

అందుకే ఫిట్‌నెస్‌కు అధిక ప్రాధాన్యం

చహల్, కుల్దీప్‌ల బౌలింగ్ అద్భుతం

భారత కెప్టెన్ విరాట్ కోహ్లి



కేప్‌టౌన్: ‘ఈ ఏడాదిలో 30వ పడిలోకి ప్రవేశిస్తున్నా. 34–35 ఏళ్లు వచ్చేవరకు ఇదే తరహాలో ఆడాలని భావిస్తున్నా. అందుకే శారీరక దారుఢ్యానికి అధిక ప్రాధాన్యమిస్తున్నా. దానికి అనుగుణంగా నన్ను నేను మలచుకునేందుకే ఇంతగా శ్రమిస్తాను. ఆహారం విషయంలోనూ జాగ్రత్తలు తీసుకుంటున్నా. ఆ ఫలితం ఇప్పుడు కనిపిస్తోంది. ఆటలో తీవ్రత ఉండాలని కోరుకునే రకం నేను. అది తగ్గితే మైదానంలో ఏం చేయాలో నాకే తోచదు’ అని పేర్కొన్నాడు భారత క్రికెట్ జట్టు కెప్టెన్ విరాట్ కోహ్లి. బుధవారం దక్షిణాఫ్రికాతో మూడో వన్డే ముగిశాక విలేకరుల సమావేశంలో అతడు మాట్లాడాడు. ఈ సందర్భంగా ఇంకేం అన్నాడంటే...

మళ్లీమళ్లీ ఇలాంటి రోజులు...

నిత్యం జట్టు గురించే ఆలోచిస్తే అద్భుతాలు జరుగుతాయి. అలాంటి అనుభూతినే నేను పొందుతున్నా. ఒక అథ్లెట్‌గా ఇలాంటి మరుపురాని రోజులను మళ్లీ మళ్లీ కోరుకోవాలి. బ్యాట్స్‌మన్‌గా, భారత ఆటగాడిగా డ్రెస్సింగ్ రూంలో మంచి వాతావరణాన్ని నెలకొల్పుతున్నందుకు అత్యంత సంతోషిస్తున్నా. కొన్నిసార్లు బ్యాటింగ్‌కు అనుకూల పిచ్‌లపై రాణించి ఉండొచ్చు. కానీ అంతర్జాతీయ స్థాయిలో పరుగులు సాధించడం సులువేం కాదు. క్లిష్టమైన పిచ్‌పై, మంచి బౌలింగ్ దాడిని ఎదుర్కొంటూ చేసిన కేప్‌టౌన్ వన్డే శతకం ప్రత్యేకమైనది. 30వ ఓవర్ తర్వాత పిచ్ నెమ్మదించింది. వికెట్లు కూడా కోల్పోయాం. దీంతో ఆటతీరును పదేపదే మార్చుకోవాల్సి వచ్చింది. వ్యక్తిగత స్కోరు 90ల్లోకి చేరాక కండరాలు పట్టేశాయి. అయినా... జట్టు అవసరాల ముందు దానిని లక్ష్య పెట్టలేదు. ఇంకా ఆడగలిగే శక్తి ఉందని భావించా. ఛేదనలో లక్ష్యం తెలిసిపోతుంది కాబట్టి మనమేం చేయాలో అర్థమవుతుంది. మొదట బ్యాటింగ్‌కు దిగినప్పుడు ఒకరు దూకుడుగా ఆడుతుంటే మరొకరు స్ట్రైక్ రొటేట్ చేయాలి. అవతలివారు అవుటయ్యాక ఆ బాధ్యత మనం తీసుకోవాలి. మూడో వన్డేలో ధావన్ బాగా ఆడుతున్నప్పుడు నేనదే చేశా.

పట్టు సడలించేది లేదు...

వరుసగా నాలుగు (చివరి టెస్టు సహా) విజయాలు సాధించినా పట్టు జారనివ్వం. ఇందుకోసం చాలా కష్టపడ్డాం. జట్టుగా మేమంతా చాలా గర్వపడుతున్నాం. అయినప్పటికీ మా బాధ్యతను సగం మేర కూడా నిర్వర్తించామని అనుకోవడం లేదు. సిరీస్ కోల్పోయే పరిస్థితుల్లో లేం అనే విషయం టీం విశ్వాసాన్ని పెంచుతుంది. అయినప్పటికీ నాలుగో వన్డేకు మరింత పట్టుదలతో బరిలో దిగుతాం. మూడు మ్యాచ్‌లు ఆడాల్సి ఉన్నందున 6–0తో సిరీస్ కైవసం అంటే చాలా దూరం ఆలోచించినట్లు అవుతుంది.

వారికి టెస్టు అవకాశాల గురించి..

ఇక్కడి పరిస్థితుల్లో చహల్, కుల్దీప్ రాణిస్తున్న తీరుకు హ్యాట్సాఫ్. పిచ్‌లు కూడా కొద్దిగా సహకరిస్తుండటంతో ప్రత్యర్థిని చుట్టేస్తున్నారు. విదేశాల్లో ఇలాంటి ప్రదర్శన నమ్మశక్యం కానిది. చివరి రెండు వన్డేల్లో జట్ల మధ్య తేడా వారిద్దరే. భారీ షాట్లు కొడతారనే భయం కూడా లేకుండా బ్యాట్స్‌మెన్‌కు వారు ఊరించే బంతులేస్తున్నారు. తమ బౌలింగ్‌తో ప్రతి ఓవర్‌లో బ్యాట్స్‌మెన్‌కు రెండు, మూడు ప్రశ్నలు మిగులుస్తున్నారు. వారిద్దరిపై జట్టుకు అమిత నమ్మకం ఉంది. ఇక టెస్టుల్లోకి తీసుకోవడం అన్నది ఇప్పుడే చెపాల్సింది కాదు. భవిష్యత్తులో ఏం జరుగుతుందో చెప్పలేం. ప్రపంచకప్‌ను విదేశంలో ఆడబోతున్నాం. ఈ నేపథ్యంలో చహల్, కుల్దీప్ అత్యంత కీలకంగా మారతారని అనుకుంటున్నాం.



చైతన్యరెడ్డిని రనౌట్ చేసిన అనంతరం విదర్భ ఆటగాళ్ల సంబరం

చిత్తుగా ఓడిన హైదరాబాద్

- 237 పరుగులతో విదర్భ ఘన విజయం
- విజయ్ హజారే వన్డే ట్రోఫీ

సాక్షి, హైదరాబాద్: విజయ్ హజారే వన్డే టోర్నీలో వరుసగా రెండు విజయాలు సాధించి జోరు మీదున్న హైదరాబాద్‌కు మూడో మ్యాచ్‌లో ఎదురు దెబ్బ తగిలింది. గురువారం ఇక్కడ జరిగిన గ్రూప్ ‘డి’ మ్యాచ్‌లో విదర్భ 237 పరుగుల భారీ తేడాతో హైదరాబాద్‌ను చిత్తు చేసింది. ముందుగా విదర్భ 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 350 పరుగులు చేయగా... భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో హైదరాబాద్ 34.2 ఓవర్లలో 113 పరుగులకే కుప్పకూలింది. విదర్భ కెప్టెన్ ఫైజ్ ఫజల్ (97 బంతుల్లో 103; 9 ఫోర్లు, 3 సిక్సులు) అద్భుత సెంచరీ సాధించగా... రవి జాంగిడ్ (62 బంతుల్లో 81; 6 ఫోర్లు, 3 సిక్సులు), అపూర్వ్ వాంఖడే (43 బంతుల్లో 66; 3 ఫోర్లు, 3 సిక్సులు) ధాటిగా ఆడారు. హైదరాబాద్ బౌలర్లలో రవితేజకు 2 వికెట్లు దక్కాయి. అనంతరం హైదరాబాద్ ఏ దశలోనూ లక్ష్యాన్ని ఛేదించేలా కనిపించలేదు. గత మ్యాచ్‌లో సెంచరీ చేసిన రోహిత్ రాయుడు (3), అక్షత్ రెడ్డి (6), సందీప్ (7), చైతన్యరెడ్డి (5) ఘోరంగా విఫలమయ్యారు. రెండు మ్యాచ్‌ల నిషేధం పూర్తయిన తర్వాత ఈ మ్యాచ్ బరిలోకి దిగిన కెప్టెన్ అంబటి రాయుడు (21) కూడా తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరడంతో హైదరాబాద్ 43 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో సుమంత్ కొల్లా (30; 2 ఫోర్లు, 1 సిక్స్) కాసేపు పోరాడినా... రవితేజ (7), భండారి (10), మెహదీ హసన్ (0), సిరాజ్ (10)ల వికెట్లు కోల్పోవడంతో లక్ష్యానికి చాలా దూరంలో హైదరాబాద్ ఆట ముగిసింది. విదర్భ బౌలర్లలో కరణ్ శర్మ మూడు, శ్రీకాంత్ వాఘ్ రెండు వికెట్లు పడగొట్టారు.

సింధు గెలిచింది.. భారత్ ఓడింది

చివరి లీగ్‌లో పురుషుల, మహిళల జట్ల పరాజయం ● ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్



అలోర్ సెటార్ (మలేసియా): ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత మహిళల జట్టు కూడా క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధించింది. గురువారం గ్రూప్ ‘డబ్ల్యూ’లో జరిగిన లీగ్ పోరులో భారత్ 1–4తో జపాన్ చేతిలో కంగుతింది. ఈ పోరులో దక్కిన ఒకే ఒక్క విజయాన్ని తెలుగుతేజం సింధు అందించింది. తొలి మ్యాచ్‌లో సింధు 21–19, 21–15తో యామగుచిపై విజయం సాధించింది. ప్రపంచ నాలుగో ర్యాంకర్ సింధు 36 నిమిషాల్లోనే ప్రత్యర్థి ఆటకట్టించింది. అయితే తర్వాత జరిగిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ ఏ ఒక్కరు గెలవకపోవడంతో సింధు శ్రమ వృథా అయింది. శ్రీకృష్ణ ప్రియ 12–21, 10–21తో ప్రపంచ 13వ ర్యాంకర్ సయాక సాటో ధాటికి చేతులెత్తేసింది. డబుల్స్ స్పెషలిస్ట్ అయిన అశ్విని పొన్నప్ప కూడా 13–21, 12–21తో ప్రపంచ 16 ర్యాంకర్ అయ హోరి చేతిలో ఓడింది. దీంతో భారత ఆధిక్యం 1–2కు తగ్గింది. తర్వాత రెండు డబుల్స్ పోటీల్లోనూ ప్రజక్తా సావంత్-సంయోగిత ఘోర్పడే జోడి 17–21, 17–21తో షిహో టనక-కొహరు యోనెమొటో జంట చేతిలో... సిక్కిరెడ్డి-అశ్విని జోడి 18–21, 18–21తో మిసాకి మత్సుటొమొ-అయక తకహషి జంట చేతిలో కంగుతిన్నాయి.

> చివరి మ్యాచ్ ఫలితంతో సంబంధం లేకుండా ఇరు జట్లు క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాయి. శుక్రవారం జరిగే క్వార్టర్స్‌లో పురుషుల విభాగంలో చైనా, మహిళల విభాగంలో ఇండోనేసియాతో భారత జట్లు తలపడతాయి.

పురుషుల జట్టుకూ ఓటమి

గ్రూప్-డిలో ఇదివరకే క్వార్టర్ ఫైనల్స్‌కు చేరిన భారత పురుషుల జట్టు చివరి పోరులో 2–3తో ఇండోనేసియా చేతిలో ఓడింది. మొదటి సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్‌కు 17–21, 17–21తో జొనాథన్ క్రిస్టీ చేతిలో చుక్కెదురైంది. తర్వాత డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి ద్వయం 18–21, 21–18, 24–22తో అహ్‌సాన్-సంజయ సుకముల్జో జోడీపై గెలిచింది. రెండో సింగిల్స్‌లో సాయిప్రణీత్ 21–18, 21–19తో ఆంథోని సినిసుక‌పై గెలుపొందగా... రెండో డబుల్స్‌లో అర్జున్-శ్లోక్ రామచంద్రన్ జంట 21–14, 16–21, 12–21తో అంఘ ప్రతమ-రియాన్ సప్రుత్రో జోడీ చేతిలో, మూడో సింగిల్స్‌లో సుమిత్ రెడ్డి 12–21, 7–21తో మౌలానా ముస్తఫా చేతిలో ఓడిపోయారు.

అంకిత అదరగొట్టినా...


- భారత్‌కు తప్పని ఓటమి
- ఫెడ్ కప్ టెన్నిస్

న్యూఢిల్లీ: ఫెడ్ కప్ వరల్డ్ గ్రూప్ ప్లే ఆఫ్ రేసునుంచి భారత్ నిష్క్రమించింది. సింగిల్స్ విభాగంలో అంకితా రైనా తన అసాధారణ ప్రదర్శన కొనసాగించి మరో విజయం సాధించినా... జట్టుగా భారత్‌కు ఓటమి తప్పలేదు. గురువారం ఇక్కడ జరిగిన ఆసియా ఓసియానియా గ్రూప్–1 టెన్నిస్ టోర్నీలో భారత్ వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఓడింది. ఈ పోరులో కజకిస్తాన్ 2–1తో భారత్‌పై గెలుపొందింది. బుధవారం చైనాతో జరిగిన మ్యాచ్‌లో సంచలన విజయం సాధించిన అంకిత... తన ధాటిని ఈ మ్యాచ్‌లోనూ కొనసాగించింది. సింగిల్స్‌లో ప్రపంచ 253వ ర్యాంకు క్రీడాకారిణి అంకిత 6–3, 1–6, 6–4తో 87వ ర్యాంకర్ యులియా పుటిన్‌త్సెవాను కంగుతినిపించింది. మిగతా మ్యాచ్‌ల్లో భారత అమ్మాయిల వైఫల్యంతో జట్టు ఓడిపోయింది. తొలి మ్యాచ్‌లో కర్మన్ కౌర్ థండి 3–6, 2–6తో జరీనా దియాస్ చేతిలో పరాజయం చవిచూసింది. చివరగా జరిగిన డబుల్స్‌లో అంకిత-ప్రార్థన తొంబారే జోడీ 0–6, 4–6తో జరీనా దియాస్-యులియా పుటిన్‌త్సెవా జంట చేతిలో ఓడింది. ఆసియా ఓసియానియా గ్రూప్–1లో కొనసాగాలంటే గెలవాల్సిన తదుపరి మ్యాచ్‌లో భారత్... హాంకాంగ్‌తో తలపడనుంది.

బుమ్రాను కౌంటీల్లో ఆడించాలి: అక్రమ్

సెయింట్ మోరిట్జ్ (స్విట్జర్లాండ్): భారత పేస్ బౌలర్ల ఇటీవలి ప్రదర్శన పాకిస్తాన్ బౌలింగ్ దిగ్గజం వసీం అక్రమ్‌ను కూడా ఆకట్టుకుంది. గతంతో పోలిస్తే ఈ తరం భారత పేస్ విభాగం చాలా బాగుందని అతను కొనియాడాడు. చిన్న చిన్న మార్పులు చేసుకుంటే రాబోయే ఇంగ్లండ్ సిరీస్‌లో టీమిండియా బౌలర్లు విజృంభిస్తారనడంలో ఎలాంటి సందేహం లేదని అన్నాడు. ‘బుమ్రా కౌంటీ క్రికెట్ ఆడితే మరింత మెరుగవుతాడు. ఇంగ్లండ్ పిచ్‌లపై అనుభవం ఉంటేనే కచ్చితత్వంతో బంతులు వేయగలడు. ఐపీఎల్ సమయంలో కనీసం ఒక నెలపాటు అతడిని కౌంటీ క్రికెట్ ఆడేలా బీసీసీఐ అనుమతిస్తే బుమ్రా మరింత రాటుదేలుతాడు. టీ20 స్పెషలిస్టుగా క్రికెట్‌లో అడుగుపెట్టి టెస్టు ఫార్మాట్లో రాణించాలంటే కాస్త సమయం పడుతుంది. నా దృష్టిలో భువనేశ్వర్ అత్యుత్తమ బౌలర్. దక్షిణాఫ్రికాలో అతడి ప్రదర్శన అసాధారణం. ప్రస్తుత పేస్ దళం ఇంగ్లండ్‌లో రాణించగలదు’ అని అక్రమ్ తెలిపాడు.

చల చల్లగా... సరదా సరదాగా...



ఆల్ప్స్ పర్వతాల నడుమ మ్యాచ్ వేదిక

స్విట్జర్లాండ్‌లోని సెయింట్ మోరిట్జ్‌లో ఐస్ క్రికెట్ సరదాగా సాగింది. గడ్డకట్టిన సరస్సుపై ఏర్పాటు చేసిన మ్యాటింగ్ వికెట్‌పై మైనస్ 12 డిగ్రీల హిమతాపంలో క్రికెట్ దిగ్గజాలు టి20 మెరుపులతో అలరించారు. డాషింగ్ ఓపెనర్ సెహ్వాగ్ (31 బంతుల్లో 62) ఇక్కడ కూడా తన ప్రతాపాన్ని చూపెట్టాడు. అయితే వీరూ జట్టుపై ఆఫ్రిది జట్టు గెలుపొందడం విశేషం. మొదట సెహ్వాగ్ ప్రాతినిధ్యం వహించిన డైమండ్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 164 పరుగులు చేసింది. ప్రత్యర్థి బౌలర్లలో రజాక్ 4 వికెట్లు తీశాడు. తర్వాత ఆఫ్రిది, అక్తర్‌లున్న రాయల్స్ 15.2 ఓవర్లలో 4 వికెట్లకు 166 పరుగులు చేసి గెలిచింది. ఓవైస్ షా (34 బంతుల్లో 74), కలిస్ (26 బంతుల్లో 36) ధాటిగా ఆడారు. శుక్రవారం రెండో టి20 జరుగుతుంది.



మ్యాచ్‌లో ప్రయర్, సెహ్వాగ్, అక్తర్

హంస వాహనంపై విహరించిన మల్లన్న

శ్రీశైలం: శ్రీశైల మహాక్షేత్రంలో జరుగుతున్న మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి ఆది దంపతులైన శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి వార్లు హంస వాహనంపై మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో హంసవాహనంపై ఆవహింపజేసిన స్వామి అమ్మవార్లకు వేదపండితులు విశేష పూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తుల ఆలయ ప్రదక్షిణ అనంతరం ప్రధానాలయ రాజగోపురం గుండా రథశాల వద్దకు చేర్చారు. అక్కడి నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం అంకాలమ్మ గుడి, నందిమండపం మీదుగా బయలు వీరభద్రస్వామి గుడికి.. అక్కడి నుంచి తిరిగి ఆలయ ప్రాంగణానికి చేరింది.



హంసవాహనాధీశులైన ఆది దంపతులకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

నేడు టీటీడీ తరపున మల్లన్నకు పట్టువస్త్రాలు

సంప్రదాయంలో భాగంగా మహాశివరాత్రి రోజున జరిగే శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి వార్ల బ్రహ్మోత్సవ కల్యాణం కోసం తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తరపున పట్టువస్త్రాలను శుక్రవారం సమర్పిస్తారు,

ముక్కంటి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

శ్రీకాళహస్తి: చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో గురువారం ముక్కంటి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలి రోజున భక్తకన్నప్ప ధ్వజారోహణ కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. కైలాసగిరి కొండపై భక్త కన్నప్ప ధ్వజస్తంభానికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి.. ఉత్సవాన్ని వైభవంగా చేపట్టారు. అలంకార మండపంలో భక్త కన్నప్ప ఉత్సవమూర్తితో పాటు స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి మంగళ వాయిద్యాల నడుమ ఉత్సవ మూర్తులను కొండపైకి తీసుకెళ్లి.. సంప్రదాయబద్ధంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ధ్వజస్తంభానికి దర్భతో చేసిన పవిత్రదారాన్ని, వస్త్రాన్ని అలంకరించారు. ప్రత్యేక పూజలు, ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తుడికే తొలిపూజ చేసి... భక్తకన్నప్ప ధ్వజారోహణం పూర్తిచేశారు. అనంతరం పట్టణ పురవీధుల్లో భక్తకన్నప్ప ఉత్సవమూర్తుల ఊరేగింపు నిర్వహించారు.



భక్తకన్నప్ప ధ్వజారోహణం

రాష్ట్రం అట్టుడుకుతుంటే బాబు దుబాయ్ వెళ్తారా?

కేంద్ర ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉంటూ నాటకాలు

- ప్రజల వ్యతిరేకతను బీజేపీపై నెట్టేందుకు కుట్ర
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అంబటి ధ్వజం
- రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెట్టారు: పార్థసారథి



సాక్షి, అమరావతి/విజయవాడ సిటీ: రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రజలంతా రోడ్డెక్కితే.. సీఎం చంద్రబాబు విమానం ఎక్కి దుబాయ్ పర్యటనకు వెళ్లారని వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి అంబటి రాంబాబు ధ్వజమెత్తారు. హక్కుల సాధన కోసం రాష్ట్రం అట్టుడికి పోతుంటే పెట్టుబడుల కోసమంటూ బాబు విదేశాల కెళ్లడం సిగ్గుచేటన్నారు. హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీతో మిత్రపక్షంగా ఎందుకున్నారని అడిగినప్పుడు రాష్ట్రానికి ఎక్కువ నిధులు తీసుకురావడానికే అని చెప్పిన చంద్రబాబు.. నాలుగేళ్లలో ఏమి సాధించారో చెప్పాలని నిలదీశారు.

వీర్రాజు ప్రశ్నకు బదులేదీ?

చంద్రబాబు రెండు ఎకరాల నుంచి రూ.లక్షల కోట్లకు ఎలా అధిపతి అయ్యారని బీజేపీ ఎమ్మెల్సీ వేసిన ప్రశ్నకు ఇప్పటి వరకు సమాధానం ఇవ్వకపోవడంలో ఆంతర్యమేంటని అంబటి ప్రశ్నించారు. ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై గల్లా జయదేవ్ విమర్శలు చేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో అత్యంత అవినీతిపరుడు చంద్రబాబేనని జయదేవ్ తెలుసుకోవాలన్నారు. కేంద్రం పంపిస్తున్న నిధుల్లో బాబు కమీషన్లు తీసుకుంటున్నారని బీజేపీ పెద్దలే చెప్పారన్నారు. జీఎస్టీ వచ్చిందని, ప్రత్యేక హోదా ఇవ్వలేకపోతున్నామని చెబితే ప్యాకేజీకి అంగీకరించామని టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ చెప్పడంపై అంబటి విరుచుకుపడ్డారు.

డ్రామాలాడుతున్నారు..

రాష్ట్ర ప్రజలు బీజేపీ, టీడీపీపై తీవ్రమైన వ్యతిరేకతతో ఉండడంతో ఆ తప్పు బీజేపీపై వేసి చంద్రబాబు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నాడని అంబటి మండిపడ్డారు. సీపీఎం, సీపీఐ, టీఆర్ఎస్, పవన్ కల్యాణ్, బీజేపీతో జత కట్టి పబ్బం గడిచిన తర్వాత వదిలేయడం చంద్రబాబు రాజకీయ నైజమన్నారు. నాలుగేళ్లుగా చంద్రబాబు నిర్లక్ష్యం మూలంగానే విభజన హక్కులు సాధించలేకపోయారన్నారు. కేంద్రంతో భాగస్వాములుగా ఉంటూ నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా బంద్‌లో పాల్గొన్న వారందరికీ పార్టీ తరపున ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

హక్కులను కాలరాశారు..



ఓటుకు కోట్లు కేసులో ఇరుక్కున్న చంద్రబాబు తన స్వార్థం కోసం రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రానికి తాకట్టు పెట్టారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొలుసు పార్థసారథి ధ్వజమెత్తారు. విజయవాడలోని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలంతా రోడ్లపైకి వచ్చి నిరసన తెలుపుతుంటే సీఎం చంద్రబాబు మాత్రం విదేశీ యాత్రలు చేస్తున్నారని మండిపడ్డారు. బంద్‌లో పాల్గొంటున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలు, నేతలను హౌస్ అరెస్టులు చేయడం దారుణమన్నారు. బీజేపీతో కలిసి టీడీపీ నేతలు రాష్ట్ర ప్రజల హక్కులను కాలరాశారన్నారు. మనకు హక్కుగా రావాల్సిన ప్రత్యేక హోదా, పోలవరం, రైల్వేజోన్, స్టీల్ ఫ్యాక్టరీలను తీసుకురాలేకపోయిన చంద్రబాబు.. ఇక పెట్టుబడులు ఏం తీసుకొస్తారని ఎద్దేవా చేశారు.

రౌడీలపై అవసరమైతే కాల్పులు

సాక్షి ప్రతినిధి, చెన్నై: చెన్నై శివార్లలో రౌడీ బృందాలతో జన్మదిన వేడుకలను నిర్వహిస్తూ పోలీసుల కళ్లుగప్పి పారిపోయిన రౌడీ బిను తదితరులను పట్టుకునేందుకు కాల్పులకు సైతం వెనుకాడవద్దని తమిళనాడు ప్రభుత్వం పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు ఆ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

మార్చి 8న ఏపీ బడ్జెట్!

- మార్చి 5 నుంచి 28 వరకు అసెంబ్లీ సమావేశాలు
- 16 రోజులు సభ నిర్వహణకు ప్రాథమికంగా నిర్ణయం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మార్చి 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ నరసింహన్ ప్రసంగంతో బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతాయని అధికార వర్గాలు తెలిపాయి. సప్తమి పర్వదినం సందర్భంగా మార్చి 8వ తేదీన (గురువారం) ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు అసెంబ్లీలో బడ్జెట్ సమర్పిస్తారు. ఆదివారం, ఇతర సెలవు రోజులు పోనూ 16 పనిదినాలు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది. వచ్చే నెల 28వ తేదీన ద్రవ్య వినిమయ బిల్లును ఆమోదించడంతో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగియనున్నాయి. ఈ మేరకు అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు. ప్రభుత్వం నుంచి షెడ్యూల్ అందగానే గవర్నర్ ఆమోదించనున్నారు. అనంతరం అసెంబ్లీ సచివాలయం సమావేశాల తేదీలపై అధికారికంగా బులెటెన్ విడుదల చేయనుంది.

శ్రీవారి ట్రస్టులకు రూ. 1.10 కోట్ల విరాళం



జేఈవో శ్రీనివాసరాజుకు రూ.కోటి డీడీ అందజేస్తున్న ప్రసన్నకుమార్

సాక్షి, తిరుమల: తిరుమల శ్రీవారి ట్రస్టులకు గురువారం రూ.1.10 కోట్లు విరాళంగా అందింది. చెన్నైకి చెందిన గురుచంద్రిక సమితి ట్రస్టు చైర్మన్ కే.వెంకటేశన్.. టీటీడీ వేద పరిరక్షణ ట్రస్టుకు రూ.కోటి విరాళాన్ని ప్రకటించారు. ఆయన తరుపున ప్రసన్నకుమార్ అనే వ్యక్తి జేఈవో కేఎస్ శ్రీనివాసరాజుకు రూ.కోటి విరాళాన్ని డీడీ రూపంలో అందజేశారు. అలాగే కృష్ణాజిల్లా పామర్రుకు చెందిన వ్యాపారవేత్త ఖాజా పెదవేంకటేశ్వరరావు నిత్యాన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళాన్ని అందజేశారు.

హాస్టల్‌పై నుంచి దూకి వైద్య విద్యార్థి ఆత్మహత్య

పరీక్షల ఒత్తిడే కారణమని పోలీసుల అనుమానం



గిరీశ్‌కుమార్ (ఫైల్‌ఫొటో)

కాకినాడ/రాజాం సిటీ: హాస్టల్ పై నుంచి దూకి ఓ వైద్య విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. పరీక్షల ఒత్తిడే కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. వివరాలు.. శ్రీకాకుళం జిల్లా రాజాం మండలం మొగలివలసకు చెందిన లెంక వెంకటరమణ, రాజేశ్వరమ్మల కుమారుడు గిరీశ్‌కుమార్(20) కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సెకండియర్ చదువుతున్నాడు. పరీక్షల నేపథ్యంలో విపరీతమైన మానసిక ఒత్తిడికి గురైన గిరీశ్ గురువారం రాత్రి 7 గంటల సమయంలో హాస్టల్ టెర్రస్ పై నుంచి కిందకు దూకాడు. సహచర విద్యార్థులు ఆస్పత్రికి తరలించేసరికి గిరీశ్ మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న గిరీశ్ తల్లిదండ్రులు కుప్పకూలిపోయారు. గిరీశ్ చదువులో బాగా రాణించేవాడని.. ఇంటర్, ఎంసెట్‌లో అత్యుత్తమ మార్కులు సాధించి వైద్య సీటు సంపాదించినట్టు బంధువులు తెలిపారు. ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని.. ఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడించాలని వారు డిమాండ్ చేశారు.

ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య

కర్నూలు/కల్లూరు రూరల్: ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం కర్నూలులో జరిగింది. నగరంలోని వెంకటరమణ కాలనీకి చెందిన ఆర్టీసీ డ్రైవర్ వెంకటేశ్వర్లు కుమార్తె ప్రశాంతి(20) ఓ ప్రైవేటు కాలేజీలో బీటెక్ సెకండియర్ చదువుతోంది. గురువారం ఉదయం కాలేజీకి వెళ్లిన ప్రశాంతి సాయంత్రం ఇంటికి వచ్చిన తర్వాత తల్లి నాగేశ్వరమ్మతో గొడవ పడింది. వెంటనే తన గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. దీనిపై తండి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రశాంతి ఆత్మహత్యకు గల కారణాలను కుటుంబసభ్యుల నుంచి పోలీసులు ఆరా తీస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో హైకోర్టు ఏర్పాటు చేయాలి

ఉమ్మడి హైకోర్టు వద్ద రాష్ట్ర న్యాయవాదుల నిరసన



హైకోర్టు వద్ద ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహిస్తున్న న్యాయవాదులు

హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లో హైకోర్టును ఏర్పాటు చేయాలని ఏపీ బార్ అసోసియేషన్ కార్యదర్శి బాసిన హనుమంతరావు, న్యాయవాదులు జాగర్లమూడి కోటేశ్వరిదేవి, టి.వేణుగోపాల్, మరికొంత మంది న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వారు హైదరాబాద్‌లోని ఉమ్మడి హైకోర్టు ముందు ప్లకార్డుల ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్రానికి మొండిచేయి చూపారని మండిపడ్డారు. వీరికి తెలంగాణ హైకోర్టు న్యాయవాదులు సంపూర్ణ మద్దతు తెలిపారు. అలాగే కొందరు న్యాయవాదులు రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో ప్రదర్శన నిర్వహించారు.

న్యాయవాదులకు సౌకర్యాలు కల్పించండి

అమరావతిలో ఏర్పాటు చేయనున్న తాత్కాలిక హైకోర్టు భవనంలో న్యాయవాదుల సౌకర్యాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఏపీ హైకోర్టు భవనాల పరిశీలన కమిటీ చైర్మన్ జస్టిస్ వి.రామసుబ్రమణియన్‌ను హైకోర్టు న్యాయవాదుల సంఘం కోరింది. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు చల్లా ధనుంజయ ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం న్యాయమూర్తిని కలిసి వినతిపత్రం అందజేశారు.

23 కేజీబీవీ పాఠశాలలు కళాశాలలుగా మార్పు

సాక్షి, కడప: రాష్ట్రంలోని 23 కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయా (కేజీబీవీ)లను కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ఈ నెల 6న జీవో జారీ చేసింది. రానున్న విద్యా సంవత్సరం నుంచి 23 కస్తూర్బా పాఠశాలలు కళాశాలలుగా మార్పు చెందనున్నాయి. వైఎస్సార్ జిల్లాలోని పెద్దముడియం, వీరబల్లి, శ్రీకాకుళం జిల్లాలోని కోటబొమ్మాళి, సి.సిగడం, విజయనగరం జిల్లాలోని గజపతినగరం, విజయనగరం, విశాఖ జిల్లాలోని మునగపాక, సబ్బవరం, ప్రకాశం జిల్లాలోని సీఎస్‌పురం, జరుగుమల్లి (కె.బిట్రగుంట), గుంటూరు జిల్లాలోని నాదెండ్ల, బెల్లంకొండ (గంగిరెడ్డిపాలెం), నెల్లూరు జిల్లాలోని కావలి, వెంకటగిరి, చిత్తూరు జిల్లాలోని రామకుప్పం (విజలపురం), గంగవరం, అనంతపురం జిల్లాలోని గుమ్మగట్ట (బీటీ ప్రాజెక్టు), పరిగి, కర్నూలు జిల్లాలోని చాగలమర్రి, తుగ్గలి, తూర్పు గోదావరి జిల్లా శంఖవరం (పరిగి), కృష్ణా జిల్లా రెడ్డిగూడెం (రంగాపురం), పశ్చిమ గోదావరి జిల్లా కాకనూరు మండలాల్లోని కేజీబీవీ పాఠశాలలు జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ కానున్నాయి.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
శుక్రవారం, 9-2-2018



గ్రామ దేవతల ఉత్సవాల సందర్భంగా నృత్యం చేస్తూ కల్లు సీసాను నోటితో ఎత్తుతున్న జోగినీ (ఫైల్)

వీడని నీడ

జోగినీ వ్యవస్థ ప్రభావం ఇంకా సమాజాన్ని వేధిస్తూనే ఉంది! ఈ దుర్వ్యవస్థ, దురవస్థ మూలాలు మిగిలే ఉన్నాయి. జోగినీ దురాచారాన్ని రూపుమాపడానికి ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న ప్రయత్నాలు కొద్ది మేర ఫలితాలు ఇస్తున్నప్పటికీ పేదరికం, మూఢత్వం 'జోగిని'ని పూర్తిగా రూపు మాపలేక పోతున్నాయి. ఇప్పటికే జోగినీలుగా ఉన్నవారికి ఉపాధి చూపడంతో పాటు కొత్త వారు రాకుండా ఉండేందుకు కట్టుదిట్టమైన చర్యలు లేకపోవడంతో జోగినీ వ్యవస్థ నిర్మూలన జరగడం లేదు. తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 16 వేల మంది జోగినీలు వివిధ పేర్లతో ఉన్నట్టు అధికారిక లెక్కలే చెబుతున్నాయి. దానికితోడు వ్యవస్థలోకి కొత్తవారు రావడం మరింత ఆవేదన కలిగించే విషయం.

దెప్పి పొడుపులు : శ్యామల కథ

కామారెడ్డి జిల్లాలోని ఓ మారుమూల గ్రామానికి చెందిన శ్యామల (పేరు మార్చాం) కష్టాన్ని వింటే మనుసున్న వారెవరికైనా కళ్లు చెమరుస్తాయి. శ్యామల ఐదేళ్ల ప్రాయంలో ఉండగా అనారోగ్యానికి గురైంది. ఆమె కుటుంబంలో జోగినీ ఆచారం ఉందని, మొక్కుకుంటే నయం అవుతుందని కొందరు సలహా ఇవ్వడంతో శ్యామలను జోగినీగా మారుస్తామని దేవునికి మొక్కుకున్నారు. దేవత అనుగ్రహం వల్లే బతికిందని నమ్మిన తల్లిదండ్రులు పసి వయసులోనే ఆమెను జోగినీగా మార్చారు. అయితే కుటుంబంలో అన్నలతో కలిసి చదువుకున్న శ్యామల ఉన్నత చదువులపై దృష్టి పెట్టింది. ఇటీవల శ్యామల సోదరులు ఆమెకు పెళ్లి చేయాలన్న ఆలోచనకు వచ్చారు. బంధువులతో పెళ్లి సంబంధాల గురించి మాట్లాడారు. ఇంతలోనే శ్యామల తండ్రి అనారోగ్యానికి గురికావడంతో శ్యామల కుటుంబసభ్యులు పెళ్లి ఆలోచన విరమించారు. దేవతతో పెళ్లి చేసిన శ్యామలకు మళ్లీ పెళ్లి చేస్తే అరిష్టమని, అందుకే తండ్రి అనారోగ్యం పాలయ్యాడని శ్యామల బంధువులు శ్యామలను ఇప్పుడు దెప్పిపొడుస్తున్నారు.

వెంటాడే గతం : మమత వ్యథ

నిర్మల్ జిల్లాలోని కుంటాల మండలానికి చెందిన మమత (అసలు పేరు కాదు)ది మరో దీనగాథ. వీళ్ల కుటుంబంలో తరతరాలుగా జోగినీ దురాచారం కొనసాగుతోంది. వీరి తల్లిదండ్రులకు పిల్లలు పుట్టగానే చనిపోవడంతో మమత పుట్టగానే జోగినీగా మారుస్తామని వారు మొక్కుకున్నారు. అందులో భాగంగానే చిన్నతనంలోనే మమతను జోగినీగా మార్చారు. అయితే దురాచారానికి ఎదురు నిలిచిన మమత పోస్టుగ్రాడ్యుయేషన్ చేస్తోంది. అయితే పెళ్లి చేసుకోవడానికి ఎవరూ ముందుకు రాని పరిస్థితుల్లో అప్పటికే పెళ్లయిన మేనబావతో సహజీవనం చేస్తోంది. ప్రస్తుతం మమతకు ఇద్దరు పిల్లలు. టైలరింగ్ చేస్తూ చదువు ఖర్చులు భరిస్తూ జీవనం సాగిస్తోంది. సమాజానికి ఎదురు నిలిచి సొంతకాళ్లపై నిలబడ్డ మమతను దురాచారపు ఆనవాళ్లు అడుగడుగునా వెంటాడుతున్నాయి.

మాలెక్క మా పిల్లలు కావొద్దు



నాకు పదకొండేండ్లకే దేవునితో పెండ్లి చేసి జోగినీగా మార్చిండ్రు. మస్తు కష్టాలు ఎల్లదీసినా. ఎన్నో అవమానాలు ఎదురైనయి. నాకు ఇద్దరు ఆడ పిల్లలు. పిల్లలకు తండ్రి ఎవరంటే ఏం చెప్పతం సార్. అప్పుడే రాజయ్య సార్ మా దగ్గరికి వచ్చిండు. మాకు ధైర్యం చెప్పిండు. హేమలత మేడం, లవణం సార్‌లతో కలిసి ఢిల్లీదాకా పోయినం. మాకు న్యాయం జరగాలని తిరిగినం. నాలెక్క ఎంతో మంది జోగినీలు పడుతున్న కష్టాల నుంచి బయట పడేయడానికి రాజయ్య సార్ తో కలిసి ఊరూరు తిరిగి అందరినీ కూడగట్టినం. ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చినం. అప్పుడు జోగినీలకు రూ.1,500 పింఛన్, మూడెకరాల భూమి ఇయ్యాలన్నారు. నాకు, నాతోటోళ్లకు ఎకరం చొప్పన మాత్రమే భూమి వచ్చింది. మూడెకరాలు ఇయ్యలేదు. పింఛన్ కూడా రాకుండే. ఒంటరి మహిళల పింఛన్ కింద రూ. వెయ్యి ఇస్తున్నరు. మాలెక్క మా పిల్లలు అన్నాయం కావద్దనుకుని వాళ్లకు సదువు చెప్పిచ్చినం. పిల్లలు చదువుకున్నరు. ఉద్యోగాలు లేక ఇబ్బంది పడుతున్నరు. ప్రభుత్వం జోగినీలకు పింఛన్లు ఇయ్యాలె. భూములు ఇయ్యాలె. పిల్లలకు ఉద్యోగాలిచ్చి ఆదుకోవాలె. బతుకుదెరువు ఉంటే అందరితో కలిసిపోతరు. ఈ కష్టాలు పోతయి.

- కామవ్వ, జోగినీ, బొమ్మన్‌దేవ్‌పల్లి, నస్రుల్లాబాద్

పిల్లలకు ఉద్యోగం కల్పించాలి



జోగినీలుగా ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నాం. ఇప్పటికీ ఎదుర్కొంటున్నాం. మేం కొంత అవగాహన వచ్చిన తరువాత మాలాంటి వాళ్లను చైతన్యం చేయడానికి ప్రయత్నిస్తున్నాం. అయితే చాలా మంది మాకు బతుకుదెరువు లేదంటున్నారు. భూములు లేవు. ఉపాధి లేదు. దీంతో చాలామంది ఇప్పటికీ శవయాత్రల్లో నాట్యం చేస్తున్నరు. చాలా మందికి ఇండ్లు కూడా లేవు. తినడానికి తిండి దొరక్క ఎంతో మంది కష్టాలు పడుతున్నరు. జోగినీల పిల్లలకైనా కనీసం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే వారి జీవితాలు బాగుపడతాయి. ప్రభుత్వానికి అప్పట్లో రఘునాథ్‌రావ్ కమిషన్ జోగినీలకు భూములు ఇవ్వాలని చెప్పినా, ఎక్కడా సరిగా ఇవ్వలేదు. భూమి లేదు, ఇల్లు లేదు. చేయడానికి పనులు కూడా లేవు. బతకడం కష్టంగా ఉంది. అందరికీ ఉపాధి అవకాశాలు కల్పించాలి. తద్వారా దురాచారాన్ని నిర్మూలించవచ్చని మేం గూడా కలెక్టర్‌ను కలిసి విన్నవించినం. ప్రభుత్వం ఆలోచన చేయాలె.

- పద్మ, జోగినీ, నాగిరెడ్డిపేట

ఆర్థికంగా బలోపేతం చేయాలి



జోగినీ వ్యవస్థను నిర్మూలించాలని మేం దశాబ్దాలుగా ప్రభుత్వంతో పోరాటం చేశాం. రఘునాథరావ్ కమిషన్ వేసిండ్రు. కమిషన్ ఇచ్చిన సిఫారసులు ఇప్పటికీ అమలు కావడం లేదు. కొందరికి ఎకరం చొప్పన భూములు ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకుంది. జోగినీలుగా ముద్రపడిన అందరికీ భూములు ఇవ్వాలి. వాటిని అభివృద్ధి చేసుకోవడానికి సాయం చేయాలి. వారి పిల్లల చదువులకు సాయం అందించాలి. ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలి. ఆర్థికంగా వారు కష్టాలను అధిగమిస్తేనే ఈ దురాచారాన్ని పూర్తి స్థాయిలో నిర్మూలించవచ్చని ప్రభుత్వానికి సూచించాం. ఇటీవల ఎంపీ కవితను కలిసి విన్నవించాం. మేం నాలుగైదు జిల్లాల్లో తిరిగి సర్వే చేస్తున్నాం. కొత్తగా కూడా జోగినీలు తయారవుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

- రాజన్న, సంఘ వికాస స్వచ్ఛంద సంస్థ చైర్మన్

అమలుకాని సిఫారసులు

జోగినీ వ్యవస్థను రూపుమాపడానికి చేపట్టే చర్యల్లో భాగంగా అప్పటి ఉమ్మడి ప్రభుత్వం వి.రఘునాథ్‌రావ్ కమిషన్‌ను నియమించింది. ఆ ఏకసభ్య కమిషన్ ప్రభుత్వానికి పలు సూచనలు చేస్తూ నివేదిక ఇచ్చింది. అయితే నివేదికలోని సూచనలు ఎక్కువ భాగం అమలుకు నోచుకోలేదు. జోగినీలు ఆర్థికంగా నిలదొక్కుకోవడం కోసం చేపట్టిన చర్యలు లేవు. జోగినీల పిల్లలకు ఉద్యోగాలు కల్పించే విషయాన్ని పూర్తిగా విస్మరించారు. దానికి తోడు జాతరలు, గ్రామ దేవతల ఉత్సవాలు జరిగినపుడు జోగినీల నృత్యాలు ఇంకా కనిపిస్తూనే ఉన్నాయి. ఈ పరిస్థితిని మార్చే చర్యలు కావాలిప్పుడు.

- ఎస్.వేణుగోపాలచారి, సాక్షి, కామారెడ్డి
ఫోటోలు: **అరుణ్**

ప్రతీకారమా?

'ఛీ టూ'...

ఎనభై ఏళ్లు దాటిన హాలీవుడ్ మ్యూజిక్ డైరెక్టర్ క్విన్సీ జోన్స్.. ఇవాంకపై నిందవేయడాన్ని మహిళా లోకం 'ఛీ' కొడుతోంది. 'మీ టూ.. ఛీ' అంటోంది.



● ఇవాంకా



● క్విన్సీ జోన్స్

చూస్తుంటే పురుష పుంగవులు రివర్స్ గేర్‌లో మహిళలపై యుద్ధానికి దిగినట్లే కనిపిస్తోంది! 'మీ టూ' ఉద్యమం మొదలయ్యాక.. కలిసి పనిచేసే చోట మగ ఉద్యోగులు మహిళా ఉద్యోగులతో మాట్లాడ్డం బాగా తగ్గించారని ఒక వైపు సర్వేలు వెల్లడిస్తుంటే.. ఇప్పుడు క్విన్సీ జోన్స్ అనే 84 ఏళ్ల హాలీవుడ్ మ్యూజిక్ డైరెక్టర్.. ఒకప్పుడు తను ఇవాంకా ట్రంప్‌తో డేటింగ్ చేశానని ప్రకటించి ప్రకంపనలు సృష్టిస్తున్నాడు. 'మీ టూ' అంటూ హాలీవుడ్ నటీమణులు ఫలానా వ్యక్తి తమను లైంగికంగా వేధించాడని ఒకరొకరుగా బయటికి వచ్చి చెప్పుకుంటున్న ఈ తరుణంలో క్విన్సీ జోన్స్.. ఇవాంకాతో తనకు ఉన్న సంబంధం గురించి బయట పెట్టడం వెనుక.. 'మీ టూ' ఉద్యమానికి టిట్ ఫర్ ట్యాట్ (తగిన శాస్తి) చేయాలన్న ఉద్దేశం ఉండి ఉండవచ్చునని సామాజిక పరిణామాల పరిశీలకులు భావిస్తున్నారు! ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ టామీహిల్ఫింగర్ దగ్గర జోన్స్ కూతురు కిదాదా పని చేస్తున్నప్పుడు.. అదే ఫీల్డులో ఉన్న ఇవాంకా అక్కడికి వచ్చేవారు. అలా వచ్చి వెళుతున్న సమయంలో ఓసారి.. తనకు క్విన్సీ జోన్స్‌తో కలిసి డిన్నర్ చేయాలని ఉంది అని ఇవాంకా అన్నట్లు కిదాదా ద్వారా జోన్స్‌కి కబురు పంపించాడట టామీ హిల్ఫింగర్. అలా లంచ్ పరిచయం డేటింగ్ వరకు వెళ్లిందని 'వల్చర్' పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పరమ దరిద్రపుగొట్టు పదాలతో వెల్లడించారు క్విన్సీ జోన్స్. ''మేమిద్దరం ఏ టైమ్‌లో డేటింగ్‌లో ఉన్నామో సరిగ్గా చెప్పలేను కానీ కుష్నర్‌తో (ఇవాంకా భర్త) ఇవాంక డేటింగ్ చేయడానికి ముందే అనుకుంటాను. బహుశా 2007లో కావచ్చు'' అని క్విన్సీ జోన్స్ అప్పటి తీపి జ్ఞాపకాలేవో గుర్తు చేసుకోడానికి ప్రయత్నించినట్లుగా పద భావాలు ప్రదర్శించారు. దీనిపై ఇంతవరకు ఇవాంకా కానీ, ట్రంప్‌కానీ ఏమీ స్పందించలేదు. ఇవాంకాకు 2009తో కుష్నర్‌తో పెళ్లయింది. ఆమె భర్తగా కుష్నర్ ఏమైనా స్పందిస్తాడేమో చూడాలి. యు.ఎస్.లోని ప్రముఖ మహిళలంతా మగజాతిపై పగబట్టినట్లు లైంగిక ఆరోపణలు చేస్తున్నారు కాబట్టి, ఆడజాతిపై అక్కడి పురుషజాతి కట్టుకథలతో, ఉత్తుత్తి సర్వేలతో ప్రతీకారం తీర్చుకోబోతున్నారా? 'మీ టూ' లాంటి ఒక మగ ఉద్యమానికి క్విన్సీ జోన్స్ ఆద్యుడు కాబోతున్నాడా? చూడాలి.

ఎమర్జెన్సీ



● పరిణీతి చోప్రా

ఎక్కడున్నావ్ పరీ?! ఎలా ఉన్నావ్ పరీ?!

సరిగ్గా రెండు రోజుల క్రితమే పరిణీతి చోప్రా మాల్దీవుల్లోని తన 'జాలీడేయింగ్' ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆ ఫొటోల్లోని పరిణీతి ముఖంలో.. ఆ దీవుల్లోని అందమంతా ప్రతిఫలించింది. ఏదో పొలిటికల్ సంక్షోభం. 'అయ్యో! మన పరిణీతి ఎలా ఉందో' అని అభిమానులు కలవరపడటం మొదలుపెట్టేశారు. ట్వీటర్‌లో, ఇన్‌స్టాగ్రామ్‌లో, ఫేస్‌బుక్‌లో ఎక్కడ వీలైతే అక్కడ.. బీ సేఫ్ పరీ, టేక్ కేర్ పరీ.. అని పోస్టులు పెట్టేస్తున్నారు. అయితే అటువైపు నుంచి, అంటే...



● మాల్దీవుల నుంచి పరిణీతి పోస్ట్ చేసిన ఫొటోలు

పరిణీతి వైపు నుంచీ రెస్పాన్స్ ఏమీ రాలేదు. దాంతో వీళ్ల కంగారు మరింత ఎక్కువైంది. 'ఎక్కడున్నావ్ పరీ.. ఎలా ఉన్నావ్ పరీ.. ఒక్క పోస్టు పెట్టి వెళ్లిపో పరీ' అని ప్రాధేయపడుతున్నారు. ఎమర్జెన్సీలో పరిస్థితులు ఊహించని విధంగానే ఉంటాయి. అయితే.. ఏ దేశమైనా అలాంటి పరిస్థితుల్లో విదేశీ టూరిస్టుల భద్రతను దగ్గరుండి పర్యవేక్షిస్తుంది. ముందు వాళ్లనే విమానం ఎక్కించి పంపించేస్తుంది. పరిణీతి కూడా నేడో రేపో ఇండియా వచ్చేయొచ్చు. బహుశా ఇప్పుడు ఇండియాకు వచ్చే దారిలో కూడా ఉండి ఉండొచ్చు. కనుక ఆమె ప్రాణాలను తమ అరచేతుల్లో పెట్టుకుని బిక్కుబిక్కుమంటున్న ఫ్యాన్స్... ఆ టెన్షన్ వదిలేసి, విదేశీయానాన్ని విజయవంతంగా ముగించుకుని వస్తున్న పరిణీతి శుభాకాంక్షల్ని సిద్ధం చేసుకోవచ్చు.

చెట్టు నీడ

నన్నిలాక్కూడా బతకనివ్వవా?!

ఒక దీవికి సమీపంలో పడవ మునిగిపోయింది. ఒకే ఒక వ్యక్తి బతికి బట్ట కట్టి దీవి ఒడ్డుకు కొట్టుకువచ్చాడు. అది మనుషులుండే దీవి కాదు. ఇతడొక్కడే మనిషి. భయపడ్డాడు. దేవుడిని ప్రార్థించాడు. నీళ్లలోంచి ఒడ్డున పడేసినందుకు ధన్యవాదాలు తెలిపాడు. ఒడ్డు నుంచి తనను తన దేశానికి చేర్చమని వేడుకున్నాడు. రోజులు గడుస్తున్నా ఏ దేవుడూ అతడి మొర ఆలకించలేదు. చలికి, ఎండకు తట్టుకోలేకపోతున్నాడు. ఒడ్డున ఉన్న చెక్కలతో కష్టపడి చిన్న గది కట్టుకుని ప్రాణాలను నిలుపుకున్నాడు. ఒకరోజు ఆ వ్యక్తి ఆహారాన్ని వెతుక్కుంటూ వెళ్లినప్పుడు ఆకాశంలో దట్టంగా పొగ కనిపించింది. ఆ పొగ ఎక్కడినుంచి వస్తోందా అని ఆ దారి వెంటే వెళితే.. చివరికి తన చెక్కగల గది కాలిపోతూ కనిపించింది. ఆ పొగ తన గదిదే! 'భగవంతుడా.. నన్ను ఇలాక్కూడా బతకనివ్వవా?' అని దేవుడిపై ఆగ్రహించాడు. కొద్దిసేపటికే అక్కడి ఒక నౌక వచ్చింది! అతడిని ఎక్కించుకుంది. ''నేనిక్కడ ఉన్నానని మీకెలా తెలిసింది'' అని సంతోషంగా అడిగాడు ఆ వ్యక్తి. ''ఆకాశంలోకి వ్యాపించిన పొగను చూసి వచ్చాం'' అని చెప్పారు వాళ్లు. దేవుడికి మనసులోనే కృతజ్ఞతలు తెలియజేసుకున్నాడు అతను. దేవుడు ఏ రూపంలో అనుగ్రహిస్తాడో తెలీదు. ఆగ్రహించాడని అనుకుంటాం కానీ.. అది కూడా అనుగ్రహమే అయి ఉంటుంది.

> **రోజులు గడుస్తున్నా ఏ దేవుడూ అతడి మొర ఆలకించలేదు.**


బ్యూటిప్



ఒక టీ స్పూన్ మీగడలో అంతే మోతాదులో నిమ్మరసం కలిపితే హోమ్‌మేడ్ క్లెన్సింగ్ క్రీమ్ రెడీ. దీనిని ముఖానికి పట్టించి సున్నితంగా మర్దన చేసి పది నిమిషాల తర్వాత చన్నీటితో కాని గోరువెచ్చటి నీటితో కాని శుభ్రం చేయాలి. ఇది చర్మానికి టోనర్‌గా పనిచేస్తుంది. చర్మాన్ని తెల్లబరుస్తుంది కూడా.

- రోజుకు ఒక టేబుల్ స్పూన్ తేనెలో అంతే మోతాదులో ఉల్లిపాయరసం కలిపి చప్పరిస్తే క్రమంగా చర్మం కాంతిని సంతరించుకుంటుంది.
- టేబుల్ స్పూను శనగపిండి, ఒకటిన్నర టీ స్పూన్ల నీళ్లు, చెంచాడు తేనె కలిపి ముఖానికి రాసి, పదిహేను నిమిషాల తర్వాత కడిగితే ముఖం కాంతివంతంగా ఉంటుంది.
- నిమ్మరసంలో రెండు టేబుల్ స్పూన్ల పసుపు వేసి బాగా కలిపి ముఖానికి పట్టించి, 20 నిమిషాల తర్వాత చల్లటి నీళ్లతో కడిగితే ముఖం నిగనిగలాడుతుంది.

లవ్ డాక్టర్ | నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

నేను ఒక అమ్మాయిని ప్రేమిస్తున్నా. ఎంతలా అంటే నాకు ప్రతిక్షణం తనే గుర్తొస్తోంది. తనని నేను నాలుగేళ్ల క్రితం కాలేజ్‌లో చూశాను. తనూ నాకు కనెక్ట్ అయింది. మా కాలేజ్ అయిపోయి రెండేళ్లు అయిపోయింది. ఇప్పటికీ తను నాకు టచ్‌లోనే ఉంది. తను మరాఠీ అమ్మాయి. తనకి ప్రపోజ్ చేశా, బట్ నేనంటే తనకి ఇంట్రెస్ట్ లేదని చెప్పింది. కానీ రోజూ నాతో మాట్లాడుతోంది. చాలా క్లోజ్‌గా ఉంటోంది. మా ఇంట్లో ఈ విషయం చెప్పాను. వాళ్లు ఓకే అన్నారు కానీ ఆ అమ్మాయి సైడ్ నుండి నాకు క్లారిటీ రావట్లేదు. తనకి కూడా నేనంటే ఇష్టం అనుకుంటున్నా. కాకపోతే తన ఇంట్లో రెస్పాన్స్ గురించి ఆలోచిస్తుందేమో అని అనిపిస్తోంది. నేను చాలా కన్ఫ్యూజన్‌లో ఉన్నాను. ప్లీజ్ నాకు కొంచెం క్లారిటీ ఇవ్వండి. ఇది లవ్వా? లేక అట్రాక్షనా? చెప్పండి ప్లీజ్.

– సాగర్

హికడే ఆ!

'అంటే ఏంటి సార్?'

తికడే ఝా!

'సార్ షో అప్ చేయకండి.. మీకు మరాఠీలో రెండే ముక్క లొచ్చని...!'

ఇక్కడికి రా..

'వస్తున్నా సార్..'

హికడే ఆ అంటే ఇక్కడికి రా అని..

'ఓ.. తికడే ఝా అంటే అక్కడకి పొమ్మనా సార్??'

ఎంత కరెక్ట్‌గా చెప్పావు నీలాంబరీ?

'దానికి, సాగర్ ప్రేమకు ఏంటి సార్ సంబంధం???'

ఏం లేదు.

మరి...!

అమ్మాయి మరాఠీలో ఏం చెప్పిందో... సాగర్ ఏమని అర్థం చేసుకున్నాడో..

మనోడు తెలుగులో ఏం చెప్పాడో.. అమ్మాయికి ఏం అర్థమయిందో..

ఇక్కడికి పో అంటే ఇక్కడికి రా అనుకున్నాడేమో...

అక్కడికి పో అంటే అక్కడికి రా అనుకున్నాడేమో...

'సార్.. మీ కుళ్లు జోక్‌కి నాకే నవ్వు రావడంలేదు..

ఏడుస్తున్న సాగర్‌కి ఏం నవ్వు వస్తుంది సార్???

ఏదైనా పనికొచ్చే విషయం ఉంటే తెలుగులో చెప్పండి సార్!'

సాగర్... అమ్మాయికి నువ్వంటే ఇష్టం. ప్రేమలేదు.

నీ కంపెనీ అంటే ఇష్టం. నీతో 'ఆ' కనెక్షన్ ఇష్టంలేదు...

నువ్వు ఫ్రెండ్‌గా మాట్లాడ్డానికి ఇష్టం. ముడులేసుకోవడానికి కష్టం అని చెబుతోంది.

'దీన్నిబట్టి మనకు అర్థం ఏం అయిందంటే... సాగర్ చాలా మంచివాడు.

అమ్మాయిలు సాగర్ మంచితనాన్ని నమ్ముతారు. గ్రేట్!

'ఇక సాగర్‌కి లవ్ ప్రాప్తం కాదా సార్?? మంచోడూ.. మంచోడూ... అని అమ్మాయిలంతా ఆటాడుకుంటారా సార్? అన్యాయం సార్, మంచితనానికి రోజులే లేవు సార్!'

అట్లేమీ లేదు. చూస్తూ ఉండు.. సాగర్‌కి గ్రేట్ లవ్ దొరుకుద్ది. 100%..!!

'హికడే ప్రేమ తికడే దొరుకుద్దా సార్..???' అని నవ్వింది నీలాంబరి.

lovedoctorram@sakshi.com

కాసుకో సుడోకు

3		1			7		5	9
8	7	5		2				4
	9		3	1			8	
			4	5	1	9		2
1		3	2	9	6			
	8			6	3		9	
4				8		7	6	3
5	3		9			8		1

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

8	2	5	6	3	9	7	4	1
3	1	6	4	2	7	9	5	8
9	4	7	8	1	5	3	2	6
2	5	1	3	9	6	8	7	4
6	9	4	7	5	8	2	1	3
7	3	8	1	4	2	5	6	9
4	7	2	9	6	3	1	8	5
5	6	9	2	8	1	4	3	7
1	8	3	5	7	4	6	9	2

కాలం నిర్ణయిస్తుంది!


రజనీకాంత్

చిట్టినా? కాలానా? ముందు ఎవరు కమింగ్! ఇదిగో ఇలాంటి చర్చే ఇప్పుడు చెన్నై ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. చిట్టి కంటే ముందే కాలా ప్రేక్షకులను పలకరించబోతున్నాడన్నది తాజా ఖబర్.

అయితే హీరో రజనీకాంత్ మాటలు మాత్రం చిట్టీయే ముందు వస్తాడనే ఫీల్‌ని కలిగిస్తున్నాయి. ''2.0' సినిమాను ఏప్రిల్ 27న రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నాం. కానీ గ్రాఫిక్ వర్క్ ఇంకా జరుగుతోంది. రిలీజ్ అప్‌డేట్‌ను అతి త్వరలో ఎనౌన్స్ చేస్తాం'' అని చెన్నై మీడియాతో రజనీ పేర్కొన్నారు. ''పాలిటిక్స్ పరంగా మీరు, కమల్‌హాసన్ కలిసి వర్క్ చేస్తారా? అని మీడియా వారు అడగ్గా... ''ఆ విషయం కాలం నిర్ణయిస్తుంది'' అని దాటేశారు రజనీ. ఇదిలా ఉంటే.. శంకర్ దర్శకత్వంలో రజనీకాంత్, అక్షయ్ కుమార్, అమీ జాక్సన్ ముఖ్య తారలుగా రూపొందిన '2.0' పై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రాన్ని ఏప్రిల్‌లో రిలీజ్ చేయనున్నట్లు ఎనౌన్స్ చేసింది '2.0' నిర్మాణ సంస్థ లైకాప్రొడక్షన్స్. కానీ గ్రాఫిక్స్ వర్క్ పెండింగ్ ఉండటం వల్ల ఏప్రిల్‌లో రిలీజ్ అయ్యే పరిస్థితి కనిపించడంలేదట. దాంతో 'కబాలి' ఫేమ్ పా. రంజిత్ దర్శకత్వంలో రజనీ చేస్తోన్న 'కాలా'ని ఏప్రిల్‌లో విడుదల చేయాలనుకుంటున్నారట. ఆల్రెడీ షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటోంది. అందుకని 'కాలా' సినిమాను తమిళ సంవత్సరాది వీకెండ్ సందర్భంగా ఏప్రిల్ 12న రిలీజ్‌కు ప్లాన్ చేస్తున్నారన్నది కోలీవుడ్ ఖబర్. అంతేకాదు 2.0 చిత్రాన్ని ఆగస్టు 15న రిలీజ్ చేయాలనుకుంటున్నారట.

ఇద్దరం కలిసి సక్సెస్‌మీట్ పెడతాం


సాయిధరమ్ తేజ్

''రీమిక్స్ సాంగ్స్ కావాలని నేనెప్పుడూ అడగలేదు. అది డైరెక్టర్స్ ఛాయిస్. ఆ రీమిక్స్‌కి నా బెస్ట్ ఇవ్వటానికి కృషి చేస్తాను. నాలుగు రీమిక్స్ సాంగ్స్‌ను ఎంజాయ్ చేస్తూ, బాధ్యతగా చేశాను'' అన్నారు సాయిధరమ్ తేజ్. వీవీ వినాయక్ దర్శకత్వంలో సాయిధరమ్ తేజ్, లావణ్య త్రిపాఠి జంటగా సి.కల్యాణ్ నిర్మించిన 'ఇంటిలిజెంట్' ఈ రోజు విడుదల కానుంది. ఈ సందర్భంగా సాయిధరమ్ తేజ్ మీడియాతో పలు విశేషాలు పంచుకున్నారు.

■ ఇందులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ పాత్రలో కనిపిస్తాను. ఆ క్యారెక్టర్ ఎలా ఉంటుందంటే తన కంఫర్ట్ జోన్ నుంచి బయటకు రావడానికి ఎప్పుడూ ట్రై చేయడు. ఫ్రెండ్స్, పేరెంట్స్ వల్ల కంఫర్ట్ జోన్‌లో నుంచి బయటకు వచ్చే ప్రాసెస్‌లో ఎంత ఇంటిలిజెంట్‌గా బిహేవ్ చేసి, తన వాళ్లను కాపాడుకుంటాడనే పాయింట్‌తో నా క్యారెక్టర్‌ని బిల్డ్ చేశారు.మనకి హెల్ప్ చేసినవాళ్లను ఎప్పుడూ మరచిపోకూడదు. వాళ్లకు అవసరం వచ్చినప్పుడు మనం వాళ్లకు ఉండాలనే మెసేజ్ ఉంది.

■ ఫస్ట్ టైమ్ ఫుల్ లెంగ్త్ కమర్షియల్ మూవీ చేశా. కొత్తగా అనిపించింది. ఆడియన్స్ ఎంజాయ్ చేస్తారనుకుంటున్నాను. ప్రతి సినిమా బ్రేక్ ఇస్తుందనే చేస్తాం. అన్ని సినిమాలకూ ఒకేలా కష్టపడతాం.

■ వినాయక్‌గారు ఏం చెప్పినా చేసేస్తాం. ఆయన అడిగే విధానం అంత బావుంటుంది. అంత కంఫర్టబుల్‌గా ఉన్నప్పుడు మన దృష్టి మొత్తం మన డైలాగ్స్ మీద, మన షాట్స్ మీద పెట్టుకొని ఇంకా బాగా వర్క్ చేయొచ్చు. ఎక్స్‌పీరియన్స్ ఉన్న డైరెక్టర్స్‌తో చేస్తే ఇలా ఉంటుందా? అనిపించింది. నాలో మా ఇద్దరి మావయ్యలు కనిపిస్తారని, వినాయక్‌గారు దాన్ని బెస్ట్‌గా యుటిలైజ్ చేసుకొని ఆడియన్స్‌కు ఇవ్వాలనుకున్నారు. ఆకుల శివగారు రాసిన కథకు ఆయన స్టైల్లో స్క్రీన్‌ప్లే రాశారు. నేనెంత ఇంటెలిజెంట్ అంటే ఒక 60 పర్సెంట్ అనుకుంటున్నాను. కానీ నా గురువులందరూ ఇంటెలిజెంట్సే. ■ నా లాస్ట్ సినిమాల్లో చేసిన తప్పులు ఎనలైజ్ చేసుకుంటున్నాను. డైరెక్టర్స్ అనుకున్నట్టుగానే తీశారు కానీ ఆడియన్స్ ఆశించింది ఇవ్వలేకపోయాం. అది ఎవ్వరి తప్పు కాదు. సినిమా అంటేనే కలెక్టివ్ ఎఫర్ట్. ఎవర్నీ బ్లేమ్ చేయడానికి లేదు. ■ వరుణ్, నేను ఒకేసారి రావాలనుకోలేదు. అది తెలియకుండా జరిగింది. ఇద్దరం కూర్చుని డిస్కస్ చేశాం. కానీ ప్రొడ్యూసర్స్ ఇష్యూ కదా అని చేతులు ఎత్తేశాం. కానీ నాకనిపించింది ఇద్దరం ఒకేసారి హిట్ కొడితే ఆ కిక్కే వేరని. మా మెగా హీరోస్ ఇంతమంది అయ్యేసరికి ఇలా రిలీజ్ డేట్ ఇష్యూ అవుతోంది అంటే.. మాకు ఇదో టెస్ట్ అనుకుంటాను. ప్రేక్షకులకు రెండు సినిమాలు నచ్చుతాయని ఆశిస్తున్నాను. మా సినిమాలు హిట్ అయ్యాక వరుణ్, నేను కలిసి సక్సెస్ మీట్ పెడతాం.

మీ స్పెషల్ ఫ్రెండ్ రెజీనా ఈ మధ్య ఓ యంగ్ హీరోతో లవ్‌లో పడి, కెరీర్ పాడు చేసుకున్నా అన్నారు. మీ ఒపీనియన్?

క్లోజ్ ఫ్రెండే.. కాదనడంలేదు. కానీ తన పర్సనల్ విషయాల గురించి నేను కామెంట్ చేయదలచుకోలేదు.

నువ్వు నన్నేం చేయలేవురా అనలేకపోయా!


అనుష్క

'హలో అండీ... ఎలా ఉన్నారు?' అని స్వీట్‌గా పలకరిస్తారు స్వీటీ. అంతేనా? తెలుగులో చక్కగా మాట్లాడతారు. మరి.. నిత్యామీనన్, రకుల్, అనుపమా పరమేశ్వరన్, సాయిపల్లవి, కీర్తీ సురేశ్, అనూ ఇమ్మాన్యుయేల్.. రష్మిక మండన్నలా అనుష్క తన పాత్రకు ఎందుకు డబ్బింగ్ చెప్పుకోరు? వీళ్లందరికన్నా స్వీటీ సీనియర్. పైగా తెలుగు చక్కగా మాట్లాడతారు. ఇదే విషయం అనుష్క ముందుంచితే – ''నేను తెలుగు మాట్లాడగలను. అయితే.. డబ్బింగ్ చెప్పేంత సాహసం చేయలేను. నా మాట చిన్నపిల్లల మాదిరిగా ఉంటుంది. నేను మాట్లాడుతుంటే పక్కవాళ్లకు కూడా వినిపించదని మా కుటుంబ సభ్యులే అంటుంటారు. అటువంటప్పుడు నేను డబ్బింగ్ చెబితే ఆ పాత్ర ఔచిత్యం దెబ్బతింటుంది. అంతెందుకు? 'అరుంధతి' సినిమాలో 'నువ్వు నన్నేం చేయలేవురా' డైలాగ్ ఇంటి వద్ద చాలాసార్లు ప్రాక్టీస్ చేసినా అంత గట్టిగా చెప్పలేకపోయాను. ఇటీవల వచ్చిన 'భాగమతి' సినిమాలోని 'ఇది భాగమతి అడ్డా' డైలాగ్ కూడా అంతే. ఆ పాత్రలకు తగ్గ గంభీరమైన గొంతు నాకు లేదు. అందుకే డబ్బింగ్ చెప్పడం లేదు'' అన్నారు. పాయింటే కదా.

మళ్లీ ఏక్ దో తీన్


జాక్వెలిన్ ఫెర్నాండెజ్

''ఏక్ దో తీన్..'' అనగానే మనందరికి గుర్తొచ్చేది మాధురీ దీక్షిత్. మోహినిగా తను వేసిన స్టెప్పులను దశాబ్దాలు దాటిపోయినా ఎవ్వరూ మరచిపోయి ఉండరు. మాధురీ దీక్షిత్‌ను ఓవర్ నైట్ స్టార్‌గా మార్చేసి, డ్యాన్సింగ్ క్వీన్ అంటూ బాలీవుడ్ అభిమానుల కితాబులు పొందేలా చేసిందీ సాంగ్. ప్రస్తుతం'భాగీ 2' చిత్రం కోసం ఆ పాటను రీమిక్స్ చేస్తున్నారు. నయా మోహినిగా జాక్వెలిన్ ఫెర్నాండెజ్ కనిపించనున్నారు. టైగర్ ష్రాఫ్, దిశా పటానీ జంటగా అహ్మద్ ఖాన్ దర్శకత్వంలో సాజిద్ నడియాడ్‌వాలా నిర్మిస్తున్న చిత్రం 'భాగీ 2'. 2016లో వచ్చిన 'భాగీ' చిత్రానికి ఇది సీక్వెల్. అప్పుడు మాధురీ కోసం ప్యారీలాల్ కంపోజ్ చేసిన ఆ పాటకు సరోజ్ ఖాన్ కొరియోగ్రఫీ చేశారు. ఇప్పుడు సరోజ్ ఖాన్ శిష్యుడు, 'భాగీ 2' చిత్ర దర్శకుడు ఈ పాటను రీమిక్స్ చేయాలనుకోవడం విశేషం. 'ఏక్ దో తీన్...' సాంగ్‌లో సైడ్ డ్యాన్సర్‌గా కనిపించిన గణేష్ ఆచార్యనే ఈ రీమిక్స్‌కు కొరియోగ్రఫీ చేయడం మరో విశేషం. ఈ సాంగ్ రీమిక్స్ గురించి దర్శకుడు మాట్లాడుతూ – ''ఏక్ దో తీన్' అనే పాట ఆల్ టైమ్ హిట్. గణేష్ మాస్టర్‌ను సేమ్ సరోజ్ ఖాన్ స్టైల్‌లోనే కంపోజ్ చేయమని అడిగాను. అలాగే మాధురీ దీక్షిత్ ధరించిన పింక్ కలర్ డ్రెస్‌ను దృష్టిలో ఉంచుకొనే జాక్వెలిన్‌కు డ్రెస్ డిజైన్ చేయమని మనీష్ మల్హోత్రాను కోరాను. జాక్వెలిన్‌తో ఇంతకు ముందు 'కిక్'లో 'జుమ్మే కీ రాత్ హై', 'రాయ్' సినిమాలో 'చిట్టియన్ కలయ్యా' వంటి సూపర్ హిట్ సాంగ్స్ చేశాం. ఆమె ఫెంటాస్టిక్ డ్యాన్సర్. అందుకే 'ఏక్ దో...' సాంగ్‌ను రీక్రియేట్ చేయటానికి జాక్వెలిన్ మంచి ఛాయిస్ అనుకున్నాను'' అన్నారు. ఈ సాంగ్‌ను మూడు రోజులు షూట్ చేస్తారట. 'భాగీ 2' మార్చి 30న విడుదల కానుంది.


'ఏక్ దో తీన్..' సాంగ్‌లో మాధురీ దీక్షిత్

మాధురీ దీక్షిత్ గురించి సరోజ్ ఖాన్ మాట్లాడుతూ – "బేసిక్‌గా మాధురీ కథక్ డ్యాన్సర్. అందుకే బాలీవుడ్ స్టైల్ పాటలను అడాప్ట్ చేసుకోవటానికి కొంచెం ఇబ్బంది పడేవారు. 'ఏక్ దో...' సాంగ్‌ను నేను కేవలం 20 నిమిషాల్లో కంపోజ్ చేశాను. కానీ ఆ హిప్ మూమెంట్స్‌ను క్యాచ్ చేయటానికి ఆమె బాగా కష్టపడ్డారు. దానికోసం పదిహేడు రోజులు ప్రాక్టీస్ చేద్దాం అనుకున్నాం. ప్రతిరోజు ఉదయం 10 నుంచి రాత్రి 10 వరకూ ప్రాక్టీస్ చేసేవారు. పదో రోజు కల్లా తన స్టెప్స్‌లో పర్ఫెక్ట్ అయ్యారు మాధురి. ఇక ప్రాక్టీస్‌కు రావద్దులే అంటే మిగతా 7 రోజులు కూడా డ్యాన్స్ స్టూడియోకి వచ్చి ప్రాక్టీస్ చేస్తూనే ఉండేవారామె" అన్నారు.

వీరమహాదేవి వచ్చేశారహో!


సన్నీ లియోన్

రాణీ వీరమహాదేవి విచ్చేశారు. బుధవారం స్టార్టైన షూటింగ్ లొకేషన్‌కు వచ్చారు. సిల్వర్ స్క్రీన్‌పై సన్నీ లియోన్ వీరమహాదేవి అనే విషయం తెలిసిందే. వీసీ వడివుడయాన్ దర్శకత్వంలో సన్నీ లియోన్ టైటిల్ రోల్ చేస్తున్న సినిమా 'వీరమహాదేవి'. తమిళ, తెలుగు, మలయాళ భాషల్లో ఏకకాలంలో సినిమాని రూపొందిస్తున్నారు. తెలుగులో 'వీరమహాదేవి' అనే టైటిల్ ఫిక్స్ చేశారు. అంతకుముందు ఐటమ్ సాంగ్స్, స్పెషల్ రోల్స్‌లో అలరించిన సన్నీ సౌత్‌లో హీరోయిన్‌గా చేస్తోన్న తొలి సినిమా ఇది. ఇంకో ఇంట్రెస్టింగ్ మేటర్ ఏంటంటే... ఇందులో నవదీప్ విలన్ రోల్ చేస్తున్నారని సమాచారం. ఈ సినిమా ఎంటైర్ షూట్‌లో ఆల్మోస్ట్ 300 గుర్రాలు అవసరం అవుతాయట. 'క్వీన్' వీరమహాదేవి పాత్ర కోసం కత్తి యుద్ధాలు, గుర్రపు స్వారీ నేర్చుకున్నారు సన్నీ లియోన్.

ఇదిలా ఉంటే సినిమాలో ఆల్మోస్ట్ 50 పర్సెంట్ గ్రాఫిక్స్ వర్క్ ఉండటంతో 'బాహుబలి, 2.0' సినిమాలకు వర్క్ చేసిన టెక్నీషియన్స్‌ను తీసుకున్నారు. ''వీరమహాదేవి షూటింగ్ స్టార్టైంది.. సో ఎగ్జైటెడ్'' అని పేర్కొన్నారు సన్నీ.

కామెడీ సోడా


మానస్, నిత్యనరేష్

మానస్, నిత్య నరేష్, కారుణ్య ముఖ్య తారలుగా తెరకెక్కిన చిత్రం 'సోడ గోలీ సోడ'. మల్లూరి హరిబాబు దర్శకత్వంలో చక్రసిద్ సమర్పణలో ఎస్.బి ఆర్ట్ క్రియేషన్స్ పతాకంపై భువనగిరి సత్య సింధూజ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 16న విడుదల కానుంది. ఈ సందర్భంగా భువనగిరి సత్య సింధూజ మాట్లాడుతూ– ''హాస్యం ప్రధానాంశంగా రూపొందిన చిత్రమిది. తెలుగు చిత్ర పరిశ్రమలోని సీనియర్ కమెడియన్స్ అందరూ మా సినిమాలో ఉన్నారు. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకర్షించే అంశాలున్నాయి. క్వాలిటీ విషయంలో రాజీ పడకుండా అన్ని కమర్షియల్ విలువలతో తెరకెక్కించాం. తప్పకుండా మా సినిమా అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి సహ నిర్మాత: భువనగిరి శ్రీనివాస్ మూర్తి, సంగీతం: భరత్, కెమెరా: ముజీర్ మాలిక్.

ఫ్యాషన్

స్లీవ్ లెస్స





స్లీవ్‌లెస్ జాకెట్స్ తెలుసు కదూ! ఇప్పుడు కాంట్రాస్ట్ స్లీవ్‌లతో స్లీవ్‌లెస్ కంటే కూడా సూపర్‌గా ఉండే స్లీవ్ లెస్స అనిపించే డిజైన్లు ఇవి...



మల్టీకలర్ స్లీవ్స్

చీరకు పూర్తి కాంట్రాస్ట్ కలర్‌లో బ్లౌజ్ ఉంటే పెద్ద డిజైన్ అక్కర్లేదని ముందే అనుకున్నాం కదా! అలాగే పూర్తి కాంట్రాస్ట్ కలర్ ఫ్యాబ్రిక్స్ (ప్లెయిన్ పట్టు, రాసిల్క్, బెనారస్, నెటెడ్... వంటి క్లాత్ అయితే బాగుంటుంది) ఎంపిక చేసుకొని బ్లౌజ్ బాడీ పార్ట్‌కి ఒకే కలర్ ఫ్యాబ్రిక్ వేయాలి. చేతుల భాగానికి రెండు మూడురకాల ఫ్యాబ్రిక్‌తో కుట్టి, దాని మీద అందంగా ఎంబ్రాయిడరీ చేస్తే కొత్త లుక్ వచ్చేస్తుంది.



బెనారస్‌తో బుట్టచేతులు

బాడీ పార్ట్ చీర రంగు ప్లెయిన్ క్లాత్‌తో డిజైన్ చేయాలి. స్లీవ్స్ పార్ట్ చీరకు, బ్లౌజ్‌కి పూర్తి కాంట్రాస్ట్‌లో ఉండే బెనారస్ క్లాత్‌తో బుట్టచేతులతో డిజైన్ చేయించుకోవాలి. బెనారస్ ఫ్యాబ్రిక్ మీద ఆలోవర్ బుటా ఉండటం వల్ల ఇదే డిజైన్‌గా కనిపిస్తుంది. అందుకని స్లీవ్స్ పార్ట్‌కి వేరే మగ్గం వర్క్ వంటి ఎంబ్రాయిడరీ అవసరం లేకుండా చేతుల భాగాన్ని డిజైన్ చేయించుకోవచ్చు. బుట్ట చేతులు లేదంటే మోచేతుల వరకు చేతుల భాగాన్ని డిజైన్ చేసుకోవచ్చు.



నిర్వహణ
ఎన్.ఆర్.

నెటెడ్‌తో నయనానందం

పట్టు చీరల మీదకు నెటెడ్ బ్లౌజ్‌లా అని ఆలోచించే వారుంటారు. ఇలాంటి వారు బ్లౌజ్ బాడీ పార్ట్‌ని పట్టు ఫ్యాబ్రిక్‌తో డిజైన్ చేయించుకొని, చేతుల భాగానికి కాంట్రాస్ట్ నెటెడ్ ఫ్యాబ్రిక్ తీసుకోవచ్చు. నెట్ మరీ సాదా సీదాగా ఉంటుంది కాబట్టి దీని మీద గ్రాండ్ ఎంబ్రాయిడరీ చేస్తే లుక్ వావ్ అనిపిస్తుంది.

అక్కర్లేని పెద్ద పెద్ద డిజైన్లు

చీరకు బ్లౌజ్‌కి పూర్తి కాంట్రాస్ట్‌లో జాకెట్టు చేతుల భాగం ఉండటంతో త్వరగా చూపులను దోచేస్తుంది. అలాంటప్పుడు గాడీగా డిజైన్లు అక్కర్లేదని అతివల భావన. అందుకని ఈ స్లీవ్స్ భాగాన్ని సింపుల్ డిజైన్‌తో సరిపెట్టేయవచ్చు.

పట్టుచీరలకూ కాంట్రాస్ట్

పట్టు చీర అంటే డిజైనర్ బ్లౌజ్ వేసుకోవాల్సిందే అనే ట్రెండ్ నిన్నా మొన్నటిది. ఇప్పుడు పట్టులోనూ కాంట్రాస్ట్ స్లీవ్స్ ప్యాటర్న్ బాగా ఆకట్టుకుంటుంది. బ్లౌజ్ భాగాన్ని చీర బాడీ ప్యాటర్న్‌ని, చేతుల భాగాన్ని చీర అంచు భాగంతో డిజైన్ చేస్తే ఓ సరికొత్త లుక్ వచ్చేస్తుంది.

బాడీ పార్ట్ కాంట్రాస్ట్

చీరకు పూర్తి కాంట్రాస్ట్ కలర్ ఫ్యాబ్రిక్ విడిగా తీసుకొని బ్లౌజ్ బాడీ పార్ట్‌ని డిజైన్ చేయించుకోవాలి. చేతుల భాగానికి చీరలో ఇచ్చే బ్లౌజ్ ఫ్యాబ్రిక్‌తో డిజైన్ చేయించాలి. దీంతో ఒక ప్రత్యేక లుక్‌తో పార్టీలో మెరిసిపోతారు.

నోట్

- ఎంబ్రాయిడరీ, మగ్గం వర్క్ బ్లౌజ్‌లతో పోల్చితే ఈ కాంట్రాస్ట్ స్లీవ్స్ బ్లౌజ్‌ల డిజైన్‌కి ఖర్చు తక్కువే అవుతుంది.
- దీనికి ఎక్కువగా ఆలోచించనక్కర్లేదు చీరకు పూర్తి కాంట్రాస్ట్ క్లాత్‌ల ఎంపిక సులువు కూడా!
- చేతుల పార్ట్‌కి విడిగా ఎంబ్రాయిడరీ చేయించిన పార్ట్‌ని ప్యాచ్‌లా తర్వాత జత చేసుకోవచ్చు.



పరి పరిశోధన

కొంచెం పుచ్చుకుంటే.. మెదడుకు మేలేనట!

మితంగా పుచ్చుకుంటే మద్యం వల్ల మెదడుకు మేలే జరుగుతుందని అంటున్నారు రోచెస్టర్ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు. తక్కువ స్థాయిలో తీసుకునే మద్యం మెదడులో పేరుకుపోయే బీటీ అమైలాయిడ్ వంటి విష పదార్థాలు బయటకు పంపేందుకు దోహదపడుతుందని , తద్వారా వాపు/మంట తగ్గి మెదడు పనితీరు మెరుగవుతుందని శాస్త్రవేత్తలు ఒక అధ్యయనం ద్వారా స్పష్టం చేస్తున్నారు. దీర్ఘకాలంపాటు మద్యం ఎక్కువగా తీసుకోవడం నాడీ వ్యవస్థపై దుష్ప్రభావం చూపుతుందని వీరు గతంలోనే నిరూపించగా.. తాజా అధ్యయనంలో కొన్ని ఎలుకలకు తక్కువ మోతాదులో ఎథనాల్ అందించి.. వాటి మెదళ్లలో వచ్చే మార్పులను పరిశీలించారు.



అస్సలు మద్యం తీసుకోని ఎలుకల కంటే కొద్దిమోతాదులో తీసుకునే వాటిలో మెదడులోని మలినాలను తొలగించేందుకు ఉపయోగపడే సెంట్రల్ స్పైనల్ ఫ్లూయిడ్స్ వేగంగా పనిచేసినట్లు తెలిసింది. మెదడు కదలికలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించినప్పుడు కూడా మద్యం తీసుకోని.. తక్కువ తీసుకున్న ఎలుకల పనితీరు ఒకేలా ఉందని ఈ అధ్యయనంలో పాల్గొన్న శాస్త్రవేత్త ఒకరు తెలిపారు. ఈ ప్రయోగాల్లో తక్కువ మోతాదు మద్యమంటే.. రోజుకు రెండున్నర పెగ్గులుగా తీర్మానించారు!

బట్టతలపై వెంట్రుకలు మొలిపించవచ్చు...

బట్టతలతో బాధపడుతున్న వారందరికీ శుభవార్త. జపాన్ శాస్త్రవేత్తలు బోడిగుండుపై కూడా బోలెడన్ని వెంట్రుకలు..అదీ వేగంగా మొలిపించేందుకు ఓ కొత్త పద్ధతిని ఆవిష్కరించారు. సిలికోన్ డబ్బాల్లో వీరు చేసిన ప్రయోగాలు సత్ఫలితాలివ్వడంతో ఇకపై బట్టతల అన్నది ఉండదని అంటున్నారు. యోకహోమా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త జున్‌జీ పుకూడా నేతృత్వంలో జరిగిన పరిశోధనల్లో రెండు రకాల వెంట్రుక కణాలను ఉపయోగించారు. కొన్ని రోజుల వ్యవధిలోనే దాదాపు ఐదువేల వరకూ వెంట్రుకలను పెంచడంలో విజయం సాధించారు. ప్రస్తుతం క్లినిక్స్‌లో వెనుకవైపు వెంట్రుకలను తీసుకుని ముందు అతికిస్తున్నారని.. దీనివల్ల తలపై వెంట్రుకలు మందంగా ఉండటం లేదని పుకూడా అంటున్నారు. మందులతో జుట్టు ఊడిపోయే వేగాన్ని తగ్గించవచ్చుగానీ.. పూర్తిగా నివారించలేమని.. ఈ నేపథ్యంలో తాము కొత్త టెక్నిక్‌ను ఉపయోగించి జుట్టు వేగంగా పెరిగేలా చేశామని వివరించారు. ప్రస్తుతానికి తాము పరిశోధనశాలలో మాత్రమే ప్రయోగాలు నిర్వహించామని.. ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నప్పటికీ మరిన్ని ప్రయోగాలు చేసిన తరువాతగానీ ఈ పద్ధతిని మనుషులకు అందుబాటులోకి తీసుకురామని పుకూడా అంటున్నారు.



ఫ్యామిలీ డాక్టర్

నాకు తరచూ గుండెదడ... ప్రమాదమా?

నా వయసు 46 ఏళ్లు. ఈమధ్య నాకు గుండె దడగా ఉంటోంది. అడపాదడపా ఈ గుండెదడ వస్తోంది. దీనివల్ల గుండెకు సంబంధించిన వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంటుందా? వాటి సాధారణ కారణాలు తెలపండి. సలహాలు ఇవ్వండి.

– రఘురామయ్య, కర్నూలు

సాధారణ పరిస్థితుల్లో అయితే గుండె తాలూకు స్పందనలను మనం గ్రహించలేము. ఒకవేళ అలా గ్రహించేలా గుండె స్పందిస్తూ ఉంటే దాన్ని గుండె దడ అని చెప్పవచ్చు. గుండె దడ అనేది ఒక వ్యాధి కాదు. ఒక లక్షణం. భయాందోళనలకు గురైనప్పుడు, ఉద్రిక్తతలు ఏర్పడినప్పుడు గుండె అదనపు వేగంతోనూ, శక్తితోనూ పనిచేయాల్సి ఉంటుంది. ఈ ప్రయత్నంలో ఎవరి గుండె స్పందన వాళ్లకు తెలుస్తుంది. ఇది తాత్కాలికంగా కనిపించినా... తర్వాత దానంతట అదే సద్దుమణుగుతుంది.

అయితే ఒకవేళ ఇదే పరిస్థితి నిరంతర లక్షణంగా మారితే దానికి ప్రాధాన్యం ఇవ్వాలి లేకపోతే చాలా మందిలో గుండెకు సంబంధించిన ప్రతి అంశం ఆందోళన పుట్టిస్తుంది. సాధారణమైన జలుబులు, చిన్న చిన్న ఇన్ఫెక్షన్లు, టీ, కాఫీ, మద్యం తాగడం వంటి అంశాలు కూడా గుండెదడను కలిగించగలవనే విషయం తెలియక చాలామంది విపరీతమైన ఆందోళనకు, అలజడికి గురవుతారు.



సాధారణంగా ఆందోళన ఎక్కువగా ఉన్నప్పుడు గుండెదడ వస్తుంది లేదా గుండెకు సంబంధించిన వ్యాధులలో కూడా ఈ స్థితి కినిస్తుంది. గుండెదడను వైద్యశాస్త్రపరంగా విశ్లేషించేటపుపడు సాధారణ రక్తపరీక్ష మొదలు ఈసీజీ వరకు అనేక రకాల పరీక్షలు అవసరమవుతాయి. టెస్ట్‌లలోని ఫలితాలను బట్టి చికిత్స ఉంటుంది.

గుండెదడ తగ్గించుకోడానికి సూచనలు :

- గుండెదడగా ఉన్నప్పుడు మరీ వేడిగా ఉండే పదార్థాలను తినకూడదు. కషాయం, చేదు, కారం రుచులను తగ్గించుకోవాలి. ఎక్కువగా తినడం లేదా తిన్నది జీర్ణం కాకముందే తినడం మంచిది కాదు.
- మలమూత్ర విసర్జనలను ఆపుకోకూడదు.
- కాఫీ, టీ, కూల్‌డ్రింక్స్ లాంటి ఉత్ప్రేరక పదార్థాలు వాడటం తగ్గించాలి. టీ కంటే కాఫీతో గుండెదడ పెరిగే అవకాశాలు ఎక్కువ.
- పొగతాగే అలవాటు మానేయండి. పక్కనుండే స్నేహితులు పొగతాగుతున్నా వారించండి.
- మానసికంగా స్థిరంగా ఉండండి.
- బిగ్గరగా మాట్లాడకూడదు, మాట్లాడితే గుండెదడ పెరుగుతుంది.
- నూనెలు, కొవ్వు పదార్థాలు వాడకాన్ని తగ్గించాలి.
- మరీ గుండెదడ ఎక్కువగా ఉన్నప్పుడు ప్రథమచికిత్సగా ఐస్‌ను నల్లగ్గొట్టి ఒక బ్యాగ్‌లో వేసి, ఛాతీపై పెట్టుకుంటే గుండెదడ కొంతవరకు తగ్గుతుంది.

గుండెజబ్బుల నివారణకు సూచనలేమిటి?

నా వయసు 35 ఏళ్లు. చాలా కొద్ది వ్యవధిలోనే మాకు తెలిసిన ఇద్దరు ముగ్గురు సన్నిహితులు గుండెజబ్బుతో చనిపోయారు. దాంతో మాకు చాలా ఆందోళనగా ఉంది. గుండెజబ్బులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు చెప్పండి.

– ఎమ్. సత్యనారాయణ, వైజాగ్

గుండెజబ్బులు ఉన్న కుటుంబ చరిత్ర గలవారు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. కొన్ని ప్రధాన సూచనలివి...

- మీలా చిన్న వయసు వారైనప్పటికీ ఇప్పట్నుంచే తరచూ కొలెస్ట్రాల్ పరీక్షలు చేయిస్తూ, ఆహార నియమాలు పాటిస్తూ ఉండటం మేలు. డాక్టర్ సలహాల మేరకు కొన్ని మందులు తీసుకోవడం ద్వారా కొలెస్ట్రాల్‌ను నియంత్రించుకుంటూ ఉండాలి.
- గుండెపోటు రావడానికి డయాబెటిస్ ఒక ప్రధాన కారణం. అందుకే ఆ సమస్య ఉన్నవారు రక్తంలోని చక్కెరను పూర్తిగా నియంత్రణలో ఉంచుకోవడం తప్పనిసరి. రోజూ క్రమం తప్పకుండా మందులు వాడుతూ, డాక్టర్ సూచన మేరకు వారు సూచించిన వ్యవధిలో క్రమం తప్పకుండా రక్తంలోని చక్కెరలను పరీక్షించుకుంటూ ఉండాలి.



- కొవ్వు పదార్థాలు ఉండే ఆహారాన్ని బాగా తగ్గించాలి.
- పొగ తాగే అలవాటును పూర్తిగా వదిలేయాలి. అలాగే పొగాకుకు సంబంధించిన ఉత్పాదనలు, వస్తువులను పూర్తిగా మానేయాలి. గుండెజబ్బుల నివారణలో ఇది చాలా ప్రధానం.
- డాక్టర్ సూచనల మేరకు శరీరానికి మరీ శ్రమ కలిగించకుండా చేసే వ్యాయామాలను క్రమం తప్పకుండా చేయాలి.
- మన ఒంటి బరువును పెరగకుండా జాగ్రత్తగా చూసుకోవాలి.
- రక్తపోటును అదుపులో పెట్టుకోవాలి.
- మనం తీసుకునే ఆహారంలో అన్ని పోషకాలు ఒంటికి అందేలా సమతులాహారం తీసుకోవాలి.
- ఆరోగ్యకరమైన జీవనశైలిని తప్పనిసరిగా పాటించాలి.

ఈ కొన్ని జాగ్రత్తలతోనే చాలావరకు గుండెజబ్బులను నియంత్రించవచ్చు. ఇప్పటికే గుండె సమస్యలు ఉన్నవారు తమ డాక్టర్లు సూచించిన మందులను తప్పక వాడుతుండాలి. ఆరోగ్యంలో ఏమాత్రం తేడా ఉన్నట్లు అనిపించినా డాక్టర్‌ను తప్పక సంప్రదించాలి. ఈ కొద్దిపాటి సూచనలు పాటిస్తే గుండెపోటు వంటి ఎన్నో ప్రమాదకరమైన పరిస్థితులను నివారించడం చాలావరకు నివారించవచ్చు.


కార్డియో కౌన్సెలింగ్

ఒంటరిగా ఉన్నప్పుడు గుండెపోటు లక్షణాలు కనిపిస్తే?

నా వయసు 58 ఏళ్లు. ఇంట్లో నేనొక్కడినే ఉంటాను. ఈమధ్య ఛాతీలో ఎడమవైపు కాస్త అసౌకర్యంగా అనిపించింది. అప్పుడేమీ అనిపించలేదుగానీ... తలచుకుంటే ఇప్పుడు ఆందోళనగా ఉంది. ఒకవేళ అది నిజంగానే గుండెపోటు అయితే నాలాంటివారి పరిస్థితి ఏమిటి? నాలాంటి ఒంటరి వాళ్లు అలాంటి సమయంలో ఏం చేయాలో తగిన సలహా ఇవ్వండి.

– నందగోపాల్, విజయవాడ

గుండెపోటు లక్షణాలైన ఎడమవైపున భుజం నొప్పిగా ఉండటం, ఎడమవైపు ఛాతీలో అసౌకర్యం, ఎడమ దవడ నొప్పిగా అనిపించడం, ఛాతీలో నొప్పి ఎడమవైపునకు పాకుతున్నట్లుగా ఉండటం, చెమటలు పట్టడం లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే అప్రమత్తం కావాలి. అలాంటి సమయాల్లో చాలా బలంగా దగ్గాలి. ఊపిరితిత్తుల నిండా గాలి పీల్చుకొని అలా దగ్గుతూనే ఉండండి. ఎంత బలంగా దగ్గాలంటే 'వయొలెంట్ కాఫ్' అని పిలిచేంత తీవ్రంగా ఆ దగ్గు ఉండాలి. ఇలా బలంగా దగ్గడం వల్ల గుండెకు రక్త సరఫరా ఎక్కువ అవుతుంది. దాంతో గుండెకు అసలే రక్తసరఫరా నిలిచిపోయే పరిస్థితి నివారితమవుతుంది. ఇలా మీరు దాదాపు 5 నిమిషాల సమయం పాటు మీ సమస్యను



వాయిదా వేయగలిగినా చాలు... అవి ప్రాణాన్ని రక్షించే బంగారు క్షణాలవుతాయి. మీరు ఎవరికైనా ఫోన్ చేయడానికైనా... లేదా మీ మందుల డబ్బా వరకు చేరేంత వరకైనా తగినంత సమయం మీకు దొరుకుతుంది. మీలాంటి వారు మీ మందుల డబ్బాలో యాస్పిరిన్ ఉంచుకోవాలి. మీరిలా దగ్గుతూ మందుల డబ్బాను చేరి యాస్పిరిన్ టాబ్లెట్ వేసుకుంటే... మీరు ఆసుపత్రికి చేరే టైమ్ దొరికే అవకాశం ఉంటుంది. అది మీ ప్రాణాలను రక్షిస్తుంది.




డాక్టర్ హేమంత్ కౌకుంట్ల
సీనియర్ కార్డియోథొరాసిక్ సర్జన్,
సెంచరీ హాస్పిటల్స్, బంజారాహిల్స్, హైదరాబాద్.

స్క్రీన్ టెస్ట్



5
ఈ ప్రముఖ హీరో కాలిపాదం సైజు 13వ నంబర్. ఇండియాలో ఈ నంబరు చెప్పలు దొరకడం చాలా కష్టం. అందుకే ఈయన దుబాయ్ వెళ్లినప్పుడల్లా సూట్‌కేస్ నిండా చెప్పలతో తిరిగొస్తారు. ఆ లాంగ్ ఫుట్ హీరో ఎవరబ్బా?
ఎ) ప్రభాస్ బి) మహేశ్‌బాబు
సి) రానా డి) వరుణ్‌తేజ్





7
దీపికా పదుకోన్ మాజీ ప్రియుడు పేరు 'ఆర్' అక్షరంతో మొదలవుతుంది. తాజా ప్రియుడి పేరూ అదే అక్షరంతో మొదలవుతుందని హింటిచ్చారు. ఆ 'ఆర్' ఎవరో కనుక్కోండి చూద్దాం?
ఎ) రణ్‌బీర్ కపూర్ బి) రణ్‌వీర్ సింగ్ సి) రాజ్‌కుమార్ రావు డి) రణ్‌దీప్ హుడా



9
'అపుడో, ఇపుడో, ఎపుడో కలగన్నానే చెలి..' అనే పాట 'బొమ్మరిల్లు' సినిమా లోనిది. ఆ పాట రచయితెవరు?
ఎ) సాహితి బి) జొన్నవిత్తుల
సి) శ్రీమణి డి) అనంత శ్రీరామ్

20
జియస్టీ (గాడ్, సెక్స్ అండ్ ట్రూత్) అనే షార్ట్ ఫిల్మ్‌కు మ్యూజిక్ డైరెక్టర్ ఎవరు?
ఎ) జేబి
బి) యం.యం. కీరవాణి
సి) జిబ్రాన్
డి) కమ్రాన్

16
రిషిబాలా నావల్ అని ఈ నటి అసలు పేరు. ఈమె సౌత్‌లో పదేళ్ల క్రితం టాప్ హీరోయిన్? ఎవరా కథానాయిక?
ఎ) త్రిష బి) స్నేహ
సి) సిమ్రాన్ డి) శ్రియ




6
ఈ మధ్యే చనిపోయిన పాత తరం నటి 'కృష్ణకుమారి' ఒక ప్రముఖ హీరోయిన్ చెల్లెలు. ఎవరా హీరోయిన్?
ఎ) శారద బి) షావుకారు జానకి
సి) సావిత్రి డి) జమున



15
నటుడు ఆర్.నారాయణమూర్తి ఏ చిత్రం ద్వారా హీరోగా మారారో తెలుసా?
ఎ) అర్ధరాత్రి స్వాతంత్య్రం
బి) అడవి దివిటీలు సి) దండోరా
డి) లాల్‌సలామ్

17
'అర్జున్‌రెడ్డి' చిత్ర సంగీతదర్శకుని పేరేంటి?
ఎ) గోపీసుందర్ బి) సాయి కార్తీక్
సి) రామ్ నారాయణ్ డి) రథన్

11
'స్వాతిముత్యం' చిత్రంలో బాల నటుడిగా నటించిన ఈ నటుడు ఇప్పుడు టాలీవుడ్‌లో టాప్ స్టార్? ఎవరా హీరో కనుక్కోండి?
ఎ) అల్లు అర్జున్ బి) రామ్‌చరణ్
సి) యన్టీఆర్ డి) కల్యాణ్‌రామ్



1
"జీవితంలో ఏదీ ఈజీ కాదు.. ప్రయత్నిస్తే ఏదీ కష్టం కాదు" అని రజనీకాంత్ చెప్పిన ఈ డైలాగ్ ఏ సినిమాలోనిది?
ఎ) నరసింహ బి) అరుణాచలం
సి) శివాజీ డి) లింగ



13
ప్రస్తుతం విక్రమ్ సరసన ఓ సినిమా కమిట్ అయిన ప్రముఖ కథానాయకుని కుమార్తె ఎవరు?
ఎ) శివానీ రాజశేఖర్ బి) శ్రుతీహాసన్ సి) వరలక్ష్మీ శరత్ కుమార్ డి) అక్షరాహాసన్

3 ఎన్టీఆర్-ఏయన్నార్ కాంబినేషన్‌లో వచ్చిన సినిమా లెన్ని?
ఎ) 18 బి) 16 సి) 14 డి) 10

2
మహేశ్‌బాబును తెలుగు తెరకు హీరోగా పరిచయం చేసిన దర్శకుడెవరు?
ఎ) వైవీయస్ చౌదరి బి) కె. రాఘవేంద్రరావు సి) బి. గోపాల్ డి) గుణశేఖర్

10 'కాస్టింగ్ కౌచ్' గురించి నిర్భయంగా మాట్లాడుతున్న హీరోయిన్ ఈమె. ఆమె పాటలు కూడా పాడతారు. ఎవరా హీరోయిన్?
ఎ) భావన బి) ఆండ్రియా సి) అంజలి డి) అమీ జాక్సన్



8
దుబాయ్‌లో పుట్టింది ఈ మలయాళీ భామ మొదటి తెలుగు చిత్రం 'చమ్మక్ చల్లో'. ఇప్పుడు చాలా సినిమాల్లో బిజీ హీరోయిన్. ఎవరామె?
ఎ) కేథరిన్ థెరిస్సా బి) ప్రగ్యా జైస్వాల్
సి) హెబ్బా పటేల్ డి) అనూ ఇమ్మాన్యుయేల్

18 మొన్న సంక్రాంతి పండగను నాగార్జున కొత్త కోడలు సమంత అన్నపూర్ణ స్టూడియో స్టాఫ్‌తో జరుపుకున్నారు. అన్నపూర్ణ స్టూడియో ప్రారంభించి ఎన్ని సంవత్సరాలైందో తెలుసా?
ఎ) 34 బి) 28 సి) 42 డి) 38



4
ఈ మధ్యనే 50 చిత్రాల క్లబ్‌లో చేరిన సంగీత దర్శకుడెవరో చెప్పకోండి?
ఎ) యస్.యస్. తమన్
బి) అనూప్ రూబెన్స్ సి) అనిరుథ్
డి) యం.యం. కీరవాణి

12
వైఫ్ ఆఫ్ వి వరప్రసాద్ సినిమా నిర్మాత ఎవరు?
ఎ) కృష్ణవంశీ బి) జె.డి. చక్రవర్తి
సి) రామ్‌గోపాల్‌వర్మ
డి) గుణశేఖర్

సమాధానాలు
1) డి 2) బి 3) సి 4) బి
5) సి 6) బి 7) బి 8) ఎ
9) డి 10) బి 11) ఎ 12) సి
13) డి 14) సి 15) ఎ
16) సి 17) డి 18) సి
19) ఎ 20) బి





19
'గాయత్రి' అనే పేరుతో వస్తున్న చిత్రంలో లీడ్ రోల్‌లో నటిస్తున్న సీనియర్ మోస్ట్ హీరో ఎవరో కనుక్కోండి?
ఎ) మోహన్‌బాబు
బి) రాజేంద్రప్రసాద్
సి) జగపతిబాబు డి) సుమన్

14
కె. రాఘవేంద్రరావు దర్శకత్వం వహించిన 'సాహసవీరుడు-సాగరకన్య' చిత్రంలో నటించిన భాలీవుడ్ భామ ఎవరు? (ఈమెని పొడుగు కాళ్ల సుందరి అని కూడా అంటారు)
ఎ) టబు బి) ట్వింకిల్ ఖన్నా
సి) శిల్పాశెట్టి డి) మనీషా కొయిరాలా

మీరు 6 సమాధానాల కంటే తక్కువ చెబితే... మీకు సినిమా అంటే ఇష్టం
10 సమాధానాల వరకూ చెప్పగలిగితే... మీకు సినిమా అంటే ఇంట్రెస్ట్
15 సమాధానాల వరకూ చెప్పగలిగితే... మీకు సినిమా అంటే పిచ్చి
20 సమాధానాలూ చెప్పగలిగితే... ఇంకోసారి ఈ క్విజ్ చదవకండి!

నిర్వహణ
శివ మల్లాల

నాలుగోసారి...

ఒకటోసారి.. రెండోసారి.. మూడోసారి.. అనగానే ఏదైనా వేలం పాట నిర్వహిస్తున్నారా? అనే అనుమానం రాకమానదు. ఇక్కడ మూడోసారితో ఆగడానికి వీల్లేదు. నాలుగోసారి.. అనాల్సిందే. ఇంతకీ ఈ కహానీ ఏంటంటే.. ఇప్పటికే ముచ్చటగా మూడు సార్లు జోడీ కట్టిన హీరో అజిత్, హీరోయిన్ నయనతార నాలుగోసారి కలిసి నటించనున్నారు. 'బిల్లా, ఏగన్, ఆరంభమ్' చిత్రాలతో సూపర్‌హిట్ జోడీ అనిపించుకుని హ్యాట్రిక్ హిట్స్ సాధించారు అజిత్, నయన్. అందుకే కాబోలు మరోమారు ఈ క్రేజీ కాంబినేషన్‌ని రిపీట్ చేస్తున్నారు. 'వివేగం' వంటి విజయవంతమైన చిత్రం తర్వాత అజిత్ 'విశ్వాసం' అనే సినిమాలో నటిస్తున్నారు. అజిత్‌తో 'వీరం, వేదాళం, వివేగం' వంటి సూపర్ హిట్స్‌ని తెరకెక్కించిన శివ 'విశ్వాసం' సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. అజిత్–శివ కాంబినేషన్‌లోనూ ఇది నాలుగో చిత్రం కావడం విశేషం. ఈ సినిమాలో హీరోయిన్‌గా కీర్తీ సురేశ్, తమన్నా, కాజల్ అగర్వాల్.. ఇలా పలువురు ముద్దుగుమ్మల పేర్లు వినిపించాయి. తాజాగా నయనతారను కథానాయికగా చిత్రవర్గాలు ప్రకటించడంతో హీరోయిన్ ఎవరనే చర్చకు ఫుల్‌స్టాప్ పడింది. హ్యాట్రిక్ హిట్స్ అందుకున్న అజిత్–నయనతార 'విశ్వాసం'తో డబుల్ హ్యాట్రిక్‌కి శ్రీకారం చుట్టారని ఇద్దరి అభిమానులూ అనుకుంటున్నారు. దీపావళికి ఈ చిత్రం విడుదల కానుంది.



• నయనతార

ఐయామ్ బ్యాక్



• రాయ్ లక్ష్మీ

...అంటున్నారు హీరోయిన్ రాయ్ లక్ష్మీ. దాదాపు ఏడాది తర్వాత తమిళంలో ఆమె 'నీయా 2' అనే చిత్రం కమిట్ అయ్యారు. మధ్యలో హిందీ చిత్రం 'జూలీ 2'లో నటించారు. అందుకే 'ఐయామ్ బ్యాక్' అన్నారు. రీసెంట్‌గా 'నీయా 2' సెట్స్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. ''నీయా 2' రెండో షెడ్యూల్ షూటింగ్ జరుగుతోంది. ఈ ఏడాది తమిళ, మలయాళం, తెలుగు ప్రాజెక్ట్స్ కోసం బ్యాక్ టు బ్యాక్ షూట్‌లో పాల్గొనబోతున్నాను'' అని పేర్కొన్నారు రాయ్ లక్ష్మీ. ఈ సంగతి ఇలా ఉంచితే ఈ 'నీయా 2' చిత్రం గతంలో కమల్‌హాసన్ నటించిన 'నీయా'కి సీక్వెల్ అని టాక్. దుర్గై దర్శకత్వంలో ఆర్.ముత్తురామన్, కమల్‌హాసన్, సుప్రియ, లత ముఖ్య తారలుగా 1979లో 'నీయా' చిత్రం రూపొందింది. ఇది హారర్ మూవీ. స్నేక్‌కి కీలక పాత్ర ఉంది. 'నీయా2' కూడా స్నేక్ బేస్డ్ హారర్ మూవీ. దాంతో కమల్ 'నీయా'కి ఇది సీక్వెల్ అనే వార్త ప్రచారంలోకొచ్చింది. అయితే చిత్రబృందం ఈ విషయం గురించి అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఇందులో జై హీరోగా, రాయ్ లక్ష్మీ, కేథరిన్, వరలక్ష్మీ శరత్ కుమార్ కథానాయికలుగా నటిస్తున్నారు. మరోవైపు నటి అంజలి, రాయ్‌లక్ష్మీల కాంబినేషన్‌లో తెలుగు, తమిళ భాషల్లో ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే.

అంతకు మించి...

విభిన్నమైన కథాంశంతో, సహజమైన సన్నివేశాలతో, భావోద్వేగమైన నటనతో ప్రేక్షకులను అలరించిన చిత్రం 'దండుపాళ్యం'. బొమ్మాళి రవిశంకర్, పూజాగాంధీ, మకరంద్ దేశ్‌పాండే, రవికాలే ప్రధాన పాత్రల్లో శ్రీనివాస రాజు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'దండుపాళ్యం 2' వచ్చింది. ఆ రెంటినీ మించేలా 'దండుపాళ్యం 3' రాబోతోంది. ఈ చిత్రం తెలుగు హక్కులను ఫ్యాన్సీ రేట్‌కి సొంతం చేసుకున్న శ్రీనివాస్ మీసాల, రజని తాళ్లూరి మాట్లాడుతూ– ''శ్రీనివాసరాజు కథ, కథనం, సన్నివేశాలు మెస్మరైజ్ చేస్తాయి. ట్రైలర్‌కి మంచి స్పందన వచ్చింది. 'దండుపాళ్యం' సిరీస్‌కి ఇదే చివరి పార్ట్ కావటంతో క్లైమాక్స్ ఎలా ఉంటుందో అనే ఆసక్తి అందరిలో ఉంది. త్వరలోనే ప్రీ–రిలీజ్ ఫంక్షన్ చేస్తాం. మార్చి 2న సినిమాను రిలీజ్ చేయబోతున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి సమర్పణ: సాయికృష్ణ ఫిల్మ్స్, సంగీతం: అర్జున్ జన్యా, కెమెరా: వెంకట్ ప్రసాద్, సహ నిర్మాత: సాయి కృష్ణ పెండ్యాల.



• పూజా గాంధీ